# ఆర్షవిజ్ఞానసర్వస్వము

## తృతీయ సంపుటం : ఆరణ్యకాలు



సంపాదకులు : డా॥ ఎస్.బి. రఘునాథాచార్య

తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ఆర్షవిజ్ఞానసర్వస్వము

# ఆర్షవిజ్ఞానసర్వస్వము

## తృతీయసంపుటం

## ఆరణ్యకాలు

ప్రధానసంపాదకుడు
ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య ఎమ్.ఎ., పిహెచ్.డి.
న్యాయవిద్యాప్రవీణ : డిప్లొమా ఇన్ జర్మన్
ప్రధానవిదేశకులు
శ్రీ వేంకటేశ్వరోన్నత వేదవిద్యాధ్యయన పరిషత్
కో-ఆర్డినేటర్, పబ్లికేషన్స్.

ప్రచురణ
డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
1999

# ĀRṢAVIJÑĀNA SARVASVAMU
(Encyclopaedia of Ancient Indian Literature)

Third Volume: ĀRAṆYAKĀLU

Chief Editor:
Professor S.B. Raghunathacharya
Director General: S.V. Institute of Higher Vedic S

First Edition :1992
Second Edition : 1999

Copies : 2,000

Cover Page : Ponnapalli Giri Dattu

Published by
Dr. I.V. Subba Rao, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# మామాట

డాక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

విశ్వమానవ కల్యాణమే లక్ష్యంగా ఏర్పడింది వైదిక సాహిత్యం. మనసా వాచా కర్మణా మానవుడు నిండైన జీవితాన్ని ఆనందంగా అనుభవించడానికి మహర్షులందించిన అపూర్వజ్ఞాననిధి, విజ్ఞానశేవధి వేదరాశి అనడంలో సందేహం లేదు. ఆ వేదరాశి మానవ జాతికందిస్తున్న మహోపదేశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్షవిజ్ఞానసర్వస్వమనే ప్రణాళికద్వారా సామాన్య మానవునికి అందుబాటులోకి తీసికొని వస్తున్నది. ఈ ప్రణాళికలో 1. వేదసంహితలు, 2. బ్రాహ్మణాలు, 3. ఆరణ్యకాలనే మూడు సంపుటాల ప్రతులు ప్రచురించిన కొద్దికాలంలోనే అయిపోవడం సంభవించింది. అందుకే వాటిని పునర్ముద్రించాలని నిర్ణయం తీసుకున్నాం.

ఇప్పుడా ప్రణాళికలో ఆరణ్యకాలనే మూడోసంపుటం ప్రచురణకు సిద్ధమైంది. ప్రధానసంపాదకులుగా ఈ ప్రణాళికను తీర్చిదిద్దుతున్న ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్యగారిని మనసారా అభినందిస్తున్నాను. ఈ సంపుటాన్ని ఇంత అందంగా ముద్రించిన తి.తి.దే. ప్రెస్‌వారికి నా అభినందనలు.

ఎంతో కాలాన్నుంచి ఎదురుచూస్తున్న పాఠకులకు ఈ ప్రచురణ ఆనందాన్నందిస్తుందని నా దృఢవిశ్వాసం.

వేదోఽఖిలో ధర్మమూలమ్

# మనవి

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల్లో సుప్రసిద్ధమైన ప్రణాళిక ఆర్షవిజ్ఞానసర్వస్వం (Encyclopaedia of Ancient Indian Literature). ప్రధానసంపాదకుడుగా దీన్ని తీర్చిదిద్దే అదృష్టం నాకు కలగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ప్రచురించిన కొద్దికాలానికే మొదటి మూడు సంపుటాలు పాఠకుల ఆదరానికి పాత్రం కావడం పునర్ముద్రించాల్సిన అవసరం ఏర్పడడం నాకెంతో ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తున్నది.

తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారి, డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారు ఈ సంపుటాలను పునర్ముద్రించాలని నిర్ణయించడం వైదిక సంస్కృతిప్రియులకెంతో ఊరట కలిగించింది. ఎంతో మంది ద్వితీయ ముద్రణ ఎప్పుడు జరుగుతుందని పదే పదే అడుగుతుండటం వల్ల వారి ఆదరానికి ఈ సంపుటాలెంత పాత్రమైనాయో అర్థమవుతోంది. ఆరణ్యకాలనే మూడో సంపుటం పునర్ముద్రణ జరిగి పాఠకుల ముందుకు వస్తున్నది. ప్రథమ ముద్రణలాగా దీన్ని కూడా పాఠకులు ఆదరిస్తారని, వైదిక ధర్మోపదేశాన్ని అర్థం చేసికొని, ఆచరించి సుఖశాంతులతో జీవితాన్ని సార్థకం చేసికొంటారని ఆశిస్తున్నాను.

ఈ సంపుటాన్ని పునర్ముద్రించాలనే నిర్ణయం తీసికొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.గారికి హృదయపూర్వకంగా ధన్యవాదాలనందిస్తున్నాను. చక్కగా ముద్రించిన తి.తి.దే. ప్రెస్ వారికి నా కృతజ్ఞతలు.

హనుమజ్జయంతి,

10-5-1999. రఘునాథాచార్య

# ముందుమాట

శ్రీ ఎమ్.వి.ఎస్. ప్రసాద్, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

భగవంతుని నిశ్వాసరూపాలు వేదాలు. ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలను మానవజాతికందించి విశ్వమానవ కల్యాణాన్ని సాధించడానికి భగవంతుడావిష్కరించిన నిత్య సత్య శబ్దరాశి వేద వాఙ్మయం. సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులనే నాలుగు భాగాలుగా ఈ వాఙ్మయం విస్తరించింది. కేవలం మంత్ర భాగాలు సంహితలైతే వాటికి వ్యాఖ్యానరూపాలుగా త్యాగ -- యోగ స్వరూపమైన యాగప్రక్రియను ప్రవేశపెట్టింది బ్రాహ్మణ వాఙ్మయం. ప్రతి బ్రాహ్మణంలోను చివరిలో కొంతభాగం ఆరణ్యకంగా పిలువబడింది. అరణ్యాలలో త్రికరణశుద్ధిగా పఠించదగిన గ్రంథభాగం కాబట్టి దాన్ని ఆరణ్యకమన్నారు.

సంహితావాఙ్మయంలో కొన్ని శాఖల్లాగా, బ్రాహ్మణవాఙ్మయంలో కొన్ని గ్రంథాల్లాగా ఆరణ్యకవాఙ్మయం కూడా చాలావరకు నశించి పోయింది. ఈనాడు అథర్వవేదానికి ఒక్క ఆరణ్యకం కూడా మిగలకుండా పోయింది. ఇప్పుడు మనకు దొరకుతున్న ఆరణ్యకాలను పరిశీలిస్తే యజ్ఞయాగాలనాచరించే కాలంలోనే మంత్రద్రష్టలైన మహర్షుల దృష్టి ఆధ్యాత్మికరంగం వైపు మళ్లినట్లు తెలుస్తుంది. శాంఖాయనార ణ్యకంలోని బాలాక్యుపాఖ్యానం, బృహదారణ్యకంలోని ప్రాణోపాఖ్యానం, తలవకారారణ్యకంలోని సృష్టిక్రమాలను పరిశీలిస్తే తాత్త్వికజ్ఞానధార ఆ వాఙ్మయంలో ఎంతగా ఏర్పడిందో స్పష్టంగా అర్థమౌతుంది.

వైదికవాఙ్మయంలో నాలుగో రంగమైన ఉపనిషత్తులు ఈ ఆరణ్యకాలకు అనుబంధాలుగా ఏర్పడ్డాయి. ఆత్మతత్త్వవిచారానికి ఆశ్రయాలైనాయి. ఒకరకంగా బ్రాహ్మణవాఙ్మయంలోని యజ్ఞయాగ ప్రక్రియలు ఆచరణకు, ఉపనిషత్తుల్లోని ఆధ్యాత్మిక విచారధారకు సంగమస్థానంగా ఆరణ్యకాలు నిలుస్తున్నాయనడం అక్షరసత్యం. పోయినవి పోగా ఇప్పటికి మిగిలి ఉన్న ఐతరేయ, కౌషీతక, తైత్తిరీయ, బృహద్, మైత్రాయణీయ, తలవకారారణ్యకాలు ఆరింటిలోను ప్రతిపాదించబడిన ఉపాసనలను, విశేషాలను సంగ్రహంగా సమీక్షిస్తూ అనేక నూతనాంశాలను సమాజానికి అందిస్తున్నది ఆర్షవిజ్ఞానసర్వస్వంలోని మూడోభాగంగా మీ ముందు కొస్తున్న ఈ ఆరణ్యకాల సంపుటం.

విశ్వశాంతికోసం, మానవజాతి కల్యాణంకోసం అంకితమైన వైదికవాఙ్మయసారాన్ని సామాన్యప్రజలకు గూడా అందించాలనే ఆశయంతోనే ఆర్షవిజ్ఞానసర్వస్వాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తున్నది. ఈ వేదవాఙ్మయోపదేశాన్ని ప్రతి వ్యక్తి ఉపయోగించుకొని ఆత్మోన్నతిని సంపాదించుకుంటారని భావిస్తున్నాను. వైదిక వాఙ్మయంలో నిరంతర పరిశ్రమ చేస్తూ సమాజానికి అందులోని ఉపదేశాన్ని అందించాలనే అంతరంగంతో ఈ ఆర్షవిజ్ఞానసర్వస్వాన్ని సంపాదిస్తున్న ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య (కో – ఆర్డినేటర్, టి.టి.డి. పబ్లికేషన్స్) గారిని నేను మనసారా అభినందిస్తున్నాను. అమూల్యమైన వారి రచనలను పంపి ఈ ప్రణాళికకు సహకరించిన రచయితలకు నా అభినందనలు. ఇంకా పాఠకులు ఎదురుచూస్తున్న భాగాలను కూడా త్వరగా సంపాదించి వైదికవాఙ్మయోపదేశాలను సమాజానికి అందుబాటులోకి తీసుకురాగలరని ఆశిస్తున్నాను.

'యస్య నిఃశ్వసితం వేదాః

# సంపాదకుని మాట

భగవంతుని ఆజ్ఞ లేనిదే గడ్డిపరకైనా అటూ ఇటూ కదలలేదు. అలాంటి దివ్యశక్తిసంపన్నుడైన ఆయన స్వరూపస్వభావాలను తెలియ జేసేవే వేదాలు. ఆయన సంకల్పం లేనిదే వైదికవాఙ్మయ సర్వస్వాన్ని సామాన్యమానవునికి కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ఈ ఆర్ష విజ్ఞానసర్వస్వం ఆవిర్భవించడం అసంభవం. కలియుగప్రత్యక్షదైవమైన భగవాన్ శ్రీ వేంకటేశ్వరుడు, ఆయన పట్టమహిషి పరమమంగళ దేవత, ప్రపన్న జనమానసవిహారిణి శ్రీ పద్మావతీదేవి దివ్యానుగ్రహంవ ల్లనే నవ్యమైన, భవ్యమైన ఈ ప్రణాళిక రూపుదాల్చి మీ ముందుకు వస్తున్నది. వేదాల్లో ఏముంది? అని కొందఱు, "వేదాల్లో అన్నీ ఉన్నాయిష" అని ఇంకొందఱు వేదాలను పరిహాసపాత్రాలుగా చేస్తున్న ఈ రోజుల్లో, నిజంగా వేదాల్లో ఏమున్నదో తెలిసికొనగోరే జిజ్ఞాసువు లకు వాటిల్లోని ధార్మిక, సాంఘిక, తాత్త్విక విశేషాలను యథాతథంగా అందుబాటులోకి తీసుకొనిరావడమే ఈ ప్రణాళికకు పరమ లక్ష్యం. తిరుమల తిరుపతి దేవస్థానం లక్ష్యశుద్ధితో ఆ లక్ష్యసిద్ధికోసమే ఈ పది సంపుటాలను తీర్చి దిద్ది ప్రజల ముందుంచడానికి ప్రయత్నిస్తున్నది. అందులో భాగమే "ఆరణ్యకాల"నే ఈ మూడో సంపుటం.

ఈ ప్రణాళిక ప్రయోజనాన్ని అవసరాన్ని చక్కగా గుర్తించి దీన్ని మంచిమనస్సుతో ప్రారంభించిన మహామనీషి ఆనాడు తి.తి.దే. కార్య నిర్వహణాధికారి, ఫలిత శక్తిత్రయులు శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్‌గారు. వారికి నా కృతజ్ఞతానవమల్లికలనందిస్తున్నాను.

వైదిక వాఙ్మయ ప్రచార ప్రసారాలు నిర్విఘ్నంగా జరగడానికి నిత్యం ప్రయత్నిస్తున్న తి.తి.దే. ధర్మకర్తలమండలి వారికి నా హృదయ

పూర్వక ధన్యవాదాలనందిస్తున్నాను. అరణ్యకవాఙ్మయాన్ని పరిచయం చేసే మూడో సంపుటానికి ముచ్చటైన ముందుమాటను పలికిన ప్రభు – మంత్ర – ఉత్సాహశక్తి సంపన్నులు, వైదికవాఙ్మయోద్ధరణబద్ధ దీక్షులు తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఎమ్.వి.ఎస్. ప్రసాద్‌గారు. వారి నిరంతర ప్రోత్సాహానికి చిత్తశుద్ధితో వారందిస్తున్న స్ఫూర్తికి నా కృతజ్ఞతారవిందాలనందిస్తున్నాను.

ఈ సంపుట ప్రచురణలో ప్రత్యక్షపరోక్ష సహకారాలనందిస్తున్న తి.తి.దే. పౌరసంబంధశాఖాధికారి డాక్టర్ రావుల సూర్యనారాయణ మూర్తిగారికి, సప్తగిరి సంపాదకులు శ్రీ కె. సుబ్బారావుగారికి నా ధన్యవాదాలు. ఈ సంపుటంకోసం అడిగిన వెంటనే ఎందఱో పండితులు వారివారి అంశాలను శ్రద్ధతో తయారుచేసి పంపారు. వారందఱికీ నా కృతజ్ఞతా సుమమంజరుల నందిస్తున్నాను. ఈ ప్రణాళికను తీర్చిదిద్దడంలో ఎన్నో అమూల్యమైన సలహాలనిచ్చిన సంపాదక సమితి సభ్యులకు నా అభివందనాలను సమర్పిస్తున్నాను.

ఈ సంపుటానికి ప్రెస్‌కాపీ తయారుచేయడంలోను, ప్రూఫ్‌లు చదవడంలోను నా దగ్గఱ పనిచేస్తున్న శ్రీమతి డి. శారద, శ్రీమతి టి. సావిత్రి, శ్రీ వి. గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ సి. లలితారాణి ఎంతో సహాయపడినారు. వారందఱికీ నా ఆశీస్సులు.

ఈ సంపుటాన్ని చక్కగా ముద్రించిన టి.టి.డి. ప్రెస్ మేనేజర్ శ్రీ ఎమ్. విజయకుమార్ రెడ్డి గారికి, వారి సిబ్బందికి నా ధన్యవాదాలు.

గురుపూర్ణిమ

14-7-1992. — రఘునాథాచార్య

# రచయితలు

ఏ. ఎస్. ఎస్. — శ్రీ ఏ. సోమేశ్వరశర్మ ఎం.ఏ.
రీడర్ (రిటైర్డ్) సాంస్క్రిట్ డిపార్ట్‌మెంట్
ఆంధ్రయూనివర్శిటీ, వాల్తేరు.
1.8 మహర్షులు; 2.3.7 వైశిష్ట్యం

సి. ఎల్. ఆర్. — డా. సి. లలితారాణి, ఎం.ఏ., పిహెచ్.డి.
రీసెర్చి ఆఫీసర్,
తి. తి. దేవస్థానములు, తిరుపతి.
1.12 కవితాసౌందర్యం;
2.6.8 సంగ్రహసమీక్ష

డి. ఏ. ఎస్. — డా. డి. అర్క సోమయాజీ, ఎమ్.ఏ., పిహెచ్.డి.
కార్యదర్శి, హిందుధర్మరక్షణసంస్థ,
తి. తి. దేవస్థానములు, తిరుపతి.
2.4.7 వైశిష్ట్యం

డి. ఎన్. ఆర్. — డా. డి. నరసింహారెడ్డి, ఎం.ఏ; ఎమ్.ఫిల్, పిహెచ్.డి.
లెక్చరర్,
ఎస్. వి. యూనివర్శిటీ, తిరుపతి.
2.6.7 వైశిష్ట్యం

డి. ఎస్. బి. — ప్రొఫెసర్ డి. శ్రీధరబాబు, ఎమ్.ఏ; పిహెచ్.డి.
ప్రొఫెసర్ : ఎస్.వి.యు. ఓరియంటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్,
తిరుపతి.
2.2.6 ఉపాసనలు

| | |
|---|---|
| కె. బి. ఆర్. | డా. కె. భాస్కరరావు, ఎం.ఏ., డి.లిట్.<br>లెక్చరర్, ఎస్. వి. ఓరియంటల్ కాలేజ్,<br>తిరుపతి.<br>2.5.7 వైశిష్ట్యం |
| కె. హెచ్. ఎస్. | డా. కె. హయగ్రీవశర్మ, ఎం.ఏ., పిహెచ్.డి.<br>లెక్చరర్,<br>ఎస్. వి. యూనివర్శిటి, తిరుపతి.<br>2.3.8 సంగ్రహసమీక్ష |
| కె. ఎస్. ఆర్. డి. | డా. కె. ఎస్. ఆర్. దత్త, ఎం.ఏ., పిహెచ్.డి.<br>ప్రిన్సిపాల్, ఎస్. వి. ఓరియంటల్ కాలేజ్,<br>తిరుపతి.<br>2.5.8 సంగ్రహసమీక్ష |
| కె. ఎస్. వి. | శ్రీ కె. శ్రీనివాసవరదన్ శిరోమణి<br>రీసెర్చి అసిస్టెంట్, ఎస్. వి. యు. ఓరియంటల్<br>రీసెర్చి ఇన్స్టిట్యూట్, తిరుపతి.<br>2.1.8 సంగ్రహసమీక్ష |
| కె. వి. ఆర్. | శ్రీ కె. వి. రాఘవాచార్యులు, ఎం.ఏ.(తెలుగు)<br>ఎం.ఏ. (సంస్కృతం), విద్వాన్, డిప్లొమా ఇన్<br>లింగ్విస్టిక్స్, లెక్చరర్, శ్రీ వేంకటేశ్వర కాలేజ్<br>ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్, తిరుపతి.<br>1.10 ప్రకృతి; 1.13 భాషాపరిణామం |
| కె. వి. ఆర్. కె. | డాక్టర్ కె. వి. ఆర్. కృష్ణమాచార్యులు, ఎం.ఏ.,<br>పిహెచ్.డి., విద్యాప్రవీణ,<br>రీడర్, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠమ్,<br>తిరుపతి.<br>1.9 ఉపాఖ్యానాలు |

| | |
|---|---|
| ఎస్. ఎస్. ఆర్. | ప్రొఫెసర్ ఎస్. ఎస్. ఆర్. తాతాచార్య, పిహెచ్.డి.<br>న్యాయమీమాంసావ్యాకరణ వేదాంత శిరోమణి,<br>కులపతి, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠమ్, తిరుపతి.<br>2.1.7 వైశిష్ట్యం |
| పి. జి. ఎల్. | ప్రొఫెసర్ పి. జి. లాలే, ఎం.ఏ., పిహెచ్.డి.<br>ప్రొఫెసర్ (రిటైర్డ్) సాంస్క్రిట్ డిపార్ట్మెంట్,<br>ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్.<br>2.2.8 సంగ్రహసమీక్ష |
| పి. ఎస్. | ప్రొఫెసర్ పి. శ్రీరామమూర్తి, ఎం.ఏ., పిహెచ్.డి.<br>ప్రొఫెసర్, సాంస్క్రిట్ డిపార్ట్మెంట్,<br>ఆంధ్ర యూనివర్శిటీ, విశాఖపట్టణం.<br>2.5.6 ఉపాసనలు |
| ఎస్. బి. ఆర్. | ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య, ఎం.ఏ., పిహెచ్.డి.<br>విద్యాప్రవీణ, డిప్లొమా ఇన్ జర్మన్;<br>ప్రొఫెసర్, సాంస్క్రిట్ డిపార్ట్మెంట్,<br>శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ,<br>కో -- ఆర్డినేటర్ పబ్లికేషన్స్, టి.టి.డి.,<br>ప్రధానసంపాదకుడు.<br>1.1 పరిచయం, 1.2 అరణ్యకాలంటే ఏవిటి?<br>1.3 సంహితలు ; అరణ్యకాలు; 1.4 అరణ్యకాల్లో<br>ముందువెనుకలు; 1.5 నశించిపోయిన అరణ్యకాలు;<br>1.6 అరణ్యకాలుకూడా వేదాలేనా?;<br>1.7 అరణ్యకాలవల్ల ఏం ప్రయోజనం?<br>2.1.1, 2.2.1, 2.3.1,<br>2.4.1, 2.5.1, 2.6.1 పరిచయం |

2.1.2, 2.2.2, 2.3.2,
2.4.2, 2.5.2, 2.6.2 విభాగం
2.1.3, 2.2.3, 2.3.3,
2.4.3, 2.5.3, 2.6.3 సంకలనకాలం
2.1.4, 2.2.4, 2.3.4, 2.4.4,
2.5.4, 2.6.4 వ్యాఖ్యానాలు, ప్రచురణలు
2.1.5, 2.2.5, 2.3.5,
2.4.5, 2.5.5, 2.6.5 ప్రసిద్ధి
2.1.6 ఉపాసనలు

ఎస్. పి. వి. — డా. ఎస్. పాండురంగ విఠల్, ఎం.ఏ., పిహెచ్.డి.
శిరోమణి, రీసెర్చి అసోసియేట్, సాంస్క్రిట్ డిపార్ట్‌మెంట్,
ఎస్. వి. యూనివర్శిటి, తిరుపతి.
2.4.8 సంగ్రహసమీక్ష

ఎస్. ఎస్. ఎస్. — డా. ఎస్. సుదర్శనశర్మ, ఎం.ఏ., పిహెచ్.డి.
లెక్చరర్,
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠమ్, తిరుపతి.
1.11 మతం -- తత్త్వం

టి. వి. ఆర్. — డా. టి. వి. రాఘవాచార్యులు, ఎం.ఏ., పిహెచ్.డి.
విద్యాప్రవీణ, లెక్చరర్, ఆర్.ఎస్. విద్యాపీఠమ్,
తిరుపతి.
2.6.6 ఉపాసనలు

యు. వి. ఆర్. — శ్రీ యు. వెంకటరామయ్య, ఎం.ఏ.,
విద్యాప్రవీణ, భాషాప్రవీణ,
లెక్చరర్ (రిటైర్డ్) ఎస్. వి. ఓరియంటల్ కాలేజ్,
తిరుపతి.
2.4.6 ఉపాసన

| | |
|---|---|
| వి. వి. | ప్రొఫెసర్ వి. వరదాచార్య, ఎం.ఏ., పిహెచ్.డి.<br>ప్రొఫెసర్, ఫ్రెంచి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండాలజీ,<br>పాండిచ్చేరి.<br>**2.3.6 ఉపాసనలు** |
| వి. వి. బి. | శ్రీ వేదాంతం విష్ణుభట్టాచార్యులు, ఎం.ఏ., ఎమ్.ఫిల్.<br>రీసెర్చి స్కాలర్,<br>రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.<br>2.2.7 వైశిష్ట్యం |

* * *

# ప్రస్తావన

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య
ప్రొఫెసర్, సంస్కృతవిభాగం,
శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం,
తిరుపతి.

ప్రాచీన మానవతావాదానికి సముదాత్తమైన సంస్కృతికి, విశ్వకల్యాణభావనలకు నిలయాలు వేదాలు. ఒకనాడు సమ్మిశ్రంగా ఉన్న వేదరాశిని విడివిడిగా వర్గీకరించి ఋగ్వేదమని, యజుర్వేదమని, సామవేదమని, అథర్వవేదమని విభజించినవాడు వేదవ్యాసుడు. వైదికవాఙ్మయంలో సంహితలు మూలగ్రంథాలు. వాటికి వ్యాఖ్యానాలుగా బ్రాహ్మణాలవతరించాయి. బ్రాహ్మణంలో ఒకభాగంగా ఆరణ్యకం ఆవిర్భవించింది. లోక కల్యాణంకోసం త్యాగ -- యోగ రూపమైన యజ్ఞాలనాచరించిన భారతీయుడు ఇంకో అడుగు ముందుకు వేసి తనను గురించి, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించి ఆలోచిస్తూ తాత్త్వికదృష్టిని పెంపొందించుకునే ప్రయత్నం ప్రారంభించాడు. అలాంటి విచారధార, అన్వేషణ, జిజ్ఞాస మొట్టమొదట మనకు ఆరణ్యకవాఙ్మయంలో సూత్రప్రాయంగా కనబడుతుంది.

**ఆరణ్యకవాఙ్మయం :**

యజ్ఞాచరణ ప్రభావం కొంతవఱకు ఉన్నప్పటికీ ఉపాసనల ప్రాశస్త్యాన్ని గుర్తించి ఆధ్యాత్మిక తత్త్వబీజాలను మానవుని మనస్సులో నాటిన వాఙ్మయం ఆరణ్యకవాఙ్మయం. ప్రతిసంహితకు బ్రాహ్మణాలు ఏర్పడినట్లే ఆరణ్యకాలు కూడా ఉండేవి. కాని కాలక్రమేణ ఆరణ్యకవాఙ్మయం కూడా మన నిరాదరణకు గురై కొంత నశించి

పోయింది. ఈనాడు అథర్వవేదానికి గోపథబ్రాహ్మణం ఉన్నప్పటికీ అరణ్యకం లేకపోవడం అందుకు నిదర్శనం. మూడువేదాలకు మాత్రమే ఆరణ్యకాలు దొరుకుతున్నాయి. యజ్ఞయాగస్పర్శలేకుండా పరిణతమైన తాత్త్వికభావనలతో విలసిల్లే ఉపనిషద్వాఙ్మయానికి ఊపిరి పోస్తున్నది ఆరణ్యకవాఙ్మయం. ఇది వైదికరంగంలో మూడో భాగంగా గుర్తింప బడింది. నశించిపోయిన ఆరణ్యకాలు ఎన్నో పోగా ఇప్పుడు మిగిలి ఉన్నవి ఆరు ఆరణ్యకాలు మాత్రమే. వీటిని కూడా రక్షించుకోలేని దీన స్థితికి ఈనాటి భారతీయుడు తనకు తెలియకుండా చేరిపోతున్నాడు. అందుకే ఉన్నతమైన ఈ వాఙ్మయాన్ని ఉన్నంతవఱకైనా భద్రపరచి ప్రజల ముందుకు తీసుకురావాలని తి.తి.దే. చేస్తున్న ప్రయత్నమే ఆర్షవిజ్ఞానసర్వస్వం.

ఈ ప్రణాళికలో మొదటి సంపుటం "వేదసంహితలు", రెండో సంపుటం "బ్రాహ్మణాలు" ఇదివఱకే మీముందుకు వచ్చి మీ ఆద రానికి పాత్రమైనాయి. ఇప్పుడు "ఆరణ్యకాల"నే మూడో సంపుటం ముస్తాబై వస్తున్నది.

స్వరూపం :

ఇంతకు ముందు సంపుటాల్లాగానే ఇందులోను సామాన్యవిశేష విభాగాలున్నాయి. ఆరణ్యక సాహిత్యానికి సంబంధించిన సామాన్యాంశా లన్నీ ఈ విభాగంలోని పదమూడు శీర్షికల్లో చక్కగా చర్చించబడినాయి. ఆరణ్యకవాఙ్మయానికి సంబంధించిన స్థూలస్వరూపాన్ని వివిధ దృక్కో ణాల్లోంచి ఈ విభాగంలో దర్శించవచ్చు.

రెండోది విశేషవిభాగం. ఇందులో ఆరు ఆరణ్యకాలు విడివిడిగా పరామర్శించబడ్డాయి. ప్రతి ఆరణ్యకానికి సంబంధించిన ఎనిమిది అంశాలు ఈ విభాగంలో చక్కగా సమీక్షించబడ్డాయి. ఈ ఎనిమిది

అంశాలను సమగ్రంగా చదివితే ఆ ఆరణ్యక స్వరూపం మనకు సుల భంగా బోధపడుతుంది. ఈ సంపుటంలో సమీక్షించబడిన ఆరణ్యకాలివి:

ఋగ్వేదం : 1. ఐతరేయారణ్యకం
2. కౌషీతకారణ్యకం

యజుర్వేదం : 1. తైత్తిరీయారణ్యకం
2. బృహదారణ్యకం
3. మైత్రాయణీయారణ్యకం

సామవేదం : 1. తలవకారారణ్యకం.

నిత్య సత్యాన్వేషులై, నిస్వార్థజీవనులై నిరంతరం ఋతానికి, సత్యానికి కట్టుబడి మనుగడసాగించి, విశ్వకల్యాణాన్ని ఆకాంక్షించిన ఆ మహనీయుల వారసులం మనం. ప్రేమే తప్ప ద్వేషం తెలియక త్యాగమే తప్ప స్వార్థం ఎఱుగక మనస్సు -- మాట – శరీరమనే త్రికరణాలను సత్యానికి అంకితం చేసిన ఆదర్శజీవనులు ప్రాచీనభారతీయులు. వారే మంత్రద్రష్టలైన మహర్షులు. వారందించిన నిధులే ఈ వేదాలు. అసమర్థుడి చేతిలో బడ్డ అఖండనిధుల్లాగా అవి కరిగిపోయి నాయి. ఈనాడు నామమాత్రంగా కొన్ని శాఖల్లో ఒకటి రెండు మిగిలి ఉన్నాయి. వాటిని చూచి, అవి విశ్వానికి అందించే శాంతిసందేశాన్ని విని ఈనాడు భారతీయ సంస్కృతికి ప్రపంచదేశాల్లో పెద్దపీట వేస్తు న్నారు. భారతీయ మనీషులకు నీరాజనాలు పడుతున్నారు. వాటిని రక్షించుకొని మానవత్వాన్ని రక్షించటమా? లేక వాటిని అసహ్యించు కొని, అవహేళన చేసి మన అస్తిత్వాన్ని పోగొట్టుకోవడమా? ఇదే ఈనాడు మన ముందున్న ప్రశ్న. రక్షిస్తే రాబోయే తరాలు మనల్ని గౌరవిస్తాయి. వదిలేస్తే మన వారసులకు మనం క్షంతవ్యులం కాలేం. సంయమనంగల ఒక భారతీయుడుగా ప్రతిస్పందించండి! లోక కల్యా

ణాన్ని ఆశించండి! విశ్వమానవుల్ని ప్రేమించండి! శాంతి సామరస్యాలతో సహజీవనం సాగించండి! అదే అదే ఆర్షవిజ్ఞానం మనకందించే సందేశం.

— రఘునాథాచార్య

# అనుక్రమణి

ముందుమాట

సంపాదకుని మాట

రచయితలు

ప్రస్తావన

## 1. సామాన్యవిభాగం

1.1 పరిచయం

1.2 ఆరణ్యకాలంటే ఏమిటి? 3
ఎందుకు ఆరణ్యకమైంది? ..

1.3 సంహితలు : ఆరణ్యకాలు 6
ఋక్సంహిత : ఆరణ్యకాలు ..
యజుస్సంహిత : ఆరణ్యకాలు ..
సామసంహిత : ఆరణ్యకం 7
అథర్వసంహిత : ఆరణ్యకం ..

1.4 ఆరణ్యకాల్లో ముందువెనుకలు 9

1.5 నశించిపోయిన ఆరణ్యకాలు 12

**ఋక్సంహిత : ఆరణ్యకాలు** 13

1. పైంగ్యారణ్యకం ..
2. బాహ్వృచారణ్యకం ..
3. ఆశ్వలాయనారణ్యకం ..
4. గాలవారణ్యకం 14

యజుస్సంహిత : ఆరణ్యకాలు ..
1. చరకారణ్యకం ..
2. శ్వేతాశ్వతరారణ్యకం ..
3. కారకారణ్యకం ..
4. జాబాలారణ్యకం 15
5. ఖాండికేయారణ్యకం ..
6. ఔఖేయారణ్యకం ..
7. హారిద్రవికారణ్యకం ..
8. తుంబురు ఆరణ్యకం ..
9. ఆహ్వరకారణ్యకం ..
10. కంకత్యారణ్యకం 16
11. ఛాగలేయారణ్యకం ..

సామసంహిత : ఆరణ్యకాలు ..
1. భాల్లవ్యారణ్యకం ..
2. కాలబవ్యారణ్యకం ..
3. రౌరుక్యారణ్యకం ..
4. శాట్యాయనారణ్యకం 17

1.6 ఆరణ్యకాలు కూడా వేదాలేనా? 18
1.7 ఆరణ్యకాల వల్ల ఏం ప్రయోజనం? 20
1.8 మహర్షులు 22
ఋషి అంటే ఎవరు? ..
1.9 ఉపాఖ్యానాలు 31
ఇంద్రోపాఖ్యానం 32
ప్రజాపత్యుపాఖ్యానం ..
విశ్వామిత్రోపాఖ్యానం 33

| | | |
|---|---|---|
| | గాంగ్యాయన్యుపాఖ్యానం | 34 |
| | ప్రతర్దనోపాఖ్యానం | 35 |
| | బాలాక్యుపాఖ్యానం | 36 |
| | ఆకలిదప్పులు | 37 |
| | ప్రాణోపాఖ్యానాలు | .. |
| | సృష్టిక్రమం | 39 |
| | ఓంకారమహిమ | 40 |
| | ఉద్గాత – ఉత్తరదిక్కు | 41 |
| | ఉచ్చైశ్శ్రవోపాఖ్యానం | .. |
| 1.10 | ప్రకృతి | 43 |
| | 1. దేశాలు | 45 |
| | 2. నదులు | .. |
| | 3. ఋతువులు | .. |
| | 4. ధాన్యాలు | 46 |
| | 5. క్షీరద్రవ్యాలు | 47 |
| | 6. సోమలత | .. |
| | 7. వృక్షాలు | .. |
| | 8. జంతువులు | 50 |
| | 9. పక్షులు | 51 |
| | 10. సర్పాలు | .. |
| 1.11 | మతం – తత్త్వం | 52 |
| | 1. మతం | 53 |
| | 2. తత్త్వం | 60 |
| 1.12 | కవితాసౌందర్యం | 65 |
| | 1. పలుకుబళ్లు | .. |
| | 2. భావనలు | 66 |

| | | |
|---|---|---|
| 3. | వర్ణనలు | 68 |
| 4. | శబ్దాలంకారాలు | 70 |
| 5. | అర్థాలంకారాలు | 72 |
| 6. | ప్రశ్నోత్తరికలు | 74 |
| 1.13 | భాషాపరిణామం | 75 |
| | వ్యాకరణవిశేషాలు | 76 |
| 2. | **విశేషవిభాగం** | |
| 2.1 | ఐతరేయారణ్యకం | |
| 2.1.1 | పరిచయం | 86 |
| 2.1.2 | విభాగం | 87 |
| | విషయ విభాగం | 89 |
| | మొదలు – చివరు | 90 |
| 2.1.3 | సంకలనకాలం | 91 |
| | దేశం | .. |
| | కాలం | .. |
| 2.1.4 | వ్యాఖ్యానాలు – ప్రచురణలు | 92 |
| | వ్యాఖ్యానాలు | .. |
| | ప్రచురణలు | .. |
| 2.1.5 | ప్రసిద్ధి | 93 |
| | గర్భంలో పిండం ఎలా ఏర్పడింది ? | |
| 2.1.6 | ఉపాసనలు | 95 |
| | ఉపాసనాశబ్దార్థం | .. |
| | హింకారోపాసన | .. |
| | ఉదరోపాసన | 96 |

| | | |
|---|---|---|
| | హృదయోపాసన | 97 |
| | ప్రాణోపాసన | .. |
| | ఆత్మోపాసన | 100 |
| | సంహితోపాసన | .. |
| | నిర్భుజోపాసన | 101 |
| 2.1.7 | వైశిష్ట్యం | 102 |
| 2.1.8 | సంగ్రహసమీక్ష | 105 |
| | మొదటి ఆరణ్యకం | .. |
| | రెండో ఆరణ్యకం | 106 |
| | మూడో ఆరణ్యకం | 107 |
| | సకృదుక్తి ఖండాధ్యాయం | 108 |
| | నాలుగో ఆరణ్యకం | 109 |
| 2.2 | కౌషీతకారణ్యకం | 111 |
| 2.2.1 | పరిచయం | .. |
| 2.2.2 | విభాగం | 113 |
| | విషయవిభాగం | 114 |
| | మొదలు – చివఱ | .. |
| 2.2.3 | సంకలనకాలం | 115 |
| | దేశం | .. |
| | కాలం | .. |
| 2.2.4 | వ్యాఖ్యానాలు -- ప్రచురణలు | 117 |
| | వ్యాఖ్యానాలు | .. |
| | ప్రచురణలు | .. |
| 2.2.5 | ప్రసిద్ధి | 118 |
| 2.2.6 | ఉపాసనలు | 120 |

| | | |
|---|---|---|
| 2.2.7 | వైశిష్ట్యం | 128 |
| | మహావ్రతోపాసన | .. |
| | సంహితోపాసన | .. |
| | అక్షరోపాసన | 129 |
| | పురుషచాతుర్విధ్యం | 130 |
| 2.2.8 | సంగ్రహసమీక్ష | 133 |
| 2.3 | తైత్తిరీయారణ్యకం | 139 |
| 2.3.1 | పరిచయం | .. |
| 2.3.2 | విభాగం | 140 |
| | విషయ విభాగం | 141 |
| | మొదలు – చివఱ | .. |
| 2.3.3 | సంకలనకాలం | 142 |
| | దేశం | .. |
| | కాలం | .. |
| 2.3.4 | వ్యాఖ్యానాలు -- ప్రచురణలు | 143 |
| | ప్రచురణలు | .. |
| 2.3.5 | ప్రసిద్ధి | 144 |
| 2.3.6 | ఉపాసనలు | 146 |
| 2.3.7 | వైశిష్ట్యం | 150 |
| 2.3.8 | సంగ్రహసమీక్ష | 154 |
| | మొదటి ప్రపాఠకం | .. |
| | రెండో ప్రపాఠకం | 155 |
| | యజ్ఞోపవీతప్రశస్తి | .. |
| | సంధ్యోపాసన | 156 |

| | | |
|---|---|---|
| | పంచమహాయజ్ఞాలు | .. |
| | మూడో ప్రపాఠకం | .. |
| | నాలుగో ప్రపాఠకం | 157 |
| | అయిదో ప్రపాఠకం | 158 |
| | ఆరో ప్రపాఠకం | .. |
| 2.4 | బృహదారణ్యకం | |
| 2.4.1 | పరిచయం | 159 |
| 2.4.2 | విభాగం | 161 |
| | విషయవిభాగం | 162 |
| | మొదలు – చివఱ | .. |
| 2.4.3 | సంకలనకాలం | 163 |
| | దేశం | .. |
| | కాలం | .. |
| 2.4.4 | వ్యాఖ్యానాలు – ప్రచురణలు | 164 |
| 2.4.5 | ప్రసిద్ధి | 166 |
| 2.4.6 | ఉపాసన | 168 |
| | ప్రాణోపాసన | 169 |
| | ఆత్మోపాసన | 171 |
| | అన్నోపాసన | 172 |
| | వాగ్బ్రహ్మోపాసన | 173 |
| | వాయుబ్రహ్మోపాసన | .. |
| | చక్షుర్బ్రహ్మోపాసన | .. |
| | శ్రోత్రబ్రహ్మోపాసన | 174 |
| | మనోబ్రహ్మోపాసన | .. |
| | హృదయబ్రహ్మోపాసన | .. |

| | | |
|---|---|---|
| | ప్రణవాకాశోపాసన | 175 |
| | సత్యబ్రహ్మోపాసన | .. |
| | విద్యుద్బ్రహ్మోపాసన | 176 |
| | ధేనురూపవాక్ బ్రహ్మోపాసన | .. |
| | అన్నప్రాణరూప బ్రహ్మోపాసన | 177 |
| | గాయత్ర్యుపాసన | .. |
| | వివిధదృష్టులతో ప్రాణోపాసన | 178 |
| 2.4.7 | వైశిష్ట్యం | 181 |
| 2.4.8 | సంగ్రహసమీక్ష | 187 |
| | మొదటి అధ్యాయం | .. |
| | రెండో అధ్యాయం | 188 |
| | మూడో అధ్యాయం | .. |
| | గ్రహాలు : అతిగ్రహాలు | 189 |
| | నాలుగో అధ్యాయం | 190 |
| | అయిదో అధ్యాయం | 191 |
| | 'ద'కారోపదేశం | .. |
| | హృదయమంటే ఏమిటి? | .. |
| | ఆరో అధ్యాయం | 192 |
| 2.5 | మైత్రాయణీయారణ్యకం | |
| 2.5.1 | పరిచయం | 194 |
| 2.5.2 | విభాగం | 196 |
| | విషయవిభాగం | .. |
| | మొదలు – చివఱ | 197 |

| | | |
|---|---|---|
| 2.5.3 | సంకలనకాలం | 198 |
| | దేశం | |
| | కాలం | 199 |
| 2.5.4 | వ్యాఖ్యానాలు -- ప్రచురణలు | 200 |
| 2.5.5 | ప్రసిద్ధి | 201 |
| | కాలమే అన్నింటికీ కారణం | |
| | మనస్సే మన సాధనం | |
| 2.5.6 | ఉపాసనలు | 203 |
| | పరబ్రహ్మోపాసన | 206 |
| | ఆదిత్యోపాసన | 207 |
| | అన్నోపాసన | 208 |
| | షడంగయోగం | .. |
| | శబ్దోపాసన | 209 |
| | ప్రణవోపాసన | .. |
| 2.5.7 | వైశిష్ట్యం | 211 |
| | ఇదంతా నశించిపోయేదే! | |
| | మనస్సే అన్నింటికీ మూలం | |
| 2.5.8 | సంగ్రహసమీక్ష | 215 |
| | ప్రథమ ప్రపాఠకం | 216 |
| | ద్వితీయ ప్రపాఠకం | 217 |
| | తృతీయ ప్రపాఠకం | 219 |
| | చతుర్థ ప్రపాఠకం | 220 |
| | పంచమ ప్రపాఠకం | .. |
| | షష్ఠ ప్రపాఠకం | 221 |
| | సప్తమ ప్రపాఠకం | 223 |
| 2.6 | తలవకారారణ్యకం | |

| | | |
|---|---|---|
| 2.6.1 | పరిచయం | 226 |
| 2.6.2 | విభాగం | 227 |
| | విషయవిభాగం | 228 |
| | మొదలు – చివఱు | .. |
| 2.6.3 | సంకలనకాలం | 229 |
| | దేశం | .. |
| | కాలం | .. |
| 2.6.4 | వ్యాఖ్యానాలు – ప్రచురణలు | 230 |
| 2.6.5 | ప్రసిద్ధి | 231 |
| 2.6.6 | ఉపాసనలు | 233 |
| | గాయత్రోపాసన | 234 |
| | ఉద్గీథోపాసన | 235 |
| | ప్రణవోపాసన | .. |
| | ప్రాణోపాసన | 236 |
| | విద్యుదుపాసన | 237 |
| | వేదత్రయోపాసన | 238 |
| 2.6.7 | వైశిష్ట్యం | 239 |
| | అశరీరసామ | |
| 2.6.8 | సంగ్రహసమీక్ష | 243 |
| | ప్రథమాధ్యాయం | .. |
| | ద్వితీయాధ్యాయం | 245 |
| | శర్యాతోపాఖ్యానం | 246 |
| | తృతీయాధ్యాయం | 247 |

| | |
|---|---|
| సుదక్షిణక్షైమి — ప్రాచీనశాలి | .. |
| మూడుసార్లు పుట్టి మూడుసార్లు చస్తున్నాడు | 248 |
| చతుర్థాధ్యాయం | 249 |
| నేనంటే నేను | .. |
| భగీరథ వృత్తాంతం | .. |


* * *

# సామాన్య విభాగం

# ఆర్షవిజ్ఞానసర్వస్వము

## ఆరణ్యకాలు

# 1 సామాన్యవిభాగం

## 1.1 పరిచయం :

భారతీయుల ధార్మిక జీవనస్రవంతికి, తాత్త్విక భావనాపటిమకు ప్రతీకలు వేదాలు. వైదికవాఙ్మయం సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులని నాలుగు రంగాలుగా విభజించబడింది. నిరంతర తపస్సుతో అతీంద్రియజ్ఞానాన్ని సంపాదించుకొని, భగవంతుని నిశ్శ్వాసాలైన వేదాలను సందర్శించారు సంయమీంద్రులు మంత్రద్రష్టలైన మహర్షులు. వారు దర్శించిన మంత్రభాగాలే సంహితలు. వాటికి వ్యాఖ్యానరూపాలే బ్రాహ్మణాలు. ఇవి యజ్ఞయాగాది స్వరూపాన్ని వాటినాచరించే పద్ధతులను చక్కగా ప్రతిపాదించాయి. కాలక్రమేణ కర్మమార్గంపైన ఆసక్తి సడలసాగింది. మానవుని దృష్టి అశాశ్వతమైన సుఖాన్ని వదలి శాశ్వతసుఖాన్వేషణవైపు మళ్లింది. జీవస్వరూపం, ప్రపంచసృష్టి, భగవంతుడు మొదలగు అంశాలను గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు మానవుడు.

గృహస్థాశ్రమం నుంచి నిష్క్రమించి అతడు వానప్రస్థుడై ప్రశాంత రమణీయాలైన అరణ్యాలకు చేరాడు. భౌతికబంధాలను తగ్గించుకోడానికి ప్రయత్నించాడు. అప్పుడు అరణ్యంలో దీక్షితుడై అతడధ్యయనం చేసిన గ్రంథాలే ఆరణ్యకాలు. ఇవి ఉపనిషత్తులకు ఊపిరిపోసినాయి. కర్మ - జ్ఞాన మార్గాల మేలుకలయిక ఈ ఆరణ్యకాలనుకోవడం ఎంతైనా ఉచితంగా ఉంటుంది. అనిత్యఫలాలనందించే కఠోర కర్మాచరణం నుంచి నిత్యమైన సుఖాన్ని పొందడం కోసం అందరిలోను దాగి ఉన్న ఆత్మ తత్త్వంపైన ఆలోచనలు ప్రారంభమైనాయి. వాటి సమగ్రస్వరూపమే మీరు ఈ సంపుటంలో సాక్షాత్కరించబోతున్నారు.

భారతీయుల ఆదర్శజీవనానికి, ఆత్మోన్నత్యానికి, సంస్కారసంభరితమైన మనస్తత్వానికి, వాస్తవతత్త్వజిజ్ఞాసకు ఈ ఆరణ్యకవాఙ్మయం ఒక పెన్నిధి లాంటిది. అది సర్వాంగసుందరంగా మీ ముందుకొస్తోంది. పరిశీలించండి.

— ఎస్.బి.ఆర్.

# 1.2 ఆరణ్యకాలంటే ఏమిటి?

ఇంతకు ముందే చెప్పినట్లు వైదికవాఙ్మయరంగాన్ని నాలుగు దశ లుగా విభజించుకుంటే అందులో సంహిత, బ్రాహ్మణం అనేవి మొదటి రెండు దశలు కాగా ఆరణ్యకం అనేది మూడో దశ అవుతున్నది. ఆరణ్యకాలు బ్రాహ్మణాలకు పరిశిష్టభాగంగాను, ఉపనిషత్తుల ఉనికికి ఆధారంగాను కనబడుతున్నాయి. అందువల్లనే బ్రాహ్మణాల్లో ఉన్న కర్మ కాండచ్ఛాయలు, ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడ్డ జ్ఞానకాండచ్ఛాయలు కూడా స్పష్టంగా కన్పడుతున్నాయి. యజ్ఞయాగాలు ఆదరింపబడే ఆచ రింపబడుతున్న కాలంలో బ్రాహ్మణాలకు, తరువాత కాలంలో జ్ఞానభాగం ప్రధానమైనప్పుడు ఉపనిషత్తులకు బహుజనసమాదరణ లభించింది. కాని ఆరణ్యకాలకు ఒకప్పుడు ఎక్కువ ఆదరణగాని ఇంకొకప్పుడు అనాదరం గాని ఈ సమాజంలో ఏర్పడలేదు.

### ఎందుకు ఆరణ్యకమైంది ?

యజ్ఞాల్లోని రహస్యాలను మహర్షులు అరణ్యాల్లో చర్చించారు. వాటి సారమే ఆరణ్యకాల్లో మనకు కనబడుతుంది. అరణ్యంలో చదువదగినవి గనక ఈ గ్రంథాలకు ఆరణ్యకాలనే పేరేర్పడింది. అందువల్లనే సాయ ణాచార్యులు తన ఐతరేయ బ్రాహ్మణభాష్యారంభంలో "అరణ్యే పాఠ్య త్వాత్ ఆరణ్యకమ్" అని నిర్వచించారు.[1] కనుకనే సత్రప్రకరణంలో మహా వ్రతంలోని హౌత్రాన్ని గురించి చెప్పకుండా అది అరణ్యంలో

1. ఐతరేయబ్రాహ్మణేఽస్తి కాండమారణ్యకాభిధమ్ |
అరణ్య ఏవ పాఠ్యత్వాదారణ్యకమితీర్యతే ||
సత్రప్రకరణేఽనుక్తి రరణ్యాధ్యయనాయ హి |
మహావ్రతస్య తస్యాత్ర హౌత్రం కర్మ వివిచ్యతే ||
సా.భా.ఐ.బ్రా. 1.5.8.

పఠనీయం కాబట్టి మహర్షి ఈ ఆరణ్యకంలో ఉపదేశిస్తున్నాడని సాయణుడభిప్రాయపడుతున్నాడు.

సురేశ్వరాచార్యులు తన సంబంధవార్తికంలో ఇది అరణ్యంలో అధ్యయనం చేయతగింది కాబట్టి ఆరణ్యకమైందని తెలియజేస్తున్నాడు.[2] మహాభారత శాంతిపర్వంలో పెరుగునుంచి వెన్నలాగా, మలయపర్వతం నుంచి చందనతరువులాగా, ఓషధులనుంచి అమృతంలాగా వేదాలనుంచి ఆరణ్యకాలు సారాంశాలుగా ఏర్పడుతున్నాయని చెప్పబడింది.[3]

వేదసంహితలకు అనుబంధంగా ఒకప్పుడు అనేక బ్రాహ్మణాలెలా ఉండేవో అలాగే బ్రాహ్మణాలకు అనుబంధంగా ఆరణ్యకాలు కూడా ఒకప్పుడు అనేకం ఉండేవి.

కాలక్రమేణ చాలా ఆరణ్యకాలు నశించిపోయాయి. ఇప్పుడు మనకు దొరకుతున్న ఆరణ్యకాలు చాలా కొద్ది మాత్రమే. గృహస్థాశ్రమాన్ని పరిత్యజించి వానప్రస్థాశ్రమం స్వీకరించినవాళ్లు ఆచరించాల్సిన యజ్ఞాలకు మహావ్రతాలకు సంబంధించిన వివరాలన్నింటిని ఆరణ్యకాలు ప్రతిపాదిస్తున్నాయి. వాటిల్లో యజ్ఞస్వరూపం, యజ్ఞప్రయోజనం చక్కగా విశదీకరించబడింది. ఉపనిషత్తులకు ఆరణ్యకాలే మూలం కనుక వీటిల్లో చర్చించబడే అనేక రహస్యార్థాలకు ఆరణ్యకాలు ఆలవాలంగా ఉన్నాయి. అందువల్లే ఆరణ్యకాలకు రహస్యాలనే పేరు కూడా ఏర్పడింది. గోపథ బ్రాహ్మణంలోను, మనుస్మృతిలోను వాసిష్ఠధర్మసూత్రంలోను[4] ఇలాంటి వ్యవహారం కనబడుతున్నది.

ఆరణ్యకాలు బ్రాహ్మణాల్లో ఒక భాగంగా ఉన్నాయి కాబట్టి ఆర

---

2. అరణ్యాధ్యయనాదేతదారణ్యకమితి. సం. వా. 9.

3. నవనీతం యథా దధ్నో మలయాచ్చందనం యథా |
ఆరణ్యకం చ వేదేభ్య ఓషధిభ్యోఽమృతం యథా ||
మ.భా.శాన్తి. 331.3.

4. తస్యా భర్తురభిచార ఉక్తం ప్రాయశ్చిత్తం రహస్యేషు
వా.ధ.సూ. 4.4

ణ్యకవాక్యాలను బ్రాహ్మణవాక్యాల్లాగానే పండితులు ఉదాహరించేవాళ్లు. బృహదారణ్యకం శతపథబ్రాహ్మణంలోను, తలవకారారణ్యకం జైమినీయ బ్రాహ్మణంలోను ఒక భాగంగా ఉండటం అందరికీ తెలిసిన విషయమే. అలాగే ఉపనిషత్తులు ఆరణ్యకాలలో ఏకదేశంగా దొరుకుతున్నాయి. మొత్తంమీద రహస్యార్థాలను వివరించే వైదికగ్రంథరాశి, బ్రాహ్మణాలకు పరిశిష్టభాగాలైన ఆరణ్యకాలు వైదికవాఙ్మయంలో మూడోరంగంగా రూపుదిద్దుకున్నట్లు తెలుస్తున్నది.

— ఎస్.బి.ఆర్.

# 1.3 సంహితలు:ఆరణ్యకాలు

వేదసంహితలకు బ్రాహ్మణాలు విడివిడిగా ఉన్నట్లే ఆరణ్యకాలు గూడా ఉండేవి. కాలక్రమేణ ఎన్నో ఆరణ్యకాలు నశించిపోయాయి. ఇప్పుడు మనకు దొరుకుతున్న ఆరణ్యకాలు చాలా కొద్ది మాత్రమే. ఆయా వేదాలకు సంబంధించిన ఆరణ్యకాలను ఇక్కడ పరిశీలిద్దాం.

**ఋక్సంహిత: ఆరణ్యకాలు:**

ఋగ్వేదానికి 21 శాఖలుండేవి. వాటిల్లో నశించిపోయినవి పోగా ఐతరేయ, కౌషీతకి (శాంఖాయన), పైంగి, బహ్వృచ, ఆశ్వలాయన, గాలవ బ్రాహ్మణాలు ఆరుండేవి. కాని వాటిల్లో చివరి నాలుగు నశించి పోయి ఐతరేయ-కౌషీతకి బ్రాహ్మణాలు రెండే మిగిలి ఉన్నాయి. ఆరణ్యకాలు బ్రాహ్మణాలకు పరిశిష్ట భాగాలు కాబట్టి ఋగ్వేదానికి ఐతరేయ-కౌషీతకారణ్యకాలు రెండే ఈ నాటికీ దొరుకుతున్నాయి.

**యజుస్సంహిత: ఆరణ్యకాలు:**

యజుర్వేదం శుక్ల-కృష్ణ భేదంతో రెండు విధాలు. అందులో శుక్ల యజుర్వేదానికి మాధ్యన్దిన- కాణ్వభేదంతో రెండు శాఖలున్నాయి. ఈ రెండు శాఖలకు విడివిడిగా శతపథబ్రాహ్మణం అనే పేరుతో రెండు బ్రాహ్మణాలున్నాయి. అధ్యాయాది విభాగంలో భేదమేగాని ఈ రెండింటికి విషయంలో భేదం లేదు. ఈ బ్రాహ్మణాలు రెండింటిలో ఒక భాగంగా బృహదారణ్యకం ఉన్నది.

ఇక కృష్ణయజుర్వేదంలోని తైత్తిరీయ శాఖకు సంబంధించినది తైత్తిరీయబ్రాహ్మణం. ఆ బ్రాహ్మణానికి పరిశిష్టమే తైత్తిరీయారణ్యకం. కృష్ణయజుర్వేదంలోని మైత్రాయణీయ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం మైత్రాయణీయబ్రాహ్మణం. దీనికి పరిశిష్టమే మైత్రాయణీయారణ్యకం. దీన్ని కూడా చరకశాఖలకు సంబంధించిన బృహదారణ్యకం అని అంటారు.

**సామసంహిత: ఆరణ్యకం:**

సామవేదానికి ఒకప్పుడు వెయ్యి శాఖలుండేవి. ఎన్నో శాఖలు నశించిపోగా రాణాయనీయ:, కౌథుమ, జైమినీయశాఖలు మూడు మాత్రమే మిగిలాయి. అందులో రాణాయనిమహర్షి ప్రవర్తింపజేసినశాఖ రాణాయనీయ శాఖకాగా, కుథుమి మహర్షి ద్వారా ఏర్పడిన శాఖ కౌథుమశాఖగా, జైమినిమహర్షి ద్వారా ప్రచారంలోకి వచ్చిన శాఖ జైమినీయశాఖగా ప్రసిద్ధి ఏర్పడింది.

కౌథుమశాఖకు సంబంధించిన బ్రాహ్మణాలు రెండున్నాయి. ఒకటి తాండ్యమహాబ్రాహ్మణం, రెండోది ఛాందోగ్యబ్రాహ్మణం. జైమినీయ శాఖకు చెందిన బ్రాహ్మణం తలవకార బ్రాహ్మణం. ఇందులో తాండ్య బ్రాహ్మణానికి ఆరణ్యకం, ఉపనిషత్తు లేదు. ఛాందోగ్యబ్రాహ్మణానికి ఆరణ్యకం లేదు గాని ఉపనిషత్తు మాత్రం ఉంది. అదే ఛాందోగ్యోపనిషత్. ఇక జైమినీయ శాఖకు సంబంధించిన తలవకారబ్రాహ్మణానికి ఆరణ్యకం జైమినీయోపనిషద్బ్రాహ్మణమనే పేరుతో ఉంది.

సామవేదానికి సంబంధించిన ఉపబ్రాహ్మణాలు 1. సామవిధాన బ్రాహ్మణం 2. దేవతాధ్యాయబ్రాహ్మణం 3. సంహితోపనిషద్బ్రాహ్మణం 4. వంశబ్రాహ్మణమని నాలుగున్నాయి. కాని వీటి విషయనిరూపణ పరిధి చాలా పరిమితమైంది. ఇందులో ఆరణ్యక భాగాలేవీ కనబడటం లేదు.

మొత్తం మీద సామవేదానికి సంబంధించిన ఆరణ్యకం ఒకే ఒకటి జైమినీయోపనిషద్బ్రాహ్మణం అనే పేరుతో ఉన్నట్లు తెలుస్తున్నది.

**అథర్వసంహిత: ఆరణ్యకం:**

అథర్వవేదానికి సంబంధించిన బ్రాహ్మణం గోపథబ్రాహ్మణం. ఈ బ్రాహ్మణం ఒకప్పుడు నూరు ప్రపాఠకాలతో ఉండేది. కాని ఇప్పుడు

89 ప్రపాఠకాలు నశించిపోయి కేవలం 11 ప్రపాఠకాలు మాత్రమే దొరుకుతున్నాయి. ప్రస్తుతం దొరుకుతున్న 11 ప్రపాఠకాల్లోను దేనికీ గుర్తింపు రాలేదు. బహుశ నశించిపోయిన 89 ప్రపాఠకాల్లో తప్ప కుండా ఆరణ్యకభాగం ఉండి ఉండవచ్చు. బ్రాహ్మణాలలో చివరి భాగంలో ఏర్పడిన గోపథంలో తప్పక ఆరణ్యక భాగం ఉండటానికి అవకాశం ఉంది. కాని మన దౌర్భాగ్యం వల్ల తొమ్మిదివంతుల గ్రంథం నశించిపోయి అందులోని అమూల్యమైన విషయాలు మనకందుబాటులో లేకుండాపోయాయి.

కాని దొరుకుతున్న ప్రపాఠకాలలో సృష్టి, ఓంకారోత్పత్తి, గాయత్రీ మాహాత్మ్యం మొదలగు అంశాలు ఇతరారణ్యకాలలో కూడా వర్ణింప బడి ఉండటం చూస్తే ఈ బ్రాహ్మణంలో కూడా ఆరణ్యక భాగం తప్పక ఉండి ఉండేదని ఊహించడానికి అవకాశం కలుగుతున్నది.

అయితే ప్రస్తుతానికి అథర్వవేదానికి ఆరణ్యకవాఙ్మయం లేదనే చెప్పాలి.

— ఎస్.బి.ఆర్.

# 1.4 ఆరణ్యకాల్లో ముందు వెనుకలు

ఋగ్యజుస్సామవేదాలకు సంబంధించిన ఐతరేయ, కౌషీతక, తైత్తిరీయ, బృహత్, మైత్రాయణీయ, తలవకారారణ్యకాలు ఆరు సుప్రసిద్ధంగా కనబడుతున్నాయి. ఇవి ఆయా శాఖలకు సంబంధించిన బ్రాహ్మణాలకు పరిశిష్ట భాగాలుగా రూపొందించబడినాయి. అయితే వీటిలో ఏవి ముందు? ఏవి వెనుక ఏర్పడి ఉంటాయనే ప్రశ్నకు సమాధానం చెప్పడం అంత సులభమైన పని కాదు. బ్రాహ్మణగ్రంథాలతో పాటే రూపొందిన ఈ ఆరణ్యకవాఙ్మయం బ్రాహ్మణకాలమైన క్రీ. పూ. 8వ శతాబ్దం నుంచి 5 వ శతాబ్దంలోపే ఏర్పడి ఉంటుందనుకోవడానికి అవకాశం ఎక్కువ కనపడుతోంది. అయితే ఈ నాలుగు వందల సంవత్సరాల కాలంలో ఆరణ్యకాలక్రమాన్ని గురించి ఇంకా పరిశోధనలు కొనసాగుతునే ఉన్నాయి. అయితే ఆధునిక విమర్శకుల అభిప్రాయాలను కొన్నింటిని దృష్టిలో పెట్టుకొని స్థూలంగా ఈ క్రమాన్ని క్రింది విధంగా నిర్ణయించుకోవచ్చు.

సామవేదానికి సంబంధించిన తలవకారారణ్యకాన్ని పరిశీలించినప్పుడు అందులోని భాషను, విషయాలను గమనించినప్పుడు ఆరణ్యకాలన్నింటిలోను అది ప్రాచీనమైందని అనిపిస్తుంది. తైత్తిరీయారణ్యకంలోని స్వరసంప్రదాయాన్ని వాక్యనిర్మాణపద్ధతిని, జాగ్రత్తగా అనుశీలనం చేస్తే తలవకారారణ్యకం తరువాత రెండోస్థానాన్ని ఈ ఆరణ్యకం ఆక్రమిస్తున్నట్లు అర్థమవుతుంది. బ్రాహ్మణ కాలం ఆరణ్యకాలకాలమని విమర్శకులు అంగీకరిస్తున్నారు. కాబట్టి ఈ రెండు ఆరణ్యకాలు బ్రాహ్మణాలు ప్రాదుర్భవించిన క్రీ. పూ. 8 వ శతాబ్దంలోనే రూపుదిద్దుకున్నాయనుకోడంలో తప్పులేదు.

కృష్ణయజుర్వేదానికి గల మైత్రాయణీయశాఖకు సంబంధించిన ఆరణ్యకం మైత్రాయణీయారణ్యకం. దీన్ని కొందఱు మైత్రాయణీయోపని

షత్తుగా కూడా పిలుస్తున్నారు. ఇందులో ప్రతిపాదింపబడిన అంశాలను పరిశీలిస్తే ఇది తైత్తిరీయారణ్యకం తరువాత ఏర్పడిందిగా కనిపిస్తుంది. కనుక దీనికి ఆరణ్యకాలలో మూడో స్థానం ఇస్తున్నారు విమర్శకులు. అయితే కొందఱు దీన్ని ఇంకా అర్వాచీనమని కూడా భావిస్తున్నారు.

ఇక క్రీ. పూ. 7 వ శతాబ్దంలో రచించబడినట్లు భావింపబడు తున్న ఐతరేయారణ్యకంలోని వృత్తాంతాలను ప్రమేయాన్ని పరిశీలిస్తే అది ఆరణ్యక వాఙ్మయంలో నాలుగో స్థానంలో నిలబడుతున్నదని చెప్పక తప్పదు. ముందు పేర్కొన్న ఆరణ్యకాలకంటే ఇందులోని భాషలో అర్వాచీనత కనబడుతున్నది. దీని తరువాత కౌషీతకారణ్యకాన్ని అయిదో స్థానంలో పేర్కొంటున్నారు చరిత్రకారులు. ఐతరేయారణ్యకానికి భావనల్లోను, భాషలోను, విషయనిరూపణపద్ధతిలోను కౌషీతకారణ్యకం చాలా దగ్గఱగా కనిపిస్తున్నది. ఇది క్రీ. పూ. 7 వ శతాబ్దాంతంలో నిర్మింపబడి ఉండవచ్చునని భావింపబడుతున్నది.

ఆరణ్యకాలన్నింటిలోను చివఱిదిగా గుర్తింపబడిన ఆరణ్యకం బృహదారణ్యకం. ఇది శుక్లయజుర్వేదానికి గల శతపథబ్రాహ్మణానికి సంబంధించింది. ఇది శతపథబ్రాహ్మణంలో ఒక భాగంగా అమరి ఉంది. ఇది ఆరణ్యకవాఙ్మయంలో చివఱ క్రీ. పూ. 6 వ శతాబ్దంలో ఏర్పడి ఉండవచ్చునని విమర్శకుల భావన. ఈ ఆరణ్యకంలోని భాషలో ఆధునికచ్ఛాయలు స్పష్టంగా గోచరిస్తున్నాయి.

అథర్వవేదానికి సంబంధించిన గోపథబ్రాహ్మణంలో నశించిపోయిన 89 ప్రపాఠకాల్లో ఆరణ్యకభాగం ఉండటానికి అవకాశం ఉంది. కాని మన దౌర్భాగ్యం వల్ల అది లభ్యం కావడంలేదు.

అందువల్ల అథర్వవేదానికి ఆరణ్యకమే లేకుండా పోయింది. ఋగ్యజుస్సామవేదాలకు సంబంధించిన ఆరు ఆరణ్యకాలకు పైన చేసిన కాల

నిర్ణయం కేవలం ఆధునిక విమర్శకుల అభిప్రాయాలపై ఆధారపడి ఉంది. కాని భారతీయ సంప్రదాయాన్ని అనుసరించేవారు వేదరాశిని అతిప్రాచీనమైందిగా భావిస్తారే గాని ఇలాంటి కాలనిర్ణయం చేయడాన్ని హర్షించరు.

— ఎస్.బి.ఆర్.

# 1.5 నశించిపోయిన ఆరణ్యకాలు:

విశ్వమానవ కల్యాణాన్ని ఆకాంక్షించి మానవుణ్ణి పరిపూర్ణమైన వ్యక్తిగా, సజీవమైన శక్తిగా తీర్చి దిద్దిన జ్ఞానభాండాగారమైన వేదరాశి నిత్యమైన సత్యమైన తాత్త్వికాంశాల నెన్నింటినో బోధించింది. తమ కోసం కాక మానవజాతికంతటికోసం నిరంతరమైన తపస్సుతో ఇంద్రియ నిగ్రహంతో ఆదర్శమైన జీవితాలను గడిపిన మహర్షివరేణ్యులు తత్త్వాన్ని హితాన్ని పురుషార్థాన్ని మనకందించారు. భావితరాలకు భాగ్యరాశి అయిన ఆవేదరాశి చాలా వఱకు నశించిపోయింది. ఇప్పుడు దొరుకుతున్న మిగిలిన వాఙ్మయాన్ని పరిశీలిస్తేనే ఎన్నో అమూల్యమైన సందేశాలు, ప్రబోధాలు మానవజాతికి స్ఫూర్తినందించజాలినవిగాను, వసుధైక కుటుంబ భావనను మనలో కలిగించజాలిందిగాను కనబడుతున్నది. నిజంగా నశించిపోయిన వాఙ్మయం కూడా ఉండి ఉంటే ఎంత బాగుండేది. ఇంకెన్ని సృష్టిరహస్యాలు, తాత్త్విక భావనలు, మార్గదర్శక సూత్రాలు మనకందుబాటులో ఉండేవో! ఇది ఎంతో విచారించదగిన విషయం.

సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులని వైదిక వాఙ్మయం నాలుగు రంగాలుగా రూపుదిద్దుకొన్నట్లు ఇదివఱకే చెప్పాను. అందులో ప్రతిరంగంలోను ఎన్నో గ్రంథాలు కాలగర్భంలో కలసిపోయాయి. వాటికి సంబంధించిన సంవాదాలు అక్కడక్కడా పరిశిష్టవాఙ్మయంలో దొరుకుతున్నాయి. వాటిని బట్టి ఒకప్పుడింత వాఙ్మయం ఉండేదని ఊహించగలుగుతున్నాం. వేదసంహితలకు సంబంధించిన శాఖలెన్ని నశించినాయో, ఎన్ని బ్రాహ్మణాలు నామమాత్రంగానే అక్కడక్కడ వినబడుతూ తమ అస్తిత్వాన్ని కోల్పోయాయో ఆర్షవిజ్ఞానసర్వస్వం ఒకటి రెండు సంపుటాల్లో పేర్కొనడం జరిగింది. ఈ సంపుటంలో ప్రధానంగా ఆరణ్యకవాఙ్మయం సమీక్షించబడుతున్నది కాబట్టి

ఎంత ఆరణ్యక వాఙ్మయం రూపుమాసిపోయిందో సంగ్రహంగా ఇక్కడ పరిశీలిద్దాం.

## ఋక్సంహిత: ఆరణ్యకాలు:

ఋగ్వేదానికి సంబంధించి మనకు ఐతరేయ కౌషీతకారణ్యకాలు రెండు మాత్రమే దొరుకుతున్నాయి. ఈ వేదానికి గల కొన్ని బ్రాహ్మణాలు నశించిపోయినట్లు రెండవ సంపుటంలో (ఆ.వి.స. Vol. II. 13) పేర్కొన్నాను. ఆరణ్యకాలు సామాన్యంగా బ్రాహ్మణాలకు పరిశిష్ట భాగాలుగా ఉండటం వల్ల, నశించిపోయిన బ్రాహ్మణాలన్నింటిలోను ఆరణ్యకాలు కూడా నశించిపోయి ఉంటాయని ఊహింపబడుతోంది.

### 1. పైంగ్యారణ్యకం:

పైంగిశాఖకు సంబంధించిన ఆరణ్యకం పైంగి బ్రాహ్మణానికి పరిశిష్టంగా ఉండేది. ఆపస్తంబ శ్రౌతసూత్రం లోను, సత్యాషాఢశ్రౌత సూత్రంలోను, శంకరాచార్యుల వారి శారీరకమీమాంసాభాష్యంలోను ఈ బ్రాహ్మణప్రసక్తి ఉన్నది. ఇది ఒకప్పుడు సమగ్రంగా లభించేది. ఇప్పుడిది నామమాత్రంగానే మిగిలిపోయింది.

### 2. బాహ్వృచారణ్యకం:

బాహ్వృచశాఖకు సంబంధించిన ఆరణ్యకం బాహ్వృచబ్రాహ్మణంలో భాగంగా ఉండేది. శబరస్వామి ఈ బ్రాహ్మణాన్ని తన శాబరభాష్యంలో పేర్కొన్నాడు. ఇప్పుడిది అలభ్యం.

### 3. ఆశ్వలాయనారణ్యకం:

ఆశ్వలాయనారణ్యకం ఆశ్వలాయన బ్రాహ్మణంలో భాగంగా ఉండేది. దీన్ని రఘునందనుడు స్మృతితత్త్వమనే గ్రంథంలో పేర్కొ

న్నాడు. ఇది కాలగర్భంలో కలసిపోయింది. కొందఱు ఐతరేయమే ఆశ్వలాయనమని ఊహిస్తున్నారు.

### 4. గాలవారణ్యకం:

గాలవారణ్యకం గాలవబ్రాహ్మణానికి సంబంధించినది. పతంజలి మహాభాష్యంలో (6.3.61; 1.1.44) గాలవుని ప్రసక్తి తీసుకొని వచ్చాడు. ఇది పేరుకు మాత్రమే మిగిలిఉన్నది.

## యజుస్సంహిత: ఆరణ్యకాలు:

### 1. చరకారణ్యకం:

చరకారణ్యకం చరకబ్రాహ్మణ పరిశిష్టరూపం. లాహోరులోని డి.ఎ.వి. కళాశాల గ్రంథాలయంలో చరకారణ్యకం వ్రాతప్రతి (No. 175) ఉన్నది. కాని అది ఇంతవఱకు ముద్రింపబడలేదు.

### 2. శ్వేతాశ్వతరారణ్యకం:

శ్వేతాశ్వతరారణ్యకం శ్వేతాశ్వతర బ్రాహ్మణ పరిశిష్టరూపం. ఈ బ్రాహ్మణాన్ని ఆత్మానన్దుడు, విశ్వరూపాచార్యులు పేర్కొన్నారు. ఇది ఇప్పుడు దొరకటం లేదు.

### 3. కాఠకారణ్యకం:

కాఠకారణ్యకం కాఠకబ్రాహ్మణానికి సంబంధించింది. ఈ ఆరణ్యకం వ్రాతప్రతులు కాశ్మీర్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా అవి దొరకడం లేదు. సూర్యకాన్త, కాలంద్ ఈ బ్రాహ్మణంలోని కొన్ని భాగాలను ప్రచురించారు. అందులో ఆరణ్యకం లేదు. వాసిష్ఠ ధర్మసూత్రం, వైఖానస ఆపస్తంబశ్రౌతసూత్రాలు ఈ బ్రాహ్మణాన్ని పేర్కొంటున్నాయి. ఇది కూడా కాలగర్భంలో కలసిపోయింది.

**4. జాబాలారణ్యకం:**

జాబాలబ్రాహ్మణానికి సంబంధించిన ఆరణ్యకం జాబాలారణ్యకం. దీన్ని విశ్వరూపాచార్యులు తన 'బాలక్రీడ' వ్యాఖ్యానంలో పేర్కొన్నారు. ఇది మనకిప్పుడు దొరకడం లేదు.

**5. ఖాండికేయారణ్యకం:**

ఖాండికేయబ్రాహ్మణ పరిశిష్టమే ఖాండికేయారణ్యకం. భాషిక సూత్రంలో ఖాండికేయ బ్రాహ్మణం పేర్కొనబడింది. ఇది కూడా మనకు లభించడం లేదు.

**6. ఔఖేయారణ్యకం:**

ఔఖేయారణ్యకం ఔఖేయబ్రాహ్మణ పరిశిష్టం. భాషిక సూత్రంలో ఈ బ్రాహ్మణం పేర్కొనబడింది. ఇది కాలగర్భంలో కలసిపోయింది.

**7. హారిద్రవికారణ్యకం:**

హారిద్రవికబ్రాహ్మణ పరిశిష్టం హారిద్రవికారణ్యకం. సాయణుడు ఋగ్భాష్యంలోను, యాస్కుడు నిరుక్తంలోను దీన్ని పేర్కొన్నారు. ఇది కూడా ఇప్పుడు లభించడం లేదు.

**8. తుంబురు ఆరణ్యకం:**

తుంబురు బ్రాహ్మణాన్ని పతంజలి పేర్కొన్నాడు. దీనికి సంబంధించిన తుంబురు ఆరణ్యకం ఎక్కడా లభించడం లేదు.

**9. ఆహ్వారకారణ్యకం:**

ఆహ్వారకబ్రాహ్మణాన్ని దుర్గాచార్యుడు తన నిరుక్తవ్యాఖ్యానంలో పేర్కొన్నాడు. ఆ బ్రాహ్మణ పరిశిష్టమే ఆహ్వారకారణ్యకం. ఇది మనకు దొరకడం లేదు.

### 10. కంకత్యారణ్యకం:

కంకత్యారణ్యకం కంకతిబ్రాహ్మణ పరిశిష్టం. అపస్తంబ శ్రౌత సూత్రం ఈ బ్రాహ్మణాన్ని పేర్కొంటున్నది. ఇది ఈనాటికీ మృగ్యంగానే ఉంది.

### 11. ఛాగలేయారణ్యకం:

ఛాగలిమహర్షి శిష్యులు ఛాగలేయులు. ఛాగలేయబ్రాహ్మణానికి సంబంధించిన ఆరణ్యకం ఛాగలేయారణ్యకం. బోధాయన శ్రౌతసూత్రం ఈ బ్రాహ్మణాన్ని పేర్కొంటున్నది. స్కందస్వామి ఋగ్వేదభాష్యంలో దీన్ని పేర్కొన్నాడు. ఇది నామమాత్రంగానే ఉన్నది.

## సామసంహిత: ఆరణ్యకాలు:

### 1. భాల్లవ్యారణ్యకం:

భాల్లవిబ్రాహ్మణ పరిశిష్టమే భాల్లవ్యారణ్యకం. బృహద్దేవత, కాశికా వృత్తి, ఆపస్తంబశ్రౌతసూత్రం మొదలగు గ్రంథాల్లో ఈ బ్రాహ్మణం పేర్కొనబడింది. ఇది మనకు లభించడం లేదు.

### 2. కాలబవ్యారణ్యకం:

ఆపస్తంబశ్రౌతసూత్రం కాలబవి బ్రాహ్మణాన్ని పేర్కొంటున్నది. ఈ బ్రాహ్మణానికి పరిశిష్టమే కాలబవ్యారణ్యకం. ఇది పేరుకు మాత్రమే మిగిలింది.

### 3. రౌరుక్యారణ్యకం:

తైత్తిరియబ్రాహ్మణ భాష్యంలో రౌరుకి బ్రాహ్మణాన్ని సాయణుడు పేర్కొన్నాడు. దీని పరిశిష్టమే రౌరుక్యారణ్యకం. ద్రాహ్యాయణ -

లాట్యాయన శ్రౌతసూత్రాల్లో ఈ బ్రాహ్మణం పేర్కొనబడింది. ఇది ఎక్కడా లభించడం లేదు.

### 4. శాట్యాయనారణ్యకం:

శాట్యాయనబ్రాహ్మణం ఆపస్తంబ శ్రౌతసూత్రం, సాయణభాష్యం మొదలగు ఎన్నో వైదిక గ్రంథాల్లో పేర్కొనబడింది. ఇది చాలా సుప్రసిద్ధమైన గ్రంథం. దీని పరిశిష్టమే శాట్యాయనారణ్యకం. ఇది ఎక్కడా లభించడం లేదు.

ఇంకా సుమారు 13 సంకీర్ణ బ్రాహ్మణాలు నశించిపోయినట్లు తెలుస్తున్నది. అలాగే వాటి ఆరణ్యకాలు కూడా నశించిపోయినాయి. ఈనాడు వైదికవాఙ్మయంపైన పరిశోధనలు జరగడం లేదు. కనీసం నశించిపోయిన గ్రంథాల పేర్లైనా మనం తెలుసుకోలేని పరిస్థితులు మన చుట్టూతా ఉన్నాయి.

— ఎస్.బి.ఆర్.

# 1.6 ఆరణ్యకాలు కూడా వేదాలేనా?

'వేదం' అనే వ్యవహారాన్ని ఏయే గ్రంథాలవఱకు వర్తింపజేయవచ్చు ననే విషయంలో అతి ప్రాచీనకాలం నుంచి చర్చ కొనసాగుతూనే ఉంది. కేవలం మంత్రభాగమైన 'సంహిత' వఱకే వేదమనే వ్యవహారం ఉచిత మని కొందఱు అభిప్రాయపడ్డారు. అలా కాదు; బ్రాహ్మణాల వఱకు వేదమనే వ్యవహారం సబబైనదేనని ఇంకొందఱు అనుకున్నారు. అయితే వారి దృష్టిలో ఆరణ్యకాలను ఉపనిషత్తులను వేదమని పిలువకూడదు. ఉపనిషత్తులకు వేదాంతమనే వ్యవహారం ఎలాగూ ఉంది. వేదంలో చివఱి భాగమనే అర్థం చెబితే ఉపనిషత్తులు కూడా వేదం కావలసి వస్తుంది. అందుకే కొందఱంటారు -- 'అన్త' శబ్దానికి సిద్ధాంతమని అర్థం. వేదంలో ప్రతిపాద్యమైన ముఖ్యసిద్ధాన్తం ఉపనిషత్తుల్లో చెప్ప బడుతోంది కాబట్టి ఉపనిషత్తులు వేదాన్తమనబడుతున్నాయి. అయితే మఱి ఆరణ్యకాల సంగతి ఏమౌతుంది?

ఇది చాలా సున్నితమైన సమస్య. ఇందులో అన్ని పక్షాల వారి అభిప్రాయాలు సమర్థించ దగినవే. వేదం అనే వ్యవహారం రెండు విధా లుగా కనబడుతున్నది. అపౌరుషేయాలైన సంహితారూప గ్రంథాలలో ముఖ్యంగా వేదమనే వ్యవహారం కనబడుతున్నది. పౌరుషేయాలైన బ్రాహ్మణాది గ్రంథాల్లో గౌణంగా అంటే అప్రధానంగా వేదమనే వ్యవహారం కనబడుతున్నది. దీనికి సంబంధించిన చర్చ వివరంగా క్రిందటి సంపుటంలో (ఆ.వి.స. Vol. II. 28) చేశాను. దానికి తగిన ప్రమాణాలను కూడా ఆ సందర్భంలోనే అందించాను.

ఈ విధంగా ముఖ్య-గౌణార్థాల్లో వేద వ్యవహారం ఉండటం వల్ల సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు అనే నాలుగు దశల్లో ఉన్న వాఙ్మయాన్నంతటిని వేదమని పిలుచుకోవడం ఉచి తమౌతుంది. అంతేకాకుండా సంహితలకు బ్రాహ్మణాలకు వేదమనే

వ్యవహారం అంగీకరించే వారి పక్షంలో ఆరణ్యకాలు కూడా బ్రాహ్మ ణాలలో ఒకభాగమే కాబట్టి అవి కూడా వేదమని పిలవబడటంలో తప్పులేదనిపిస్తుంది.

ఆరణ్యకాలనుండి ఉపనిషత్తులనుండి అనేక వాక్యాలను ఉదహరిస్తూ వేదాన్తగ్రంథాల్లో 'ఇతి శ్రుతిః' అని అనడం కూడా ఆరణ్యకాలకు, ఉపనిష త్తులకు కూడా శ్రుతి అనే వ్యవహారాన్ని సమర్థిస్తున్నది. కనుక ఏవిధంగా చూసినా ఆరణ్యకాలకు కూడా వేదమనే వ్యవహారం యుక్తమే నని పిస్తున్నది. ఆరణ్యకాలను వేదమని పిలవడం వల్ల ఎవరికీ ఏరకమైన విప్రతిపత్తి లేదు.

— ఎస్.బి.ఆర్.

# 1.7 ఆరణ్యకాల వల్ల ఏం ప్రయోజనం?

మంత్రరూపమైన వేదసంహితలను చక్కగా అర్థం చేసుకోవడానికి, అందులో ఉన్న నిగూఢార్థాలను గ్రహించడానికి వ్యాఖ్యానరూపమైన బ్రాహ్మణవాఙ్మయం అవసరమైంది. యజ్ఞయాగాల స్వరూపాన్ని ప్రతి పాదిస్తూ, వాటినాచరించడంలో ఏ మంత్రాలు ఎక్కడుపయోగించాలో వాటి రహస్యార్థాలేమిటో బ్రాహ్మణాలు వివరిస్తున్నాయి. బ్రాహ్మణ గ్రంథాలలో ఒక భాగంగా ఏర్పడ్డ ఆరణ్యకాలకు గూడా ఇదే ప్రయో జనమనుకోవడంలో తప్పు లేదు. కాని గృహస్థులను దృష్టిలో పెట్టుకొని కాక వానప్రస్థాశ్రమంలో ప్రవేశించిన వాళ్లు అరణ్యాల్లో అధ్యయనం చేయదగిన అంశాలను ఆరణ్యకాలు ప్రతిపాదిస్తున్నాయి. ఆరణ్యకాల్లో పేర్కొనబడే అంశాలు గ్రామాలలో అధ్యయనం చేయదగినవి ; చర్చిం చదగినవి కాదు. పవిత్రమైన అరణ్యావాతావరణంలో వాటినధ్యయనం చేయాలి. తైత్తిరీయారణ్యకానికి భాష్యం వ్రాస్తూ సాయణుడిలా అన్నాడు--

> అరణ్యంలో అధ్యయనం చేయబడటం వల్ల దీని కారణ్యకమని పేరు. "అరణ్యే తదధీయతే" అనే శ్రుతివాక్యం, దీన్ని అరణ్యంలోనే అధ్యయనం చేయాలనే అంశాన్ని నొక్కిచెబుతున్నది.[1]

ఆరణ్యకాల్లో ప్రతిపాదింపబడే విషయాలు అత్యంత రహస్యార్థాలు. దీక్షితులు కాని వాళ్లకు ప్రమాదకరమైనవి. అందువల్లనే అవి గ్రామాల్లో అధ్యయనం చేయరాదనే నిషేధమేర్పడింది. ఇవి యజ్ఞానుష్ఠాన ప్రక్రియ

1. అరణ్యాధ్యయనాదేత దారణ్యకమితీర్యతే ।
అరణ్యే తదధీయీతేత్యేవం వాక్యం ప్రవక్ష్యతే ॥ తై.ఆ.సా.భా. 1.6

లను అనేక వ్రతాలను నియమాలను గాక, యజ్ఞాలలోని అంతరార్థాలను సాంకేతికార్థాలను వివరిస్తూ చక్కని వ్యాఖ్యానాలనందిస్తున్నాయి.

ఆరణ్యకాలు ఇటు యజ్ఞయాగాదుల స్వరూపాన్ని నిరూపించే బ్రాహ్మణాలకు, ఆత్మతత్త్వాన్ని భగవత్తత్త్వాన్ని, సృష్టిని వివరించే ఉప నిషత్తులకు మధ్య వారధిగా ఉంటూ కర్మకాండనుంచి మానవుడి మనస్తత్త్వం జ్ఞానకాండవైపు ఎలా నడిచిందో స్పష్టం చేస్తున్నాయి. ఆర ణ్యక వాఙ్మయంలో ఇటు బ్రాహ్మణాల ప్రభావం అటు ఉపనిషత్తుల ప్రభావం విశదంగా మనకు గోచరిస్తున్నది. బ్రాహ్మణాలలో ఏకదేశంగా ఉండే ఈ ఆరణ్యకాలు తమలో ఒక భాగంగా ఉపనిషత్తుల్ని కలిగి ఉండటం దీన్ని తెలియజేస్తున్నది.

బ్రాహ్మణాల్లాగానే ఆరణ్యకాల్లో కూడా పదార్థనిర్వచనం అనేక సందర్భాల్లో చేయబడింది. సంహితలలోని పదాలకు అనేకారణ్యకాల్లో చక్కని వ్యుత్పత్తులు అందించబడినాయి. తరువాతి కాలంలో నిఘం టుకారులు వేదపదాలకు నిర్వచనాలను చెప్పేటప్పుడు ఆరణ్యకాలిచ్చిన వ్యుత్పత్తులను వాడుకోవటం గమనార్హమైన విషయం. కనుక వైదిక పదార్థ స్వరూపాన్ని నిర్వచించడంలో బ్రాహ్మణాలలాగానే ఆరణ్యకాల పాత్ర కూడా ఉన్నదనే విషయం మనం గుర్తించాలి.

ఆధ్యాత్మిక భావనలకు ఆటపట్టైన ఉపనిషద్వాఙ్మయాన్ని తనలో ఇముడ్చుకున్న ఈ ఆరణ్యక సముదాయం భారతీయుల ధార్మిక జీవనా నికి, సంస్కారానికి, విరక్తికి, తాత్త్వికవిచారధారకు పట్టిన అద్దంలాంటిది.

— ఎస్.బి.ఆర్.

# 1.8 మహర్షులు

అడవులలో నివాసమేర్పరచుకుని అక్కడే అధ్యయనం చేయవల సిన గ్రంథభాగాలు గనుక "ఆరణ్యకాలు" అనే వ్యవహారం ఏర్పడింది. ఈ అంశం లోగడ స్పష్టం చేయబడిందే. (అరణ్యే అధీయీారన్ తై.ఆ). ఈ భాగాలను అరణ్యంలో చదువుకోవాలి. చిన్నపిల్లలు, గర్భ వతులైన స్త్రీలు, రోగార్తులు మొదలగువారు వినగూడని మంత్రాలు ఆరణ్యకాలలో అధికంగా ఉంటాయి. ఈ తీరు అనూచానంగాను, ఆచారంగాను, అనాదిగా వస్తున్నది. అందువల్ల "ఆరణ్యకం" అన్న పదం సార్థకమే.

**ఋషి అంటే ఎవరు?**

"ఋషి" అంటే జ్ఞానమూర్తి. పాంచభౌతికశరీరంతో కదలా డుతున్నా, లోకసంగ్రహంకోసం కర్మలను, ఉపాసనలను ఆచరిస్తున్నా, వాటితో ఏవిధమైన సంపర్కం లేకుండా నిజస్వరూపమై స్వయంప్రకాశ మైన జ్ఞానంతో వెలుగొందే మహానుభావులు ఋషులనిపించుకుంటారు. బ్రహ్మ స్వయంభు అభ్యానర్షత్. తదృషీణాం ఋషిత్వమ్ -- స్వయం జ్యోతి అయిన పరమాత్మ తనంతట తానుగా వీరిని పొందింది. అందువల్లనే వీరు ఋషులైనారు (– తైత్తిరీయం) అని వేదమే ఋషి శబ్దానికి నిర్వచనం చూపించింది. ఋషులు అన్ని విధాల గొప్పవారు. అందరికీ పూజనీయులు. కాబట్టి వారే మహర్షులవుతారు. లేక ఋషు లలో కూడా ఉత్తమోత్తమంగా జీవించేవారు మహర్షులన్నా అనవచ్చు. ఆరణ్యకగ్రంథాలననుసరించి నాటి మహర్షుల విశేషాలను సంగ్రహంగా తెలుసుకుందాం.

తూర్పు పడమరలలో సముద్రాలు, ఉత్తరాన హిమాలయం, దక్షి ణాన వింధ్య పర్వతం-- ఈ హద్దుల మధ్య నుండే దేశానికి "ఆర్యా

వర్తం" అని పేరు. దీనికి "పుణ్యభూమి" అనే బిరుదు కూడా ఉంది. ఇదే వైదిక ఋషుల మొదటి నివాసం. ఇందులో కూడా కొన్ని విభాగాలున్నాయి. సరస్వతి, దృషద్వతి అనే మహానదుల మధ్య నుండే ప్రాంతాన్ని "బ్రహ్మవర్తం" అని వ్యవహరించేవారు. ఇది అన్నింటి కన్న పవిత్రమైన ప్రదేశం. కురుక్షేత్రం, మత్స్యదేశం, శూరసేన దేశం, పాంచాలదేశం, విదేహ కోసల దేశాలు -- ఇవి బ్రహ్మవర్తం తరువాత పేర్కొనదగినవి. వీటిలో కూడా కురు పాంచాల దేశాలు, విదేహ కోసల దేశాలున్ను మహర్షుల దివ్యజీవనంతో పెనవేసుకుని పరమ పవిత్రమైనవిగాను, వైదికవిజ్ఞానానికి ఆటపట్టులుగాను, ఆర్యజాతి యొక్క జీవనాడులుగాను ప్రఖ్యాతిని సంపాదించుకున్నాయి. ఈ ప్రదేశాలన్నీ పంజాబ్ రాష్ట్రంలో కొన్ని మండలాలుగా ఏర్పడి ఉన్నాయి. ఇవే ఆనాడు ఆరణ్యక మహర్షులకు ఆవాసభూములు.

వృక్షాలు, మహావృక్షాలు, పుష్పవృక్షాలు, ఫలవృక్షాలు, తీగలు, పొదరిళ్లు, ఓషధులు, సెలయేళ్లు, నదులు, ఉపనదులు, పశుపక్ష్యాదులు మొదలయిన ప్రకృతి సిద్ధమైన సంపదలతోను, సహజసౌందర్యంతోను, నాటి అరణ్యాలు తులతూగుతూ ఉండేవి. అవి మనస్సును పరవశం చేస్తాయి. ఏకాగ్రంగా ఉంచుతాయి. సృష్టిని తనివితీరా అనుభవించడానికి భగవంతుని లీలలను ఆస్వాదించడానికి, తత్త్వాన్ని పరామర్శించి నిర్ధరించడానికి మిక్కిలి అనువైన ప్రదేశాలు అరణ్యాలే. అవే తపస్సుకు సిద్ధిక్షేత్రాలు. అందువల్లనే మహర్షులు వాటిని తమ కార్యక్షేత్రాలుగా మలచుకుని, స్థిరపరచుకున్నారు.

ఋషుల నివాసాలు ఆశ్రమాలు. నదీతీరాలలో అనుకూల వాతావరణం గల ప్రదేశాలలో వెదురుతోను, రెల్లు, దర్భ మొదలగు గడ్డితోను వీటిని నిర్మించుకునేవారు. ఆశ్రమపరిసరాలన్నీ నిరాడంబరంగాను, ప్రశాంతంగాను, సత్త్వగుణప్రధానంగాను ప్రకాశించేవి. సత్యధర్మాలకు అవి ఆలయాలు. రాగద్వేషాదులకు అక్కడ చోటు లేనే లేదు. కర్మ ఉపాసన, జ్ఞానం అనే మూడు ఆర్ష సంస్కృతి స్రవంతులకు,

ఆశ్రమాలు పరమ పవిత్రమైన దివ్యభవ్యమైన సంగమ స్థానాలని చెప్ప వచ్చు. వాస్తవంగా ఆరణ్యక గ్రంథాలలో ఆశ్రమ వర్ణనలు కనిపించవు. అయినా ఆయా సందర్భాలనుబట్టి ప్రాచీన మహాకవుల వర్ణనలనుబట్టి ఈ విధంగా చిత్రించుకోవచ్చు. ధర్మపరిపాలన విషయంలో ఋష్యా శ్రమాలే ముఖ్య కేంద్రాలుగా ఉన్నా, వ్యావహారికంగా ఆయా దేశాల రాజులు వాటి యోగక్షేమాలు చూసుకుంటూ ఉండేవారు. ప్రజల సంక్షేమానికి ఋషులు తమ తమ తపస్సును ధారపోయడం, ఋషుల బాగోగులను రాజులు గమనిస్తూ ఉండడం ఆనాటి పరిపాటి. ఇదే (పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ) అన్యోన్యం గౌరవించు కుంటూ శ్రేయస్సులను పొందండి అనే సూక్తికి పరమనిదానం.

అలనాటి వైదికమహర్షుల సంతతివారే ఆరణ్యకాలలోని ఋషులు. వీరిలో కొందరు వానప్రస్థులుగాను (వయసు ముదిరిన తరువాత కుమా రులకు సకలకార్యభారం అప్పగించి, అడవులలో భార్యతోపాటు వైరా గ్యంతో కాలక్షేపం చేసేవారు), మరికొందరు సన్న్యాసులుగాను (సర్వ సంగపరిత్యాగం చేసి, జ్ఞానధనంతో భిక్షాచరణం చేసుకుంటూ కాలం గడిపేవారు) కనిపిస్తారు. అక్కడక్కడ కొందరు గృహస్థులు కూడా తారసిల్లుతారు. స్నానధ్యానాదులతో, కృచ్ఛ్రచాంద్రాయణాదికఠోర నియ మాలతో, సాత్త్వికాహారంతో, అధ్యాత్మయోగంతోను ఋషుల నిత్యజీవితం శిష్టాతిశిష్టంగా ప్రకాశిస్తుంది. ఈ సందర్భంలో వ్యాకరణమహాభాష్యంలో పతంజలిమహర్షి చెప్పిన శిష్టనిర్వచనం గుర్తుకు రావడం సహజం. "లోభ మోహాదులు లేకుండా సదాచార ప్రవర్తకులైనటువంటి, తపోబలంచేత సకలవిద్యలు కరతలామలకంగా ప్రకాశించునటువంటి ఆర్యావర్తవాసులైన మహర్షులే శిష్టులు" అని. ఇటువంటి శిష్టులను దృష్టిలో ఉంచుకునే మనువు ఈ విధంగా అన్నాడు :

ఏతద్దేశప్రసూతస్య సకాశాదగ్రజన్మనః |
స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః ||

ఈ ఆర్యావర్తంలో పుట్టిన మహర్షుల నుండియే సకలమానవులు సదాచారాన్ని, మంచిశీలాన్ని నేర్చుకోవాలి అని దాని భావం.

కాగా తమ పూర్వులు అనుసరించిన దివ్యజీవన పద్ధతిని ఆరణ్యక ఋషులు అక్షరాల అనుసరించారు. వ్యవసాయం చేసుకుని వివిధ ధాన్యజాతులను పండించుకోవడం, గోమాతను దేవతగా పూజించి పాలించి ఆమె సంపదను పూర్తిగా అనుభవించడంకూడా వారికి పుట్టుకతోనే వచ్చిన విద్య. ఆశ్రమవృక్షాలు వారికి ఆదరణీయాలు. లేళ్ళు, చిలుకలు మొదలైనవి వారికి సుతనిర్విశేషాలు (పుత్రుల వంటివి).

అగ్నిదేవుని ఉపాసించడం ఆర్యుల సర్వస్వం గదా! ఇష్టులు (చిన్న చిన్న యాగాలు), యజ్ఞాలు, యాగాలు విరివిగా జరుగుతూనే ఉండేవి. "నచికేతాగ్ని" అనే కొత్త ప్రక్రియ మాత్రం ఆరణ్యకాల సమయంలో బయలుదేరింది. దీనికి సంబంధించిన చిన్న కథ ఒకటి ఈ విధంగా ఉంది — "ఉద్దాలక మహర్షి కుమారుడు నచికేతుడు. అతని చిన్నతనంలో ఉద్దాలకుడు "విశ్వజిత్తు" అనే యాగం చేసి, తనకున్నదంతా దక్షిణగా దానం చేసేశాడు. తనను కూడా దానం చేయాలేమో! అన్న కుతూహలంతో "నాన్నా! నన్నెవరికిస్తావు?" అని పదిసార్లు అడిగి తండ్రికి విసుగెత్తించాడు. తండ్రి కోపంతో "నిన్ను యమునికిస్తాను" అన్నాడు. కుమారునికి ఆ మాట అర్థం కాలేదు. తికమక పడుతూ ఉండగా ఆకాశవాణి "యమలోకానికి వెళ్ళు. యముని నుండి వరాలు కోరుకో, శుభం కలుగుతుంది" అని పలికింది. తదనుసారం నచికేతుడు యముని ఇంటికి వెళ్ళాడు. సమయానికి యముడింటి దగ్గర లేడు. మూడు రోజుల తరువాత యముడు వచ్చి అంతవరకు ఉపవాసంతో ఉన్న నచికేతుణ్ణి చూసి బుజ్జగించి అతనికి మూడు వరాలిచ్చాడు. వాటిని స్వీకరించి అతడు మరల తన తండ్రిని చేరి సుఖంగా ఉన్నాడు."

నచికేతుడు పొందిన వరాలలో నూతనమైన అగ్నిపూజావిధానం ఒకటి. దినికే "నాచికేతాగ్ని" అని వైదికవ్యవహారం. ఈ విధానాన్ని నాటి ఋషులు విరివిగా ప్రచారం చేశారు.

అగ్ని తరువాత ఆరణ్యకులకు ప్రత్యక్ష దైవం సూర్యుడు. ఉషఃకాంతిని, ఉదయించే సూర్యుణ్ణి, పయనించే సూర్యుణ్ణి, అస్తమించే సూర్యుణ్ణి, సంధ్యారాగాన్ని వేయివిధాలుగా భావించి, వర్ణించి, తన్మయులై మురిసిపోయి లక్షవిధాలుగా వారు ఆరాధించేవారు. సకలదేవతాస్వరూపునిగాను, పరబ్రహ్మగాను, సూర్యుణ్ణి తీర్చిదిద్దారు. సర్వవేదసారంగా గాయత్రీమంత్రాన్ని రూపొందించారు. ఆరోగ్యభాగ్యానికి అధిదేవతగా పూజించారు. సూర్యనమస్కారాలను నిత్యకర్తవ్యంగా ఆచరించారు. "అరుణం" అనే ఆరణ్యకభాగాన్ని నిత్యపారాయణంలో చేర్చుకున్నారు. ఈ తీరులన్నీ నేటికీ భరతఖండమంతా కొద్దిగానో గొప్పగానో కనిపిస్తూనే ఉంటాయి.

దేవయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం, బ్రహ్మయజ్ఞం అనే అయిదు యజ్ఞాలను ప్రతిరోజూ నిర్వర్తించడం మహర్షుల జీవిత విధానంలో ముఖ్యఘట్టమని చెప్పవలసి ఉంది. ఇంద్రాది దేవతలనుద్దేశించి అగ్నిలో హోమాలు చేయడం దేవయజ్ఞం. పితృదేవతలకు శ్రాద్ధకర్మను ఆచరించడంగాని, నీటితో తర్పణం చేయడంగాని పితృయజ్ఞం. పశుపక్ష్యాదులకును, కృమికీటకాదులకున్ను యథాశక్తిగా అన్నపానాదులను అందించడం భూతయజ్ఞం. ఇంటికి వచ్చిన అతిథులకు అన్నివిధాలా గౌరవాదరాలను చూపడం మనుష్యయజ్ఞం. వేదవేదాంగాలను తాను చదువుకోవడంగాని – ఒకరికి చెప్పడంగాని బ్రహ్మయజ్ఞం. కర్మకాండనంతా కుదించి గుళికలుగా చేసి, నిత్యజీవితానికి సమన్వయం చేసిన మహారాజమార్గమే ఈ పంచయజ్ఞ విధానం. అందులోనూ ఆయా వేదాల యొక్క, వేదాంగాల యొక్క మొదటి మంత్రాలను వాక్యాలను ఏర్చి కూర్చి, వాటి పారాయణం వల్ల సకల వేదవేదాంగ పారాయణం

వల్ల కలిగే ఫలం అంతా కలుగుతుందనే దృఢవిశ్వాసంతో ఏర్పడిన బ్రహ్మ యజ్ఞ విధానం ఋషుల శ్రద్ధానక్తులను మనకళ్లముందుంచుతుంది. ఇప్పటికీ కర్మరులైన వైదికుల ఇళ్లలో పై పంచయజ్ఞాలు జరుగుతూనే ఉండడం మహర్షుల దివ్యతపఃఫలమే – సంవిధానచాతుర్యమే.

తాము ఆధ్వర్యవం వహించి రాజుల చేతను, చక్రవర్తులచేతను అశ్వమేధయాగాలను చేయిస్తూ ఉండడం నాటి ఋషుల కర్మచరిత్రలో ఉదాత్తమైన చివరి అధ్యాయం. ఆశ్రమాలలో ఋషులుండేవారు. ఆస్థానాలలో రాజులుండేవారు. పరస్పరం రాకపోకలు జరుగుతూ ఉండేవి. ఆయా సమయాలలో అశ్వమేధాలకు ఒకవంక సంకల్పాలు, మరొకవంక అవభృథస్నానాలున్ను అక్కడక్కడ జరుగుతూ ఉండేవి.

మంచిలక్షణాలు గల గుఱ్ఱాన్ని యజ్ఞపశువుగా చేసి జరిపే యజ్ఞం అశ్వమేధం. ఇదొక పెద్ద పథకం. ఇహం, పరం, సాంఘికం, రాజకీయం, ఆర్థికం -- అన్నీ దీనిలో ఇమిడి ఉన్నాయని పెద్దలు చెప్తారు. ఆరణ్యకాలు అశ్వమేధానికిచ్చిన ప్రాముఖ్యం ఇంతా అంతా కాదు. అశ్వం సకల దేవతా స్వరూపమని, అశ్వమేధం యజ్ఞసర్వస్వం అని, అది సృష్టికంతకు సంకేతమనిన్నీ నాటి ఋషులు భావించారు. నేటి వారికి మాత్రం యజ్ఞప్రక్రియ -- అందులోను అశ్వమేధ ప్రక్రియ కొరకరాని కొయ్యగా తయారైంది. అది వేరే విషయం.

అశ్వమేధాలు అసంఖ్యాకంగా జరిగిన తరువాత ఋషుల దృక్పథంలో పెద్దమార్పు వచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. కర్మకాండకు సంబంధించిన నియమాలు నిష్ఠలున్ను కొంచెం కొంచెం సడలడం ఆరంభమయింది. ఉపాసన అనే కొత్త మార్గం ఏర్పడింది.

తరువాతి సమయాలలో శాఖోపశాఖలుగా వృద్ధిచెందిన భక్తిమహా వృక్షానికి ఈ ఉపాసనే బీజం అయింది. "ఏకాగ్రమైన మనస్సుతో

ధ్యానించడం, జపించడమున్ను" ఉపాసనయొక్క తాత్పర్యం. ఇందులో మనస్సుకే తప్ప బాహ్యమైన కర్మ కలాపానికి చోటులేదు. "ఓమ్" అనే ప్రణవనాదం మొదలుకొని అగ్ని, సూర్యుడు, వాయువు మొదలైన దేవతలు, హృదయకమలం, పురుషుడు, శక్తి మొదలైన సాంకేతిక విషయాలున్ను ఋషుల ఉపాసనకు ఆలంబనాలు అయినాయి. దహరవిద్య, పంచాగ్నివిద్య, మధువిద్య మొదలగు చిత్రమైన పేర్లతో వారు ఉపాసన సాగించేవారు.

చిట్టచివరను మహర్షుల మననజలధి నుండి అపూర్వమైన అనర్ఘమైన మహారత్నం ఒకటి ఆవిర్భవించింది. అదే జ్ఞానరత్నం - తత్త్వరత్నం - శాశ్వతమైనరత్నం - సకలలోకైకరత్నం. ఆరణ్యకాలలో ఆవిర్భవించిన ఈ రత్నం యొక్క దివ్యకాంతులే క్రమంగా ఉపనిషత్తులు అనిపించుకున్నాయి. ఉపనిషత్తులు ఆరణ్యక నవనీతాలే కాని ప్రత్యేక గ్రంథాలు కావు. "ఆరణ్యకాలు" అనే వ్యవహారం వాటి విషయంలో కూడా సార్థకమే. "సృష్టి స్థితిలయాలకు మూలమైన పరమసత్యం ఏది?" అన్న జిజ్ఞాసయే జ్ఞానరత్నం దొరకడానికి ముఖ్యకారణం అయింది.

"మనం అనునిత్యం ఉపాసన చేసే ఆత్మ అంటే ఎవరు? కన్ను మొదలగు ఇంద్రియాల శక్తియా? హృదయమా? మనస్సా? విజ్ఞానమా? ప్రజ్ఞానమా? . . . . . . . . . . . " అని మహర్షులకు సంశయం కలిగింది. విచారణ సాగింది. తుదకు ఉపాధిని బట్టి (పై తొడుగు) ఏ పేరు పెట్టుకున్నా అంతా ప్రజ్ఞానమే-- శుద్ధచైతన్యమే-- సృష్టి అంతా దాని విలాసమే-- నామరూపాలు అన్నీ అదే-- కాబట్టి ప్రజ్ఞానమే బ్రహ్మ" అని నిర్ణయం జరిగింది. ఈ తీరులో తత్త్వ విచారానికి శ్రీకారం చుట్టింది. ("ఐతరేయారణ్యకం" 2 వ కాండం - 6 వ అధ్యాయం).

పరమార్థం లభించగానే ఋషుల కర్మకలాపం, ఉపాసనావైవిధ్యం కూడా మూలబడ్డాయని చెప్పవచ్చు. అడవులు, ఆశ్రమాలు, ఆలయాలు,

ఆస్థానాలు, నగరాలు, జనపదాలు, విద్యాస్థానాలు, సకల ప్రదేశాలు విద్వద్గోష్ఠులతోను, వివాదాలతోను, తత్త్వవిచారంతోను మారుమ్రోగుతూ ఉండేవి. పరమార్థానికే "బ్రహ్మ" అని పేరు పెట్టడం జరిగింది. బ్రహ్మను తెలుసుకున్న మహానుభావుడు "బ్రహ్మవాది". అటువంటి స్త్రీరత్నం "బ్రహ్మవాదిని". బ్రహ్మవాదులు, బ్రహ్మవాదినులు ముఖ్యంగా కురు, పాంచాల దేశాలలో పుష్కలంగా ఉండేవారు.

రాజులలో అజాతశత్రువు, జనకుడు మొదలగువారు, మహర్షులలో గార్గ్యుడు, యాజ్ఞవల్క్యుడు మొదలగువారు, స్త్రీరత్నాలలో మైత్రేయి మొదలగు వారున్ను నాటి బ్రహ్మవాదులలో సుప్రసిద్ధులు. వీరికి సంబంధించిన ఒకటి రెండు గాథలను ఈ సందర్భంలో చవిచూడడం అవసరం.

అజాతశత్రువు కాశీదేశపురాజు. అతడు బ్రహ్మవేత్త. అయినా ఏమీఎరగనివాని వలెనే ఉండేవాడు. ఒకనాడు అతని దగ్గరకు గార్గ్య మహర్షి వచ్చాడు. అతనికింకా పరబ్రహ్మ విషయంలో మిడిమిడి జ్ఞానమే కలిగింది. కాని బ్రహ్మవేత్తననే గర్వం మాత్రం అధికమయింది. అందువల్ల "అజాతశత్రూ! నీకు బ్రహ్మను గూర్చి చెపుతాను. వింటావా?" అని విర్రవీగి ప్రకటించాడు. అజాతశత్రువు చిరునవ్వుతో "చిత్తం స్వామీ! అట్లయితే తమకు వెయ్యి ఆవులను దానం చేసుకుంటాను" అని వినయంతో అంగీకరించాడు. గార్గ్యుడు మొదట "ఆదిత్యుడే బ్రహ్మ" అన్నాడు. అజాతశత్రువు అది అందరకూ తెలుసు. కొత్తవిషయం కాదు" అన్నాడు. ఈ విధంగా చంద్రుడు, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు మొదలగు వాటినన్నింటిని బ్రహ్మగా గార్గ్యుడు ప్రతిపాదించడం, "అవేవీ కావు" అని అజాతశత్రువు నిరాకరించడం జరిగింది. చివరకు గార్గ్యునికి కోపం వచ్చింది. "అయితే సరే నీవే గురువు. నేను శిష్యుడను మాత్రమే. నాకు బ్రహ్మజ్ఞానం ప్రసాదించు" అని లొంగిపోయాడు. వెంటనే అజాతశత్రువు అతనిని అనునయించి "అయ్యా! అన్నింటికి

పరమమూలం ప్రజ్ఞానం. అదే పరబ్రహ్మం. సాలెపురుగు నుండి దారం వచ్చినట్లు బ్రహ్మనుండియే సృష్టివస్తుంది. దాని ఉనికి, లయం అంతా మరల బ్రహ్మయందే. నిప్పునుండి రవ్వలు పైకి చిమ్ముతాయి. అవి వేరే వస్తువులు కావు. నిప్పేగదా! బ్రహ్మవిషయంలో కూడా ఇదే తీరు. అంతా ప్రజ్ఞానమే." అని వివరించాడు. గార్గ్యుడు సంతసించి అజాతశత్రువును చాలా గౌరవించాడు. ఆనాడు పాలకులైన క్షత్రియులు కూడా బ్రహ్మజ్ఞాన సంపన్నులనే విషయాన్ని ఈ కథ విశదం చేస్తుంది.

ఇక యాజ్ఞవల్క్యుని సంగతి. ఆ రోజులలో అతడు బ్రహ్మవేత్తలం దరకు తలమానికం. ఆత్మానుభవంలో అందెవేసిన చెయ్యి. ఆత్మసాక్షాత్కారం కలిగించే ప్రాచార్యుడు. ఒకానొక సమయంలో జనకమహారాజు ఒక యజ్ఞం ఆచరించాడు. వందలకొలది విద్వాంసులు అందులో పాల్గొన్నారు. యజ్ఞావసానంలో జనకుడు కుతూహలంతో "ఉన్నవారందరిలోను ఎవరు బ్రహ్మిష్ఠులో వారికి, బంగారు కొమ్ములు తొడిగిన వెయ్యి గోవులను ఇస్తాను" అని పందెం ప్రకటించాడు. హేమాహేమీలందరు ఏమీ చేయలేక తలలు దించుకున్నారు. యాజ్ఞవల్క్యుడు ఒక్కడే చేయెత్తి "నేను బ్రహ్మిష్ఠుడను" అని ఎలుగెత్తి చాటుకోగలిగాడు. మిగిలిన వారు అసూయతో అతనిని వాదాలకు దింపారు. అందరితోను వాదించి, అందరిని ఓడించి యాజ్ఞవల్క్యుడు గోవులను స్వీకరించాడు. నాటి నుంచి జనకుడు అతనిని తన పరమగురువుగా, ఆస్థాన విద్వాంసునిగా ప్రతిష్ఠించుకున్నాడు.

ఈ విధంగా కర్మోపాసనలతో కలకలలాడిన వైదిక ఋషిసంతతి ఆరణ్యకాలనాటికి తత్త్వపర్యవసాయి అయి, ఆత్మజ్ఞానంతో అజరామరమై అలరారింది.

— ఎ.ఎస్.ఎస్.

# 1. 9 ఉపాఖ్యానాలు

వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించినవారు యజ్ఞాది కర్మాంగాలైన మంత్ర సూక్త హవిస్సులలో ఆయాదేవతా స్వరూపోపాసన జేసి, జ్ఞానమార్గం అవలంబించి పరమపురుషార్థమైన మోక్షాన్ని పొందే పద్ధతిని ఆరణ్యకాలు బోధిస్తున్నాయి. సంహితలు, బ్రాహ్మణాలు మంత్రక్రియాప్రధానాలైతే ఆరణ్యకాలు, ఉపనిషత్తులు జ్ఞాన-ఉపాసనాప్రధానాలైనాయి. అందువల్లనే ఆరణ్యకాలకు ఉపనిషత్తులకు తేడా చెప్పడం కష్టం. ఆరణ్యకాల్లో తత్త్వ జిజ్ఞాస ప్రధానంగా కల అధ్యాయాలనే ఉపనిషత్తులుగా వేరుచేసి, మిగిలిన భాగాలను ఆరణ్యకభాగాలుగా వ్యవహరిస్తున్నారు. ఇలా ఉపనిషద్భాగాలను వేరుచేయగా మిగిలిన ఆరణ్యక భాగాల్లో కొన్ని వ్రత-సూక్తాల ప్రశంసలు, కొన్ని విశేషహోమ మంత్రాలు, కొన్ని విశిష్ట మంత్రాల వ్యాఖ్యలు చోటు చేసుకున్నాయి. ఉపాఖ్యానాలన్నీ సామాన్యంగా తత్త్వజిజ్ఞాస ప్రధానంగా కల అధ్యాయాల్లోనే ఉండటం వల్ల కేవలారణ్యక భాగాల్లో ఉపాఖ్యానాలు పెద్దగా లేనట్లే చెప్పవచ్చు. అయినా సూక్త-వ్రత ప్రశంసలను జేసే ఒకటి రెండు ఉపాఖ్యానాలు లేకపోలేదు.

ఇపుడు ఆరణ్యకాలుగా దొరుకుతున్న వాటిల్లో ఋగ్వేదానికి చెందినవి ఐతరేయ శాంఖాయనారణ్యకాలు రెండు; యజుర్వేదానికి చెందినవి బృహదారణ్యక తైత్తిరీయారణ్యకాలు రెండు; సామవేదానికి చెందిన తలవకారారణ్యకం ఒకటి; యజుర్వేదానికి చెందినదే మరొక ఆరణ్యకం మైత్రాయణీయారణ్యకం; ఇది మైత్రాయణ్యుపనిషత్తనే వ్యవహరింపబడుతోంది.

వీటిల్లో ఐతరేయోపనిషత్తు ఐతరేయారణ్యకంలోను, తైత్తిరీయ నారాయణోపనిషత్తులు తైత్తిరీయారణ్యకంలోను, కౌషీతక్యుపనిషత్తు శాంఖాయనారణ్యకంలోనూ ఉన్నాయి. బృహదారణ్యకం, మైత్రాయణీయారణ్యకం, తలవకారారణ్యకం పూర్తిగా ఉపనిషత్తులుగానే గ్రహింప

బడుతున్నాయి. మైత్రాయణీయారణ్యకం మైత్రాయణ్యుపనిషత్తని, తలవకారారణ్యకం జైమినీయోపనిషద్బ్రాహ్మణమని, బృహదారణ్యకం బృహదారణ్యకోపనిషత్తని వ్యవహరింపబడుతున్నాయి. ఈ ఉపనిషత్తుల్లో ఐతరేయ, తైత్తిరీయ, నారాయణ, మైత్రాయణ్యుపనిషత్తులను ఉపనిషత్తులుగా గ్రహించి శ్రీశంకరాచార్యులవారు భాష్యం వ్రాశారు. మిగిలిన రెండింటికి శంకరుల భాష్యం లేదు. అందువల్ల ఆ రెండు ఆరణ్యకాలనే ఆయన తలంపేమో.

ఐతరేయ, తైత్తిరీయ, నారాయణ, మైత్రాయణ్యుపనిషద్భాగాలను వదలి మిగిలిన ఆరణ్యక భాగాల్లో ఉన్న ఉపాఖ్యానాలను గురించి ఇక్కడ ముచ్చటించుకుందాం. ఆయా ఉపనిషత్తుల విషయం ఉపనిషద్భాగానికి వదలివేద్దాం.

**ఇంద్రోపాఖ్యానం:**

ఐతరేయారణ్యకంలో ఆరంభంలోనే మహావ్రత ప్రశంస చేస్తూ ఇంద్రోపాఖ్యానం ఉల్లేఖింపబడింది. సోమపాన విశేషరూపమైన ఈ మహావ్రతం వల్లనే ఇంద్రుడు వృత్రాసురుణ్ణి చంపాడట. ఈ వ్రతాన్నాచరించి ఇంద్రుడు గొప్పవాడయ్యాడు. కాబట్టి ఇది మహావ్రతం అని పిలువబడుతోంది. అలాగే గొప్పవాడైన ఇంద్రుని ఉద్దేశించి చేయబడటం వల్ల కూడా ఇది మహావ్రతం అని పిలువబడుతూందని సాయణభాష్యం (ఐ.ఆ. 1.1.1.) వివరిస్తున్నది.

**ప్రజాపత్యుపాఖ్యానం:**

ఇలాగే "తదిదాస" (ఋ.సం. 1.12.1) అనే మంత్రాన్ని వ్యాఖ్యానిస్తూ తచ్ఛబ్దవైశిష్ట్యాన్ని చెప్పేందుకు ప్రజాపత్యుపాఖ్యానం ఇలా చెప్పబడింది – ప్రజాపతి జగత్తును సృష్టించి తకారంతో మొదలుపెట్టి శబ్దోచ్చారణ ప్రారంభించాడట. మొట్టమొదట 'తత' అని, తరువాత

'తాత' అని అన్నాడట. ప్రజాపతి తనచేత సృష్టింపబడిన హిరణ్యగర్భుని 'తాత' అని పిలిచాడట. అందువల్లనే ఇప్పటికి తండ్రులు తమ పిల్లలను 'తాత' అనే పితృవాచకశబ్దంతో లాలిస్తున్నారట (ఐ.ఆ. 2.1.8). ఇప్పటికీ పిల్లల్ని పితృవాచక శబ్దంతో పిలవడం ఆచారంగానే ఉంది. దానికిది చక్కని ఐతిహ్యం కదా!

**విశ్వామిత్రోపాఖ్యానం:**

ఇందులోనే రెండో ఆరణ్యకం, రెండో అధ్యాయం మూడు నాల్గు ఖండల్లో విశ్వామిత్రోపాఖ్యానం చెప్పబడింది -- (ఐ.ఆ. 2.2.3-4). శస్త్రగతాలైన తృచాశీతులలో 'అన్నత్వభావన' చేయాలి అని ఉపదేశిస్తూ, ఆవిధంగా ఆ మంత్రాలలో అన్నత్వభావనచేయడం వల్ల విశ్వామిత్రునికి కల్గిన లాభం ఈ ఉపాఖ్యానంలో వర్ణింపబడింది.

ఒకప్పుడు మహావ్రతంలో విశ్వామిత్రుడు హోతగ ఉండగా ఇంద్రుడు అన్నార్థియై విశ్వామిత్రుని వద్దకు వస్తాడు. అపుడు విశ్వామిత్రుడు ఇంద్రుని అభిప్రాయాన్ని తెలిసికొని ఇదే నీకు అన్నమని బృహతీ ఛందస్సులోనున్న వేయి మంత్రాలను పఠిస్తాడు. అలా పఠించడం వల్ల ఇంద్రుని లోకమైన స్వర్గాన్ని పొంది, మరల ఇంద్రుని కోరికచేత రెండుసార్లు బృహతీ సహస్రాన్ని పఠించి ఇంద్రుని అనుగ్రహానికి పాత్రుడౌతాడు. బృహతీసహస్రపాఠం వల్ల సంతోషించిన ఇంద్రుడు వరాన్ని కోరుకోమంటే – "నేను నిన్ను తెలుసుకోవాలనుకుంటున్నా"నంటాడు విశ్వామిత్రుడు. ఇంద్రుడప్పుడు -- "సర్వం ప్రాణమయమని, ఆదిత్యాది రూపాలతో అన్ని దిక్కుల వ్యాపించి ఉన్నది తనేనని, తనకు అన్నమే ప్రీతిజనకం, వృద్ధిహేతువు, విశ్వశ్రేయః కారణం కూడా" అని "ఈ బృహతీసహస్రంలో హల్లులు శరీరమని, ఊష్మలు ప్రాణమనే శరీరాత్మ భావనచే వశిష్ఠుడు వశిష్ఠుడైనా"డని ఉపదేశిస్తాడు. ఇదే ఉపాఖ్యానం శాంఖాయనారణ్యకంలో కూడా (శాం.ఆ. 1.6) ఉంది.

## గాంగ్యాయన్యుపాఖ్యానం:

శాంఖాయనారణ్యకంలో ఉపనిషద్భాగాలైన అధ్యాయాల్లోనే కొన్ని ఉపాఖ్యానాలున్నాయి. వాటిల్లో మొదటిది గాఙ్గ్యాయన్యుపాఖ్యానం. ఇందులో ఈ పాంచభౌతిక శరీరాన్ని వదలిన తరువాత ఆత్మ దేవయానాది మార్గాల ద్వారా మోక్షాన్ని ఎలా పొందుతుందో వివరింపబడింది (శాం.అ. 3).

ఈ ఉపాఖ్యాన సారాంశం ఇది – గాంగ్యుని కుమారుడు చిత్రుడు అనేరాజు యాగం చేయదలచి హోతగా ఆరుణిని రమ్మని ప్రార్థిస్తాడు. అతడు తన కుమారుడైన శ్వేతకేతువును పంపుతాడు. వచ్చిన శ్వేతకేతువును రాజు "శరీరాన్ని వదలి ఈ ఆత్మ ఎక్కడికి పోతుంది? ఎలా పోతుంది?" అని అడుగుతాడు. నాకు తెలియదు. మా నాయనను కనుక్కొనివస్తానని చెప్పి శ్వేతకేతువు వెళ్ళి తండ్రిని అడుగుతాడు. అపుడు ఆరుణి "ఈ విషయం నాకు కూడా తెలియదు. పోయి అతనినే అడిగి తెలుసుకుందాం" అని ఈ జ్ఞానం కోసం రాజునే ఆశ్రయిస్తారు. అపుడు రాజు ఇలా చెబుతాడు –

శరీరాన్ని త్యజించినవారు దేవయాన, పితృయాన మార్గాల ద్వారా చంద్రుని చేరుతారు. ఈ చంద్రుడే స్వర్గద్వారం. ఇక్కడ చంద్రుడు కొన్ని ప్రశ్నలడుగుతాడు. వానికి ఎవ్వరైతే సరైన సమాధానం చెప్ప గల్గుతారో వాళ్ళను స్వర్గం వైపు వదులుతాడు. చెప్పలేని వాళ్ళను మరల భూమికి తరుముతాడు. అలా తరమబడిన వాళ్ళు కీట, పక్షి, పశు, మత్స్య, సింహ, వరాహ, శార్దూల పురుషాది రూపాలలో పుడతారు. చంద్రుడు తన వద్దకు వచ్చిన వాడిని "నీవెవరవు?" అని అడుగుతాడు. అపుడు నేను రేతశ్శరీరుడనని చెపుతూ జననమరణరూపమైన మృత్యువుకు నన్నప్పజెప్పవద్దని ప్రార్థించి, సత్యతపస్సులచేత ఋతువును (కాలమును), ఋతుజన్యపదార్థ విశేషాన్ని, బ్రహ్మను, నీవును

నేనే అని సమాధానం చెప్పాలి. చంద్రునిచే వదలి పెట్టబడి దేవ యాన మార్గం గుండా అగ్ని, వాయు, వరుణ, ఆదిత్య, ఇంద్ర, ప్రజాపతి లోకాల ద్వారా బ్రహ్మలోకానికి వస్తారు. బ్రహ్మలోకంలో అరం అనే మడుగులో స్నానం చేస్తారు. తరువాత ముహూర్తాలనబడే కాపలాదారులను సమీపిస్తారు. వారిచేత అడ్డగింపబడకుండా విరజానది దగ్గరకు వస్తారు. అంతలో బ్రహ్మ 500 అప్సరసలను విరజానదిని దాటిన వారిని ఆహ్వానించడానికి పంపిస్తాడు. విరజా (విజరా) నదిని అవగాహన పూర్వకంగా దాటి పాపపుణ్యసంపర్కం లేనివారై అప్సర సలతో కూడా తిల్యవృక్షాన్ని సమీపించి, బ్రహ్మగంధాన్ని పొందినవారై, సాలజ్యమనే సంస్థానాన్ని సమీపించి బ్రహ్మరసులై, అపరాజితమనే ఆయ తనాన్ని పొంది బ్రహ్మతేజస్కులై, ఇంద్రప్రజాపతులనే ద్వారపాలకులను సమీపించి, వారిచేత అంగీకరింపబడి విభుప్రమితమనే స్థానాన్ని పొంది బ్రహ్మయశస్కులై, విచక్షణమనే పేరుగల వేదికను సమీపిస్తారు. దానిని అధిరోహించాలనుకున్న వారిని అందులో ఉన్న బ్రహ్మ మళ్లా నీవెవర వని ప్రశ్నిస్తాడు. అప్పుడు చంద్రునికి చెప్పిన సమాధానం చెప్తూ నీవే ఆత్మగా గలవాడనని, నీవెవరో నేను వానినే అని బదులు చెప్తారు. అపుడు బ్రహ్మ నేనెవణ్ణని అడగగా దేహేన్ద్రియ మనః ప్రాణాద్యతిరిక్తమైన సత్యపదార్థమే నీవని సమాధానం చెప్పి బ్రహ్మభావాన్ని పొందుతారు.

## ప్రతర్దనోపాఖ్యానం:

కౌషీతక్యుపనిషత్తులోనే మూడో అధ్యాయంలో అంటే; శాంఖా యన బ్రాహ్మణం ఐదవ అధ్యాయంలో ప్రతర్దనోపాఖ్యానం ఉంది. దివోదాసు కుమారుడు ప్రతర్దనుడు శౌర్యపరాక్రమాలతో ఇంద్రుని నిలయ మైన స్వర్గాన్ని చేరుతాడు. స్వర్గాన్ని చేరిన ఆ ప్రతర్దనుణ్ణి ఇంద్రుడు 'వరం కోరుకో'మంటాడు. నాకు కావలసిందేదో నీవే ఇమ్మంటాడు ప్రత ర్దనుడు. ఒకరి కోసం మరొకళ్ళు వరం కోరరు; నీవే కోరుకో మంటాడు ఇంద్రుడు. అయితే నాకు వరమే వద్దంటాడు ప్రతర్దనుడు. వరమిస్తాననే

మాటకు కట్టుబడి ఇంద్రుడు నా స్వరూపాన్నే నీకు వరంగా తెలియజే స్తానంటూ ఇలా వివరిస్తాడు – "త్వాష్ట అనే పురోహితుణ్ణి చంపాను. అరున్ముఖులనే యతులను వేటకుక్కలకు ఆహారంగా వేశాను. చేసిన ప్రతిజ్ఞలనతిక్రమించి స్వర్గంలో ప్రహ్లాదపుత్రుల్ని, అంతరిక్షంలో పులోమ పుత్రుల్ని, భూమిపై కాలనంజులనే రాక్షసుల్ని చంపాను. ఇలా చేసినా నాకు ఈషణ్మాత్రమైనా హాని కలుగలేదు. ఇది బ్రహ్మవిద్యాప్రభావం. ఇలా నన్నెవరు తెలుసుకొంటారో అతనిని కర్మజన్య పుణ్యపాపాలు అంటవు. ప్రజ్ఞాత్మ స్వరూపుడైన ప్రాణమే నేను. నన్ను ఆయుష్షు గాను, అమృతంగాను ఉపాసించు" అని ప్రాణం యొక్క గొప్పతనాన్ని ప్రతిపాదిస్తాడు. బ్రహ్మవిద్యాప్రభావంవల్ల ఆత్మకు పుణ్యపాపాలు అంటక పోవటం ఈ ఉపాఖ్యానం సారాంశం.

**బాలాక్యుపాఖ్యానం:**

ఈ ఉపనిషత్తులోనే నాల్గవ అధ్యాయంలో అంటే శాంఖయనార ణ్యకంలో ఆరవ అధ్యాయంలో బాలాకి కథ ఉంది. ఇదే కథ బృహ దారణ్యకంలో నాల్గవ అధ్యాయంలో కూడా ఉంది. బృహదారణ్యకంలో ఈ బాలాకి 'దృప్తబాలాకి' అని సర్వజ్ఞంమన్యునిగా పేర్కొనబడ్డాడు. బ్రహ్మజ్ఞుడననే అహంభావంగల గర్గగోత్రుడైన బాలాకి అజాతశత్రువు అనే రాజు వద్దకు వచ్చి బ్రహ్మోపదేశం చేస్తానంటాడు. రాజు కూడా సంతోషంతో అంగీకరిస్తాడు. వెయ్యి వరహాల బహుమానం ఇస్తానని ప్రకటిస్తాడు. బాలాకి బ్రహ్మోపదేశం ప్రారంభించి సూర్యచంద్రవిద్యు న్మేఘ వాయ్వాకాశాగ్ని జలాదులధిదేవతలుగా గల చక్షురాదుల యందు బ్రహ్మభావాన్ని ఉపదేశిస్తాడు. అజాతశత్రువు ఇది అంతా నాకు తెలి సిందే. ఇకపైన ఏమైనా ఉంటే చెప్పమంటాడు. అపుడు బాలాకి నాకింకేం తెలియదని మౌనాన్ని వహిస్తాడు. అపుడు అజాతశత్రువు "నే చెప్తా! రా!" అని అతని చేతిని చేతిలోనికి తీసికొని నిద్రపోతున్న ఒక వ్యక్తి దగ్గఱికి తీసికెళ్ళి వాణ్ణి పిలుస్తాడు. అతడు పలుకడు. తరువాత కర్రతో పొడుస్తాడు. అపుడా పురుషుడు లేచి కూర్చుం

టాడు. అపుడజాతశత్రువు బాలాకిని "ఇంతవరకు నిద్ర పోయేవాడెక్కడికి పోయాడు? ఇపుడెక్కడినుంచి వచ్చాడని అడుగుతాడు. బాలాకి తెలియ దనగా పురీతత్తు అనే నాడిలో ప్రవేశించిన ఆత్మ ఇంద్రియ సంపర్కం లేనివాడై ఉంటాడని, దానినే సుషుప్త్యవస్థ అంటారని, ఈ విధంగా ఇంద్రియాతిరిక్తమైన ప్రాణమే ఆత్మ అని ప్రబోధిస్తాడు.

**ఆకలి దప్పులు:**

ఇలాగే శాంఖాయనారణ్యకంలో 11 వ అధ్యాయంలో పాంచ భౌతికశరీరంలోని వాక్కు మొదలగు వాటిలో అగ్న్యాది దేవతల నెలా ప్రతిష్ఠచేశాడో చెప్పే ఉపాఖ్యానం ఉంది. ప్రజాపతి పురుషుణ్ణి సృష్టించి అతని వాక్కులో అగ్నిని, ప్రాణంలో వాయువును, అపా నంలో విద్యుత్తును, ఉదానంలో పర్జన్యుని, చక్షుస్సులో ఆదిత్యుని, మనస్సులో చంద్రుణ్ణి, క్రోధంలో ఈశ్వరుణ్ణి, మూర్ధంలో ఆకాశాన్ని, ఆత్మలో బ్రహ్మను ప్రతిష్ఠింపజేశాడట. అపుడీ శరీరం అమృతకుంభం లాగా లేచి నుంచున్నదట. అందులోని దేవతలు ఈ పురుషుని వల్ల మనకేం ప్రయోజనం? ఇతనితో మనకెందుకు? అని ఒక్కసారిగా ఈ శరీరాన్ని వదలి వెళ్ళిపోయారట. దాంతో శరీరం నిశ్చలమై ఛిద్రాలతో అసహ్యంగా అయ్యిందట. ఈ పరిస్థితి జూచి ప్రజాపతి, ఈ శరీరంలో ఆయా దేవతల్ని శాశ్వతంగా ప్రతిష్ఠింపజేయడానికి వారికి ఆకలిదప్పు లను సృష్టించాడట. అప్పుడాదేవతలు ఇతరత్ర ఆకలిదప్పులు తీరక మళ్లా శరీరాన్ని ఆవహించారట.

ఆకలిదప్పులే లేకపోతే ఈ ప్రపంచం అంతా నిర్వ్యాపారమైపోయే దని, రంధ్రమయమైన ఈ దేహం ఆ దేవతలకు నిలయమైనపుడే ఉపాదేయమని ఈ ఉపాఖ్యానం చెప్తోంది.

**ప్రాణోపాఖ్యానాలు:**

ఇక బృహదారణ్యకంలో ప్రాణం యొక్క గొప్పదనాన్ని చెప్పే ఉపాఖ్యానాలు రెండున్నాయి. అందులో మొదటిది ప్రథమాధ్యాయం

తృతీయ బ్రాహ్మణంలో ఉంది. దేవతలు రాక్షసులు పోటీ పడ్డారట. రాక్షసులసంఖ్య అధికం. దేవతల సంఖ్య అత్యల్పం. అయినా యజ్ఞంలో ఉద్గీథతో జయిద్దామని క్రమంగా వాక్, ప్రాణ, చక్షుః, శ్రోత్ర, మనోదేవతలను ఋత్విక్కులుగా ఉండమని అడుగుతారట. వారు ఆర్త్విజ్యాన్ని అంగీకరించి ఉద్గీథను గానం చేయబూనగానే రాక్షసులు వచ్చి, తమ ప్రభావం వల్ల వాళ్ళను పాపిష్ఠులుగా చేస్తారట. చివరకు దేవతలు ముఖాంతర్గతమైన ప్రాణదేవతను ప్రార్థించి ఆ దేవత సహాయంతో రాక్షసుల్ని జయిస్తారట. రాక్షసులు ఈ దేవతను కూడా తమ ప్రభావం వల్ల పాపిగా చేయ ప్రయత్నించి, రాళ్ళను ఢీకొన్న వాళ్ళలా ముక్కలు ముక్కలైపోయి నశించారట. ఈ ఉపాఖ్యానం ఆంతర ప్రాణరూపమైన ఆత్మకు పాపసంపర్కముండదని తెలియజేస్తోంది. ఇదే ఉపాఖ్యానం (జైమినీయోపనిషద్బ్రాహ్మణం) తలవకారారణ్యకంలో ప్రథమాధ్యాయం 18 వ అనువాకం 5 వ ఖండలోను, ద్వితీయాధ్యాయం 4 వ అనువాకం మొదటి ఖండలోను ఉంది. ఈ తలవకారారణ్యకం లోనే ప్రథమాధ్యాయం, 15 వ అనువాకం 4 వ ఖండలో అసుర పరాజయోపాఖ్యానం మరొక విధంగా ఉంది. దేవతలు ప్రజాపతి వద్దకు పోయి అసురులను జయిస్తామంటారట. అపుడు "మీరు గాని, దేవతలుగాని నన్ను తెలిసికోలేదు. నన్ను తెలిసికుంటేనే అసురులను జయించగలరు"ని అంటాడట ప్రజాపతి. అలా ప్రజాపతి స్వరూపాన్ని తెలిసికొని దేవతలు అసురుల్ని జయిస్తారట.

బృహదారణ్యకంలో ఆరో అధ్యాయంలో శరీరంలో ఉన్న ఇంద్రియాలు, ప్రాణం ఒకసారి బ్రహ్మవద్దకు పోయి మాలో ఎవరు శ్రేష్ఠులో నిర్ణయించమంటారట. బ్రహ్మ మీలో ఎవ్వరులేకపోతే శరీరం హేయమవుతుందో అతడే గొప్ప అని చెప్తాడట. అపుడు శరీరాన్నుండి ఒక్కొక్కళ్ళే నిష్క్రమించి చూస్తారట. చివరగా ప్రాణం నిష్క్రమించినపుడే శరీరం నిష్క్రియమై హేయమవటం గమనించి ప్రాణమే శ్రేష్ఠమని నిర్ణయించుకుంటారట.

ఈ ఆరణ్యకంలో అనేక సంవాదాలు యాజ్ఞవల్క్యునితో ముడిపడి ఉన్నాయి. ఇందులో ప్రధానపాత్ర యాజ్ఞవల్క్యుడే కాబట్టి వాటిని ఉపాఖ్యానాలుగా గ్రహించే అవకాశం లేదు.

**సృష్టిక్రమం:**

తలవకారారణ్యకం (జైమినీయోపనిషద్బ్రాహ్మణం)లో ఆరంభం లోనే సృష్టిక్రమం వర్ణింపబడింది. ఇలాంటి వర్ణన ఇంకెక్కడా లేదు. ప్రజాపతి ఋగ్వేదాన్ని తీసికొని "భూః" అని ఉచ్చరించి రసాన్ని పిండాడట. అది పృథివి అయిందట. అలాగే "భువః" అని యజుర్వేదాన్ని పిండాడట. ఆరసం అంతరిక్షమైందట. అలాగే "సువః" అని సామవేదాన్ని పిండాడట. ఆరసమే స్వర్గమైందట. ఆమూడు రసాల నుంచి మళ్ళా రసాన్ని తీసాడట. అవి క్రమంగా అగ్ని, వాయువు, ఆదిత్యులుగా అయ్యాయట. ఇలా వేదత్రయాన్ని పిండగల్గినా ప్రజాపతి "ఓం" అనే అక్షరాన్ని మాత్రం పిండలేకపోయాడట. ఈ ఓంకారమే వాగ్రూపమైందట. దానిరసమే ప్రాణమట. ఈ విధంగా ఈ ఎనిమిది ప్రజాపతి వల్ల సృష్టింపబడ్డాయి. వీని ప్రతీకరూపమే గాయత్రీ ఛందస్సు. అందువల్లనే గాయత్రి బ్రహ్మరూపంగా భావింపబడుతోంది (జై.ఉ.బ్రా. 1.1.1.) దీని తరువాత గ్రంథం ఓంకారం గొప్పదనాన్ని ప్రతిపాదించింది.

ఇలాగే ప్రథమాధ్యాయం ద్వితీయానువాకం మొదటిఖండ ప్రజాపతి చేసిన సృష్టిక్రమాన్ని వర్ణించిన తరువాత ఇంద్ర చంద్ర రుద్ర సముద్రులు దేవతలలో ఎలా గొప్పవారైనారో వర్ణించింది. ప్రజాపతి వేదత్రయాన్ని పిండి, ఆ రసాన్ని అక్కడే వదలి పైకి వెళ్ళిపోయాడట. అలా వెళ్ళిన ప్రజాపతిని ఇంద్రాదులు నల్గురు చూచారట. అందువల్లనే వారు దేవతలలో గొప్పవారైనారట. ఆ రసమే తపస్సైందట. ఆ రసాన్ని ఆ దేవతలు చూసారట. వేదత్రయాన్ని పరిశీలించి, అందులో

'ఓం' కారాన్ని కనుగొన్నారట. అటువంటి ఓంకారం వల్ల వేదాలు రసయుక్తాలని తెలిసికొని పేలాలు బెల్లంతో కలిపినట్లు తపస్సును వేద త్రయంతో కలిపి తపస్సు చేశారట. అలా తపస్సు వల్ల వేదాలు సమృద్ధమైనాయట. ఈ తపస్సు, వేదాల ద్వారా ప్రజాపతిలాగా మరల వేదత్రయాన్ని జయించి ఆ నల్గురు ప్రజాపతితో సమానులైనారట (1-2-1).

**ఓంకార మహిమ:**

మరొక కథలో దేవతలు ప్రజాపతిని మృత్యు-పాపాలనుండి విము క్తికి ఉపాయం సూచించమని అడిగారట. అపుడు ప్రజాపతి వాళ్ళను గాయత్ర్యాది ఛందస్సులలో ప్రవేశించమని సూచించాడట. కాని అలా ఛందస్సులలో ప్రవేశించినా వారికి మృత్యు-పాపాల వల్ల బాధ తప్పలే దట. తరువాత వాళ్లు 'ఓం' కారంలో ప్రవేశించి అమరులు, పాప రహితులు అయినారట. ఇలా ఎవరైతే ఓంకారైక్యాన్ని పొందుతారో వాళ్ళను మృత్యుపాపాలంటవు అని ఈ కథ చెప్తోంది (1.4.4.).

ఇదే అనువాకంలో మొదటి రెండు ఖండలలో దేవతలు స్వర్గాన్ని పొందడానికి చేసిన ప్రయత్నం, దాని తరువాత రాక్షసులచే బాధింప బడటం, మరల వారిని జయించిన పద్ధతి వర్ణింపబడ్డాయి. "దేవతలు ప్రజాపతిని సమీపించి మేమేం చేసినా స్వర్గాన్ని పొందలేకపోయాం -- అందువల్ల స్వర్గాన్ని పొందే ఉపాయం తెల్పమంటారు. ఋఙ్మంత్రం లేకుండా సామగానం చేస్తే స్వర్గం వస్తుందంటాడు ప్రజాపతి. అలా ఋక్కులను వదిలేసి సామగానంతో స్వర్గాన్ని పొందుతారు. వారు వది లిన ఋక్కులనన్నింటెని తీసుకొని ప్రజాపతి వాటిని పూజిస్తాడు. అసలు ఆ ఋక్కులే ఆ దేవతల అదృష్టం. వాటి వల్లే వాళ్ళు దేవతలయ్యారు. కాని ఇపుడు వాళ్ళు వాటినే కాదన్నారు. దీన్ని తెలుసుకున్న అసురులు దేవతలచేత విడిచిపెట్టబడిన ఋక్కులను సంపాదించి బలవంతులైనారు.

దేవతలు దీన్ని గ్రహించి, తమ అదృష్టాన్ని మళ్లా సంపాదించదలిచి ఋక్‌తో కూడిన సామగానాన్ని చేశారు. అలా బలవంతులై వాళ్ళు అసురుల్ని పారద్రోలారు." ఇందుచేతనే మాధ్యందిన సాయం సవనాల్లో ఋక్సహితమైన సామ, ప్రాతఃసవనాల్లో ఋగ్రహితమైన సామగానం చేయబడుతోంది (1-4-1-2).

**ఉద్గాత - ఉత్తరదిక్కు:**

ఉద్గాత ఉత్తర దిక్కులో ఉండటానికి కారణమైన కథ ఒకటి ఈ బ్రాహ్మణంలో ఉంది. శర్యాతుడనే మానవుడు యాగం చేయబోగా తూర్పునుండి బృహస్పతిని తీసికొని దేవతలు, దక్షిణదిక్కునుండి బంబుడగు ఆజద్విషుని తీసికొని పితృదేవతలు, పశ్చిమం నుంచి ఉశనసుడనే కావ్యుని తీసికొని అసురులు, ఉత్తరం నుంచి అయాస్యుడగు అంగిరసునితో మానవులు వచ్చి, బృహస్పతి మొదలైన వాళ్ళను ఉద్గాతగా పెట్టుకోమని బలవంతం చేస్తారు. అలా ఉద్గాతలుగా వచ్చినవాళ్ళను ఒక్కొక్కళ్ళను ప్రశ్నింపగా మానవులు తెచ్చిన అయాస్యుడైన అంగిరసుడే ఉత్తమంగా సమాధానం చెప్తాడు. అందువల్ల అతణ్ణే ఉద్గాతగా స్వీకరిస్తాడు. ఉత్తరాన్నించి వచ్చిన ఆంగిరసుణ్ణే ఆతడు ఉద్గాతగా స్వీకరించాడు కాబట్టి అప్పటి నుండి ఉద్గాతస్థానం ఉత్తరదిక్కుగా నిర్ణయింపబడిందట (2-3-1-2).

**ఉచ్చైశ్శ్రవోపాఖ్యానం:**

ఇలాగే తృతీయాధ్యాయంలో షష్ఠానువాకంలో ప్రథమ ద్వితీయఖండలలో అశరీరసామవైశిష్ట్యం చెప్పబడింది. ఈ అశరీరసామవల్ల మర్త్యశరీరాన్ని పరిత్యజించి దివ్యశరీరంతో దివ్యలోకాన్ని పొందడం దార్భ్యఉచ్చైశ్రవోపాఖ్యానం ద్వారా చెప్పబడింది.

"ఉచ్చైఃశ్రవుడు దాల్భ్యుడు ప్రాణస్నేహితులు. వారిలో ఉచ్చైఃశ్రవుడు చనిపోతాడు. అంతట దాల్భ్యుడు నిర్విణ్ణుడై శోకాన్ని మరచిపోడానికి వేటకు వెళ్తాడు. అక్కడ వేటాడుతూ తన మిత్రుణ్ణి చూస్తాడు. అతడు ఈ మర్త్యశరీరంలో లేడు. అతనితో మాట్లాడగల్గుతాడు కాని అతణ్ణి తాకలేకపోతాడు. అపుడు తన మిత్రుణ్ణి దాల్భ్యుడు నీవిలా ఎలా అయ్యావని అడుగుతాడు. అశరీరసామగానం వల్ల ఇటువంటి శరీరం కల్గుతుందని చెప్పగా, అటువంటి సామగానం చేయగలిగే వాణ్ణి వెతికి తాను కూడా అటువంటి శరీరాన్ని పొందుతాడు." -- ఇలా ఆరణ్యకాల్లో అక్కడక్కడ ఉన్న ఉపాఖ్యానాలు ఆయా మంత్రాల, కర్మల వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి.

— కె.వి.ఆర్.కె.

# 1.10 ప్రకృతి

యజ్ఞాలలో ఉన్న నిగూఢార్థాలు, సంకేతాలు, సమస్యలు అరణ్యంలో అధ్యయనం చేయదగినవి. కనుక ఆరణ్యకాలనబడుతున్నాయి. మంత్ర, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తుల విచారం బ్రహ్మచర్య, గృహస్థ, వాన ప్రస్థ, సన్యాసాశ్రమాలకు విధించినట్లు తలచవచ్చు.

వివాహం లేకుండా అధ్యయనం కొనసాగించేవారు 'అరణు' లని 'అరణమాను' లని పిలువబడుతుండేవారు. అరణులు నివసించే ప్రదేశం ఆరణ్యకం. వారి ఆలోచనలు, విచారధారలు, ఆరణ్యకాలలో నిక్షిప్తమై ఉన్నాయి (అరుణేయ ఉపనిషత్తు-- 2). వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు అరణ్యంలో చేయదగిన మహావ్రతాలు, మహానామ్ని, ప్రవర్గ్య, పితృమేధం మొదలైనవి ఆరణ్యకాలలో వివరింపబడినాయి. ఇంకా నివృత్తిమార్గానికి చెందిన వైరాగ్యసూత్రాలు, వేదరహస్యాలు ఆరణ్యకంలో ఉన్నాయి. ఉపనిషత్తులలో విచారించబడిన ఆత్మ లేక బ్రహ్మజ్ఞాన రహస్యాలకు పునాది ఆరణ్యకాలలోనే పడింది. కాబట్టి ఆరణ్యకాలకు 'రహస్యం' అనే నామాంతరం కలిగింది. ఈ విషయాన్ని 'రహస్యాని సామాన్యారణ్యకాదీతాని' అని మనుస్మృతి (11-261) వివరిస్తోంది. 'రహస్యం అరణ్యే పఠితవ్యో గ్రంథో యః తం' అని ఐతరేయబ్రాహ్మణ వ్యాఖ్యాత భట్ట గోవిందస్వామి ఆరణ్యకాల రహస్యస్వభావాన్ని వివరించాడు. ఆరణ్యకాలలో ఉన్న మాంత్రికశక్తి వల్ల అవి ప్రమాదకరాలుగ తలచబడ్డాయి. కాబట్టి అవి అరణ్యాలలో అధ్యయనం చేయదగినవని విధింపబడింది.

దృశ్యమానమైన స్థావరజంగమాత్మకమయిన జగత్తు అంతా ప్రకృతి. అంటే మనకు కనిపిస్తున్న మన చుట్టూ ఉన్న చెట్లు, తీగలు, గుట్టలు, పక్షులు, జంతువులు, నదులు, పర్వతాలు మొదలైనవి. ప్రకృతి పరమాత్మ యొక్క విరాట్‌స్వరూపమే. ప్రకృతి అనే పదం సంహితా భాగంలో కనిపించటం లేదు. మొదట తైత్తిరీయారణ్యకం (10.10.3)

లో ప్రకృతిపదం కనబడుతోంది. ఈ పదం 'కృ' (చేయు) అనే ధాతువు నుంచి ఏర్పడింది. ప్ర - ఉపసర్గ; క్తిన్ ప్రత్యయం. ప్ర+కృ+క్తిన్→ ప్రకృతి (స్త్రియాం క్తిన్ - (పాణిని 3.3.94)). ప్రకృతి అంటే చక్కగా చేసేది అని అర్థం. జగత్తులో పురుషునికి ప్రతిగా ఉన్నది ప్రకృతి. ఐతరేయారణ్యకం (3.1.6) లో, జైమినీయోపనిషద్బ్రాహ్మణం (1.41.7) లో ప్రకృతి దేవతగా, అదితిగా వర్ణించబడింది.

"ప్రారంభః క్రియతే అనయేతి ప్రకృతిః" అని .గురుబాల ప్రబోధిక ప్రకృతిని వివరించింది. దీనిచేత జగత్ ప్రారంభం చేయబడుతోంది. మొట్టమొదట పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం (పంచ భూతాలు) ప్రకృతిగా ఏర్పడ్డాయి. ప్రాణులు అన్నీ పాంచభౌతికాలు కావటంచేత తమ జన్మకు, జీవనానికి గూడ ప్రకృతిపై ఆధారపడవలసి వచ్చింది. "కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే" -- (భగవద్గీత 13.20) అని గీతాచార్యుడు కార్యకారణాలను కలిగించటానికి కారణం ప్రకృతి అని వివరించాడు. వేదాంతులు కొందఱు ప్రకృతిని మాయగా భావించి ప్రకృతిసౌందర్యం పట్ల విముఖులైనారు. పురుషునికి ప్రకృతికి పరస్పర సాన్నిహిత్యం ఉంది. మానవులు ఆహారానికి ఆనందానికి గూడ ప్రకృతిపై ఆధారపడి ఉన్నారు. కనుక ప్రకృతిపట్ల ఆరాధనాదృష్టి, సౌందర్యదృష్టి ఏర్పడింది. ప్రకృతిలో మానవతారోపణ చేయబడింది. ప్రకృతి అఖండశక్తికి మూర్తిమతిగా ఆరాధింపబడింది. వైదికఋషులు ప్రకృతిని మాతృదేవతగా పూజించారు. ప్రకృతిసౌందర్యాన్ని తనివితీరా చూసి తన్మయులైనారు. స్తుతించారు. తరించారు. ఆరణ్యకాల నాటికి ఆర్యుల ప్రకృతివిజ్ఞానం సమగ్రంగా అభివృద్ధి చెందింది. ఈ విజ్ఞాన సారాంశమంతా ఆరణ్యకాలలోని ప్రకృతివర్ణనలలో వెల్లడి అవుతున్నది.

వేదవాఙ్మయంలో ఆరణ్యకాలు చిన్న గ్రంథాలు. వీటిలో వర్ణించ బడిన అంశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఆరణ్యకాల్లో ప్రకృతికి సంబంధించిన విశేషాలు కొన్ని ఇక్కడ వివరించబడుతున్నాయి.

## 1. దేశాలు:

కురుక్షేత్రం :- ఇది దేవతలు యజ్ఞం చేసిన పవిత్రమైన దేశం. భారతకాలంలో ఇది ధర్మక్షేత్రంగా ప్రశస్తి పొందింది. కురుక్షేత్రంలో అగ్ని, ఇంద్ర, సోమ, విష్ణు, విశ్వేదేవతలు యజ్ఞాలు చేశారు. అందుచేత కురుక్షేత్రం 'దేవయజన' మనే పేరుతో పిలువబడుతోంది (బృ. ఆ. 1.1.2). కురుక్షేత్రంలో 'అన్యతఃప్లక్ష' అనే సరస్సు ఉంది. అందులో పద్మాలు, హంసలు ఉన్నట్లుగా వర్ణింపబడింది.

ఆరణ్యకాలలో కురు, పాంచాల దేశాలు, మత్స్య, విదేహ, కాశీరాజ్యాలు పేర్కొనబడ్డాయి. కురు పాంచాలాలు విద్యలకు, విద్వాంసులకు నిలయాలుగా ఉండేవి. ఆర్యసంస్కృతికి కురు పాంచాల దేశాలు ఆలవాలమయినాయి.

## 2. నదులు:

గంగా, యమున, సరస్వతి, సింధు, వరుణ, గోమతి, త్రిష్టామా, సువర్తు, రసా, శ్వేత, కుభా, మేహత్ను నదులు తైత్తిరీయారణ్యకంలో (10.1.13) పేర్కొనబడ్డాయి. వీటిలో సరస్వతీనది దేవతగా ఆరాధింపబడింది. ఇది నేటికి కాలగర్భంలో కలసి, అంతర్వాహినిగా నిలిచింది.

## 3. ఋతువులు:

ఋతువులకు ప్రభువు సంవత్సరం. సంవత్సర స్వరూపుడైన కాల పురుషుని ఆజ్ఞను ఋతువులు నిర్వర్తిస్తాయి. ఆనాటి ఋతువులు, మాసాలు ఇలా ఉన్నాయి --

| సం. | ఋతువులు | మాసాలు | ప్రస్తుతమాసాలు |
|---|---|---|---|
| 1. | వసంత | మధు, మాధవ | చైత్ర, వైశాఖ |
| 2. | గ్రీష్మ | శుక్ర, శుచి | జ్యేష్ఠ, ఆషాఢ |
| 3. | వర్ష | నభ, నభస్య | శ్రావణ, భాద్రపద |
| 4. | శరత్ | ఇష, ఊర్జ | ఆశ్వయుజ, కార్తీక |
| 5. | హేమంత | సహ, సహస్య | మార్గశీర్ష, పౌష |
| 6. | శిశిర | తప, తపస్య | మాఘ, ఫాల్గుణ |

ఋతువులలో ముఖ్యమైంది వసంతం. ఇందులో యజ్ఞయాగాది కర్మలు చేయబడతాయి. ప్రకృతి మనోహరంగా ఉంటుంది. గ్రీష్మం వసంతం కంటే అసాధారణంగా ఉంటుంది. తాపాధిక్యం దీని అసాధారణగుణం. సూర్యుడు నిరుపమానతేజస్సుతో భూమిని తపింపజేస్తాడు. వర్షర్తువు ప్రాణికోటికి వ్రీహి మొదలైన ధాన్యాలను ఫలాలను సమకూరుస్తుంది. దీనికాదిత్యులు ప్రభువులు. దీనివెంట శరదృతువు వస్తుంది. ఇందులో లోకమంతా నిష్పంకమై ప్రసన్నంగా ఉంటుంది. దీనికి ప్రభువులు ఋభువులు. హేమంతానికి ప్రభువులయిన మరుద్గణాలు విజృంభించటం చేత చలితీవ్రత హెచ్చుతుంది. శిశిరఋతువులో మార్గమధ్యంలో నీరు లభించదు. బాటసారులు నీరెక్కడ దొరుకుతుందో అని తపిస్తూ ప్రయాణం చేస్తుంటారు.

## 4. ధాన్యాలు:

వ్రీహి, ప్రియంగు, ముద్గ, మాష, శ్యామాక గోధూమ, తిల, యవ, అణు, ఖల్వ, నీవార, మసూర ధాన్యాలు ఆరణ్యకాల్లో పేర్కొనబడ్డాయి. కృషికులు శునాసీర దేవతలను పూజిస్తుండేవారు. "శున" ద్యౌ దేవత. ఇది వర్షాన్ని, సూర్యకాంతిని ఇస్తుంది. "సీర" హల

దేవత. కర్షకులు భూమిని నాగళ్ళతో దున్ని, విత్తనాలు చల్లి, సస్యాలను పోషిస్తారు.

## 5. క్షీరద్రవ్యాలు:

గోవు, గోక్షీరం పవిత్రమైనవిగా తలచబడ్డాయి. ప్రతిధుక్ (గోర్వెచ్చని సద్యః క్షీరం), శృత (కాచిన పాలు), శర (మీగడ), దధి, మస్తు, అతంచన, నవనీత, ఘృత, ఆమిక్ష, వాజిన, పయస్యా, పృషద్ ఆజ్యా, షాంటా మొదలైనవి క్షీరద్రవ్యాలు. గోవు భూదేవతకు, అదితికి ప్రతినిధిగా పూజింపబడుతుండేది.

## 6. సోమలత:

సోమరసం యజ్ఞాలలో ప్రధాన హవిస్సుగా ఉండేది. సోమలత ముంజవత్ పర్వతసానువులలో ఉంది. దీనికి చిత్రవర్ణంగల 15 పత్రాలుంటాయి. ఇది పూర్ణిమకు 15 పత్రాలతో సంపూర్ణంగా ఉంటుంది. అమావాస్యనాటికి క్రమంగా ఆకులన్నీ రాలిపోయి కాడమాత్రం మిగులుతుంది. మరల పూర్ణిమకు సంపూర్ణంగా వృద్ధిచెందుతుంది. సోమలత దేవతలకు ఆహారం. చంద్రుని కంటే వేరు కాదు. దీని నుంచి అమృతం లభిస్తుంది. "ఏష వై సోమో రాజా దేవానామన్నం యచ్చంద్రమా" (శ. బ్రా. 1.6.4.5) సోమరసం మనిషిని ఉల్లాసపరుస్తుంది. తన్మయత్వం కల్గిస్తుంది. కనుక యాగాలలో ఋత్విక్కులు, యజమానిసోమపానం చేస్తారు. బంగారం, వస్త్రం, చర్మం, ఆడమేక, పాలిచ్చే ఆవులనిచ్చి సోమలత కొనబడుతుంది. సోమలత లభించనప్పుడు పుతికా, అర్జున, ఫాల్గున లతలు ఉపయోగించేవారు.

## 7. వృక్షాలు:

1. అపామార్గ (ఉత్తరేణి) - రాజసూయ యాగంలో 'అపామార్గ హోమం' రాక్షసనిర్మూలనకై చేయబడుతుంది. 2. అర్క (జిల్లేడు)

- చయనహోమం అర్క పత్రాలతో చేయబడుతుంది. 3. అశ్వత్థ (రావిచెట్టు) - ఇది దేవతలకు ముఖ్యంగా మరుత్తులకు నివాసం. రాజసూయంలో అశ్వత్థంతో చేయబడిన పాత్రలు ఉపయోగిస్తారు. చయన హోమంలో అశ్వత్థంతో 'ఉపభృత్' చేయబడుతుంది. అశ్వత్థానికి శత్రు నిర్మూలన, విజయలబ్ధి ప్రతిఫలాలుగా చెప్పబడ్డాయి. ఉదుంబర (మేడి చెట్టు) - సదస్సుమధ్యలో నున్న యూపస్తంభం ఈ జాతికి చెందినదిగా ఉంటుంది. వాజపేయయాగంలో రాజు కూర్చొనే సింహాసనం, అభిషేకపాత్రలు మేడికొయ్యతో చేయబడతాయి. అగ్నిక్షత్రంలో విత్తనాలు వేయటానికి గూడ ఉదుంబరపాత్ర ఉపయోగిస్తారు. 5. కార్షమర్య - రాక్షసులను హతమార్చే వృక్షంగా వర్ణింపబడింది. 'అతిథ్యేష్టి' లో పరిధిగా కార్షమర్య ఉపయోగించబడుతుంది. 6. క్రముక (ఎర్రలొద్దుగు, గంగరావి). యజ్ఞాలలో సమిధగా ఉపయోగించబడుతుంది. 7. ఖదిర (చంద్ర). యజ్ఞాలలో ఉపయోగించే 'స్రువం' అనబడే గరిటె 'షఫ్య' అనబడే కొయ్యకత్తి ఈ కర్రతో చేయబడుతుంది.

8. న్యగ్రోధం - (మర్రిచెట్టు) రాజసూయయాగంలో ఒక అభిషేక పాత్రను ఈ కొయ్యతో చేస్తారు. ఈ పాత్రలోని జలంతో రాజమిత్రుడు రాజును అభిషేకిస్తాడు. 9. పలాశ (మోదుగుచెట్టు): పర్ణ (మోదుగు) - ఇది చాలా పవిత్రమైంది. అగ్నిహోత్ర హవిస్సుగ మోదుగ కొమ్మలు ఉపయోగిస్తారు. దర్శపూర్ణ మాసయాగంలో "వత్సాపాకరణా" నికి పలాశదండాన్ని ఉపయోగిస్తారు. గార్హపత్యాగ్ని ఉన్న స్థలాన్ని మోదుగ కొమ్మతో ఊడ్చాలి. 10. పీతదారు ( దేవదారు) యూపస్తంభంగా దేవదారును ఉపయోగిస్తారు. 11. పృష్ణిపర్ణి (కోలపొన్న) ఇది ఓషధి. సూక్ష్మజీవులను నశింపచేస్తుంది. 12. ఫాల్గున (ఏఱుమద్ది) ఇది రెండు రకాలు. ఎర్రపూలు గలది. పసుపు మీరిన ఎర్రపూలు గలది. ఈ రెండవ రకం సోమలతకు బదులుగా సోమయాగంలో వాడతారు.

13. వరణ (ఉలిమిరి) - దీనితో శంకులు చేస్తారు. పరిధికా య్యలు, స్రువాలు=గరిటెలు దీనితో చేస్తారు. 'వరణావతి' ఒక సరస్సు పేరు. దానియొడ్డున వరణవృక్షాలు చాలా ఉన్నాయి. 14. వికంకట (ములువెలమ లేక పుల్ల వెలగచెట్టు) ప్రజాపతి తన చేతులను రుద్దగా అందుండి వికంకట ఉద్భవించింది. అందువల్ల యజ్ఞంలోని పాత్రలను దీనితో చేస్తారు. 'స్రువం' అనబడే అగ్నిహోత్రపు గరిటెలు మట్టిని త్రవ్వే పార (ఖనిత్ర) దీనితో చేస్తారు. మరుత్తుకు ప్రతినిధిగా ప్రవర్గ్య పాత్రపై వికంకట కొయ్యముక్కలు ఉంచాలి. ప్రజాపతి మొట్టమొదట నైవేద్యాన్ని ఈ వృక్షం ద్వారా సమర్పించాడు. కాబట్టి వికంకటం పవిత్రమైంది. 15. విభీతక (తాండ్రచెట్టు) జూదమాడటానికి ఉప యోగించే పాచికలు ఈ కొయ్యతో చేస్తారు. దీని పళ్లు ఆహారంగా ఉపయోగించుకుంటారు. 16. శమీ (జమ్మి). ఇది పలాశంలాగా పవిత్ర మైంది. అగ్నిగర్భ అని ప్రశంసింపబడింది. దీనితో శంకులు చేస్తారు. 17. శాల్మలి (బూరుగుచెట్టు) రథ నిర్మాణానికి ఈ కొయ్యను ఉపయోగిస్తారు.

18. వంశ: వేణు (వెదురు) యజ్ఞాలలో ఉపయోగించే అభ్రి (కొయ్యగడ్డపార), శూర్ప (చేట) దీనితో తయారుచేస్తారు. 19. శ్యేన హృత - ఈ తీగను సోమలతకు బదులుగా సోమయాగంలో ఉపయోగి స్తారు. 20. దూర్వ (గరిక), కుశ (దర్భ), ముంజ - ఇవి గడ్డి జాతికి చెందినవి. కాశ లేక అశ్వవాల (రెల్లు) గూడ ఈ తరగతికి చెందిందే. కుశతో వస్త్రాలు నేస్తుండేవారు. 'ప్లక్ష' (జువ్వి) రెమ్మలతో చాపలు అల్లేవారు. అశ్వమేధయాగంలో 21 యూపస్తంభాలు ఉంటాయి. దీనిలో మధ్యనున్నది 'రజ్జుదాల' కొయ్యతో చేయబడుతుంది. మిగిలినవి దేవదారు (2) బిల్వ (6) ఖదిర (6) పలాశ (6) వృక్షాల కొయ్య లతో చేయబడతాయి. ఓషధులలో పుష్పవతి, ప్రసూవతి, విశ్వపరిష్ట,

ఫలనీయు, అఫలనీయు, అపుష్పపుష్పిణి, సోమరాజ్ఞి అనేవి బాగా గుర్తిం చబడ్డాయి.

**8. జంతువులు:**

ఇవి ఆరణ్య, గ్రామ్యభేదంతో రెండు రకాలు. పురుష, అశ్వ, గోవు, అవి (పొట్టేలు) అజ (మేక) అనే అయిదు గృహజంతువులుగ పరిగణింపబడ్డాయి. వీటిలో గోవు యజ్ఞపశువుగా గ్రహింపబడలేదు. పురుషుడు యజ్ఞపశువుగా గ్రహింపబడ్డాడు. పురుషమేధంలో పురుషుడే యజ్ఞపశువుగా ఉంటాడు. సాధుజంతువులైన పురుష, అశ్వ, గో, అవి, అజ అనే వాటికి బదులుగా క్రమంగా కింపురుష, గౌర, గవయ, ఉష్ట్ర, శరభ అనేవి క్రూరజంతువులుగ పరిగణించబడ్డాయి. వృషభం, గర్దభం, వేసరం (కంచరగాడిద) భారవాహాలుగా ఉండేవి. ఎద్దులలో త్ర్యవి, పంచవి, వత్సతర, దిత్యవాహ, త్రివత్స, తుర్యవాహ, షష్ఠవాహ అనే రకాలు వయస్సును బట్టి గుర్తింపబడ్డాయి.

శార్దూలం సుందరమృగంగా ప్రశంసింపబడింది. వ్యాఘ్రచర్మ సౌందర్యం కొనియాడబడింది. బస్త (మగమేక) ఉక్ష (ఎద్దు) వృష్ణి (పొట్టేలు) ఋక్షము (ఎలుగు) పురుష, వ్యాఘ్ర, సింహ, ధేనువులు శక్తిమంతమైన జంతువులు. వృకం (తోడేలు) అరణ్యపశువు లలో ప్రచండవేగం గలది (అజాతిః) గా గుర్తింపబడింది. శార్దూలం అరణ్యపశువులకు రాజుగా (అరణ్యపశూనాం రాజా), సింహం అరణ్య పశుపాలకుడుగా (అరణ్యపశూనామీశః) ప్రశంసింపబడింది.

తెల్లని అశ్వం సూర్యునికి ప్రతీకగా గౌరవింపబడింది. అశ్వమేధ యాగంలో అశ్వమే యజ్ఞపశువు. దీనికి హయ, అత్య, మయ, అర్వా, సప్తి, వాజి, యము, శిశు అనేవి పర్యాయపదాలు. యాగ పశువులలో మేక, గొఱ్ఱె ముఖ్యమైనవి. రంగును బట్టి, చెవులను బట్టి, తోకను బట్టి వీటిలో అనేకరకాలు గుర్తింపబడ్డాయి. కృష్ణ, కృష్ణగ్రీవ,

శ్యామ, సిత, పృష్ఠ, శిల్ప, అరుణ, కలమాష, సింహిత, పిశంగ, రోహిత, ధూమ్రరోహిత, కర్కంధురోహిత, శుద్ధవాల, మణివాల, నభోరూప, లోహితోర్ణీ, ప్లక్ష, ప్లీహకర్ణ, శుంఠకర్ణ, శితికక్ష మొదలైనవి. గొఱ్ఱెలకాపరికి 'అవిపాల' అనిపేరు.

**9. పక్షులు:**

ఇవి వయాంసి, వాయువ్యాలుగా పేర్కొనబడ్డాయి. కపింజల, తిత్తిరి, కలవింక, వర్తికా, కకర, వికకర, కుటరు, శుక, ఉలూక, మయూర, కపోత, కౌలిక, మైనా, పారుష్ణ, పారావత, సుపర్ణ మొ||నవి కొన్ని పక్షులు. జలసంబంధమైనవి - శిశుమార, మండూక, మత్స్య, నక్ర, హంస, బలాక, కూర్మ, క్రౌంచ, చక్రవాకాలు.

**10. సర్పాలు:**

దంద శూకాః, అసిత, తిరశ్చిరాజీ, స్వజ, కల్మాష, గ్రీవ, శ్విత్ర, కరిక్రత, ఘృతాచి, అజగరాలు.

అశ్వమేధయాగంలో 340 గ్రామ్యజంతువులు వధింపబడతాయి. 360 అరణ్యజంతువులు సేకరింపబడతాయి. ఇవి యాగానంతరం వదలివేయబడతాయి. ఏనుగు 'హస్తి'గా పిలువబడింది. దీని రక్షకునికి 'హస్తిప' అనిపేరు.

ఇలా ఆరణ్యకాలలో ప్రకృతిని గూర్చిన ప్రస్తావం ఉంది. ప్రకృతికి సంబంధించిన తాత్త్వికచింతన నాటి భారతీయులకు ప్రకృతిపట్లగల ఆరాధనాభావాన్ని, ప్రకృతి వర్ణనలు వారి సౌందర్యదృష్టిని వెల్లడిస్తున్నాయి.

— కె.వి.ఆర్.

# 1.11 మతం - తత్త్వం

మంత్రానికి బ్రాహ్మణం, బ్రాహ్మణానికి ఆరణ్యకం, ఆరణ్యకానికి ఉపనిషత్తు అనుబంధంగా ఉన్నాయి. బ్రాహ్మణంలోని చివరిభాగానికి ఆరణ్యకం అనే పేరు అరణ్యాలలో అధ్యయనం చేయటంవల్ల కలిగిందని విద్యారణ్యులు సురేశ్వరాచార్యుడు[1] కూడా చెప్పటం జరిగింది. ఆరణ్యకానికి ముందున్న వేదభాగమంతా యజ్ఞయాగాదికర్మలను, వాటిని ఆచరించే విధానాలను, అందుకు సంబంధించిన విషయాలను బోధిస్తున్నది. అటు తరువాత జ్ఞానమార్గాన్ని ఉపదేశించటం ద్వారా వేదం మానవుణ్ణి మోక్షం వైపు నడిపిస్తున్నది. అటు కర్మమార్గానికి ఇటు జ్ఞానమార్గానికి వారధిగా మధ్యలో ఉంటుంది ఈ ఆరణ్యకం. కర్మాచరణకు, బ్రహ్మోపదేశానికి సంబంధించిన అనేక రహస్యాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. అందుచేత అతిజాగ్రత్తగా కాపాడవలసిందన్న తలంపుతో ఈ వేదభాగాన్ని అరణ్యంలో అధ్యయనం చేయటం సమంజసమే.

ఆరణ్యకాన్ని అరణ్యంలోనే అధ్యయనం చెయ్యాలి. మరోచోట చేయగూడదు అనే నిబంధనలో కొంత సడలింపు ఉన్నట్లు కనిపిస్తుంది. దీనికి కారణం తైత్తిరీయారణ్యకంలో అరణ్యంలో గాని గ్రామంలో గాని అధ్యయనం చేయవచ్చునని చెప్పబడి ఉండటమే.[2] మనువు మొ|| ధర్మశాస్త్రకర్తలు బ్రహ్మచర్య - గృహస్థ - వానప్రస్థ - సన్యాసాలనే నాలుగు ఆశ్రమాలను, అనగా జీవనదశావిశేషాలను సూచించారు. వానప్రస్థాశ్రమంలో ఉన్న వ్యక్తి మోక్షాన్వేషణలో అడవికి వెళ్లి భార్యతో కలిసి బ్రహ్మచర్యంతో ఉండి తపస్సు చేసుకుంటూ ఉంటాడు. ఇలాంటి

1. అరణ్యాధ్యయనాదేతదారణ్యకమితి - సం.వా.9
2. గ్రామే మనసా స్వాధ్యాయ మధీయీత - తై.ఆ. 2.12.2
య ఏవం విద్వాన్...అరణ్యే గ్రామే వా యావత్తారసం స్వాధ్యాయమధీతే
తై. ఆ. 2.15.1

వారు అధ్యయనం చేయడానికి నిర్దేశింపబడిందే ఈ వేదభాగం. ఈ కారణం వల్ల కూడా దీన్ని ఆరణ్యకమనవచ్చు.

అనేక వేదశాఖలు కాలగర్భంలో కలసిపోగా ఇప్పుడు కొద్ది శాఖలకు సంబంధించిన ఆరణ్యకాలు మాత్రమే దొరుకుతున్నాయి. వీటిలో ఐతరేయ - శాంఖాయన - తైత్తిరీయ - బృహదారణ్యకాలు ముఖ్యమైనవి. ముందు చెప్పబడినట్లుగా ఇవి వైదిక ధర్మాన్ని ప్రతిబింబించే యజ్ఞ యాగాదులు దేవతారాధనలు మొ|| కర్మలు, తత్త్వానికి సంబంధించిన అనేక రహస్యాలను ప్రతిపాదిస్తున్నాయి. ఈ రెండు అంశాలను గురించి వరుసగా తెలుసుకుందాం.

## 1. మతం:

ఆరణ్యకాలలో పేర్కొనబడిన మతపరమైన అంశాలలో ముఖ్యమైనవి "మహావ్రతం" మొ|| కర్మలు. ఇవి ప్రధానంగా వానప్రస్థాశ్రమంలోని వారికి సంబంధించినవిగా ఉంటాయి. ఇప్పుడు 'దొరుకుతున్న ఋగ్వేదానికి సంబంధించిన ఐతరేయ - కౌషీతకారణ్యకాలలో (శాంఖాయన) ఈ మహావ్రతయాగం చాలా వివరంగా ప్రతిపాదింపబడి ఉన్నది.

'మహావ్రతం' ఒక సంవత్సరకాలంపాటు సాగే 'గవామయనం' అనే సత్రయాగంలో చివరిరోజుకు ముందురోజు జరుపబడుతుంది. పూర్వం గోవులు ఈ యాగాన్ని సంవత్సరంపాటు ఆచరించినట్లు గోపథబ్రాహ్మణంలో చెప్పబడి ఉంది. అందుచేతనే దీనికి గవామయనం అనేపేరు వచ్చింది. ఇందులో యజమానులందరూ ఋత్విక్కులే. మహావ్రతంలో అనేక హోమాలను జరపటంతో పాటు స్తోత్రాలను, శస్త్రాలను (దేవతాస్తుతి పరమైన ఋక్కులు) పఠించటం జరుగుతుంది. మతపరమైన అనేక అంశాలను పాటించటంతో ఈ మహావ్రతం ఒక నాటకీయమైన రూపును దిద్దుకుంటుంది.

ఉద్గాత అనే ఋత్విక్కు మేడికర్రతో చేయబడిన జానెడెత్తున్న బల్లపై ఎక్కి స్తోత్రాలను గానం చేస్తూ ఉంటాడు. హోత ఉయ్యాలనెక్కి శస్త్రం పఠించటం ప్రారంభిస్తాడు. అధ్వర్యుడు ఔదుంబర ఫలకాలనెక్కి కూర్చుంటాడు. మిత్రావరుణుడు మొ॥ ఋత్విక్కులు కూడా వారివారికి తగిన ఆసనాలను అలంకరిస్తారు. ఇంతలో ఒక బ్రాహ్మణుడు ఈ మహావ్రతయాగాన్ని ఆచరించే వారిని ప్రశంసించాలి. దానికి ప్రతిగా ఒక శూద్రుడు వారిని నిందించాలి. ఇదిలా ఉండగా కొందరు వేదికకు అన్ని కోణాలవైపు నిలబడి తప్పెటలను గందరగోళంగా వాయిస్తూ ఉంటారు. ఆగ్నీధ్రమంటపానికి పశ్చిమదిక్కున ఒక గుంట తవ్వి, దానిపైన చర్మాన్ని కప్పి వాయిస్తారు. దీనిని "భూమి దుందుభి" అంటారు. ప్రేక్షకులంతా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుకుంటూ ఉంటారు. రాజపురుషులు ధనుర్ధారులై యజ్ఞవాటికచుట్టూ తిరుగుతుంటారు. మర్జాలీయ యజ్ఞవేదిక వద్ద ఎనిమిదిమంది దాసస్త్రీలు నీటికడవలతో నృత్యం చేస్తూ ఉంటారు. యజమానపత్నులు వీణ మొ॥ వాద్యాలతో ఉద్గాతకు వంతపాడుతుంటారు. ఇవిగాక ఇంకా శంఖాలు, ముఖవీణలు, కాండవీణలు మొ॥ సంగీత వాద్యాలు ప్రయోగింపబడుతుంటాయి. అతి గంభీరమైన ధ్వనిగల వంద తీగలుండే 'వాణం' అనే వీణ వంటి సాధనాన్ని ప్రయోగించటం మరో ముఖ్య విశేషం.

ఇలా అనేక మతపరమైన ఆచారాలు గల మహావ్రత యాగానికి సంబంధించిన విషయాలను ఐతరేయారణ్యకం చక్కగా వివరిస్తున్నది. ఈ ఆరణ్యకం ప్రథమ భాగంలో మహావ్రతానికి సంబంధించిన ప్రాతర్మాధ్యందిన సవనాలలో పఠించబడే శస్త్రాలు వర్ణించబడ్డాయి. ద్వితీయ భాగప్రారంభంలో వైదికకర్మానుష్ఠానాన్ని వదిలివేసినవారు పశుపక్ష్యాదులుగా జన్మిస్తారని, ఆచరించినవారు అగ్ని, సూర్యుడు, వాయువులయొక్క ఉపాసనద్వారా ఉత్తమలోకాలను పొందుతారని చెప్పబడింది. అటు తరువాత యజ్ఞానుష్ఠానానికి అవసరమైన వస్తువులు, వాటిని గురించి

తీసుకోవలసిన శ్రద్ధ అభివర్ణింపబడ్డాయి. "నిష్కేవల్యశస్త్రం" ఐతరేయారణ్యకంలోని మరొక ముఖ్య ఘట్టం. ఇందులో పృథివి (భూమి) వర్ణన ఉన్నది. అగ్ని ఈ శస్త్రానికి అర్చనీయదేవత. చరాచరాత్మకమైన సృష్టికి ఆధారం పృథివి. దీనినుంచే "అన్నం" ఉద్భవిస్తుంది. దాన్ని "హవిస్సు" రూపంలో దేవతలకిచ్చి స్వర్గాన్ని పొందవచ్చు. ఇంతేగాక అనేకమంది దేవతల ఆరాధనకూడా ఐతరేయారణ్యకంలో చెప్పబడింది.

ఋగ్వేదానికి చెందిన శాంఖాయనారణ్యకం కూడా మహావ్రతాన్ని విస్తృతంగా వివరిస్తున్నది. ఇందులో మహావ్రతంలో చదవబడే స్తోత్రాలన్నీ ఉన్నాయి. మహావ్రతంలో మూడుసార్లు - ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం - సోమరసాన్ని హోమం చేస్తారు. వీటినే వరుసగా 1. ప్రాతస్సవనం, 2. మాధ్యందిన సవనం, 3. తృతీయ సవనం అంటారు. ప్రాతస్సవనంలో బహిష్పవమానస్తోత్రం, మాధ్యందిన సవనంలో మాధ్యందిన పవమానస్తోత్రం, తృతీయ సవనంలో ఆర్భవ పవమానస్తోత్రం పఠింపబడతాయి. అట్లే ఆజ్య - ప్రఉగ - నిష్కేవల్య - అగ్నిమారుతాది శస్త్రాలు కూడా వీటితో పాటే చెప్పబడ్డాయి.

మతపరమైన ఆచారాల్లో తాయత్తులు (మణులు) ధరించటం కూడా ఒక భాగమే. ఇలాంటి ఆచారం శాంఖాయనారణ్యకంలో వివరింపబడింది. అంతులేని సంపదను, ఆరోగ్యాన్ని శత్రువులపై విజయాన్ని కోరే వ్యక్తి "బిల్వమణి" ని (మారేడు తాయత్తు) ధరించాలి. దీనిని ధరించగోరే వ్యక్తి మూడురాత్రులు కేవలం పూలు మాత్రం ఆహారంగా తీసుకుంటూ ఏనుగనీడలో గాని, పెద్దపులి చర్మంమీద గాని అగ్నిని ప్రతిష్ఠించి కొన్ని హోమాలు చెయ్యాలి. బిల్వమణిని మొదట తేనెలో తరువాత నేతిలో ఆటు తరువాత అన్నంలో ఏడు లేదా మూడేసి రాత్రులపాటు నానబెట్టి ఉంచాలి. ధరించటానికి ముందు ప్రార్థనాపూర్వకమైన మంత్రాలను ఇలా చదవాలి. సంగ్రహంగా వాటి సారాంశమిది.

"నేను మదగజం కాంతిని, శక్తిని పొంది దేవతల
వలె ప్రకాశింతును గాక! అగ్ని, ప్రజాపతి, తమ
కాంతులను నాలో ప్రవేశపెట్టుదురు గాక!
అశ్వినీదేవతలు మధురమైన కంఠస్వరాన్ని
నాకు ఇత్తురు గాక! ఈ మణి నా శత్రువులనందరినీ
నశింపజేయుగాక! వృత్రాసురునిపై ఇంద్రునివలె
నేను నాశత్రువులపై విజయాన్ని సాధింతును గాక!
ఓ మరుద్దేవతలారా! మీ బలంతోను, ఓ రుద్రా!
నీ ఆయుధాలతోను, నా శత్రువులను నశింప జేయండి.
ఓ అగ్నిప్రజాపతులారా! ధైర్యస్థైర్యాలతోబాటు
అపారమైన సంపదను అనుగ్రహించండి."

ఈ బిల్వమణి ప్రశంస ఇలా ఉంది - "ఈ బిల్వమణిని ధరించిన వానికి అపజయమన్నది లేదు. నిత్యం సుఖంగా ఉంటాడు. అతని సంతతికి ఎలాంటి ఆపదలు రావు. దొంగలవల్ల, ఇతరులవల్లగాని అతనికి ఎలాంటి ఇబ్బందులు రావు. రాక్షస పిశాచాదులు అతనికి ఎట్టి హానినీ కలిగించలేవు. ఇలాగే ఆముదపుచెట్టు, చంద్రచెట్లయొక్క తాయత్తులను గురించి కూడా శాంఖాయనారణ్యకంలో చెప్పబడింది.

మతసంబంధమైన ఆచారాలను వివరించటంలో మిగిలిన ఆరణ్యకాల కంటే కృష్ణయజుర్వేదానికి చెందిన తైత్తిరీయారణ్యకం ప్రముఖస్థానంలో ఉంది. దీనికి కారణం తైత్తిరీయశాఖ మంత్ర - బ్రాహ్మణ సంకీర్ణంగా ఉండటమే. స్వర్గాది ఫలాలను ఉద్దేశించి మహాగ్నిచయనమనే క్రతువు చేయబడుతుంది. ఈ మహాగ్నిచయనాన్ని అనుసరించే ఇంకా అనేక చయనక్రతువులు తైత్తిరీయారణ్యకంలో చెప్పబడ్డాయి. అవి - సావిత్రి చయనం, నాచికేతచయనం, చాతుర్హోత్రచయనం, వైశ్వసృజచయనం, ఆరుణకేతుకచయనం అనేవి. ఆరుణకేతుకచయనాన్ని ప్రతిపాదించటం

వల్లనే ఈ ఆరణ్యకంలోని మొదటి ప్రపాఠకానికి అరుణం అనేపేరు వచ్చింది.

ప్రకృతిని దేవతగా భావించి ఆరాధించటం వైదికమతంలోని లక్ష ణాలలో ఒకటి. అది ఈ ఆరణ్యకంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అగ్ని, వర్షాలకు అధిపతియైన వరుణుడు, చంద్రుడు మొ|| ప్రకృతి దేవతల ప్రార్థన అరుణంలో ఉన్నది. విశేషించి సూర్యుని ఉపా సన హెచ్చుగా కనబడుతుంది. ఆరోగ్యానికి అధిదేవతగా సూర్యుణ్ణి ప్రస్తుతించటం జరిగింది. ఆరోగ-భ్రాజ-పటర- పతంగ-స్వర్ణర-జ్యోతిషీ మత్-విభాస నామాలతో ఏడుగురు సూర్యులు ఉన్నట్లు చెప్పబడింది. వీరుకాక కశ్యపుడనే పేరుగల ఎనిమిదవ సూర్యుడున్నాడు. ఇతడెపుడూ మేరుపర్వతాన్ని విడిచి ఉండడు. గర్గమహర్షి వంశంలో జన్మించిన ప్రాణ త్రాతుడనే తపస్సంపన్నుడైన ఋషి సూర్యమండలం వృత్తాకారంగా తిరగడం చూచినట్లు అరుణంలో పేర్కొనబడింది. నక్షత్రాల వర్ణన ఆయా నక్షత్రాధిష్ఠాన దేవతల ప్రశంస కూడా ఈ ఆరణ్యకంలో ఉంది.

త్రైవర్ణికులకు ఉపనయనంతో పాటు యజ్ఞోపవీతధారణం విధించ బడింది. ఆ యజ్ఞోపవీతం ఎలా ఉండాలో, ఎలా ధరించాలో వివ రిస్తూ, ఈ తైత్తిరీయారణ్యకం యజ్ఞోపవీతప్రభావం వల్లనే దేవతలు రాక్షసులను త్రోసి రాజని, స్వర్గాన్ని పొందగలిగినట్లు తెలియజేస్తున్నది. ఇదే సందర్భంలో సంధ్యావందనప్రశంస కూడా ఉంది. త్రైవర్ణికులు ఉపనయనం అయినప్పటినుంచి మరణించే వరకు మూడువేళల అను ష్ఠించ వలసిన నిత్యకర్మ సంధ్యావందనం. ఈ సంధ్యావందనంలోని ముఖ్యమైన అంగం సూర్యుణ్ణి ఉద్దేశించి అర్ఘ్యాన్ని ఇవ్వటం. ఈ అర్ఘ్య ప్రదానాన్ని ప్రశంసిస్తూ ఒక చిన్న వృత్తాంతాన్ని ఈ ఆరణ్యకం ఇలా చెబుతున్నది – ఒకప్పుడు మహాబలవంతులైన రాక్షసులు ఒక సమూ హంగా సంచరిస్తూండేవారు. వారికి 'మందేహుడు' అనే రాక్షసుడు నాయకుడు. వీరంతా కలిసి ప్రజాపతిని గురించి ఘోరమైన తపస్సు

చేసి, మెప్పించి, సూర్యుడితో యుద్ధం చేయగలిగేటట్లు వరాన్ని పొందారు. ఆ కారణంగానే వాళ్లు ఉదయ-మధ్యాహ్న సాయంకాలాల్లో సూర్యునితో యుద్ధం చేసి పీడిస్తూ ఉంటారు. సంధ్యావందన సమయంలో విడువబడే అర్ఘ్యం మంత్రబలం వల్ల వజ్రరూపాన్ని దాల్చి మందేహాది రాక్షసులను పారద్రోలి, సూర్యుని మార్గాన్ని సుగమం చేస్తుంది.

వైదికమతంలోని మరొక ప్రధాన భాగం ప్రాయశ్చిత్తకాండ. తెలిసీ తెలియక చేసిన అనేక అపరాధాలకు పరిహారాలు కూశ్మాండ హోమ మంత్రాలలో చెప్పబడ్డాయి. దేవతలను అవమానించటం, తీసికొన్న అప్పును ఎగవేయటం, గర్భపాతం, మొ|| చెడు పనులవల్ల కలిగిన పాపాలనుంచి ఈ కూశ్మాండ హోమం చేయటం వలన విముక్తి లభిస్తుంది. అంతేగాక వ్యాధిరూపంలో పీడిస్తున్న పాపాలు కూడా తొలగిపోతాయి. పంచమహాయజ్ఞాలుగా చెప్పబడే దేవ- పితృ-భూత-మనుష్య-బ్రహ్మ యజ్ఞాలు ఈ ఆరణ్యకంలో ప్రతిపాదింపబడినాయి.

"ప్రవర్గ్య" మనే మరో వైదికకర్మ రెండు ప్రపాఠకాలలో విస్తృతంగా వర్ణింప బడింది. ఈ ప్రవర్గ్యకర్మ సోమయాగానికి అంగంగా జరుపబడుతూ ఉంటుంది. దీనిని స్వతంత్రంగా కూడా ఆచరించవచ్చు. ఇది శరీరంలో శిరస్సువలె యజ్ఞాలలో అతి ముఖ్యమైనది. "ప్రవర్గ్య" మనేది ఈ కర్మకే గాక ఇందులో ఉపయోగపడే కుండకు గూడ పేరు. దీనికి "మహావీర" మనే పేరు కూడా ఉన్నది. ఒకప్పుడు యజ్ఞరూపుడైన విష్ణువు దేవతలతో యుద్ధానికి పూనుకొన్నాడు. అతడు దేవతలపైపు అవహేళనపూర్వకంగా నవ్వుతూ ధనుస్సును గడ్డంక్రింద ఉంచుకొని నిలబడి ఉండగా ఇంద్రుని చేత ప్రేరేపించబడిన చదలు పురుగులు అడుగుభాగాన ఉన్న విష్ణుధనుస్సు యొక్క అల్లెత్రాటిని కొరికివేశాయి. అప్పుడు వేగంగా పైకి లేచిన ధనుస్సు (కఱ్ఱ) అతని శిరస్సును శరీరం నుంచి వేరుచేసింది. విష్ణువు యజ్ఞరూపుడవటం

చేత యజ్ఞమే విచ్ఛిన్నమైనట్లు అయింది. తరువాత అశ్వినీదేవతలు ఆ శిరస్సును మొండేనికి అతికించి విష్ణువును పునర్జీవితుని గావించారు. దీనికి గుర్తుగానే ప్రవర్గ్యంలో శిరస్సులాంటి ఆకారం గల మట్టిపాత్రలో పాలుకాచి అందులో కొద్దిగా కలిపి, ఘర్మరి అని పిలువబడే ఈ ద్రవాన్ని దేవతలకు ఆహుతిగా ఇవ్వటం జరుగుతుంది.

ఈ యాగానుష్ఠానంవల్ల కలిగే దీప్తి, స్వర్గప్రాప్తి మొ|| కాక ప్రవర్గ్యం పూర్తి అయిన తరువాత మహావీరపాత్ర మొ|| వాటిని విసర్జించే చోటును బట్టి రకరకాల ఫలితాలు కలుగుతాయి. ఉద్వాసన ఉత్తరవేదితో జరిగితే యజమానునికి అన్నలోపం ఉండదు. నీటిలో విసర్జిస్తే తేజస్వి అవుతాడు. తాను ద్వేషించే వ్యక్తి ఉన్నదిశగా విసర్జిస్తే ఆ శత్రువు నశిస్తాడు. మేడికొమ్మపైన ఉద్వాసన జరిగితే శారీరక పుష్టి కలవాడౌతాడు. దర్భదుబ్బులపైన ఉద్వాసన చేస్తే సకాలంలో తగిన వర్షాలు పడతాయి.

ఏ మతంలోనైనా మరణించిన వారి కోసం జరిపే క్రియాకలాపం ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుంది. పితృమేధం అనే పేరుగల ప్రపాఠకంలో ఇలాంటి పైతృకకర్మలను గురించి వివరంగా చెప్పబడింది. పైతృకకర్మలో ప్రధానాంశం శవదహనం. శరీరాన్ని విడిచిన తరువాత ఆ ప్రాణిని 'ప్రేత' అని సంబోధించటం జరుగుతుంది. ప్రేతాన్ని ఉద్దేశించి అనేక హోమాలు, ప్రార్థనలు జరుగుతాయి. జీవించి ఉన్న పుత్రపౌత్రాదులు, బంధువులు మొ|| వారికి కష్టాలు, నష్టాలు, రోగాలు, అకాలమరణం సంభవించకుండా చూడమని ప్రార్థించటం జరుగుతుంది. ప్రేతాన్ని ఉద్దేశించి పఠించే మంత్రాలలో అతని గమ్యస్థానమైన యమసదనాన్ని గురించి, దానికి సంబంధించిన మార్గాన్ని గురించి, అందులో ఎదురయ్యే ఇబ్బందులను గురించి వివరింపబడింది. "నళము" అనే గడ్డిని విసరివేస్తూ "ఓ ప్రేతమా! నీవు దీనిని నావగా ఉపయోగించుకో" అని, రెల్లుగడ్డిని విసరివేస్తూ "దీనితో రాక్షసుల నుంచి నిన్ను

నీవు కాపాడుకో” అని దర్భలను విసరివేస్తూ “దీనిని ఓషధిగా వాడుకో” అని చెప్పటం జరుగుతుంది. పితృదేవతలకు యముడు రాజు. అతణ్ణే ఉద్దేశించి కూడా అనేక ప్రార్థనలు, ఆహుతులు ఉన్నాయి. చివరిగా శవదహనం జరిగిన చోటును శుభ్రపరచి అక్కడ నుంచి తాను దూరంగా వెళ్లిపోతూ గడ్డి మొ|| అంకురాల యొక్క ఉత్పత్తికి దోహదం చెయ్యమని అగ్నిని ప్రార్థించటం జరుగుతుంది.

## 2. తత్త్వం:

ఆత్మతత్త్వజ్ఞానం ద్వారా వైరాగ్యం, దానిద్వారా మోక్షం కలిగించటమే జ్ఞానకాండ యొక్క లక్ష్యం. ముందు చెప్పుకున్నట్లుగా కర్మకాండలోని విశేషాలతో పాటు జ్ఞానకాండ యొక్క (తత్త్వానికి సంబంధించిన) పరిచయం కూడా ఆరణ్యకం వల్ల కలుగుతుంది. ఆరణ్యకంలో తత్త్వానికి సంబంధించిన విషయాలు అనేకం ఉన్నాయి.

ఐతరేయారణ్యకంలో శరీరపురుషుడు, ఛన్దఃపురుషుడు, వేద పురుషుడు, మహాపురుషుడు అనే నలుగురు పురుషుల వర్ణన ఉంది. దైహికమైన ఆత్మను శరీరపురుషునిగాను, అక్షరాత్మకమైన గాయత్రి, త్రిష్టుప్, అనుష్టుప్, పంక్తి, బృహతి మొ|| ఛన్దస్సమూహాన్ని ఛన్దః పురుషునిగాను, ఋగ్యజుస్సామాథర్వాలను వేదపురుషునిగాను, రోజులు, వారాలు, పక్షాలు, నెలలు అయనాలతో గూడిన సంవత్సరాన్ని మహాపురుషునిగాను ఉపాసన చేయాలి. ఒక్కొక్క మెట్టూ పైకి వస్తే మహాపురుషోపాసనే పరబ్రహ్మతత్త్వోపాసనకు నాంది అనవచ్చు. ప్రజ్ఞామయుడైన ఆదిత్యుడు మహాపురుషాధిష్ఠాన దేవత. ఇతడే పరబ్రహ్మకు ప్రతీక. తత్త్వాన్ని గురించి చెపుతూ ఏ పురుషుడైతే సర్వప్రాణులయందు వినబడకుండా, చూడబడకుండా, తెలియబడకుండా ఉంటూ సర్వాన్నీ వింటూ, చూస్తూ, తెలుసుకుంటూ ఉంటున్నాడో అతడే ఆత్మ - అని ఉపదేశింపబడింది.

విద్యారణ్యస్వామి తమ భాష్యంలో అందుకనే "ఆత్మ విషయం కాదు, విషయి" అని చెప్పటం జరిగింది. సృష్టిని గురించి వివరించే సందర్భంలో విరాట్పురుషుని వాక్కునుంచి పృథివి, అగ్ని; ముక్కు నుంచి అంతరిక్షం, వాయువు; చెవులనుంచి దిక్కులు, చంద్రుడు; మనస్సునుంచి వరుణుడు, నీరు - వీటి యొక్క ఉత్పత్తి జరిగిందని చెప్పబడింది. మరొక సందర్భంలో పురుషుని దేహంలో పృథివి శరీరం గాను, అగ్ని వంటిలోని వేడిగను, ఆకాశం ముఖనాసికాది రంధ్రాలుగాను, జలం రేతో రూపంతోను, వాయువు ప్రాణరూపంతోనూ ఉన్నట్లు తెలుపబడింది. మహాభూతతత్త్వాల సమావేశమే పురుషుడని అర్థం. తత్త్వజ్ఞానాన్ని ఉపదేశించటానికి చక్కని ఉదాహరణలు కూడా చెప్ప బడ్డాయి ఈ ఆరణ్యకంలో. ఒకే వీణనుంచి ఎలా భిన్న భిన్న నాదాలు పుడుతున్నాయో, అలాగే పరబ్రహ్మతత్త్వం నుంచి ఈ చిత్రవిచిత్రాలైన బ్రహ్మాండాలు ఆవిర్భవిస్తున్నాయి.

శాంఖాయనారణ్యకంలో తత్త్వపరమైన విషయాలు ఐతరేయార ణ్యకంలో లాగా విస్తృతంగా కనుపించవు. అయినా అక్కడక్కడ తత్త్వజ్ఞానానికి సంబంధించిన విషయాలున్నాయి. మహావ్రతాన్ని వివ రంగా ప్రతిపాదించి, యజ్ఞాల పర్యవసానం జ్ఞానవైరాగ్యాదుల ద్వారా మోక్షం పొందటంలోనే ఉందని సూచిస్తున్నది ఈ ఆరణ్యకం. గొలు సుకట్టుగా సాగే జనన మరణాలకు ముగింపు దీనితోనే లభిస్తుంది. యజ్ఞయాగాలను మోక్షదృష్టితో ఆచరించవచ్చు. అర్థాన్ని తెలుసు కుంటూ చేసిన వేదాధ్యయనమే మోక్షానికి దారితీస్తుంది. పాపాలు ఆట్టే వ్యక్తిని అడ్డుకొనలేవు. ఇలాంటి కొన్ని తాత్త్వికాంశాలను ఈ ఆరణ్యకం బోధిస్తున్నది.

తత్త్వోపదేశ విషయంలో కూడా తైత్తిరీయారణ్యకం అగ్రస్థానాన్ని వహిస్తున్నది. వేదాలు అనంతమైనవి. అవి బోధించే అర్థం అతి గంభీరం. వేదవాక్కులన్నీ పరబ్రహ్మ స్వరూపమైన ఓంకారంలోనే పర్య

వసానాన్ని పొందుతున్నాయి. వేదవిహితకర్మలను ఆచరించి స్వర్గాన్ని, దేవత్వాన్ని పొందవచ్చు. అట్టి సమస్త దేవతలకు గూడ అదే (ఓంకారమే) ఆధారం. ఈ రహస్యం ఎరుగనివాడు ఎన్ని వేదాలు వల్లించినా వ్యర్థమే.

"భూః భువః సువః" అనే మూడు పదాలను "వ్యాహృతిత్రయం" అంటారు. ఇది సకల వేదాల సారం. ఈ వ్యాహృతిత్రయాన్ని ఓంకార పూర్వకంగా జపిస్తే మోక్షమార్గానికి చేరువకావచ్చు. భూరాది సమస్త లోకాలు, బ్రహ్మకోశంలోని అంతర్భాగాలే. దీనినే బ్రహ్మలోకం అనికూడా అనవచ్చు. ఇది అమృతం. అంటే విరాడ్రూపుడైన ఆత్మయొక్క స్థానం అన్నమాట. ఇక్కడ మృత్యువనేది ఉండదు. అలాంటి లోకానికి చేర్చమని పరమాత్మను గురించిన ప్రార్థన ఈ ఆరణ్యకంలో ఉంది. మృత్యుదేవత గాలివలె ఎల్లప్పుడూ సంచరిస్తూనే ఉంటాడు. ఇతనికి అల సట అనేది లేదు. ఒక ప్రాణిని పుట్టిన మరుక్షణమే మృత్యువు కబళిస్తుంది. మరొక ప్రాణిని వృద్ధాప్యంతోను, వ్యాధులతోనూ విసిగి వేసారిపోయి ఉన్నా అనుగ్రహించదు. మొత్తం మీద అతివిచిత్రంగా సంచరించే ఈ మృత్యువునుంచి తప్పించుకునే ప్రాణి ఏదీ లేదు. అయితే పైన చెప్పినట్లుగా తత్త్వజ్ఞానం వల్ల మృత్యువును కూడా జయించవచ్చు.

చరాచరాత్మకమైన సృష్టిని గురించి మోక్షోపాయాన్ని గురించి చెప్పే పురుషసూక్తం ఈ ఆరణ్యకానికి మణిపూసవంటిది. పురుషుని గురించిన వర్ణన ఉండటం చేత దీనికీ పేరు వచ్చింది. ఈ పురుషుడు వేయి తలలు, వేయి కన్నులు, వేయి కాళ్లు కలిగినవాడు. అంటే సృష్టిలోని ప్రాణులన్నింటి యొక్క తలలు, మిగిలిన అవయవాలు అతనివేనన్నమాట. సకల ప్రాణిరూపుడని అర్థం. ఇతని పేరే 'విరాట్పురుషుడు'. ఇతడు బ్రహ్మాండంలోపల, బయట కూడా వ్యాపించి ఉంటాడు. ఇతనికి భూత, భవిష్యత్తులన్నీ తెలుసు. ఇతని రూపమెన్నటికీ

సరించదు. అతని నుంచే ఋగ్యజుస్సామాథర్వరూపాలైన వేదాలు, గవాశ్వాది పశుసంతతి, బ్రాహ్మణాది నరసంతతి, సూర్యచంద్రులు, ఇంద్రాదిదేవతలు, పంచ మహాభూతాలు ఉద్భవించాయి. ఇలాంటి విరాట్పురుషుని తత్త్వాన్ని తెలుసుకున్నవారికే 'అమృతత్వం' అంటే మోక్షం సిద్ధిస్తుంది. యోగాదులద్వారా ఇంద్రియాలను జయించిన మహర్షులు, సృష్టికర్తలు, ఇతనియొక్క వాస్తవరూపాన్ని తెలుసుకోవటానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటారు. సృష్ట్యాదిలో దేవతలందరు ఈ పరబ్రహ్మతత్త్వమే తమలో వ్యాపించి ఉన్నట్లు గమనించి స్తుతించారు.

యజ్ఞయాగాదులన్నీ తత్త్వమార్గంలోకి మనస్సును మళ్లించటానికి ఉపయోగపడతాయి. అయితే తత్త్వజ్ఞానాన్ని సంపాదించటానికి చేసే ప్రయత్నం కూడా ఒక యజ్ఞం లాంటిదే. దాన్ని తైత్తిరీయారణ్యకం ఇలా వివరిస్తున్నది -- చిత్తి అనగా నిర్వికల్పకమైన మనస్సు, హోమసాధనమైన స్రుక్కు. చిత్తం - అంటే సవికల్పకమైన అన్తఃకరణం హోమ ద్రవ్యమైనట్టి ఆజ్యం. వాక్కు యజ్ఞవేదిక. మంత్రోచ్చారణ దానిపైన పరచిన బర్హిస్సు (దర్భలు) కేత విజ్ఞాతములు - అనగా సవికల్పక నిర్వికల్పక జ్ఞానవిషయాలు. అగ్ని వాక్పతి. వాక్కుకు కారణ భూతుడైన వాయువు - హోత. మనస్సు ఉపవక్త (ఋత్విక్కు). ప్రాణమే హవిస్సు. సామ అధ్వర్యుడు. తత్త్వజ్ఞాని యొక్క శరీరంలో ఇలా మానసికంగా ఈ యజ్ఞం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది.

ఈ విధంగా ఆరణ్యకాలు మొదట కర్మకాండ ద్వారా జ్ఞానమార్గానికి కావలసిన పునాదివేసి, తరువాత తత్త్వోపదేశం ద్వారా మోక్షానికి దారి చూపుతున్నాయి. చదువరి, ముందు సంహిత బ్రాహ్మణాలలోని యజ్ఞయాగాది కర్మకాండవిషయాలను (మతాన్ని) అవగాహన చేసుకొని, తరువాత ఉపనిషత్తులలో చెప్పబోయే జ్ఞానకాండను (తత్త్వాన్ని) తెలుసుకోవడానికి ఆరణ్యకాలను చదవటం ద్వారా సంసిద్ధుడౌతాడు. కర్మ-

జ్ఞానకాండలకు (మత-తత్త్వాలకు) సమన్వయాన్ని చూపటమే ఆరణ్యకాల యొక్క ముఖ్య ప్రతిపాద్యాంశం. నిష్కర్షగా చెప్పాలంటే భోగిని యోగిగా మార్చే వేదికలే ఆరణ్యకాలు.

— ఎస్.ఎస్.ఎస్.

# 1.12 కవితా సౌన్దర్యం

వైదిక వాఙ్మయంలో ఆరణ్యక సాహిత్యం సంహితా బ్రాహ్మణాల తరువాత ఏర్పడినట్లు విమర్శకులు భావిస్తున్నారు. నిజానికి ఆరణ్యకాలు బ్రాహ్మణ గ్రంథాలలో చివరి భాగాలుగా గాని లేక ఏకదేశంగా గాని దొరుకుతున్నాయి. తరువాత ఏర్పడిన ఉపనిషద్వాఙ్మయానికి ఆరణ్యకాలలోనే అంకురార్పణ జరిగింది. ఒకరకంగా చూస్తే కర్మకాండను బోధించే బ్రాహ్మణ భాగానికి జ్ఞానకాండను బోధించే ఉపనిషద్భాగానికి ఆరణ్యకాలు ఒక సంగమస్థానంగా కనపడతాయి.

ఒక రకంగా కర్మలను తత్త్వజ్ఞానాన్ని ఉపదేశించే ఆరణ్యకాలలో భాషలో కాని, భావనలలో కాని మాధుర్య చమత్కారాలకు అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. రమణీయంగాను, కమనీయంగాను చెప్పవలసిన అవసరం కూడా ఇక్కడ అంతగా కనపడదు. అయినప్పటికీ క్రాంత దర్శులైన మహర్షుల వచనాలలో అక్కడక్కడా కమనీయత చోటు చేసుకొనే ఉంటుంది. కర్మలనే గభీర గవాక్షాలలో నుంచి జ్ఞానమనే సన్నని పరదాలలో నుంచి అప్పుడప్పుడు కవితాసుందరి తొంగి చూస్తూనే ఉంటుంది. ఆరణ్యక వాఙ్మయంలో దృశ్యాదృశ్యంగా కనబడుతున్న కవితా సుందరి అందచందాలను ఇక్కడ సంగ్రహంగా పరిశీలిద్దాం--

**1. పలుకుబళ్లు:**

ఆరణ్యకాలలో కనబడే కొన్ని పలుకుబళ్లు తేటగా సూటిగా ఎంతో అందంగా ఉంటాయి చూడండి –

> **మనసి వై సర్వే కామాః శ్రితాః మనసా హి సర్వాన్ కామాన్ ధ్యాయతి,**
> **వాగ్వై సర్వాన్ కామాన్ దుహే వాచా హి సర్వాన్కామాన్ వదతి.**
>
> **(ఐ.ఆ. 1.3.2.)**

కోరికలన్నీ మనస్సును ఆశ్రయించి ఉంటాయి. నాకిది కావాలని ప్రతివాడు మనస్సుతోనే కోరుకుంటాడు. వాక్కు కోరికలను సాధిస్తుంది. వాక్కుతోనే "నాకిది ఇవ్వమ"ని ప్రతివాడు కోరుతున్నాడు. ఎంత చక్కని నిరూపణమో చూడండి. సూటిగా అర్థమయ్యేటట్లున్న ఈ వాక్యాలు చక్కని వచన రచనకు నిదర్శనాలు.

అలాగే ఐతరేయారణ్యకంలో స్త్రీ పురుషులను అనుష్టుప్ త్రిష్టుప్ ఛందోరూపులుగాను, భార్యతో కూడిన పురుషుని పరిపూర్ణునిగాను నిరూపించడంలోని పలుకుల పొందిక ఎంత సరళంగా ఉందో గమనించండి --

**వృషావై త్రిష్టుప్ యోషాఽనుష్టుప్**
**తన్మిథునం తస్మాదపి పురుషో**
**జాయాం విత్త్వా కృత్స్నతరమివాత్మానంమన్యతే.**

**(ఐ.అ. 1.3.5)**

## 2. భావనలు:

ఆరణ్యకాలలోని భావనలు ఎంతో ఆశ్చర్యకరమైనవిగా కనపడతాయి. ప్రపంచమంతా నశించే స్వభావంకలదని ఆ నాటి మహర్షులు చేసిన ఈ తాత్త్విక భావన ఎంత అందంగా ఉన్నదో చూడండి --

సర్వం చేదం క్షయిష్ణు పశ్యామో యథేమే దంశ మశకాదయః
తృణవన్నశ్యత యోద్భూత ప్రధ్వంసినః

(మై.ఉ. 1.4)

లోకంలో కనపడే వస్తువులన్నీ శాశ్వతమైనవికావు. దోమలు మొదలగు సూక్ష్మజీవులు కొన్ని పుట్టిన వెంటనే నశించి పోతాయి. అలాగే భౌతిక వస్తువులన్నీ నశించిపోయేవేననే వస్తుతత్త్వ పరిశీలన ఇందులో మనకు కనపడుతున్నది.

ప్రాచీనులు ప్రపంచాన్ని చాలా నిశితంగా పరిశీలించారు. సంసార మంటే వేరే ఏదీ కాదు చిత్తమే అని మనస్తత్వాన్ని వారు ఎంత చక్కగా గమనించారో ఈ క్రింది మంత్రాల్లో చూడవచ్చు-

**చిత్తమేవ హి సంసారః తత్ప్రయత్నేన శోధయేత్|**
**యచ్చిత్తస్తన్మయో భవతి గుహ్యమే తత్సనాతనమ్||**
**చిత్తస్య హి ప్రసాదేన హన్తి కర్మ శుభాశుభమ్|**
**ప్రసన్నాత్మాఽత్మని స్థిత్వా సుఖమవ్యయ మశ్నుతే||**

(మై.ఉ. 4.4)

ఎలాంటి మనస్సు కలవాడికి అలాంటి జీవితం ఏర్పడుతుంది. ఇది చాలా రహస్యమైన విషయం. కనుక మానవ జీవితానికి, అందులో సంభవించే సుఖ దుఃఖరూపమైన అనేక పరిణామాలకు మనస్సే మూలభూతమైందని, అందువల్ల సంసారమంటే మనస్సని వారు చేసిన భావన సహేతుకంగా కన్పడుతుంది.

అయితే ఆ చిత్తాన్ని ఎలా వశపరుచుకోవాలి? దానికి అనేక మార్గా లున్నాయి. ఎలాగైనా మనస్సును ప్రసన్నం చేసుకొని పుణ్య పాపరూప కర్మలను పోగొట్టుకొని శుద్ధాత్ములై శాశ్వత సుఖాన్ని పొందాలని చక్కని సాధన మార్గాన్ని ఉపదేశించే ఈ రచన ఉత్తమమోత్తమంగా కనబడు తుంది.

పత్ని పతిని ప్రేమిస్తుంది. తన కోసమే తను ప్రేమిస్తున్నానను కుంటుంది. భర్త భార్యను ప్రేమిస్తాడు. తన కోసమే ప్రేమిస్తున్నా ననుకుంటాడు. కాని ఇది నిజంకాదు. ఎవరు ఎవరిని ప్రేమించినా అది వారు పరమాత్మను ప్రేమించడం వల్లనే సంభవిస్తున్నదనే సత్యాన్ని బృహదారణ్యకం ఎంత చక్కగా భావన చేస్తున్నదో ఇక్కడ గమనించండి--

**న వారే! పత్యుః కామాయ పతిః ప్రియో భవతి**
**ఆత్మనస్తు కామాయ పతిః ప్రియోభవతి**

న వారే! జాయాయై కామాయ జాయా ప్రియా భవతి
ఆత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి

(బృ.ఆ. 4.5)

## 3. వర్ణనలు:

ఒక వస్తువు యొక్క స్వరూపాన్ని స్వభావాన్ని ఉచితమైన పదజాలంతో అనేక కోణాలలో నుంచి అవలోకించడాన్నే వర్ణనం అంటారు. తరువాత కాలంలో అలంకార శాస్త్రంలో అభివృద్ధి చెందిన అనేక విధాలైన వర్ణనలకు మూల సూత్రాలు వైదిక వాఙ్మయంలో ఎన్నో చోట్ల నిబద్ధమై ఉన్నాయి. ఆరణ్యక వాఙ్మయంలో కూడా కొన్ని ఉత్తమమైన వర్ణన పద్ధతులు మనకు కనపడతాయి.

ఒక వృత్తాంతాన్ని ఒకేవాక్యంలో చిన్న చిన్న మాటలతో వర్ణించడం ఆరణ్యకాలలో కనపడుతుంది. మైత్రాయణీయారణ్యకంలో కథాకథన పద్ధతిలో చెప్పబడిన ఈ వాక్యాలను గమనించండి--

బృహద్రథో హ వై నామ రాజా రాజ్యే జ్యేష్ఠం పుత్రం నిధాపయిత్వేద
మశాశ్వతం మన్యమానః శారీరం వైరాగ్యముపేతోఽరణ్యం నిర్జగామ.
స తత్ర పరమం తప ఆస్థాయాదిత్యమీక్షమాణ ఊర్ధ్వబాహు
స్తిష్ఠత్యన్తే సహస్రస్య మునేరన్తికమాజగామ.

(మై.ఉ. 1.1)

మానవుడు బద్ధుడు కావాలన్నా ముక్తుడు కావాలన్నా మనస్సే దానికి కారణమవుతుంది. అది భౌతిక విషయాలపై ఆసక్తమైతే ఇతనికి సంసార బంధ మేర్పడుతుంది. విషయరహితమైతే ఇతడు ముక్తిని పొందుతాడు. లోక ప్రసిద్ధమైన ఈ అంశం మైత్రాయణీ యారణ్యకంలో లభిస్తున్నది. ఇందులోని మనస్తత్వ విశ్లేషణ అద్భుతంగా కనబడుతుంది. చూడండి –

మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః
బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్.

(మై.ఉ. 4.11)

నశ్వరమైన ప్రపంచంలో జన్మనెత్తిన ప్రతిజీవికి మృత్యువు తప్పని సరి. ఆ మృత్యువు ఆగమనమెలా ఉంటుందో మైత్రాయణీయారణ్యకం ఎంతో చమత్కారంగా సాలంకారంగా ఈ క్రింది విధంగా అభివర్ణించింది –

అస్య మృత్యోరాగమనం సదసత్వంమమ్నైర్తి పాశైః
పశురివ బద్ధం, బంధనస్థస్యైవాస్వాతంత్ర్యం, యమవిషయ
స్థస్యైవ బహుభయావస్థం, మదిరోన్మత్త ఇవామోదమదిరోన్మత్తం,
పాప్మనా గృహీత ఇవ భ్రామ్యమాణం, మహోరగదష్ట ఇవ విపద్దష్టం,
మహాన్ధకార ఇవ రాగాంధం, ఇంద్రజాలమివ మాయామయం,
స్వప్న ఇవ మిథ్యాదర్శనం, కదలీగర్భ ఇవాసారం, నట ఇవ
క్షణవేషం, చిత్రభిత్తిరివ మిథ్యామనోరమమ్.

(మై.ఉ. 4.2)

బృహదారణ్యకం మానవుడి నిద్రావస్థను ఎంతో చక్కగా అభివర్ణించింది. చూడండి–

అథ యథా సుషుప్తో భవతి, యథా న కస్యచన వేద.
హితా నామ నాడ్యః ద్వాసప్తతిసహస్రాణి హృదయాత్
పురీతతం అభిప్రతిష్ఠంతే తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే.
స యథా కుమారో వా మహారాజో వా మహాబ్రాహ్మణో వా
అతిఘ్నీం ఆనందస్య గత్వా శయీత, ఏవ మేష ఏతచ్ఛేతే.

(బృ.ఆ. 2.19)

మానవుడు నిద్రించినప్పుడు హితలనే డెబ్బై రెండు వేలనాడులు హృదయం నుంచి పురీతత్ అనే నాడిలో ప్రవేశిస్తాయి. వాటిననుస రించి జీవుడు పురీతత్‌లో శయనిస్తున్నాడు. చిన్న పిల్లవాడు గాని,

మహారాజుగాని, మహాబ్రాహ్మణుడుగాని విపరీతమైన ఆనందాన్ని పొంది అలసి సొలసి నిద్ర పోయినట్లు జీవుడు పురీతత్‌లో శయనిస్తున్నాడని నిద్రాస్వరూపాన్ని ఈ ఆరణ్యకం ఎంతో చక్కగా వర్ణిస్తున్నది.

జీవుడు కలలు కన్నప్పుడు ఎన్నో విచిత్ర పదార్థాలను చూస్తాడు, ఆశ్చర్యపడతాడు, ఆనందపడతాడు. అతని స్వాప్నిక జగత్తు తాత్కాలికమైనా అనుభూతి మాత్రం లేదనడానికి లేదు. ఈ అంశం బృహదారణ్యకంలో ఇలా రమణీయంగా నిరూపించబడింది.

**న తత్ర రథా న రథయోగా న పంథానో భవంతి.**
**అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే. న తత్ర ఆనందాః.**
**ముదః ప్రముదః భవంతి. అథానందాన్ ముదః ప్రముదః**
**సృజతే. న తత్ర వేశాంతాః పుష్కరిణ్యః స్రవంత్యః భవంతి.**
**అథ వేశాంతాన్ పుష్కరిణీః స్రవంతీః సృజతే. స హి కర్తా.**

(బృ.ఆ. 4.2.10)

స్వప్న ప్రపంచంలో రథాలు, రథాలలో తిరగడానికి మార్గాలు ఉండవు. అక్కడ ఆనందాలేవీ ఉండవు. అంతః పురాలు, పద్మసరోవరాలు ఉండనే ఉండవు. కానీ భగవంతుడు జీవులకు స్వప్నానుభూతిని కలిగించడానికి వీటినన్నింటిని సృష్టిస్తున్నాడని స్వప్న ప్రపంచాన్ని ఆరణ్యకం ఎంత వాస్తవంగా వర్ణిస్తున్నదో గమనించండి.

**4. శబ్దాలంకారాలు:**

హారాది అలంకారాలు శరీరసౌందర్యాన్ని ఇనుమడింప జేసినట్లే, కావ్య సౌందర్యాన్ని లేక రచనా సౌందర్యాన్ని ఉపమాద్యలంకారాలు వృద్ధి పొందిస్తాయి. ఈనాడు కావ్యరచనలలో విస్తరించిన వివిధాలంకారాలకు బీజభూతమైన కొన్ని అంశాలు ఆరణ్యకాలలో కనపడుతున్నాయి.

ప్రధానంగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని అలంకారాలు రెండు విధాలు. అర్థజ్ఞానం లేకుండానే కేవలం శబ్దాలను వినడంతోనే చమత్కారాన్ని కల్గించేవి శబ్దాలంకారాలు. ఇవి అనుప్రాస, యమకం అని స్థూలంగా రెండు విధాలుగా ఉంటాయి. ఆరణ్యకాలలో కూడా శబ్దాలంకారాల ఛాయలు అక్కడక్కడా కన్పడుతున్నాయి. ఇక్కడ సంగ్రహంగా కొన్ని అలంకారాలను పరిశీలిద్దాం –

ఐతరేయారణ్యకంలోని ఈ క్రింది మంత్రంలో వృత్త్యను ప్రాసాదులు ఎలా ఉన్నాయో చూడండి –

> నైనం వాచా స్త్రియం బ్రువన్నైనమస్త్రీ పుమాన్ బ్రువన్,
> పుమాంసం న బ్రువన్నేవం వదన్వదతి కశ్చన.

(ఐ.ఆ. 2.3.8)

ఈ మంత్రంలో 'స్త్రీ' అనే అక్షరం మొదటి రెండు పాదాల్లోను, 'బ్రువన్' అనే రెండు అక్షరాలు ఒకటి, రెండు, మూడు పాదాల్లోను, 'పుం' శబ్దం రెండు మూడు పాదాల్లోను, 'వదన్వదతి' అని నాలుగో పాదంలోను ఆవృత్తమవుతున్నాయి. కనుక ఇందులో వృత్త్యనుప్రాస, ఛేకానుప్రాస అనే శబ్దాలంకారాలు ఉన్నట్లు చెప్పవచ్చు.

జైమినీయోపనిషద్బ్రాహ్మణంలో 'ధా' అనే అక్షరం అనేకసార్లు ఆవృత్తమవుతున్న ఈ క్రింది మంత్రాన్ని గమనించండి –

> తదిద మి మానతి విధ్య దశధా క్షరతి శతధా సహస్రధా
> అయుతధా ప్రయుతధా నియుతధా అర్బుదధా న్యర్బుదధా
> నిఖర్వధా పద్మ మక్షితిర్వ్యో మాన్తః

(జై.ఉ.బ్రా. 1.3.4)

ఈ మంత్రంలో 'ధా' అనే వర్ణం అనేకసార్లు ఆవృత్తి పొందటం వల్ల ఉచ్చారణలో ఎంతో ఊపు ఏర్పడుతోంది. ఇది వృత్త్యను ప్రాస

అవుతుంది. అలాగే "అయుతధా", "ప్రయుతధా", "నియుతధా" అనే పదాలలో "యుతధా" అనే వర్ణాలు ఆ వృత్తిని పొందడం వల్ల యమకాలంకారమౌతుంది.

కౌషీతకారణ్యకంలో ఈ క్రింది మంత్రంలో "మయ" అనే అక్షరాలు ఆవృత్తం కావడం వల్ల వృత్త్యను ప్రాసాలంకార మున్నట్లు భావించబడుతున్నది. చూడండి:

**స ఏషోఽక్షర సంమాన శ్చక్షుర్మయః శ్రోత్రమయశ్ఛన్దోమయో**
**మనోమయో వాఙ్మయ ఆత్మా**

**(కౌ.ఆ. 8.5)**

మైత్రాయణీయారణ్యకంలో ముక్తపదగ్రస్తమనే శబ్దాలంకారాన్ని ఈ శ్లోకంలో మనం గమనించవచ్చు --

**తపసా ప్రాప్యతే సత్త్వం సత్త్వాత్సంప్రాప్యతే మనః|**
**మనసా ప్రాప్యతే త్వాత్మా హ్యాత్మాపత్త్యా నివర్తతే||**

**(మై.ఉ. 4.3)**

ఇక్కడ మొదటి పాదం చివర వచ్చిన సత్త్వమనే పదం రెండవ పాదం మొదట్లో, రెండవ పాదం చివర వచ్చిన 'మనః' అనే పదం మూడవ పాదం మొదట్లోను, మూడవ పాదం చివర వచ్చిన 'ఆత్మ' అనే పదం నాల్గవపాదం మొదట్లోను రావడంవల్ల ఇది ముక్తపదగ్రస్తం అనే శబ్దాలంకారమౌతుంది.

**5. అర్థాలంకారాలు:**

పూర్తిగా అర్థం గోచరిస్తేనేగాని అర్థాలంకారం అవగతం కాదు. ఆరణ్యక వాఙ్మయంలో కూడా అనేక చోట్ల మనకెన్నో అర్థాలంకారాలు దర్శనమిస్తాయి.

**ఉపమ:**

మైత్రాయణీయారణ్యకంలోని ఈక్రింది సందర్భాలలో సర్వాలంకార మూలభూతయైన ఉపమ ఎంతో చక్కగా అభివర్ణింపబడింది.

1. అగ్నిరివాధూమకః (1.1)
2. అన్ధోదపానస్థో భేక ఇవాహమస్మిన్ సంసారే (1.7)
3. శకటమివాచేతనమిదం శరీరం (2.3).
4. బిందురివ పుష్కర ఇతి. (3.2)

ఇవ శబ్దం ఉపమా వాచకం. అది ఉపమానోపమేయాల మధ్య సాదృశ్యాన్ని తెలియజేస్తుంది. మొదటివాక్యంలో ధూమంలేని అగ్నిలాగా అని చెప్పటంచేత ఉపమాలంకారం. అలాగే రెండవ వాక్యంలో పాడు బడిన బావిలో కప్పలాగా నేనీ సంసారంలో ఉన్నాను అనటం చేతను, మూడో వాక్యంలో 'బండి లాగా ఈ శరీరం అచేతనం' అనడం వల్లను నాల్గోవాక్యంలో 'తామరపై నీటి బొట్టువలె' అనడం వల్లను ఉపమాలంకారం సిద్ధిస్తుంది.

**ఉత్ప్రేక్ష:**

మైత్రాయణీయారణ్యకంలో ఉత్ప్రేక్షలు అరుదుగా కనబడుతున్నాయి. అందులో ఒకదానిని చూడండి –

తేజసానిర్దహన్నివ (1.1)

ఇక్కడ తేజస్సుతో తగలబెడుతున్నట్లు వలె అనడంవల్ల క్రియోత్ప్రేక్షాలంకారమవుతోంది.

**సారాలంకారం:**

ఒకదాని కంటే ఇంకొకటి సారభూతమైందని చెప్తూ ఉత్తరోత్తరోత్కర్షగల సారాంశాన్ని చిట్టచివరలో ప్రతిపాదించటమే సారాలంకారం. ఐతరేయారణ్యకంలో ఈ మంత్రంలో సారాలంకారం కనబడుతున్నది--

ప్రజాపతే రేతో దేవాః దేవానాం రేతో వర్షః వర్షస్య రేత
ఓషధయః ఓషధీనాం రేతో అన్నమ్, అన్నస్య రేతో రేతః
రేతసో రేతః ప్రజా ప్రజానాం రేతో హృదయం.
హృదయస్య రేతో మనః, మనసో రేతో వాక్ వాచో రేతః
కర్మ. తదిదం కర్మకృతమ్. అయం పురుషః.

(ఐ.ఆ. 2.1.2)

## 6. ప్రశ్నోత్తరికలు:

పరస్పరం ఇద్దరి మధ్య సాగిన సంభాషణను చిత్రీకరించడాన్నే ప్రశ్నోత్తరిక అంటారు. అంటే ఒకరి ప్రశ్నకు ఇంకొకరు సమాధానం చెప్పడమని అర్థం. బృహదారణ్యకంలో ప్రశ్నోత్తరిక లెన్నో ఉన్నాయి. ఈ మంత్రంలో ప్రశ్నోత్తరిక ఛాయ మనకు కనపడుతోంది. చూడండి--

ప్రజాపతిర్హ కర్మాణి ససృజే. తాని సృష్ట్వాన్యోన్యేనాస్పర్ధన్త.
"వదిష్యామ్యేవాహ" మితి వాగ్దధ్రే. "ద్రక్ష్యామ్యహ" మితిచక్షుః,
"శ్రోష్యామ్యహ" మితి శ్రోత్రమేవ మన్యాని కర్మాణి యథాకర్మతాని
మృత్యుః శ్రమో భూత్వోపయేమే.తాన్యాప్నోత్తాన్యాప్త్వామృత్యురవారున్ధత్.

(బృ.ఆ. 1.5.21)

కాలాంతరంలో విస్తరించిన కావ్యవాఙ్మయంలోని కవితా సౌందర్యాలకు మూలభూతమైన అంశాలు వైదిక వాఙ్మయంలో ఒకభాగమైన అరణ్యక సాహిత్యంలో చోటు చేసుకున్నాయని పై ఉదాహరణలను బట్టి మనకు స్పష్టమవుతుంది. ఎన్నో గ్రంథాలలో ఎంతో కవితాసామగ్రి దొరుకుతున్నప్పటికి సంగ్రహదృష్టితో ఈవ్యాసంలో కొద్ది ఉదాహరణలు మాత్రమే పేర్కొనడం జరిగింది.

— సి.ఎల్.ఆర్.

# 1.13 భాషా పరిణామం

ఆరణ్యకాలు బ్రాహ్మణాలకు అనుబంధగ్రంథాలు. అందువల్ల ఆరణ్యకాల భాషాశైలి బ్రాహ్మణాల భాషాశైలితో పోలిఉంటుంది.

చాలావరకు ఆరణ్యకాలన్నీ బ్రాహ్మణాలలో అంతర్భాగాలుగా ఉంటూ, ఉపనిషత్తులకు ఉపోద్ఘాతాలుగా గూడ కనబడుతున్నాయి. కొన్నింటిలో బ్రహ్మజ్ఞానానికి సంబంధించిన విచారణ గూడ ఉంది. అందువల్ల ఆరణ్యకాలు ఉపనిషత్తులలో చర్చింపబడిన బ్రహ్మజ్ఞాన విచారణకు ప్రాతిపదికలుగా ఉన్నాయి. ఐతరేయ, కౌషీతకి, బృహదారణ్యక, తైత్తిరీయ, ఛాందోగ్య, కేన ఉపనిషత్తులు ఆరణ్యకాలకు అనుబంధాలుగ ఉన్నాయి.

ఆరణ్యకాలలో యజ్ఞాల అంతరార్థం, ప్రతీకలు, రహస్య వివరణలు ఉండటం చేత, ఋగ్వేద సూక్తాలకు వ్యాఖ్యానం ఉండడం చేత, అందులోని భాష గద్యరూపంలో సులభశైలిలో ఉన్నది. ఆ భాష యొక్క విలక్షణత, వైశిష్ట్యం ఇలా ఉంది --

1. సామవేదానికి సంబంధించిన జైమినీయారణ్యకంలో ఋగ్వేద భాషాలక్షణాలు కొన్ని నిలిచి ఉన్నాయి (ఇందులో చాలా ఋగ్వేదసూక్తాలకు వివరణ ఉంది.). ఇందులో ఒకటి 'డ' కారానికి బదులుగ 'ళ' కారాన్ని వాడటం. ఉదా. పీళయిత్వా, త్రీళా.

2. మరొకటి 'ర' కారానికి బదులుగా 'ల' కారం ప్రయోగించటం. ఉదా. పులుషః (పురుషః), దాల్భ్య (దార్భ్య).

ఆరణ్యకాలలో ప్రాచీన ఆర్షప్రయోగాలు, అప్రసిద్ధప్రయోగాలు, వ్యాకరణవిశేషాలు ఉన్నాయి.

3. "వావ, వై, ను న్వై, న్వావ, హా" అనే నిపాతలు జైమినీ యారణ్యకంలో ఎక్కువగా కనబడుతున్నాయి.

4. "అధిషంక్తోః, భవితోః" మొదలైన వ్యుత్పన్న శబ్దాలు అరణ్యకాలలో ఉన్నాయి.

**వ్యాకరణవిశేషాలు:**

1. సంధి - కొన్నిచోట్ల అరుదుగ విసంధి ప్రయోగం కన బడుతోంది. ఈసందర్భంలో యడాగమం వచ్చింది. ఉదా. త్రియాయుషం - కశ్యపస్య జమదగ్నే స్త్రియాయుషమ్.

2. కొన్ని చోట్ల రెండు సంధులు కల ప్రయోగాలు ఉన్నాయి.

ఉదా. సైవాలమ్ (సః + ఏవ > సఏవ > సైవ) (స ఏవాలమ్) ప్రత్యాహేతి (ప్రత్యాహే + ఇతి > ప్రత్యాహం > ఇతి > ప్రత్యాహ ఇతి > ప్రత్యాహేతి) (ప్రత్యాహ ఇతి) ఏషో ఏవ (ఏషః + ఉ > ఏషఉ > ఏషో) (ఏషఉ).

3. మరికొన్ని సంధి విశేషాలు –

ప్రాణమ్యేవ (ప్రాణమ్ + ఉ + ఏవ)

అస్యా అప్సరసః (అస్యై + అప్సరసః > అస్యాం + అప్సరసః > అస్యా అప్సరసః)

వా ఏతమ్ (వై + ఏతమ్ > వాయ్ + ఏతమ్ > వా ఏతమ్)

4. శబ్దరూపాలు --

నపుంసకలింగ తచ్ఛబ్ద బహువచనరూపమే పుంలింగ తచ్ఛబ్ద ద్వివచనరూపంగా ప్రయోగింపబడింది.

ఉదా. తా బ్రహ్మ బ్రువన్.

5. సప్తమీ విభక్తి ఏకవచనరూపంలో 'ఇ' ప్రత్యయానికి బదులుగ 'అన్' ప్రత్యయం వాడబడింది.

ఉదా. హేమన్ (హేమ్ని) అక్షన్ (అక్షిణే) సామన్ (సామ్ని)
నిధనకృతా ఇవ వై హేమన్ ప్రజా భవంతి.
యోఽయ మక్షన్నంత ఏష ఏవ తే.
సేయమృగస్మిన్ సామన్ మిథున మైచ్ఛత.

6. సప్తమీ విభక్తి ఏకవచన రూపంలో 'అ' ప్రత్యయం ప్రయోగింపబడంది. దక్షిణా (దక్షిణాయామ్)

ఉదా. అథ మనో మయో దక్షిణా ప్రతిష్ఠితః

7. ప్రాజ్, ప్రత్యజ్, ఉదజ్ అనే నిపాతలు సప్తమీ విభక్త్యర్థంలో ప్రయోగింపబడ్డాయి.

ఉదా. తస్య వాఙ్మయో రశ్మిః ప్రాజ్ ప్రతిష్ఠితః
అథ చక్షుర్మయః ప్రత్యజ్ ప్రతిష్ఠితః,
అథ శ్రోత్రమయ ఉదజ్ ప్రతిష్ఠితః.

8. సంబోధన ప్రథమా ఏకవచన రూపంలో 'భగవన్' అనటానికి బదులుగ 'భగవః' అని ప్రయోగించబడింది.

ఉదా. సామైవ భగవ ఇతి హోవాచ.
దీనిని పాణిని 'మతు వసోరుః సంబుద్ధౌ' (8-3-1) అని సూత్రీకరించినాడు.

9. కర్త్రర్థక, కర్మార్థకాలలో మార్పులు.
'ఆసిచ్యేత్' అనటానికి బదులుగా 'ఆసిచ్యాత్' ప్రయోగం.

ఉదా. యథా క్షీరేణ క్షీర మాసిచ్యాత్.
'అవాదీత్' అనటానికి మారుగ 'అవాది' అనే ప్రయోగం.

ఉదా. తం హ జాబాలం ప్రత్యేతం కనీయాన్ భ్రాతో వాచ. కాం భవాన్ శూద్రకో వాచ మవాదీతి (అవాది + ఇతి)
'పశ్యతి' అనటానికి ప్రతిగ 'పశ్యతే' ప్రయోగం. ఉదా. నహ వా ఇంద్రః కంచన భ్రాతృవ్యం పశ్యతే.

10. గణాలలో మార్పులు –

'స్పృణోతి' నాల్గవ గణరూపానికి బదులుగ 'స్పృణాతి' తొమ్మిదవ గణరూపం ప్రయోగించబడింది.

11. ప్రథమ పురుషకు బదులుగ ఉత్తమ పురుష వాడబడింది. 'శేతే' అనటానికి మారుగ 'శయే' ప్రయోగం. ఉదా. ఏతదను అహిర్బ్రుగాన్ పర్యాహత్య శయే.

12. వచనంలో మార్పు –

'భుంక్తే' కు బదులుగ 'భుంజతే' ప్రయోగం. ఉదా. యదిదం వాచా భుంజతే. 'అధియతే'కు మారుగ 'అధియంతే' ప్రయోగం. ఉదా. ఆదిత్యో నివత, తస్మాత్ బహ్వృశా ఉదిత నివిదం అధియంతే.

13. అనియతరూపాలు

'అలోక్యతాయై'కు ప్రతిగ 'అలోకతాయై' ప్రయోగం. 'సమైత్' అనటానికి బదులుగ 'సమైతత్' ప్రయోగం. 'అన్వైత్' కు మారుగ 'అన్వైతత్' ప్రయోగం. 'వ్యేతి'కు బదులుగ 'వేతి' ప్రయోగం. ఉదా. నీలం వేతి.

14. అసమాపకక్రియలు

'పరివేష్టుమ్'కు మారుగ 'పరివేష్టవై' ప్రయోగం. ఉదా. స యథా ప్రోక్తోఽశనే శ్రేయాంసం పరివేష్టవై బ్రూయాత్ తాదృక్ తత్.

'అభిషంక్తుమ్' అనటానికి బదులుగా 'అభిషంక్తోః' ప్రయోగం. 'ధాతుమ్'కు మారుగ 'ధాతోః' ప్రయోగం.

ఉదా. యో వై మహాశనే అనశ్నతి
అశనాతి ఈశ్వరో హైన మభిషంక్తోః స ఏన
మా స్పృష్ట ఈశ్వరో దుర్ధాయాం ధాతోః.

'పరాభవితుమ్' అనటానికి బదులుగా 'పరాభవితోః' ప్రయోగం.

ఉదా. స యథా శ్రేయస ఉపద్రష్టా ఏవం హి శశ్వ
దీశ్వరోఽనులబ్ధః పరాభవితోః

'పర్యాదత్తమ్' కు ప్రతిగా 'పర్యాత్తమ్' ప్రయోగం.

ఉదా. తస్మాత్ పర్యాత్తం చక్షుః.

కారకవిశేషాలు:

15. కర్తృ వాచక పదం రెండవసారి చెప్పబడినప్పుడు, అది నిర్దేశ వాచక సర్వనామంతో ప్రయోగించబడింది.
ఉదా. చక్షుః శ్రోతమ్ మనోవాక్ ప్రాణ స్తా ఏతా పంచదేవతా.

16. తృతీయార్థంలో సప్తమీ విభక్తి ప్రయోగించబడింది. ఉదా. పంచస్వధికరణేషు (అధికరణేషు = ఆశ్రయాల చేత) సువర్గే లోకేన (సువర్గేణ లోకేన= స్వర్గలోకంతో)

17. పంచమ్యర్థంలో చతుర్థి విభక్తి ప్రయోగం.
ఉదా. భూత్యై న ప్రమదితవ్యమ్ (భూత్యై= మంగళార్థ మయిన పనుల నుండి)

18. షష్ఠీ విభక్తికి బదులుగ చతుర్థివిభక్తి ప్రయోగం.
ఉదా. గాయత్ర్యై ముఖమ్ (గాయత్ర్యాః ముఖమ్)
అస్యై మర్త్యమ్ (అస్యాః మర్త్యమ్)
దేవతాయై సర్వం రూపం (దేవతాయాః సర్వం రూపం)

19. విశేష్యం షష్ఠీవిభక్తిలో ఉండగా, విశేషణం చతుర్థి విభక్తిలో ప్రయోగించబడింది.

ఉదా. అస్యై వాచో బృహత్యై పతిః (అస్యాః వాచో బృహత్యా పతిః)
విద్యుతః విద్యోతమానాయై (విద్యుతః విద్యోతమానాయాః)
విద్యుతః సంద్రవంత్యై (విద్యుతః సంద్రవంత్యాః)

20. షష్ఠీ విభక్తికి బదులుగ పంచమీ విభక్తి ప్రయోగం.
ఉదా. 'మమ' శబ్దానికి మారుగ 'మత్' పద ప్రయోగం.

21. సప్తమీ విభక్తికి బదులుగ షష్ఠీవిభక్తి ప్రయోగం.
ఉదా. ఏతస్య ముహూర్తస్య (ఏతస్మిన్ ముహూర్తే)
వేదానాం గుహ్యైకం (వేదానాం గుహ్యార్థం)

22. ఉపసర్గలు

ఉపసర్గలు తరచుగ క్రియాపదానికి అనుబంధంగా గాక విడిగ ప్రయోగించబడతాయి.

ఉదా. ఉప తే తా దిశామి

ప్రమావహ

సమహం భూయాసం.

ప్రహ షోడశ శతం వర్షాణి జీవతి.

తే పునః పునర్బ్రహ్మాభిః బహ్వీభిః ప్రతిపద్భిః

సర్వస్య లోకస్య ద్వారం నానుచన బుబుధిరే.

23. 'తమ' ప్రత్యయప్రయోగం –

ఉదా. భరద్వాజో హవా ఋషీణా మనూచానతమో దీర్ఘ జీవితమః తపస్వితమ ఆస.

24. ప్రసిద్ధార్థంలో 'వావ' శబ్ద ప్రయోగం.

ఉదా. ఏతా వావ వ్యాహృతయ ఇమే త్రయో వేదాః

25. సకర్మకక్రియాప్రయోగం.

ఉదా. ఉపాకృతే స్తోత్రే త్రైధం నినయాథ

26. 'నాఽ భ్యాహే మేఘే' (మేఘాలున్నపుడు చదువరాదు) ఇక్కడ 'ఊహ్' ధాతువు 'అభి' (ఉపసర్గ)తో చేర్చి ప్రయోగించ బడింది.

27. 'నఽపీతే క్ష్వోదకే'.

ఇక్కడ ధాతువు 'పా'. 'అ' అనే ఉపసర్గతో చేర్చి ప్రయోగించబడింది.

28. 'అధ యోనం ప్రత్యాహతం ఇహ వృష్టి ర్భూత్వా 'వర్షతి'. ఇక్కడ 'వృష్టి ర్భూత్వా' అంటే 'వర్షాధారాభావం ప్రాప్య' అని అర్థం. ఇక్కడ 'ప్రాప్య' ప్రేరేపణక్రియగా ప్రయోగించబడింది (అష్టా 6-4-57).

29. "ఆ తపతి వర్షా గృహ్ణతి"

ఇక్కడ క్రియ అకర్మకం. దానితోనున్న కృదంతం వర్తమాన కాలానికి చెందింది (శత్రర్థకం).

30. 'య ఏవం విద్వాన్ మహారాత్ర ఉషస్య ఉదితే వ్రజంస్ తిష్ఠన్ ఆసీనః శయానోఽరణ్యే గ్రామే వా 'యావత్త' రసం' స్వాధ్యాయం అధీతే సర్వాన్ లోకాన్ జయతి.

ఇక్కడ 'యావత్త రసం' అనే సమాసంలో రెండు ఉదాత్త స్వరాలున్నప్పటికిని దీనిని అవ్యయీభావ సమాసంగానే పరిగణించాలి.

31. "అశ్వినః పయస్య అనీయమానే"

ఇక్కడ క్రియ సకర్మకం. ఇది కేవల సప్తమీవిభక్తిలో ప్రయోగింపబడింది.

32. 'స య ఏనం ఋచాద్ ఏవ తా దేవతా ఉపసృత్య బ్రూయంతే'

ఇక్కడ అంగవాక్యంలో సమాపకక్రియ ప్రయోగింపబడింది.

33. 'య ఏష స్తన ఇవావలంబతే'

పై వాక్యంలో వరుసగా రెండు నిర్దేశిక సర్వనామాలు (యః ఏ, ఏషః= ఈ) ప్రయోగింపబడినాయి. చక్కని ఉపమానం కూడ ఉన్నది.

34. 'స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః'

పై వాక్యంలో వరుసగా మూడు నిర్దేశిక సర్వనామాలు (సః= ఆ, యః =ఏ, ఏషః= ఈ) ప్రయోగింపబడ్డాయి.

35. 'యథా తథా' ప్రయోగం.

ఉదా. యథా తే తేషు వర్తేరన్. తథా తేషు వర్తేథాః

వారు ఆ విషయంలో ఏ విధంగా ప్రవర్తిస్తారో ఆ ప్రకారంగా ఆ విషయంలో వర్తించు.

36. 'యావద్ బ్రహ్మ విష్ఠితం తావతీ వాగితి'.

అనే వాక్యంలో 'యావతి - తావతి' ప్రయోగించబడింది.

37. వాక్యరచనా విశేషాలు

ఉదా. "అగ్రం వై ఛందసాం గాయత్రీ. అగ్రమంగానాం శిరః" దృష్టాంతపూర్వకరచన యిది.

38. 'దశదశతస్త్రృతమ్. దశ శతాని తత్సహస్రమ్'
అని శత, సహస్ర సంఖ్యలు వివరింపబడ్డాయి.

39. సంవత్సరానికి 720 అహోరాత్రులు (360 దినాలు) అని తెలపటానికి 'సప్త చ వై శతాని వింశతిశ్చ సంవత్సర స్యాహో రాత్రాః' అని చెప్పబడింది. ఇందులో సమాస పదాలకు ప్రత్యయాలచేత ఏర్పాటు కలిగింది.

40. "తస్య వాఙ్మయో రశ్మిః ప్రాక్ ప్రతిష్ఠితః సాయా సా వాగగ్నిః సః. స దశధా భవతి. శతధా, సహస్రధా, అయుతధా, ప్రయుతధా, నియుతధా, అర్బుదధా, న్యర్బుదధా, నిఖర్వధా, పద్మ మక్షితి ర్వ్యోమాంతః" (జై. ఆ. 1.9.1.)
ఇందులో విశేషసంఖ్యావాచకాలు క్రమంగా పేర్కొనబడ్డాయి.

41. విశ్వామిత్రపదవివరణ --
"విశ్వస్య స హ వై మిత్రం విశ్వామిత్ర ఆస".

42. బృహస్పతి పద వివరణ
"యదస్యై వాచో బృహత్యై పతిస్తస్మాద్ బృహస్పతిః"

43. "సత్యస్య సత్య మను యత్ర యుజ్యతే. తత్ర దేవాస్సర్వ ఏకం భవతి"

ఇందులో 'యత్ర-తత్ర' ప్రయోగంతో బాటు సత్యప్రభావం కూడ వివరింపబడింది. ఇది లౌకిక సత్య ప్రతిపాదకమైన వాక్యం.

44. 'పుష్పం హి ఫలం వాచః సత్యం వదతి'

అనే వాక్యానికి "యః సత్యం వదతి సః వాచః పుష్పం చ ఫలం చ భజత" అని వివరణ.

45. పదజాలం --

లౌకిక సంస్కృత వాఙ్మయంలో కనిపించని అనేక పదాలు ఆరణ్యకాలలో ప్రయోగింపబడి ఉన్నాయి. కొన్ని పదాలు అర్థపరిగా మాన్ని పొంది లౌకికవాఙ్మయంలో కనిపిస్తున్నాయి.

ఉదా.1.వశా (నివాసం)

యా వదా వశా ఉ హా స్యేమ్ ప్రాణా........భవంతి

2. ఉసరమ్ (విశేషణం, ఉన్నతమని అర్థం) పృథివ్యుసరమ్ః తప స్తను.
3. అన్నకాశినీ (ఆహారాన్ని కోరేది.)
4. ఇత్థాత్ (ఇక్కడ నుంచి)
5. న్వై లేక న్వ్వావ (అవధారణం)
6. అముః (వాడు).
7. అశ్మాన్ (రాయి)
8. స జాత వనస్యా (సాటివారిపై ఆధిపత్యానికై ప్రార్థన)

46. "పురుషే త్వే వాఽఽ విస్తరామాత్మా, స హి ప్రజ్ఞానేన సంపన్నతమో విజ్ఞాతం వదతి. విజ్ఞాతం పశ్యతి. వేద శ్వస్తనం, లోకాలోకౌ, మర్త్యే నామృత మీప్సత్యేవం సంపన్నః, అధే తరేషాం పశూనా మశనా పిపాసే ఏవాభి విజ్ఞానమ్, న విజ్ఞాతం, వదంతి, న విజ్ఞాతం పశ్యంతి న విదు శ్వస్తనం న లోకాలోకౌ త ఏతా వంతో భవంతి. యథా ప్రజ్ఞం హి సంభవాః" (ఐ.ఆ. 2.3.2).

పురుషునిలో ఆత్మజ్ఞానం అతిశయరూపంలో ప్రకటంగా ఉంటుంది. తదితర గవాశ్వాది ప్రాణిజాతంలో ఇలాంటి ప్రకటస్థితి ఉండదు. ఆకలి దప్పులను మాత్రం అవి తెలిసికొని, వాటిని తీర్చుకోటానికి మాత్రం ప్రయత్నిస్తాయి.

వేదరహస్యార్థాలను ఆరణ్యకాలు వివరిస్తున్నాయి. ఇందువల్ల ఆరణ్యకాలు వేదాలకు వ్యాఖ్యానాలని చెప్పవచ్చు. ఇతర ఆరణ్యకాలకంటే జైమినీయారణ్యకం (జైమినీయ ఉపనిషద్బ్రాహ్మణం) వేదసూక్తాలను చక్కగా వివరిస్తోంది. ఒక ఉదాహరణ.

పతంగ ముక్త మసురస్య మాయయా
హృదా పశ్యంతి మనసా విపశ్చితః
సముద్రే అంతః కవయో విచక్షతే
మరీచీనాం పదమిచ్ఛంతి వేధస ఇతి.

(ఋ.సం. 10.177.1).

అనే మంత్రాన్ని జైమినీయ ఆరణ్యకం ఇలా వివరిస్తోంది. "పతంగ ముక్తమితి. ప్రాణో వై పతంగః పతన్నివ హ్యేష్వంగేష్వేతి రథ ముదీక్షతే. పతంగ ఇత్యాచక్షతే. అసురస్య మాయయేతి. మనో వా అసురం. తద్ధ్యసుషు రమతే. తస్యైవ మాయ యుక్తః.

మరీచీనాం పదమిచ్ఛంతి వేధస ఇతి. మరీచ్య ఇవ వా ఏతా దేవతా యదగ్ని ర్వాయు రాదిత్యశ్చంద్రమాః"

(జై.ఆ. 3.35.2,3,6.)

ఇందులో ప్రాణం పతంగంతోను, మనస్సు అసురునితోను పోల్చబడింది. ఇలా చిన్నచిన్న వాక్యాలతో వేదార్థాలను సరళంగా వివరిస్తూ ఆరణ్యకాలు వ్యాఖ్యానపద్ధతికి మేలుబంతిగా ఉన్నాయి.

ఇక్కడ ఉదాహరణలలో చాలవరకు వాక్యాలే ఉదహరింపబడినాయి. వాటి పరిశీలన వలన ఆరణ్యకాలలోని వాక్యనిర్మాణం చిన్న చిన్న పదాలతో ఏర్పడినట్లున్నదని తెలుస్తోంది. ఆరణ్యకాలలోని భాష, దీర్ఘ ప్రౌఢ సమాస రచన లేకుండా, సులభగ్రాహ్యమైన సమాసరచన కలిగి ఉన్నది.

ఈ విధమైన విలక్షణత, వైశిష్ట్యం కలిగి ఆరణ్యకాలలోని భాష అటు వైదిక సంస్కృతానికి ఇటు లౌకిక సంస్కృతానికి మధ్య ఉంటూ, సంస్కృతభాషావికాస పరిణామంలో రెండవ దశకు ఉదాహరణగా ఉన్నది.

— కె.వి.ఆర్.

# విశేష విభాగం

# 2 విశేషవిభాగం

## 2.1 ఐతరేయారణ్యకం

### 2.1.1 పరిచయం

ఋగ్వేదానికి గల శాకలశాఖకు సంబంధించింది ఐతరేయారణ్యకం. దీనికీ పేరెలా ఏర్పడిందో ఐతరేయ బ్రాహ్మణపరిచయంలో వివరించాను (ఆ.వి.స.II. 129). ఇతర అనే ఆమె కుమారుడు ఐతరేయుడు. అతడికే మహిదాసని పేరు. బ్రాహ్మణానికి, ఆరణ్యకానికి అతడే కర్త. ఐతరేయుడైన మహిదాసుచే రచింపబడింది కాబట్టి దీనికి ఐతరేయారణ్యకమనే పేరేర్పడింది.

యాజ్ఞవల్క్యునికి ఇద్దఱు భార్యలు. ఆయన పెద్ద భార్యపైన ఆసక్తితో ఆమెను ప్రియురాలని, రెండవభార్య మీాద ప్రేమ తక్కువగా ఉండటంవల్ల ఆమెను 'ఇతర' అని పిలుస్తుండేవాడు. 'ఇతర' అని మహర్షిచేత నిరాదరణతో చూడబడే రెండవభార్య కొడుకు మహిదాసు. అతనికి ఐతరేయుడని ప్రసిద్ధి కలిగింది.[1] అతని రచన ఐతరేయారణ్యకం.

— ఎస్.బి.ఆర్.

1. ఆసీద్విప్రో యాజ్ఞవల్క్యో ద్విభార్య
స్తస్య ద్వితీయామితరేతి చాహుః ।
స జ్యేష్ఠాయా మాకృష్టచిత్తః ప్రియాం
తాముక్త్వా ద్వితీయామితరేతి హోచే. ॥ ఐ.బ్రా. పు.4.

## 2.1.2 విభాగం

ఐతరేయారణ్యకంలో గల 61 ఖండలు కొన్ని అధ్యాయాలుగా, ఆరణ్యకాలుగా విభజింప బడ్డాయి. ప్రధానంగా ఈ ఆరణ్యకంలో రెండు రకాల అధ్యాయాది విభాగాలు కనబడుతున్నాయి. షడ్గురు శిష్యుడు వ్రాసిన వ్యాఖ్యానం మోక్షప్రదననుసరించిన విభాగం ఒకటి, సాయ ణుని భాష్యంలో కనబడే విభాగం ఇంకొకటి.

మోక్షప్రదననుసరించి ఈ ఆరణ్యకం నాలుగు భాగాలుగా చేయ బడింది. ప్రతిభాగానికీ ఆరణ్యకమనే పేరున్నది. ప్రతి ఆరణ్యకం కొన్ని అధ్యాయాలుగాను, అధ్యాయాలు కొన్ని ఖండలుగాను విభ జింపబడినాయి. మూడు నాలుగు ఆరణ్యకాలు మధ్య భాగంలో గల అధ్యాయాన్ని సకృదుక్తిఖండాధ్యాయమని ముక్తిప్రద పేర్కొంటున్నది. ఇందులో మహానామ్ని అనే పేరుగల తొమ్మిది ఋక్కులున్నాయి.

సాయణభాష్యాన్ననుసరించి అయిదు ఆరణ్యకాలుగా విభాగం కనబ డుతోంది. రెండో ఆరణ్యకంలో ఏడధ్యాయాలు, మూడో ఆరణ్యకంలో రెండే అధ్యాయాలు ఈ భాష్యంలో చోటు చేసుకున్నాయి. సకృదుక్తి ఖండాధ్యాయమని మూడో ఆరణ్యకం తరువాత ముక్తిప్రద పేర్కొన్న భాగాన్ని సాయణుడు ప్రత్యేకారణ్యకంగా పరిగణించాడు. రెండురకాల విభాగాల పట్టికలను క్రింద పొందుపరుస్తున్నాను. చూడండి:

| మోక్షప్రదావిభాగం | | |
|---|---|---|
| ఆరణ్యకం | అధ్యాయం | ఖండ |
| I | 1 | 4 |
| | 2 | 4 |
| | 3 | 8 |
| | 4 | 3 |
| | 5 | 3 |
| II | 1 | 8 |
| | 2 | 4 |
| | 3 | 8 |
| | 4 | 3 |
| | 5 | 1 |
| | 6 | 1 |
| III | 1 | 1 |
| | 2 | 6 |
| | 3 | 6 |
| సకృదుక్తిఖండాధ్యాయం | 1 | 1 |
| IV | 1 | - |
| సూత్రభాగం | 2 | - |
| | 3 | - |
| మొత్తం | 18 | 61 |

సాయణభాష్యవిభాగం

| ఆరణ్యకం | అధ్యాయం | ఖండ |
|---|---|---|
| I | 1 | 4 |
| | 2 | 4 |
| | 3 | 8 |
| | 4 | 3 |
| | 5 | 3 |
| II | 1 | 8 |
| | 2 | 4 |
| | 3 | 8 |
| | 4 | 3 |
| | 5 | 1 |
| | 6 | 1 |
| | 7 | 1 |
| III | 1 | 6 |
| | 2 | 6 |
| IV | 1 | 1 |
| V. సూత్రభాగం | 1 | - |
| | 2 | - |
| | 3 | - |
| మొత్తం | 18 | 61 |

ముక్తిప్రదకు సాయణభాష్యానికి అవాంతర భేదాలున్నా ఐతరేయారణ్యకాన్ని పద్దెనిమిది అధ్యాయాలుగా విభజించడంలో సమానభావం లేకపోలేదు.

**విషయవిభాగం:**

ఐతరేయారణ్యకంలో ప్రథమారణ్యకం కర్మకాండను వివరిస్తున్నది. 'గవామయనం' అనే యాగం ఒక సంవత్సరంపాటు చేయాలి. అందులో ప్రాయణీయ, చతుర్వింశ మొదలగు ఇరవై అయిదు అహాలను అనేక సార్లు అనుష్ఠించాలి. ఐతరేయారణ్యకంలో ప్రాయణీయాహం నుంచి దశమాహం వఱకు గల కర్మలు నిరూపించబడ్డాయి. ప్రథమారణ్యకం ముఖ్యంగా మహావ్రతాన్ని వివరిస్తున్నది. మిగతా ఆరణ్యకాలు జ్ఞానకాండను ప్రబోధిస్తున్నాయి. రెండో ఆరణ్యకంలో నాల్గో అధ్యాయంనుంచి చివఱివరకు "ఆత్మోపనిషత్" అని, మూడో ఆరణ్యకానికి సంహితోపనిషత్తని వ్యవహారం ఉంది. సకృదుక్తి ఖండాధ్యాయంలో తొమ్మిది మహానామ్ని ఋక్కులున్నాయి. ఇవి సంహితలో ఉండాల్సినవైనప్పటికి ఆరణ్యక స్వభావం వాటిలో ఉండటాన్ని బట్టి అవి ఇక్కడ చెప్పబడ్డాయి. సాయణుడీ అధ్యాయాన్ని నాల్గో ఆరణ్యకంగా గుర్తించాడు. అయిదో ఆరణ్యకంలో ప్రథమాధ్యాయంలో మహావ్రతానికి సంబంధించిన సామిధేని మొదలగు ఋక్కుల వివరణ ఉంది.

**మొదలు—చివఱ:**

ఈ ఆరణ్యకం "అథ మహావ్రతమ్" అనే మంత్రంతో ప్రారంభమై "చతుర్వింశాన్మరుత్వతీయస్యాతానః' అనే మంత్రంతో పూర్తవుతున్నది.

— ఎస్.బి.ఆర్.

## 2.1.3 సంకలన కాలం

**దేశం:**

వైదికవాఙ్మయం ఖచ్చితంగా ఈ ప్రదేశంలోనే ఏర్పడిందని చెప్ప డానికి తగినంత సాక్ష్యాధారాలు దొరకడం కష్టం. కాని స్థూలంగా ఇలా ఇక్కడ ఏర్పడి ఉండవచ్చని ఊహించడానికి అవకాశం ఉంది. మేక్డొ నల్ అభిప్రాయపడినట్లు ఐతరేయబ్రాహ్మణం కురుపాంచాల దేశంలో ఏర్పడి ఉంటుందని భావించబడుతోంది (ఆ.వి.స. Vol.II. 133 ). అలాగే ఐతరేయారణ్యకం కూడా అదే దేశంలో రచింపబడి ఉంటుం దనుకోవడంలో అనుపపత్తి లేదు.

**కాలం:**

బ్రాహ్మణ గ్రంథాలకు అనుబంధరూపాలే ఆరణ్యకాలు కాబట్టి; బ్రాహ్మణాలలో ప్రతిపాదించబడిన కర్మకాండశేషం ఆరణ్యకాల్లోను కన బడుతోంది కాబట్టి; ఇంచుమించు అదే కాలంలోనో కొంచెం తరువాత గాని ఆరణ్యకాలేర్పడి ఉంటాయి. ఆధునికుల అంచనాల ప్రకారం క్రీస్తు పూర్వం 8వ శతాబ్దం నుంచి 5వ శతాబ్దం లోపల బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు ఏర్పడినాయని భావింపబడుతోంది. ఐతరేయం ఋగ్వేదా నికి సంబంధించిందైనా బ్రాహ్మణవాఙ్మయంలో దానికి ప్రథమస్థానం లేదు. బహుశ మూడోస్థానం లభిస్తుంది. కనుక క్రీ.పూ. 7వ శతాబ్దాం తంలో ఐతరేయారణ్యకం రచింపబడి ఉంటుందనుకోవడానికి అవకాశం ఉంది. కాని సంప్రదాయవాదులు ఈవాదాన్ని అంగీకరించడం లేదు.

—ఎస్.బి.ఆర్.

# 2.1.4 వ్యాఖ్యానాలు – ప్రచురణలు

**వ్యాఖ్యానాలు:**

ఐతరేయారణ్యకానికి 12వ శతాబ్దానికి సంబంధించిన షడ్గురు శిష్యుడు 'మోక్షప్రద' అనే వ్యాఖ్యానం వ్రాశాడు. ఈయనే ఐతరేయ బ్రాహ్మణానికి 'సుఖప్రద' అని, అశ్వలాయన శ్రౌతసూత్రానికి "అభ్యుదయప్రద" అని వ్యాఖ్యానాలు వ్రాసినట్లు తెలుస్తున్నది. ఈయన కేరళదేశీయుడని విమర్శకుల నిర్ణయం.

సాయణుడు (1315–1387) ఐతరేయారణ్యకానికి భాష్యం వ్రాశాడు. ఇంకెవరు ఈ ఆరణ్యకానికి భాష్యాలుగాని, వ్యాఖ్యానాలుగాని వ్రాసినట్లు తెలియడం లేదు.

**ప్రచురణలు :**

ఐతరేయారణ్యకాన్ని సాయణభాష్యంతో రాజేంద్రలాల్ మిత్ర కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటి తరఫున 1876లో ప్రచురించాడు. పూనాలోని ఆనందాశ్రమం ద్వారా బాబాశాస్త్రి ఫడకే 1898లో సాయణభాష్యంతో దీన్ని ముద్రించాడు. ఎ.బి.కీత్, ఆంగ్లానువాదంతో ఐతరేయారణ్యకాన్ని ఆక్స్‌ఫర్డ్‌లో 1919లో ప్రచురించాడు. 'మోక్షప్రద' వృత్తితో ఐతరేయారణ్యకాన్ని 1968లో ఓరియంటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ తరఫున డా|| కె. రాఘవన్ పిళ్లై ప్రచురించారు. ఈ ఆరణ్యకం పైన మంగళదేవశాస్త్రి, చేసిన 'ఐతరేయారణ్యక పర్యాలోచనం' అనే విమర్శ 1953లో బెనారస్ నుంచి వెలువడింది. మొత్తంమీద ఈ ఆరణ్యకానికి నాలుగు సంస్కరణలు వెలుగుచూశాయి.

–ఎస్.బి.ఆర్.

## 2.1.5 ప్రసిద్ధి:

బ్రాహ్మణాలు ముఖ్యంగా కర్మకాండను విస్తరంగా వివరించాయి. కాని అరణ్యకాలు బ్రాహ్మణశేషాలైన కర్మలను కొంతకు కొంత వివరిస్తూ మెల్లగా జ్ఞానకాండను గురించి ఎన్నో అమూల్యమైన విషయాలను మనకందిస్తున్నాయి. నిజానికి చాలా ఉపనిషత్తులు ఈ అరణ్యకాల్లో కొన్ని అధ్యాయాలుగా ఉండటం మనం ఇప్పటికీ గమనించవచ్చు.

కర్మలవల్ల మానవుడు తాత్కాలిక ప్రయోజనాలను సంపాదించినా అవి శాశ్వతసుఖాన్నివ్వలేవని గుర్తించిన మహర్షులు శాశ్వతసుఖాన్ని పొందడానికి గల మార్గాలేమిటి? అని విచారించి ఆత్మతత్త్వదర్శన మేనని నిర్ధారణ చేసుకొన్నారు. ఆ తరువాతనే ఈ విధమైన జ్ఞాన వాహిని ఏర్పడింది. అందుకే ఆరణ్యకాలు కర్మ-జ్ఞానాల సమ్మిశ్రంగా కనబడుతున్నాయి. అందువల్లే ఐతరేయారణ్యకంలో రెండో ఆరణ్యకం ఐతరేయోపనిషత్తును ప్రబోధిస్తున్నది.

ఐతరేయారణ్యకం ప్రథమారణ్యకంలో గవామయనంలోని ప్రాయణీయాహం నుంచి అనేక వైదిక కర్మలు ప్రతిపాదింపబడినా రెండో ఆరణ్యకం నుంచి మానవునికి కావలసిన అనేక రహస్యాంశాలు కూడా చక్కగా వివరించబడినాయి. నిగూఢార్థాలతో కూడిన ఇలాంటి ప్రకృతి రహస్యాలను ప్రతిపాదిస్తూ ఈ ఆరణ్యకం ఎంతో ప్రసిద్ధిని సంపాదించింది. చూడండి:

**గర్భంలో పిండం ఎలా ఏర్పడింది?**

> జగత్కారణం, ప్రాణస్వరూపి అయిన బ్రహ్మ మాతృ గర్భంలో తాను సృష్టించిన మానవ శరీరంలో పాదాల అగ్ర భాగం ద్వారా అంటే వేళ్లద్వారా ప్రవేశించాడు. ప్రాణం వాటినుంచి ప్రవేశించింది కాబట్టి వాటికి "ప్రపదము" అనే పేరొచ్చింది.

పశువులలో గిట్టల ద్వారా ప్రాణం ప్రవేశించింది. అందువల్ల గిట్టలకే ప్రపదాలని ప్రసిద్ధి కలిగింది. పాదాలనుంచి ప్రాణం వేటి నాశ్రయించి పైకి పాకిందో అవి ఊరువులైనాయి. తరువాత తిన్న పదార్థాలు నిలబడటానికి కావలసిన ఖాళీ ప్రదేశం ఉండాలనే భగవత్సంకల్పంద్వారా ఉదరం ఏర్పడింది. ఉదరం వఱకు వచ్చిన బ్రహ్మ నాకు ఇంకొంచెం ఖాళీ ప్రదేశం కావాలనుకోవడం వల్ల ఆపైన హృదయమేర్పడింది.[1]

అలాగే "పరబ్రహ్మ నుంచే దేవతలు, దేవతలనుంచి వర్షం, వర్షంనుంచి ఓషధులు, ఓషధులనుంచి అన్నం, అన్నంనుంచి రేతస్సు, రేతస్సునుంచి ప్రజలు, ప్రజలనుంచి సారభూతమైన హృదయం, హృదయసారం మనస్సు, మనస్సు నుంచి వాక్కు, వాక్కు నుంచి కర్మలు, కర్మల వల్ల శరీరం ఏర్పడుతున్నదని, శరీరం ఇరా (అన్న) మయమని, ఇరామయం కాబట్టి హితరమణీయమౌతున్నదని, అందువల్లే ఇది హిరణ్మయ[2]" మని ఐతరేయారణ్యకం (2.1.3.) ఎంతో చక్కగా వివరిస్తూ ప్రసిద్ధిని సంపాదించింది.

—ఎస్.బి.ఆర్.

---

1. తం ప్రపదాభ్యాం ప్రాపద్యత బ్రహ్మేమం పురుషమ్. యత్ప్రపదాభ్యాం ప్రాపద్యత బ్రహ్మేమం పురుషం తస్మాత్ప్రపదే. తస్మాత్ప్రపదే ఇత్యాచక్షతే. శఫాః ఖురా ఇత్యన్యేషాం పశూనామ్. తదూర్ధ్వముపసర్పత్తా ఊరూ అభవతామ్. ఉరు గృణీహీత్యబ్రవీత్తదుదరమభవత్. ఉర్వేవ మే కుర్విత్యబ్రవీత్తదురో<sub>2</sub> భవత్. 2.1.4.
2. యద్ధిరా మయా తస్మాద్ధిరణ్మయః 2.1.3.

## 2.1.6 ఉపాసనలు

ఋగ్వేదానికి సంబంధించిన ఆరణ్యకం ఐతరేయారణ్యకం. ఈ ఆరణ్యకంలో కొంతభాగం కర్మకాండ ప్రతిపాదింపబడి, తరువాత జ్ఞాన కాండకు సంబంధించిన విషయాలు ప్రబోధింపబడినాయి. సర్వవ్యాప్త మైన భగవత్తత్వాన్ని అనుభవంలోకి తీసుకువచ్చే ప్రయత్నమే ఉపాసన. ఒక శ్రేష్ఠవస్తువులో పరబ్రహ్మను భావనచేయడం ఉపాసన అవుతుంది.

ఐతరేయారణ్యకంలో ఈ క్రింది ఉపాసనలు ముఖ్యమైనవి –

1. హింకారోపాసన
2. ఉదరోపాసన
3. హృదయోపాసన
4. ప్రాణోపాసన
5. ఆత్మోపాసన
6. సంహితోపాసన
7. నిర్భుజోపాసన

**హింకారోపాసన:**

ఐతరేయారణ్యకంలో ప్రథమారణ్యకంలోని తృతీయాధ్యాయంలో హింకారోపాసన ఉపదేశింపబడింది.

హింకారోత్పత్తి ఈ ఆరణ్యకంలో ఇలా వివరింపబడింది –

'అహం' శబ్దంలో అచ్చుల్ని రెండింటిని వదిలేస్తే 'హం' అవుతుంది. అలాగే 'హం' అనే పదాన్ని హింకరించి అర్థం వివరించాలి. మహా వ్రతాంగమైన ఒకరోజులో నిర్వహింపబడే యాగం ఒకటున్నది. అందులో హింకారం నిష్కేవల్యమౌతున్నది. హింకారంతో ఈ యాగం ప్రారంభమవుతున్నది కనుక ఈ యాగానికి కూడ హింకారమనే

పేరేర్పడింది. ఇది బ్రహ్మ ప్రతిపాదకం. బ్రహ్మప్రాప్తిరూపం కూడా కాబట్టి పరబ్రహ్మమేనని ఉపాసన చేయాలి[1].

ఈ ఆరణ్యకం హింకారాన్ని అనేకరకాల ప్రశంసిస్తున్నది. హింకారం పురుషుడు. ఋక్కు స్త్రీ. ఈ రెండు మిథునం అని ఉపాసన చేసిన వాళ్లకు సంతానం, పశువృద్ధి కలుగుతుందని, హింకార జ్ఞానం చాలా పవిత్రమైందని ఈ ఆరణ్యకం పేర్కొంటున్నది.

గడ్డపారతో ఎలా భూమిని త్రవ్వి పంటలు పండించి ధాన్యసంపదను పొందుతున్నారో అలాగే హింకారమనే గడ్డపారతో వేదాన్ని త్రవ్వి సర్వసమృద్ధుల్ని పొందవచ్చు. గడ్డపారతో త్రవ్వి కృషిచేసేవాడు ఎలా ధాన్యసంపదను పొందుతాడో హింకారోపాసన చేసేవాడు అలాగే తన కోరికలను సిద్ధింప చేసుకుంటాడు.

**ఉదరోపాసన:**

మానవుణ్ణి సృష్టిస్తూ, కాలివేళ్లనుంచి ప్రాణరూపంలో శరీరంలో ప్రవేశించిన పరబ్రహ్మ తొడల వఱకు వచ్చి ఏ అంగం ద్వారా పైకి వ్యాపించిందో అది ఉదరమైంది. "ఉరుగృణీహి" (ఆహారాన్ని దాచుకొనే విస్తీర్ణమైన ఖాళీ ప్రదేశాన్ని నిర్మించు) అని జీవునితో బ్రహ్మ అనడంవల్ల దీనికి ఉదరమనే పేరేర్పడింది[2].

---

1. బ్రహ్మ వై హింకారః; బ్రహ్మైతదహః బ్రహ్మణైవ తద్బ్రహ్మ ప్రతిపద్యతే. య ఏవం వేద – ఐ.అ.1.3.

2. ఉరు గృణీహీత్యబ్రవీత్తదుదరమభవత్.
ఉరు విస్తీర్ణం యథా భవతి తథా గృణీహి నిగరణ యోగ్యం విపులచ్ఛిద్రం కుర్విత్యేవ ముపరితనం శరీరభాగం ప్రత్యూర్వోరవస్థితం బ్రహ్మాబ్రవీత్తస్య బ్రహ్మణః సంకల్పవశాత్తత్స్థాన ముపరితనముదరశబ్దవాచ్యం విపులచ్ఛిద్రమభవత్.

ఐ.అ. పా.భా. 2.1.4.

"ఉదరమే బ్రహ్మ" అని శర్కరాక్షిమహర్షి పుత్రులైన శార్కరాక్ష్యులు ఉపాసన చేశారు. పంచాగ్ని తపస్సులో సూర్యమండలాన్ని వీక్షించడం ద్వారా 'శర్కర' లాగా దృఢమైన కన్నులు గలవాడు కాబట్టి ఈ మహర్షికి శర్కరాక్షుడని ప్రసిద్ధి. ఆయన కొడుకులే శార్కరాక్ష్యులు. వీళ్ల ఉదరాన్నే బ్రహ్మగా ఉపాసన చేసినట్లు తెలుస్తున్నది.

### హృదయోపాసన:

పరబ్రహ్మ ఏ అంగంలో ప్రవేశించి నాకు విస్తీర్ణమైన స్థానాన్ని సంపాదించమని జీవునితో అన్నాడో అదే ఉరస్సు అంటే హృదయమైంది[3]. అరుణమహర్షి పుత్రులు ఆరుణులు హృదయాన్నే బ్రహ్మగా ఉపాసించారు.

### ప్రాణోపాసన:

ప్రాణం శ్రేష్ఠమైంది కాబట్టి దాన్నే బ్రహ్మగా ఉపాసన చేయాలని ఈ ఆరణ్యకం ప్రాణశ్రేష్ఠత్వాన్ని చక్కని ఆఖ్యాయికద్వారా నిరూపిస్తున్నది.

ఒకప్పుడు వాగాది ఇంద్రియాలు "నేను గొప్ప అంటే నేనే గొప్ప" అని కలహించుకున్నాయి. చివరకు అన్నీ కలసి ఇలా ఒక నిర్ణయానికొచ్చాయి. "శరీరం నుంచి మనం ఒక్కొక్కళ్లం బయటికి వెళ్లిపోదాం. ఏది లేకపోతే శరీరం నిలవలేక పడిపోతుందో అది మనందరిలో గొప్పదని అంగీకరిద్దాం." ఆ నిర్ణయం ప్రకారం ముందు వాక్కు బయటకు

3. ఉదరవర్తినో మమ భూయోఽపి విస్తీర్ణమేవ ఛిద్రం కుర్విత్యేవం బ్రహ్మ సంకల్పవశాత్తదేతదుపరితనం స్థానమురః శబ్దవాచ్యం విపులచ్ఛిద్రమభూత్.
ఐ.ఆ. సా.భా. 2.1.4.

వెళ్లింది. వాక్కు లేకపోయినా శరీరం తినడం, తాగటం మొదలగు పనులు చేసుకుంటూ పోతూనే ఉంది. చక్షురింద్రియం వెళ్లిపోయింది. అయినా శరీరం గుడ్డితనంలో కూడా అశనపానాలను చేస్తూనే ఉంది. శ్రోత్రం వెళ్లిపోయింది. చెవిటితనంలో కూడా యథావిధిగా తన పనులను శరీరం నిర్వహించడం మానలేదు. మనస్సు వెళ్లిపోయింది. వివేకం లేని చిత్తంతోకూడా తిండి తీర్థాలు జరిగిపోతున్నాయి. ప్రాణం శరీరం వదలి బయటకు వెళ్లిపోయింది. ప్రాణం పోయేటప్పటికి శరీరం పడిపోయింది[4]. నశించి పోయేది కాబట్టి దీన్ని శరీర మంటారు[5] ప్రాణోత్క్రమణం జరిగిన తర్వాత శరీరం పడిపోవటం కాకతాళీయ మేనని వాగాదులు పరస్పరం కలహించుకున్నాయి. చివఱకు మనం ఒక్కొక్కరం శరీరంలో ప్రవేశిద్దాం. ఎవరు ప్రవేశిస్తే శరీరం మళ్లా పైకి లేస్తుందో అదే ఉక్థం; అంటే ప్రధానమైంది అని నిర్ణయించుకొని, ఒక్కొక్కటే శరీరంలో ప్రవేశించడం మొదలుపెట్టాయి. వాక్కు ప్రవేశించింది. శరీరంలో మార్పులేదు. ప్రాణం ప్రవేశించేటప్పటికి శరీరం లేచింది. అందువల్ల ప్రాణమే ఉక్థమైంది. ఉక్థమంటే సత్యమని కూడా అర్థం.

వాగాది దేవతలు నీవే శ్రేష్ఠమైనదానివని ప్రాణాన్ని అంగీకరించారు. నీవే సమస్తమన్నారు. మాకు నీకు మధ్యగల సంబంధం శేష శేషి భావమన్నారు.[6] ప్రాణమే ఇంద్రియాలనన్నింటిని వాటి వాటి పనుల్లో

---

4. వాఙ్నేత్ర శ్రోత్ర చిత్తేషు సముత్క్రాన్తేషు దేహతః |
మూకాన్ధ బధిరాజ్ఞేషు ప్రభుంజానే శరీరకే ||
తతః ప్రాణే సముత్క్రాన్తే తచ్ఛరీరమపద్యత | మో.ప్ర. 2.1.4
5. శీర్యత ఇతి శరీరమ్.
6. తవాస్మాకం చ సంబంధః శేష శేషిత్వలక్షణః |
మదున్స్యజన్తోఽస్మాంస్త్వం పరిరక్షేతి తేఽబ్రువన్ మో.ప్ర. 178

నియోగించింది. ప్రాణమే ప్రాతఃకాలం, సాయంకాలం పగలు, అపానం రాత్రి, వాక్కు అగ్ని, చక్షువు ఆదిత్యుడు, మనస్సు చంద్రుడు, దిక్కులు శ్రోత్రం – ఇలా పరస్పరం సంగతాలైన వాగాదులకు ప్రాణమే బ్రహ్మ. అంటే ఆశ్రయం.

ప్రాణమే బ్రహ్మ. అదే సత్యం. సత్య శబ్దంలో రెండు తకారాలున్నాయి. 'సచ్చ త్యచ్చాభవత్' అని వేదం చెబుతున్నది. ఎప్పుడూ ఉండేది కాబట్టి సత్. ఇంకో తకారం అన్నవాచకం. సత్ + త్ +యం అన్నప్పుడు 'యం' అనే అక్షరం ఆదిత్యవాచకం. సారథి రథాన్ని నియంత్రించినట్లు ఆదిత్యుడు జగత్తులను నియమిస్తున్నాడు. కాబట్టి 'యం' అనే అక్షరం చేత చెప్పబడుతున్నాడు. కాబట్టి 'సత్యం' అంటే నిత్య, అన్న, ఆదిత్య స్వరూపమైన తత్త్వం అర్థమని తెలుసుకోవాలి. ఇదే త్రివృత్ స్వరూపం. నేత్రం కూడా త్రివృత్ స్వరూపమే. కంట్లో చుట్టూ తెల్లదనం, మధ్యన కనీనికలో నల్లదనం, దానిమధ్యలో తారక – ఈ మూడు అమరి ఉన్నాయి. అందువల్లే కన్ను కూడా త్రివృత్స్వరూపమౌతున్నది.

ఈ ప్రాణానికే గృత్సమదుడని, విశ్వామిత్రుడని, వామదేవుడని, అత్రి అని, భరద్వాజుడని, వసిష్ఠుడని, ప్రగాథ అని, పావమాన్యుడని – ఇలా ఎన్నో పేర్లున్నట్లు ఐతరేయారణ్యకం పేర్కొంటున్నది. ప్రాణాన్ని పరబ్రహ్మగా ఉపాసన చేయాలి.

**ఆత్మోపాసన:**

ఈ ఆరణ్యకం ఆత్మోపాసన నుపదేశిస్తున్నది. ఈ ప్రపంచసృష్టికి ముందు ఆత్మ ఒక్కటే ఉన్నది. ఇక్కడ ఆత్మ అంటే పరమాత్మ అని అర్థం. ఇది ఈ ఆరణ్యకంలో సుప్రసిద్ధమైన వాక్యం–

"ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీన్నాన్యత్కించన మిషత్" సృష్టికి ముందు ఊపిరిగల ప్రాణిజాతం ఏదీలేదు. పరబ్రహ్మ ఒక్కడే ఉన్నాడు. అదే అవ్యక్తావస్థ. లోకాలను సృష్టిస్తానని పరమాత్మ సంకల్పించాడు. ఆయనే అంభస్సు, మరీచులు, మరం (పృథివి) జలం అనే వాటిని సృష్టించాడు. లోక పాలకులను, ఓషధి వనస్పతులను, అగ్న్యాదిదేవతలను కూడా ఆయనే సృష్టిచేశాడు. జీవాత్మలో ప్రవేశించిన ఆ పరబ్రహ్మకు మూడు స్థానాలున్నాయి. సుషుప్తి, జాగ్రత్, స్వప్న దశలు మూడు పరమాత్మ సాహచర్యంవల్లనే జీవునికి కలుగుతున్నాయి. ఆ దశలే స్థానాలు. ఆత్మస్వరూపం తెలియనివాణ్ణే నిద్రించకపోయినా సుప్తుడనే పిలుస్తున్నారు. ఇలాంటి పరమాత్మోపాసనను ఈ ఆరణ్యకం ఉపదేశిస్తున్నది.

**సంహితోపాసన:**

అక్షరాల సంశ్లేషాన్ని సంహిత అంటారు. ఆ సంహితను పరబ్రహ్మగా ఉపాసన చేయడమే సంహితోపాసన.

పృథివి పూర్వరూపం, దివి ఉత్తరరూపం, వాయువు సంహిత అని వాక్పూర్వరూపం, మనస్సు ఉత్తర రూపం, ప్రాణమే సంహిత అని శూరవీరుడైన మాండూకేయుడు చెబుతున్నాడు. శూరుడంటే అనుష్ఠాన దక్షుడు. వాగ్జయాన్ని సంపాదించినవాడు వీరుడు. మాండూకేయునిలో ఈ రెండు లక్షణాలు ఉన్నాయి కాబట్టి ఆయన శూరవీరుడు.

మాండూకేయపుత్రుడు జ్యేష్ఠుడు మనస్సు పూర్వరూపమని, వాగుత్తరరూపమని, ప్రాణమే సంహిత అని చెప్పాడు. పితాపుత్రులిద్దఱు ప్రాణమే సంహిత అనిచెప్పారు. ఈ సంహితనుపాసన చేసినవాళ్లు సంతానాన్ని, పశువులను, కీర్తిని, బ్రహ్మవర్చస్సును, స్వర్గాన్ని ఆయుష్యాన్ని పొందగలరు. ఇలాగే సంహితోపాసనలో శాకల్యాదిమతాలు ఈ ఆరణ్యకంలో వివరంగా పేర్కొనబడ్డాయి.

## నిర్భుజోపాసన:

సమస్తమైన వాక్కును ఉపాసించే పద్ధతి ఈ ఆరణ్యకంలో చెప్ప బడింది. స్పర్శవర్ణాల్లో ('క' నుంచి 'మ' వరకు) పృథివీరూప భావన చేయాలి. ఊష్మవర్ణాల్లో (శషసహ) అన్తరిక్షభావన చేయాలి. అచ్చుల్లో స్వర్గభావన చేయాలి. స్పర్శవర్ణాల్లో అగ్నిభావన చేయాలి. వాయువులో ఊష్మవర్ణాలను, ఆదిత్యునిలో అచ్చులను, ఋగ్వేదంలో స్పర్శవర్ణాలను భావన చేయాలి. ఊష్మ వర్ణాలలో యజుర్వేదాన్ని స్వరాలలో సామ వేదాన్ని, ఇలా వివిధ వర్ణాలలో చేయాల్సిన అనేక భావనలు ఈ ఆరణ్యకంలో ఉపదేశించబడినాయి.

ఇలా ఐతరేయారణ్యకం అనేకోపాసనలను విస్తరంగా వివరిస్తున్నది.

—ఎస్.బి.ఆర్.

## 2.1.7 వైశిష్ట్యం

వేదాలు సంహితలని బ్రాహ్మణాలని రెండు విధాలు. అందులో బ్రాహ్మణాల్లోని ఉత్తరభాగమే ఆరణ్యక మనబడుతోంది. ఆరణ్యకాల్లోని ఉత్తరభాగానికే ఉపనిషత్తని పేరు. అరణ్యంలోనే చదువదగింది కాబట్టి దీనికి ఆరణ్యకమనే పేరేర్పడింది. జనశూన్యమైన ఏకాంత ప్రదేశంలో నియమంగా ఆరణ్యకాలను అధ్యయనం చేయాలి. శాశ్వత పురుషార్థమైన మోక్షం, దాన్ని పొందటానికి కావలసిన ఉపాయాన్ని బోధించడమే ఆరణ్యక గ్రంథాల ముఖ్యోద్దేశ్యం.

పెరుగునుంచి వెన్నను, మలయ పర్వతం నుంచి చందనాన్ని వేదాల నుంచి ఆరణ్యకాన్ని ఓషధులనుంచి అమృతాన్ని సారంగా గ్రహించాలని మహాభారతం వేదసారంగా ఆరణ్యకాలను పేర్కొంటున్నది.[1]

ఆరణ్యకాలలో ఐతరేయారణ్యకం ఒకటి. 'ఇతర' పుత్రుడైన మహిదాసుకే ఐతరేయుడని పేరు. అతనిచేత రచింపబడిన ఆరణ్యకానికే ఐతరేయారణ్యకమని పేరు. ఒక మహర్షికి చాలా మంది భార్యలున్నారు. వారిలో ఒకామెకు ఇతర అనిపేరు. ఇతర పత్నుల కంటే ఆమె విలక్షణమైంది. ఆమె కుమారుడే మహిదాసు. మహర్షికి ఇతరాపుత్రుడైన మహిదాసుపైన మిగత పిల్లల మీదున్నంతటి ప్రేమ లేదు. అందువల్ల అతను ఒక యజ్ఞసభలో మహిదాసును చిన్నచూపు చూసి మిగత పిల్లల్ని తొడమీద కూర్చోపెట్టుకున్నాడు. అప్పుడు తన బిడ్డ చిన్నబుచ్చుకున్నట్లు గమనించి ఇతర తమ కులదేవత భూమిని ప్రార్థించింది. వెంటనే భూదేవి దివ్యమూర్తిని ధరించి యజ్ఞసభకొచ్చి మహిదాసుకు ఒక దివ్యసింహాసనాన్ని వేసి దానిపై అతణ్ణి కూర్చోబెట్టి,

---

1. నవనీతం యథా దధ్నః మలయాచ్చందనం యథా,
ఆరణ్యకం చ వేదేభ్య ఓషధిభ్యోఽమృతం యథా.
మ.భా. ఆది. 331.3

సోదరులందరిలో అతడికి గొప్ప పాండిత్యాన్ని కలిగించి ఈ బ్రాహ్మణాన్ని రచించే శక్తి కలగాలని వరాన్నిచ్చింది. భూదేవి అనుగ్రహం వల్ల అతడి మనస్సులో "అగ్నిర్వై దేవానామవమః" అని ప్రారంభించి, "స్తృణుతే స్తృణుతే" అనే మంత్రం వఱకు గల నలభై అధ్యాయాల బ్రాహ్మణం ప్రాదుర్భవించింది. అటు తరువాత "అథ మహావ్రతమ్" అని ప్రారంభించి "ఆచార్యా ఆచార్యాః" అనే మంత్రం వఱకు గల ఆరణ్యకవ్రత రూపమైన బ్రాహ్మణం గూడా ఏర్పడింది. ఈ ఆఖ్యాయిక సాయణభాష్యంలో కనపడుతోంది.

ఈ ఐతరేయారణ్యకం ఋగ్వేద బ్రాహ్మణాన్తర్గతమైంది. ఇందులో అయిదధ్యాయాలున్నాయి. ఈ అధ్యాయాలకు ఆరణ్యకాలనే పేర్లున్నాయి. అందులో ప్రథమారణ్యకంలో మహావ్రతం వర్ణింపబడింది. రెండో దాంట్లో ఉక్థవర్ణనం. మూడో ఆరణ్యకంలో నిర్భుజాది సంహితా భేదాలు, స్వరాలు, స్పర్శలు, ఊష్మలు మొదలగు వర్ణాల భేదాలు పేర్కొనబడ్డాయి. నాలుగో ఆరణ్యకంలో మహానామ్ని ఋక్కుల సంకలనం కనబడుతోంది. అయిదో ఆరణ్యకంలో మహావ్రతంలో మాధ్యన్దిన సవనానికి సంబంధించిన నిష్కేవల్యమనే శస్త్రం వర్ణింపబడుతోంది.

ఈ ఆరణ్యకం విశిష్టత ఇలా ఉంటుంది -- ప్రథమారణ్యకంలో మహావ్రతదినాన ప్రాతస్సవన – మాధ్యన్దిన సవన -- సాయం సవనాలు, వాటికి సంబంధించిన శస్త్రాలు, విశేషంగా నిష్కేవల్య శస్త్రం విశదపరచబడినాయి. శస్త్రమంటే ప్రగీతమంత్రాలతో సాధింపబడే గుణినిష్ఠ గుణాభిధానం.

ద్వితీయారణ్యకంలో వైదికానుష్ఠానాన్ని అనుసరించే వాళ్లు, దాన్ని ఉల్లంఘించేవాళ్లు ఎలాంటి గతులను పొందుతారో వర్ణింపబడింది. ఉల్లంఘించే వాళ్లకు పక్షి సర్పాది జన్మలు వస్తాయి. అనుసరించే వాళ్ల అగ్ని, ఆదిత్య వాయువులను ఉపాసించి ఉత్తమలోకాన్ని పొందుతారు.

ఇందులో ఉక్థం విశిష్టంగా వర్ణింపబడింది. పృథివి ద్వారానే స్థావర జంగమాత్మకమైన జీవులు ఉత్పన్నమౌతున్నాయి. అందువల్ల పృథివి ఉక్థరూపంగా వర్ణింపబడుతున్నది. ఉక్థమనే శస్త్రానికి అర్చనీయుడైన దేవుడు అగ్నిహోత్రుడు. ఇంకా ఇందులో యజ్ఞపురుషుని గొప్పదనం, ప్రాణం బ్రహ్మోపాధికమని, ఇంద్రియాల్లో ప్రాణం ఉత్కృష్టమైందని పురుషసృష్టికి కారణం, ఇలా అనేక విషయాలు ప్రతిపాదింప బడినాయి.

తృతీయారణ్యకంలో ఆత్మకు సృష్టికి గల సంబంధం, శరీరం భౌతికమనే భావన తెలియజేయబడినాయి. చతుర్థారణ్యకంలో మహానామ్ని ఋక్కుల సంగ్రహం కనబడుతోంది.

పంచమారణ్యకంలో మనుష్య శరీరోత్పత్తి ప్రకారం, జనన-మరణ చక్రంలో భ్రమిసూ్తండటం వల్ల జీవుడనుభవించే క్లేశాలు, ఆత్మస్వరూపం, మొదలగు విషయాలు వర్ణింపబడుతున్నాయి. ఇందులోని పంచమాధ్యాయం ఐతరేయోపనిషత్తని పిలవబడుతోంది. ఇందులో ఆత్మ, ముక్తుల వివరణ, ముక్త్యుపాయప్రతిపాదనం చేయబడినాయి.

మొత్తం మీద ఐతరేయారణ్యకంలో మహావ్రతం విస్తరంగా వర్ణింపబడింది. ఇందులో చాలా మంత్రాలు చెప్పబడి, వాటి వినియోగ ప్రకారం కూడా విశదపరచబడింది.

— ఎస్.ఎస్.ఆర్.

## 2.1.8 సంగ్రహసమీక్ష

ఆరణ్యకాల ననుసరించి ఈ ప్రపంచమంతా యాగమయం. దేవతల నుద్దేశించి యాగద్రవ్యాలను త్యాగం చేయటమే యజ్ఞమనే సిద్ధాంతాన్ని ఆరణ్యకమతానుయాయులంగీకరించటం లేదు. మానవుడు యజ్ఞం ద్వారా సంపాదించిన స్వర్గాది ఫలాలు కాలాంతరంలో నశించిపోతాయి. అందువల్ల శాశ్వతసుఖానికి కర్మ కారణం కాజాలదు. కేవలం ఆ సుఖాన్ని జ్ఞానమార్గం చేత పొందటానికి కూడ వీలులేదు. అందువల్ల జ్ఞానకర్మ సముదాయమే శాశ్వతసుఖానికి హేతువని ఆరణ్యకాలు ప్రతిపాదిస్తున్నాయి. "జ్ఞానకర్మ సముచ్చయ సిద్ధాంతం" ఆరణ్యకాల్లోనే మొదట ఉత్పన్నమైంది. తరువాత వేదాంతాలలో పుష్పించి ఫలవంతమైంది.

ఋగ్వేదానికి సంబంధించిన ఆరణ్యకం ఐతరేయారణ్యకం. ఇది ఐతరేయ బ్రాహ్మణానికి పరిశిష్టంగా ఉంది. ఐతరేయారణ్యకంలో నాలుగు ఆరణ్యకాలున్నాయి. మూడు నాలుగు ఆరణ్యకాల మధ్యలో సకృదుక్తి ఖండాధ్యాయమని ఒక అధ్యాయం ఉంది.

### మొదటి ఆరణ్యకం:

మహావ్రతమనే యజ్ఞంతో ఈ ఆరణ్యకం ప్రారంభమైంది. దేవేంద్రుడు దీన్ననుష్ఠించి గొప్పవాడయ్యాడు. అందువల్ల దీనికి మహావ్రతమని పేరు. గొప్పవాడైన ఇంద్రునిచేత ఈ యజ్ఞం చేయబడినందువల్ల కూడా దీన్ని మహావ్రతమని చెప్పవచ్చు. అన్ని వ్రతాల్లో పెద్దవ్రత మవటంవల్ల కూడా దీన్ని మహావ్రతమని వ్యవహరిస్తున్నారు. చేతివ్రేళ్లు పది, కాలివ్రేళ్లు పది, రెండు కాళ్లు, రెండు చేతులు, పురుషుడు అని ఆత్మ ఇరవై అయిదో తత్వంగా వర్ణింపబడింది (1.1.4; 1.3.8). ఈ

ఆరణ్యకంలో గవామయన, మహావ్రతాల వర్ణన, ప్రాతస్సవనం, మాధ్యం దిన సవనం, సాయంసవనాలనే యాగాలను గురించి ప్రస్తుతింపబడింది.

ఐశ్వర్యం, భోగభాగ్యాలు, కీర్తిప్రతిష్ఠలు, సంతానం, పశువులు, ధాన్యాదిద్రవ్యాలను కోరేవాడు ఈ మహావ్రతాన్ని చేయాలి. కోరిక ననుసరించి ఈయజ్ఞాన్ని చేయాల్సిన కాలం, హోమాలు, మంత్రాలు, క్రమం సుస్పష్టంగా వివరింపబడ్డాయి (1.2.2).

ఇందులో ఎక్కువగా ప్రయోగింపబడ్డ ముఖ్యమైన పదాలు బ్రహ్మ, ఆత్మ, విరాట్, గాయత్రీ, ఛందస్సు, ఇంద్రుడు, అగ్ని, వాయువు, ప్రజాపతి, శిరస్సు, ప్రాణం, గ్రీవం, పుచ్ఛం, జాతవేదసుడు, ద్యావా పృథివీ, విద్వాంసుడు మొదలైనవి విశిష్ట స్థానాన్ని పొంది ఉన్నాయి.

**రెండో అరణ్యకం :**

కర్మకాండ, జ్ఞానకాండల (ఉపనిషత్) పరస్పర సంబంధ విచారాలు, సాధ్యసాధన విషయాలు, బుద్ధిలోని పాపాన్ని పోగొట్టి సుబుద్ధిని కల్పించి, నిశ్చయాత్మకమైన జ్ఞానాన్ని కలిగించడానికి యాగాలు కారణాలని శంకరాచార్యుల వారి ఆశయం. భాష్యకర్త సాయణాచార్యులు ఉపనిషత్తుల లాగానే విషయ ప్రయోజనాధికారి, ప్రమాణ ప్రమేయాలు వీటియొక్క క్రమం దీనిలో ఉందని చెబుతున్నారు. అగ్ని, వాయు, సూర్యుల సంబంధం సూక్ష్మంగా వర్ణితమైంది. భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే పంచభూతాల స్తోత్రాలు కూడ ఇందులో ఉన్నాయి.

మనం ప్రతినిత్యం, అనుక్షణం ఎవరిని ఉపాసిస్తున్నామో అతడెవరు? దేనిచేత చూడటం, వినటం, వాసన చూడటం, మాట్లాడటం, రుచి చూడటం జరుగుతుందో దానికి మూలకారణమేమిటి?

హృదయం, మనస్సు, బుద్ధి, నేత్రం, సత్వరజస్తమోగుణాలు, కామం, యాగానుష్ఠానం, పంచభూతాలు, ఇంద్రాదిదేవతలు, అండ

జాలు, జారుజాలు, స్వేదజాలు, ఉద్భిజ్జాలు మొదలగు చరాచర ప్రపంచం వీటన్నిటికి కారణం జ్ఞానం. ఆ జ్ఞానమే ఆత్మ. ఈ ఆత్మ 'ప్రజ్ఞానేత్రం' అనే పదం చేత ఈ ఆరణ్యకంలో చెప్పబడు తోంది. "ప్రజ్ఞానేత్రం" అనే పదానికి సృష్టి స్థితి లయ కారణాలని అర్థం (2.7.1). ఈ ప్రపంచమంతా జ్ఞానంతో నిండి ఉంది. ఆ జ్ఞానమే ప్రపంచానికి పునాది. అలాంటి జ్ఞానమే బ్రహ్మ. జ్ఞానం కలవాడు జ్ఞాని. జ్ఞానియే ఆత్మ. "జ్ఞానీ త్వాత్మైవ మే మతం" అని భగవద్గీత. అందువల్ల ఈ ఆరణ్యకం చాలా ప్రధానమైంది. జ్ఞానం, కర్మ ఈ రెంటి ఆవశ్యకత, దానివల్ల పరబ్రహ్మప్రాప్తి కూడా ఇందులో విపులీకరింపబడింది.

మూడో ఆరణ్యకం:

విద్యకు ఉత్తముడు, మధ్యముడు, అధముడు అని ముగ్గురు అధి కారులు. సంసారచక్రాన్ని వదలి ఏకాగ్రచిత్తంతో ఎవడు ఆత్మను వశం చేసుకుంటాడో వాడు ఉత్తముడు. అలాంటివాడుపాసించే విద్య బ్రహ్మ విద్య.

"ఉక్థ" మని ఒక విద్యకు పేరు. దీనికి ప్రాణవిద్య అని మరొక పేరు. ఈ విద్యనుపాసించే వాడు మధ్యముడు. ఈ విషయా లన్నీ రెండవ ఆరణ్యకంలో సంగ్రహంగా చెప్పబడ్డాయి. ఈ రెండు విద్యలనుపాసించక ఎవడు సంతానం, పశ్వాదిరూపాలైన భోగభాగ్యాలను కోరుతాడో అలాంటి వాడధముడనీ, వాటికి సంబంధించిన సంహితా రూపమైన ఉపనిషత్తు మూడో ఆరణ్యకంలో ప్రారంభించబడింది.

మనస్సు, వాక్కు, ప్రాణం అనేవి మూడు గుఱ్ఱాలు లేక రథం. ఈ జ్ఞానాన్ని తెలుసుకొన్నవాడికి సంతానం, గోవులు, కీర్తి, ఐశ్వర్యం, స్వర్గప్రాప్తి కలుగుతుంది. అలాంటివాడు జీవితాంతం వరకు సమస్త భోగాలను పొందుతాడని మాండుకేయోపదేశం (3.1.1).

భూమి, ఆకాశం అనే రెండు భిన్నపదార్థాలు ఒకచోట చేరటం చేత వర్షం వస్తుంది. రాత్రంతా మేఘం వర్షించటం చేత ప్రజలు భూమ్యాకాశాలొక్కటైనాయని చెబుతున్నారు. భూమ్యాకాశాలమధ్య వాయువు లేక ప్రాణం లీనమై ఉంది. ఈ మూడు మనుష్యుని దగ్గర ఉన్నాయి. ఆకాశంలో సూర్యచంద్రులే రెండు కళ్లు. ఇవి ప్రకాశంతో కూడుకొన్నాయి. ఈ విషయాలను తెలుసుకొన్న జ్ఞానికి అష్టైశ్వర్య ప్రాప్తి, జీవితాంతం భోగాలు లభిస్తాయి. ఇది శాకల్యోపదేశం (III. 1. 2.). ఇలానే విర్ప్రజ, మాధ్యమ, ప్రాతిబోధి, తార్క్ష్య మొదలైన ఋషులు తమ తమ మతాలను సంగ్రహంగా తెలుపుతున్నారు. స్వర, స్పర్శ, ఊష్మవర్ణాల విచారమిక్కడ ఉంది. సంహితాపదచర్చ కూడ ఉంది. మోక్షమార్గానికి సోపానాలైన ఈ ఉపనిషద్రహస్యాలు గోప్యంగా ఉంచదగినవని చివర చెప్పబడి ఉంది.

సకృదుక్త ఖండాధ్యాయం:

ఐతరేయారణ్యకంలోని ఈ సకృదుక్త ఖండాధ్యాయం చాలా చిన్నది. ఇందులో పదకొండు ఋక్కులున్నాయి. సామవేదానికి మూలమైన "మహానామ్ని" అనే పేరుగల తొమ్మిది ఋక్కులతో కూడిన మంత్రమిది. ఆరురోజులు జరిగే "పృష్ఠ్య" అనే యజ్ఞంలో అయిదవరోజు మధ్యాహ్నం ఈ మంత్రాలు సోమాన్ని తెలియజేస్తాయి. ఈ మహానామ్ని మంత్రాలు మూడు భాగాలుగా విభజింపబడ్డాయి. ఈ మంత్రాలతో కూడ మరొక తొమ్మిది మంత్రాలు పఠింపబడతాయి. వాటికి పురీషపదాలు అని పేరు. మహానామ్నిమంత్రాలు, పురీష పదమంత్రాలు యజ్ఞంలో పఠించేటప్పుడు భేదం ఉంది. మహానామ్నిమంత్రాలు విలిపి విలిపి పఠించాలి. పురీషపదమంత్రాలు పఠించేటప్పుడు పూర్తయ్యేవరకు నిలపాల్సిన అవసరం లేదు.

"విష్ణు, అగ్ని, ఇంద్ర, పూషాది దేవతలారా! ప్రపంచానికి మేలు చేకూర్చండి. సకాలంలో వర్షాన్నిచ్చి, తద్వారా ప్రజలకు కావాల్సిన ఆహార ధాన్యాలను బాగా పండించి దేశాన్ని సుభిక్షంగా ఉంచి

ప్రజలను కాపాడండి." ఈ విధంగా ప్రార్థించి యజ్ఞం చేయటం వల్ల ఆయా దేవతానుగ్రహం చేత సకాలంలో వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా ఉంటుందని మహానామ్నీ మంత్రాలు తెలుపుతున్నాయి (1.1).

**నాలుగో అరణ్యకం:**

ఈ అరణ్యకంలోని మొదటి అరణ్యకంలో ప్రారంభించిన మహావ్రత మనే యజ్ఞప్రభేదాలు, వాటిని చేయాల్సిన విధానం, ఫలాన్ని గురించి వివరింపబడింది. ఈ వ్రతంలో హోమమంత్రాలు ఇరవై అయిదు. సోమ, విశ్వజిత్, వాజపేయ, దర్శపూర్ణమాస యాగాలలాగానే ఈ యజ్ఞంలో కూడ పశుహోమం ఉంది. ఈ యజ్ఞంలో హోత 'మార్జాలీయ' మనే హోమం చేసేటప్పుడు అగ్ని, ఇంద్రుడు, బృహస్పతి, సోముడు, వాగ్దేవత, మిత్రుడు, వరుణుడు, వాయువు మొదలైన దేవతలనుద్దేశించి ఈ విధంగా ప్రార్థిస్తూ హోమం చేస్తాడు. "నేను భూదేవిలాగా స్థిరంగా ఉండాలి. అగ్నిలాగా ప్రకాశించాలి. ఆకాశంలాగా ఎవరికి పొందశక్యంగాని వాణ్ణిగా ఉండాలి. స్వర్గంలాగా శత్రువుచేత తిరస్కరింపబడకూడదు. ఇలానే చంద్రుడు, సూర్యుడు, వాయువు, బుద్ధి మొదలైన వారిలాగా ఉత్తముడైన క్షత్రియుడిలాగా సంపన్నుడుగా ఉండాలి" (4.1.1).

ఈ అరణ్యక పరమోద్దేశ్యం ప్రతి మానవునికి జ్ఞానకర్మల ద్వారానే మోక్షం లభిస్తుందని రెండవ అరణ్యకంలో సుస్పష్టంగా చెప్పబడింది. పక్షులకు రెండు రెక్కలు ఎలా ప్రధానమో మానవునికి జ్ఞానకర్మలు రెండు అంత ప్రధానమైనవి. పక్షిరాజైన గరుత్మంతుడు వేదస్వరూపుడు. వేదాత్మ, వేదశరీరం వినతాసుతుడని మంత్రశాస్త్ర తత్త్వవేదుల యొక్క సిద్ధాంతం. ఇక్కడ అగ్నిస్వరూపం పక్షిఆకారంలో కనబడుతున్న గరుత్మంతుడుగా వర్ణింపబడింది (4.1.5). పక్షి యొక్క కుడిరెక్కకు రథంతరసామ అని, ఎడమరెక్కకు బృహత్సామ అని పేరు. ఇందులో గాయత్రీమంత్రోచ్చారణ, దాని ప్రాశస్త్యం విశేషంగా ప్రస్తుతింపబడింది. ఇదీ సంగ్రహంగా ఐతరేయారణ్యకసారం.

— కె.ఎస్.వి.

# ఆర్షవిజ్ఞానసర్వస్వము

## ఆరణ్యకాలు

# 2 విశేషవిభాగం:

## 2.2 కౌషీతకారణ్యకం:

### 2.2.1 పరిచయం:

ఋగ్వేదానికి సంబంధించిన శాంఖాయనశాఖకు సంబంధించింది కౌషీతకారణ్యకం లేక కౌషీతక్యారణ్యకం. ఋగ్వేదంలో ప్రసిద్ధమైన అయిదు శాఖలలో శాంఖాయన శాఖ ఒకటి. ఈ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం శాంఖాయన బ్రాహ్మణం. దీన్నే కౌషీతకి బ్రాహ్మణమని కూడా అంటారు. ఉద్దాలకుని శిష్యుడు గుణాఖ్యశాంఖాయనుడు. కహోలకౌషీతకి ఇతని దగ్గర వేదాధ్యయనం చేశాడు. ఆయన ప్రవర్తింప జేసిన బ్రాహ్మణం కాబట్టి దీనికి కౌషీతకిబ్రాహ్మణమని పేరొ

చ్చింది. శాఖాప్రవర్తకుడు శాంఖాయనుడు కాబట్టి ఆ పేరుతోను ఈ బ్రాహ్మణం వ్యవహరింపబడుతోంది. ఈ బ్రాహ్మణానికి పరిశిష్టంగానే శాంఖాయనారణ్యకమనే ప్రసిద్ధి గల కౌషీతకారణ్యకం ఏర్పడింది. ఐతరేయోపనిషద్భాష్యంలో శ్రీ శంకరాచార్యులు దీన్ని సంహితోపనిషత్తని పేర్కొన్నారు. ఈ శాఖకు సంబంధించిన వివరాలన్నింటిని వెనుకటి సంపుటాల్లో (ఆ.వి.స. Vol. I. పు. 6; Vol. II. పు. 163) తెలియ జేశాను.

— ఎస్.బి.ఆర్.

## 2.2.2 విభాగం :

కౌషీతకారణ్యకంలో 15 అధ్యాయాలున్నాయి. ఈ 15 అధ్యాయాలలో మొత్తం 137 ఖండలున్నాయి. ఐతరేయారణ్యకంలో అనుసరించిన పద్ధతి ఈ అరణ్యకంలోను కనబడుతుంది. మహావ్రతాచరణ పద్ధతి రెండు అరణ్యకాల్లోను ఒకటిగానే నిరూపించబడింది. ఇందులోని అధ్యాయాలు ఖండల వివరాలు చూడండి.

| అధ్యాయాలు | ఖండలు | అధ్యాయాలు | ఖండలు |
|---|---|---|---|
| 1 | 8 | 8 | 11 |
| 2 | 18 | 9 | 8 |
| 3 | 7 | 10 | 8 |
| 4 | 15 | 11 | 8 |
| 5 | 8 | 12 | 8 |
| 6 | 20 | 13 | 1 |
| 7 | 23 | 14 | 2 |
| | | 15 | 1 |
| | 99 | | + 47 = 146 |

ఇందులోని మొదటి రెండు అధ్యాయాలు శాంఖాయన బ్రాహ్మణమని, మిగత పదమూడు అధ్యాయాలు మాత్రమే అరణ్యకమని కొందలు అభిప్రాయపడుతున్నారు. కాని అరణ్యకాలలో బ్రాహ్మణ గ్రంథచ్ఛాయలు కొన్ని ఉపనిషచ్ఛాయలు కొన్ని ఉండడం సహజం

కాబట్టి, మహావ్రతాన్ని వర్ణించే ఆ రెండు అధ్యాయాలు అరణ్యకమే గాని బ్రాహ్మణం కాదని నిష్కర్ష చేశారు.

**విషయ విభాగం:**

కౌషీతకారణ్యకంలో మహావ్రతం, చిత్రశ్వేతకేతు సంవాదం, ఇంద్రియాఖ్యాయిక, ప్రతర్దన - ఇంద్ర సంవాదం, గార్గ్య - బాలాకి సంవాదం, కాశ్యప - అజాతశత్రు సంవాదం, పురుష వర్ణనం, ప్రాణజ్యేష్ఠత్వం, ఆధ్యాత్మికాగ్నిహోత్రవర్ణనం, మణికల్పం, శ్రవణ మననదిధ్యాసన స్వరూపం, వంశవర్ణనం మొ|| ముఖ్యాంశాలు నిరూపింపబడినాయి.

**మొదలు - చివరు:**

కౌషీతకారణ్యకం "ప్రజాపతిర్వై సంవత్సరః" అనే మంత్రంతో ప్రారంభమై "అథ వంశః నమో బ్రహ్మణే నమ ఆచార్యేభ్యః" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

— ఎస్.బి.ఆర్.

## 2.2.3 సంకలన కాలం:

**దేశం:**

కౌషీతకారణ్యకం భారతదేశంలో ఏ భాగంలో రచింపబడి ఉండ వచ్చుననే అంశం ఇంకా పరిశోధించవలసిందే. కొందఱి అభిప్రాయం ప్రకారం ఉత్తర గుర్జర దేశంలో శాంఖాయన శాఖ బాగా ప్రచారంలో ఉన్నది కాబట్టి అక్కడే కౌషీతకిబ్రాహ్మణం, ఆరణ్యకం రచింపబడినట్లు తెలుస్తున్నది. ఈ అభిప్రాయం మహార్ణవంలోని ఒక శ్లోకం ద్వారా సమర్థించబడుతోంది.[1] కాని శాంఖాయనారణ్యకాన్ని పాఠభేదాలతో సంపాదించిన శ్రీధరశర్మాపాఠక్ ఇలా అభిప్రాయబడుతున్నారు--

"ఈ ఆరణ్యకంలోని ఆరో అధ్యాయంలో గార్గ్య-బాలాకి సంవా దంలో వారు ఉశీనర, మత్స్య, కురు పాంచాల, కాశీ విదేహ దేశాలలో ఉన్నట్లు చెప్పబడింది. ఇవన్నీ మధ్యదేశంలో ఉన్నాయి. కనుక కౌషీ తకబ్రాహ్మణం, ఆరణ్యకం మధ్యదేశంలోనే రచింప బడిందనుకోవడం సమంజసంగా ఉంటుంది."

**కాలం:**

కౌషీతకిబ్రాహ్మణాన్ని ఆచార్య పాణిని, ఆచార్య యాస్కుడు పేర్కొనడాన్ని బట్టి, అందులోని భాష, విషయ నిరూపణ పద్ధతు లను బట్టి అది క్రీ.పూ. 7వ శతాబ్దం చివఱ ఏర్పడి ఉండవచ్చని క్రిందటి సంపుటంలో (ఆ.వి.స. Vol.II 168) పేర్కొన్నాను. ఆర ణ్యకం బ్రాహ్మణానికి పరిశిష్టమే కాబట్టి కౌషీతకారణ్యకం కూడా క్రీ.పూ.

---

1. ఉత్తరే గుర్జరే దేశే వేదో బహ్వృచ ఈరితః|
కౌశీతకి బ్రాహ్మణం చ శాఖా శాంఖాయనీ స్థితా||

7వ శతాబ్దం చివఱిలో రచింపబడిందను కోవడం సత్యదూరం కాదనిపి స్తున్నది. అయినా ఈ కాలనిర్ణయాన్ని సంప్రదాయవాదు లంగీకరించరు.

— ఎస్.బి.ఆర్.

# 2.2.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

**వ్యాఖ్యానాలు:**

శాంఖాయనారణ్యకానికి సాయణభాష్యం లేదు. ఇతర ఆరణ్యకాలకు, భాష్యాలు వ్రాసినవాళ్ళు కూడా ఈ ఆరణ్యకాని కెందుకో ఎలాంటి భాష్యమూ వ్రాయలేదు. ఉదయుడు వ్రాసిన వ్యాఖ్యానం కౌషీతకిబ్రాహ్మణానికే గాని ఆరణ్యకానికున్నట్లు తెలియడం లేదు. ఐతరేయారణ్యకానికి భాష్యం వ్రాసిన సాయణాచార్యుడు ప్రతిపాద్య విషయంలో పెద్దగా భేదం లేకపోవడం వల్ల దీనికి భాష్యం వ్రాయలేదేమో ననిపిస్తున్నది.

**ప్రచురణలు:**

శాంఖాయనారణ్యకం మొట్టమొదట ఇ.బి.కోవెల్. (E.B. Cowell) సంపాదకత్వంలో 1861లో కలకత్తానుంచి వెలువడింది. ఈ ఆరణ్యకం లోని మొదటి రెండధ్యాయాలు డా. వాల్టర్ ఫ్రెండ్‌లండర్ ( Dr. Walter Friendlunder) సంపాదకత్వంలో ఆంగ్లానువాదంతో 1900 సం॥లో బెర్లిన్ నుంచి ప్రచురించబడ్డాయి. మూడో అధ్యాయం నుంచ ఏడో అధ్యాయం వఱకు దీన్ని ఇ.బి. కోవెల్ కలకత్తానుంచి 1901లో ప్రకటించాడు. ఏడో అధ్యాయం నుంచి పదిహేనో అధ్యాయం వఱకు ఈ ఆరణ్యకం ఎ.బి.కీథ్ (A.B. Keith) సంపాదకత్వంలో 1909 లో ఆక్స్‌ఫర్డ్ నుంచి ప్రచురింపబడింది. 1922లో పూనాలోని ఆనందాశ్రమం తరపున శాంఖాయనారణ్యకాన్ని పూర్తిగా శ్రీధరశర్మ పాఠక్ ప్రచురించాడు.

—ఎస్.బి.ఆర్

## 2.2.5 ప్రసిద్ధి:

శాంఖాయనారణ్యకమనే ప్రసిద్ధికల కౌషీతకారణ్యకంలో ఎన్నో విశేషాలు వర్ణింపబడినా దీనికి ఎవ్వరూ భాష్యంగాని, వ్యాఖ్యానంగాని వ్రాయకపోవడం వల్ల ఎక్కువగా ప్రసిద్ధి కలగలేదు. సాయణుడు దీనికి భాష్యం వ్రాయకపోవడం వల్ల నిజానికి దీనికి రావలసినంత ప్రసిద్ధి రాలేదు. ఈ అరణ్యకంలో ఎన్నో కొత్త భావనలు చోటు చేసుకున్నాయి. అధ్యాత్మికాగ్నిహోత్రాన్ని ఈ అరణ్యకం ఇలా అభివర్ణిస్తున్నది–

> "జీవుని ప్రాణమే ఆహవనీయం, అపానమే గార్హపత్యం, వ్యానమే అన్వాహార్యం, మనస్సే ధూమం, కోపమే అర్చకుడు, బొగ్గులు శ్రద్ధ, పాలే వాక్కు, సమిధలే సత్యం, ఆహుతి ప్రజ్ఞాత్మ[1]"

వైరాగ్యంతో శరీరాన్ని సంస్కరించాలని, ఆ పైన బ్రహ్మయజ్ఞనిష్ఠతో జీవించాలని, అలా జీవించేవాడికి అపమృత్యుభయం ఉండదని, ఆత్మను దర్శించి, విని, మననం చేసి, మనస్సులో స్థిరంగా ఆ స్వరూపం నిలబడేటట్లు చేసుకోవాలని ప్రతిపాదిస్తూ ఈ అరణ్యకం ఎంతో ప్రసిద్ధిని సంపాదిస్తున్నది.

కేవలం వేదాన్ని కంఠస్థం చేయడంతో సరిపోదు. వేదార్థాన్ని గ్రహించాలి. అలా అర్థాన్ని గ్రహించకుండా శబ్దరాశిని మాత్రం ధరించేవాడు భారవాహి అవుతున్నాడు. వేదార్థం తెలిసినవాడు సకల

---

1. శాం. అత్ర ప్రదేశద్వైరాజం దశవిధ మగ్నిహోత్రం భవతి. తస్య ప్రాణ ఏవాహవనీయోఽపానో గార్హపత్యో వ్యానోఽన్వాహార్య పచనో మనో ధూమో మన్యురర్చిరయుతా అంగారాః శ్రద్ధా పయో వాక్ సమిత్సత్య-మాహుతిః ప్రజ్ఞాత్మా స రసః. 10-8.

శ్రేయస్సులను పొందుతున్నాడు. పాపాన్ని పోగొట్టుకొని స్వర్గాన్ని పొంద గలుగుతున్నాడనే సుప్రసిద్ధమైన భావనను ఈ అరణ్యకం నిరూపిస్తున్నది.[2]

—ఎస్.బి.ఆర్.

2. స్థాణురయం భారహారః కిలాభూదధీత్య వేదం న విజానాతి 'యోఽర్థమ్।
యోఽర్థజ్ఞ ఇత్సకలం భద్రమశ్నుతే నాకమేతి జ్ఞాన విధూత పాప్మా॥
14.2.

## 2.2.6 ఉపాసనలు:

శాంఖాయనశాఖకు సంబంధించింది కౌషీతకారణ్యకం. ఇందులో అనేక ఉపాసనాక్రమాలు వివరింపబడ్డాయి.

1. మహావ్రతం 2. హింకార వర్ణనం 3. చిత్ర గాంగాయని - శ్వేతకేతు - ఆరుణి తత్త్వవిషయిక చర్చ, 4. కౌషీతకి పైఙ్గ్య - శుష్క భృంగారోక్తమైన కల్పాలు, వాటి వాటి గొప్పతనాన్ని చాటు కోవడానికి వాదించుకొనే ఇంద్రియాల కథ. అందులో ప్రాణ శ్రేష్ఠత్వ నిరూపణ 5. దివోదాస పుత్రుడగు ప్రతర్దనుడు - ఇంద్రులమధ్య తత్త్వ జ్ఞాన విషయక సంవాదం 6. గార్గ్యుడైన బాలాకి - అజాత శత్రువుల బ్రహ్మవిషయక సంవాదం 7. సంహితోపనిషద్వివరణ 8. ప్రాణోపాసన - శరీర పురుష ఛందః పురుష, వేదపురుష, మహా పురుషులనే చతుర్విధ పురుషుల వివరాలు, 9. జ్యేష్ఠత్వ శ్రేష్ఠత్వ గుణాల ద్వారా ప్రాణోపాసన ఇంద్రియ సంవాదం ఆధారంగా ప్రజాపతి చేసిన ప్రాణశ్రేష్ఠత్వ ప్రతిపాదన, 10. ఆధ్యాత్మికాగ్ని వర్ణనం, 11. అగ్న్యాది దేవతలయందు పురుషరూపోపాసన; స్వప్నాలు - వాటి ఫలితాలు; తత్తల పరిహారార్థం హోమరూపశాంతి కర్మల వివరణ; ఆశీస్సులు - ప్రార్థనలు, 12. ఆశీః ప్రార్థనల ఫలకథనం. మణికల్ప అనుష్ఠాన ప్రకార వర్ణనం, 13. శ్రవణ మనన నిదిధ్యాసనాదుల ప్రతిపాదన, 14. ఋగాది వేదత్రయాన్ని అధ్యయనం చేయని వారిని, అర్థజ్ఞానశూన్యుల్నీ నిందించడం, 15. గురుపరంపర వివరణ.

పైన వివరించిన విషయాలలో ముఖ్యంగా ఉపాసనాసంబంధమైన అంశాలను ఎన్నుకొని కొంత విషయ వివేచనం జరుపుదాం. బృహదారణ్యకోపనిషత్ వంటి ముఖ్యోపనిషత్తులలో లాగ ఈగ్రంథంలో అనేక ఉపాసనా క్రమాలు వివరింపబడ్డాయి. ఉపాసనా వివరణాలతో నిండియుండటం బట్టి దీనికి ఉపనిషత్ అనేపేరు ఏర్పడింది. అలా

సాంఖ్యాయన లేదా కౌషీతక ఆరణ్యకం అని పిలువబడే ఈగ్రంథం ప్రాచీన ఉపాసనా విధుల్ని ఎన్నింటినో ప్రబోధిస్తున్నది.

వైదికసాహిత్యంలో చెప్పే ఉపాసనా రీతి అనేక సంకేతార్థాలతో నిండి ఉంది. ఉదాహరణకి మొదటగా మహావ్రతాన్ని తీసుకొందాం. మహావ్రతం సూక్ష్మ సంకేతాలతో ఇలా వర్ణితమైంది. ప్రజాపతి అనే ఒక వైదికదైవం ఒక సంవత్సరానికి సంకేతంగా చెప్పబడితే మహావ్రతం అనేది ప్రజాపతియొక్క శరీరం అని సూచింపబడుతుంది. మహావ్రతం ప్రజాపతి శరీరమే కాదు, ఇంద్రుని శరీరం అనికూడ వర్ణితమైంది. అలాగే ఋక్, యజుః, సామ మంత్రాలతో నిర్మితమైన పురుషశరీరం అనికూడ చెప్పబడుతుంది. ఇక్కడ ఒక విశేషం ఉంది. మహావ్రత స్తోమం ఇరవై అయిదు భాగాలతో నిండి ఉంది. సంవత్సరానికి ఇరవైనాలుగు పక్షాలు. సంవత్సరంగా ఊహింపబడ్డ ప్రజాపతి ఇరువది ఐదవ తత్త్వంగా తెలుస్తుంది. మహావ్రతంలో వినియోగింపబడే ఆజ్య శస్త్రం అనేది పన్నెండు అనువాకాల మంత్రం. ఈ పన్నెండు సంఖ్య పన్నెండు నెలలు గలిగిన సంవత్సరానికి సంకేతం. ఆ సంవత్సరం ప్రజాపతి. ఇలా నడుస్తుంది వైదికుల ఆలోచనా పద్ధతి. సామాన్యంగా ఒక యజ్ఞప్రక్రియనో, వ్రతవిధానాన్నో సంకేతాలతో ఇమిడ్చి ఆయా కలాపాలలోని యాంత్రికతను పోగొట్టి ఉపాసనా ప్రక్రియతో మనస్సుని ఉన్నతోన్నత స్థాయిలోనికి తీసుకొని వెళ్ళడం ఈ పద్ధతిలోని విశేషం.

ఈ మహావ్రత పద్ధతిలోనే మరో అంశం. స్త్రీ పుం శక్తుల కలయికను సూచించాలని భావిస్తే వైదిక భావుకుడు ఆ భావనని ఉచ్చరించే మంత్రాలకు, నిర్వహించే కర్మకలాపాలకు ముడిపెట్టి వ్యాఖ్యానిస్తాడు. పుంలింగమైన మహాన్ స్త్రీశక్తియైన మహతిలో కలుస్తుంది. ఈ భావనని ముందుకు తీసుకుపోతూ అగ్ని మహాన్ అయితే పృథివి మహతి అవుతుంది. వాయువు మహాన్ అయితే అంతరిక్షం మహతి అవుతుంది.

బ్రహ్మ మహాన్ అయి బ్రాహ్మణితో కలుస్తుంది. సూర్యుడు బ్రహ్మనికి సంకేతమైతే స్వర్గం బ్రహ్మణికి చిహ్నమవుతుంది.

ఇదే విషయాన్ని ఒక కథగా చెప్పి మన మనస్సుకి పట్టేట్లు చేస్తుంది వైదిక సాహిత్యం. ఈ సందర్భంలో కథ ఇది.

విశ్వామిత్రుడు తన వ్రతాచరణబలంతో, శస్త్రాధ్యయన విద్యా సామర్థ్యంతో ఒకసారి ఇంద్రధామానికి వెళ్ళాడు. ఇంద్రుడు అతనితో– "ఒక వరం కోరుకోవయ్యా విశ్వామిత్రా!" అంటే, విశ్వామిత్ర ఋషి– "నిన్ను తెలుసుకొనే జ్ఞానం నాకు ప్రసాదించు. అదేచాలు నాకు" అంటాడు. ఇంద్రుడు మళ్లీ మళ్ళీ రెట్టిస్తూ ఏదైనా వరం కోరుకోమని విశ్వామిత్రుణ్ణి ప్రేరేపిస్తాడు. విశ్వామిత్రుడు రెండోసారి, మూడోసారి కూడ"నిన్ను గురించిన జ్ఞానమే కావా"లని ఇంద్రుణ్ణే అభ్యర్థిస్తాడు. చిట్టచివరకు ఇంద్రుడు ఇలా సమాధానమిస్తాడు. "చూడు మహర్షీ! నేనే మహాన్. మహతిని కూడా నేనే. దేవదేవీతత్త్వాల సమన్వయం నేనే. బ్రహ్మం, బ్రహ్మణి కూడ నేనే. అలా స్త్రీపుం శబ్దాల సామరస్య రూపాన్ని నేనని తెలుసుకోవాలి." విశ్వామిత్రుడు ఈ విషయాన్ని ఇంకా తెలుసుకోవాలని అభిలషిస్తాడు. ఇంద్రుడు ఈ మాటలతో తన బోధ ముగిస్తాడు. "నేను ఇంతకు ముందు చెప్పిన రీతిగా ఉంటుంది నా తత్త్వం. అది స్త్రీ పురుష విభేదాన్ని అధిగమించే తత్త్వం. ఇంకా ఏం చెప్పాలి! సరిగ్గా అర్థం చేసుకొంటే పెద్ద పెద్ద తపశ్చర్యలు చేయకపోయినా నాలాగా ఎవడైనా ఏకైక తత్త్వస్థితిని సాధనవల్ల అందుకోగలడు."

ఒక మంత్రం "హిం" కారంతో ప్రారంభమవుతుంది. ఆ "హిం" అనే శబ్దాన్ని ఉపాసనకి అనువుగా ఇలా మలుచు కోవడం జరుగుతుంది. ఆ "హి" అనే శబ్దం ప్రాణంగా, అమృతతత్త్వంగా భావింపబడుతుంది. ఉపాసింపబడుతుంది.

ఉపాసన చేసే సాధకునికి గర్వలేశం మిగిలిఉండకూడదు అనే అంశాన్ని ఈ వైదిక ఆఖ్యాయిక తెలియుపరుస్తుంది. చిత్ర - గాంగ్యాయనులు ఒక యజ్ఞం తలపెట్టి ఆరుణి అనే మహర్షిని ఋత్విక్కుగా ఎన్నుకొన్నారు. ఆరుణి తను స్వయంగా యజ్ఞానికి వెళ్ళకుండా తన కొడుకు శ్వేతకేతువును పంపాడు. అతను వెళ్ళగానే రాజైన గాంగ్యాయనుడు ఇలా అడిగాడు. "ఋషి కుమారా! ఈ ప్రపంచంలో ఏదైనా నన్ను దాచి ఉంచే రహస్య ప్రదేశం ఉందా!" దానికి శ్వేతకేతువు -- "నాకు తెలియదు. మా ఆచార్యవర్యుడైన పితృపాదులను అడిగివస్తా"నని వెళ్ళి తండ్రి నడిగితే నాకూ తెలియదు. నీకెలా చెప్పేది? మనమంతా కలసి ఆ రాజు వద్దకే వెళ్దామని" తండ్రి అన్నాడు. తర్వాత వారిద్దరూ ఆ విషయాన్ని గురించి వివరించమని గాంగ్యాయనున్ణ్ణే కోరారు. ఆయన అప్పుడు "మీరు బ్రహ్మజ్ఞానాన్ని పొందేందుకు నిజంగా అర్హులు. కారణం మీలో లేశమాత్రం కూడా గర్వం లేదు. తెలియనిది తెలుసు అని చెప్పుకొనే ఆర్భాటం కూడ లేదు" అని విషయాన్ని వివరిస్తాడు. తనకి తెలిసిన రీతిగా వారికి జ్ఞానబోధ చేస్తాడు.

ఈ గ్రంథంలో కౌషీతకీ మహర్షి "ప్రాణమే బ్రహ్మ" అని బ్రహ్మతత్త్వాన్ని ప్రాణంగా ఉపాసన చేసే విధానాన్ని సూచిస్తాడు. ఇలాగే పైఙ్గ్యుడు కూడ వివరిస్తాడు. శుష్కభృంగారుడనే వాడు ఋక్కును బ్రహ్మంగా ఉపాసించాల్సింది అని అంటాడు.

ప్రతర్దన దైవోదాసుడు యుద్ధ సామర్థ్యాన్ని, పౌరుషాన్ని ఆధారంగా చేసుకొని "ఇంద్రధామాన్ని" చేరుకొన్నాడు. ఇంద్రుడు ప్రతర్దనుని ఒక వరం కోరుకోమన్నాడు. అప్పుడు ప్రతర్దనుడు మనుష్యునికి ఏవరం కావాలో ఆ వరాన్ని నువ్వే నాకు ఎన్నికచేసి ఇవ్వమన్నాడు. అధికుడు అల్పునికి ఎన్నిక చేయడం సులభం కాదు. కాబట్టి నీ వరం నీవే కోరుక్ అంటాడు ఇంద్రుడు. ప్రతర్దనుడు -- "అయితే ఇంద్రా! నీ

వద్ద నాకోసం ఇవ్వవలసిన వరమే లేదు" అన్నాడు. అప్పుడు ఇంద్రుడు తాను సాక్షాత్తు సత్యం కాబట్టి తన సత్యపథాన్నుంచి వైదొలగకుండా ఇలా చెప్పాడు. "ప్రతర్దనా! కోరుకోకపోయినా మనిషికి ఏది కావాలో చెప్పతున్నా, విను. నన్నే తెలుసుకో." అలా ఇంద్రుడు చెప్తూ "నన్ను ప్రాణంగా, ప్రజ్ఞాతగా, ఆయువుగా, అమృతత్త్వంగా భావించి ఉపాసించమని ఉపదేశిస్తాడు."

గార్గ్యబాలాకి మంచి వేదాధ్యయన పరుడు. కురు పాంచాల కాశీ మొదలైన దేశాలను పర్యటించాడు. ఒకసారి కాశీరాజు అజాతశత్రువు దగ్గరికి వెళ్ళి "బ్రహ్మతత్త్వాన్ని గురించి నీకు వివరిస్తా" అన్నాడు. ఈ సంభాషణలో అనేక ఉపాసనా క్రమాలు వివరింపబడ్డాయి. మొదట బ్రహ్మతత్త్వాన్ని సూర్యరూపంగా, చంద్రుని రూపంగా, విద్యుద్రూపంగా - ఇలా ఎన్నో రకాలుగా వర్ణించవచ్చునని బాలాకి చెప్పకు పోతూ వుంటే, వాటికి అజాతశత్రువు అడ్డంకులు చెప్తూ ఆక్షేపణలు చేస్తాడు. చివ రికి బాలాకి ఒక చోట ఆగిపోతాడు. అప్పుడు "ఇంతేనా, ఇంకేమైనా చెప్పవలసి ఉందా?" అని అజాతశత్రువడిగితే బాలాకి "ఇంతే" నని సమాధానమిస్తాడు.

అప్పుడు అజాతశత్రువిలా అంటాడు "బాలాకీ! నేను బ్రహ్మ తత్త్వాన్ని ఉపదేశం చేస్తానంటూ నేను అనవసర ప్రసంగాలు చేసేట్లు చేయకు. బ్రహ్మతత్త్వం ప్రసంగాలకీ, ప్రవచనాలకీ అతీతం సుమా!" బాలాకి సిగ్గుపడి పోయాడు. తన వాచాలత్వం తెలుసుకున్నాడు. అజాత శత్రువునే ఆత్మతత్త్వాన్ని ఉపదేశించమని అన్నాడు. అప్పుడు ఆత్మత త్త్వాన్ని అజాతశత్రువు బాలాకికి వివరిస్తాడు.

ఉపాసనా పద్ధతిలో ఒక విలక్షణమైన తీరు ఒకచోట చెప్పబడ్డది. పృథివి పూర్వరూపం అయితే దివి ఉత్తరరూపం. వాయువు వాటిని

సంధానం చేసే సంహిత. ఇలా అని మాండుకేయుడంటాడు. ఇలాంటి పద్ధతిలో అనేక వ్యాఖ్యానాలు చేయబడతాయి.

తరువాత శాకల్యుడు అనే ఋషి ప్రాణం వెదురుబొంగుతో పోల్చి ఇలా ఊహిస్తాడు. చిన్న చిన్న వెదురు బొంగులు ఒక శాలలో ప్రధానమైన దూలం మీద ఆధారపడి యున్నట్లు సర్వమైన ఆత్మ ప్రాణం మీద ఆధారపడి ఉంటుంది. ఈ ప్రాణం ఊష్మరూపం. ఎముకలు స్పర్శరూపం. మజ్జ స్వర రూపం. ఇలా అచ్చులకు తదితర అక్షర విశేషాలకు శరీర భాగాలు, ప్రాణం అనుసంధింప బడినాయి. అక్షర సముదాయాలతో ఉపాసించ వలసిన అనేక విషయాలను అనుసంధించి చెప్పడం ఒక పద్ధతి.

మరో ఉదాహరణ: సూర్యుణ్ణి ఉపాసించాలనుకోండి. మనలో ఉన్న అంతరాత్మ, సూర్యుడిలో ఉన్న ఆత్మతత్త్వం ఒక్కటే అని చెప్తూ అలా భావించి ఉపాసించాలి, అనే ఒక ఉపాసనా విధి చెప్ప బడుతుంది. మనుష్యుడు ఆత్మావబోధ లేక అజ్ఞుడై ద్వైతభావంతో కొట్టు మిట్టాడుతున్నప్పుడు ఈ అశరీరమైన ప్రజ్ఞాత ఆ అంతరిక్షంలో వెలిగిపోయే దూరంగా ఉన్న సూర్యుడు, తత్త్వతః ఒక్కటే, అని భావించి ధ్యానించే ఉపాసన సూచింపబడుతుంది.

అగ్నిహోత్రం అనేక వైదిక యజ్ఞయాగాలకు, కర్మ కలాపాలకు ఆధారభూతం. ఈ అగ్నిహోత్రాన్ని అంతరంగికమైన ఆధ్యాత్మికాగ్నితో పోల్చి, ఆత్మని అగ్నిగా భావించి ఉపాసించే విధి ఒకటి చెప్పబడింది. అసలు దేవతలంతా పురుషులలోనే ప్రతిష్ఠితమై ఉన్నారని భావించబడింది. అగ్ని వాక్కులో, వాయువు ప్రాణంలో, సూర్యుడు నేత్రయుగ్మంలో, చంద్రుడు మనస్సులో, అన్ని దిక్కులు శ్రోత్రేంద్రియంలో, జలం రేతస్సులో భావింపబడి ఉపాసించే క్రమం వివరింప బడింది.

మనుష్యుణ్ణే సర్వదేవతలకూ నిలయంగా చేసి మనుష్యత్వంలోనే దివ్యత్వ శక్తి కలగడానికి తగిన ఉపాసనావిధులు ఈ గ్రంథంలో పొందు పరచబడియున్నాయి. ప్రజాపతి ఈ పురుషుణ్ణి దివ్యత్వస్థాయికి తీసుకు పోవడానికి అందరు దేవతలు ఈ పురుషుడిలోనే నివసించేట్లు చేశాడు. ఈ పురుషుని వాక్కులో అగ్ని, ప్రాణంలో వాయువు, అపానంలో విద్యుత్, ఉదానంలో పర్జన్యుడు, చక్షువులలో సూర్యుడు, మనస్సులో చంద్రుడు, శ్రోత్రేంద్రియంలో దిక్కులు, శరీరంలో పృథివి, రేతస్సులో జలం, బలంలో ఇంద్రుడు, కోపంలో ఈశానుడు, తలలో ఆకాశం, ఆత్మలో బ్రహ్మ, ఇలా పురుషునిలో దేవతలు, పంచ భూతాలు, అన్ని దిక్కులు నివసించి ఉంటాయి అని చెప్పటంలో పురుషుని దివ్యోన్నత స్థాయికి తీసుకొని వెళ్ళడం ఆంతర్యం.

సారాంశంగా ముఖ్యమైన విషయం శరీరాన్ని సంస్కరించి, దివ్యత్వ సిద్ధి కలిగించి ఆ శరీరంలోనే బ్రహ్మయజ్ఞాన్ని నిర్వహించటం సూచింపబడుతుంది. అలా బ్రహ్మయజ్ఞనిష్ఠుడైన పురుషుడు మృత్యువును అలా దూరదూరంగా పారదోలేస్తాడు.

కౌషీతకి మహర్షి, మనుష్యుడు తన పాపాల నుంచి ముక్తుడవ్వాలంటే ముఖ్యంగా మూడు ఉపాసనా విధులను గురించి చెప్తాడు. పాపవిముక్తికి మనుష్యుడు సూర్యుణ్ణి ఉదయించే వేళ, మధ్యాహ్న సమయంలో ఆకాశమధ్యంలో వెలుగొందే వేళ, అస్తమించే సమయంలో ఆరాధించాలంటాడు. తన సంతానం యొక్క దురదృష్టాలను దూరం చేయటానికి అతడు చంద్రుణ్ణి ఉపాసించాలి. పూర్ణచంద్రుణ్ణి ఉపాసిస్తే అతనికి ఐశ్వర్యం వెంటనంటి వస్తుంది. అతని పిల్లలు ఎప్పుడూ అతనికి ముందుగా చనిపోరు. ఈ గ్రంథంలోని ఉపనిషద్భాగంలో ముఖ్యంగా నలుగురు తమతమ సందేశాల్ని చెబుతారు. వారే కౌషీతకి-పైఙ్గ్య, ప్రతర్దన-శుష్కభృంగారకులు అనేవారు. అందులో కౌషీతకి ప్రాణంబ్రహ్మతత్త్వం అంటాడు.

కొద్దో గొప్పో పైజ్ఞ్యుడు ప్రాణం బ్రహ్మ అని ఒప్పుకుంటూ కొన్ని కొత్త విశేషాలు చెబుతాడు. ప్రతర్దనుడు కొంత స్వేచ్ఛగా ఆలోచించే తాత్త్వికుడు. బహిరంగమైన యజ్ఞకలాపాల్ని అవి యిచ్చే ఫలాలను పక్కకు నెట్టి, అంతరంగికమైన ఆధ్యాత్మిక అగ్నిహోత్ర భావనను ప్రతిపాదిస్తాడు. అంతరంగికమైన అగ్నిహోత్రంలో వాక్కు ప్రాణం అనే రెండు హవిస్సులను గురించి అభిలషిస్తాడు. శుష్కభృంగారకుడు ఉక్థమే బ్రహ్మం అని నిర్వచించి ఋగ్యజుస్సామ వేదాల రూపంలో ఆ బ్రహ్మ తత్త్వాన్ని ఉపాసించాలంటాడు.

—డి.ఎస్.బి.

## 2.2.7 వైశిష్ట్యం

ఆరణ్యకాలు కొంతవఱకు కర్మలను ప్రతిపాదించినా ప్రధానంగా జ్ఞానాన్ని ఉపాసనలను బోధిస్తున్నాయి. ఉపాసనా విధానాన్ని సమగ్రంగా వివరించే ఆరణ్యకాల్లో కౌషీతకారణ్యకం విశిష్టమైంది. శాంఖాయనారణ్యకం కౌషీతకారణ్యకం అని వ్యవహారంలో భేదమే గాని గ్రంథం ఒకటే. ఈ ఆరణ్యకం మహావ్రతోపాసన, సంహితోపాసన, అక్షరోపాసన, ప్రాణోపాసన, పురుషచాతుర్విధ్యం, ణకార షకారాల ప్రాధాన్యం, శరీరాన్ని ఆవేశించే దేవతలు, మరణ సూచకారిష్టాలు, స్వప్నవిశేషాలు, బ్రహ్మతత్త్వం మొదలైన అంశాలను ఎంతో విశిష్టంగా నిరూపించింది.

**మహావ్రతోపాసన:**

ఋగ్యజుస్సామ మయమైన వేదరాశి ఇంద్రుని ఆత్మస్వరూపం. ఈ ఆత్మస్వరూపాన్ని ఉపాసించడమే మహావ్రతోపాసన. ఇది ఒక సంవత్సరకాలం చేయబడుతుంది. ఇతరారణ్యకాలు మహావ్రతోపాసనను ప్రతిపాదించినా కౌషీతకారణ్యకం దాన్ని నిరూపించిన పద్ధతి ఎంతో విశిష్టంగా కనబడుతున్నది.

**సంహితోపాసన:**

ఈ ఆరణ్యకంలో ఏడో అధ్యాయంలో సంహితోపనిషత్తనే పేరుతో సంహితోపాసన వర్ణింపబడింది. సంహితోపాసన అధిదైవతం, అధ్యాత్మం అని రెండు విధాలు. ఈ సందర్భంలో పృథివ్యాదులకన్నింటికి పూర్వ రూపం, ఉత్తర రూపం, సంహిత, సంధి, సంధాత అని అయిదు రకాల అంశాలను ఈ ఆరణ్యకం ప్రతిపాదిస్తున్నది. ఈ అయిదు అంగాలతో కూడిన అధిదైవతాధ్యాత్మ విధానాలను వివిధాంశాలకు ఎవరు తెలుసుకొని ఉపాసన చేస్తారో వాళ్ళకు పశువులు, కీర్తి, బ్రహ్మవర్చస్సు, స్వర్గలోకం లభిస్తాయని ఈ ఆరణ్యకం వివరిస్తున్నది.

**అక్షరోపాసన:**

మాండుకేయుడు వివరించిన అక్షరోపాసనను ఈ ఆరణ్యకం ఎంతో చక్కగా ఇలా నిరూపిస్తున్నది.

ఒకపదంలో పూర్వాక్షరమే పూర్వరూపం, ఉత్తరాక్షరమే ఉత్తర రూపం, పూర్వరూపోత్తర రూపాక్షరాల మధ్యలో ఉండి సంధిని కలిగిస్తున్న మాత్ర ఏదైతే ఉందో, ఏది ప్రతి మాత్రను విభజిస్తున్నదో, ఏది ప్రతి స్వరాన్ని తెలియజేస్తున్నదో అదే సంహిత. ఎవరు ఈ సంహితను తెలిసికొని సంధిస్తాడో అతడికి సంతానం, పశువులు, కీర్తి, బ్రహ్మతేజస్సు, స్వర్గం, పూర్ణాయుర్దాయం లభిస్తాయి[1].

ఇలాంటి ఉపాసనలను ఈ ఆరణ్యకంలో కౌంఠరవ్యుడు, భార్గవుడు, శాకల్యుడు, కాశ్యపుడు, పంచాల చండుడు, తార్క్ష్యుడు, ఆర్తభాగుడు, వాలిశిఖాయని, లౌహిక్యుడు మొ|| వారు ఎంతో విశిష్టంగా నిరూపించారు. ఉదాహరణకు ఆర్తభాగుడు నిరూపించిన కాలానికి సంబంధించిన సంహితోపాసనను గమనించండి –

గతి పూర్వరూపం, నివృత్తి ఉత్తరరూపం, స్థితి సంహిత. స్థితి రూపమైన ఈ సంహితలో నిమేషాలు, కాష్ఠలు, కళలు, క్షణాలు, మహూర్తాలు, అహోరాత్రాలు, అర్ధమాసాలు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు సంధింపబడుతున్నాయి. ఈ సంహిత ఈ కాలాలను

---

1. పూర్వమే వాక్షరం పూర్వ రూపముత్తర ముత్తర రూపం తద్యాసౌ మాత్రా పూర్వరూపోత్తర రూపే అన్తరేణ యేన సంధిం వివర్తయతి యేన మాత్రా మాత్రం విభజతి యేన స్వరాత్స్వరం విజ్ఞాపయతి సా సంహితేతి న ఏవమేతాం సంహితాం వేద సంధీయతే ప్రజయా పశుభిర్యశసా బ్రహ్మవర్చసేన స్వర్గేణ లోకేన సర్వమాయురేతి శాం.ఆ. 7.13

సంధిస్తున్నది. కాలం గతి- నివృత్తి-స్థితులను సంధిస్తున్నది. గతి నివృత్తి స్థితులచేత సమస్తం సంధింప బడుతున్నదని అధిదైవతార్థం.

అధ్యాత్మార్థంలో భూతకాలం పూర్వరూపం, భవిష్యత్కాలం ఉత్తర రూపం, వర్తమానకాలం సంహిత. ఇదే కాలసంధి. దీన్ని స్పష్టంగా తెలుసుకున్నవాడు సంతానాది ఫలాలను పొందుతాడు.

ఎనిమిదో అధ్యాయంలో ప్రాణోపాసనను ఎంతో విశిష్టంగా ఈ ఆరణ్యకం నిరూపిస్తున్నది. ఆత్మకు ప్రాణం ఊష్మరూపం, ఎముకలు స్పర్శరూపం, మజ్జ స్వరరూపం, మాంసం అక్షర రూపమని మాండూకేయుడు వివరించాడు.

**పురుషచాతుర్విధ్యం:**

ఈ ఆరణ్యకం పురుషచాతుర్విధ్యాన్ని ఎంతో చక్కగా ప్రతిపాదిస్తున్నది. 1. శరీర పురుషుడు, 2. ఛన్దః పురుషుడు, 3. వేద పురుషుడు, 4. మహా పురుషుడని పురుషులు నాలుగు రకాలు. శరీర పురుషుడంటే దైహికమైన ఆత్మ. ఛన్దః పురుషుడంటే అక్షర సమామ్నాయాత్మకమైన గాయత్ర్యాది ఛందస్తత్వం తెలిసిన వాడు. వేదపురుషుడంటే ఋగాది వేదాలను తెలిసికొని బ్రహ్మిష్ఠుడై యజ్ఞ మహత్వాన్ని తెలిసిన వాడు. సంవత్సర స్వరూపం తెలిసి ఆత్మకు ఆదిత్యునితో ఏకత్వాన్ని తెలుసుకున్నవాడు మహాపురుషుడని వివరింప బడింది[2].

ఎనిమిదో అధ్యాయంలో ఈ ఆరణ్యకం 'ణ' కార 'ష' కారాల స్వరూపం ఎంతో విచిత్రంగా నిరూపిస్తున్నది. ప్రజాపతి ప్రజలను సృష్టించి ఛన్దస్సులతో ఆత్మను సంధించాడు. ఈ రెంటికి సంహిత

---

2. చత్వారః పురుషా ఇతి బాధ్వః శరీర పురుషశ్ఛన్దః పురుషో వేద పురుషో మహాపురుష ఇతి. శా. ఆ. 8.3.

ఏర్పడింది. ఈ సంహితకు 'ణ' కారమే బలం, 'ష' కారమే ప్రాణం అని కాషీతకం చేస్తున్న నిరూపణ ఎంతో విశిష్టంగా ఉన్నది.

గాయత్రీ స్వరూపం, ప్రాణం యొక్క జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం కూడా ఈ ఆరణ్యకంలో చక్కగా ఉపదేశింపబడింది[3].

మానవశరీరంలో ఏయే అవయవాల్లో ఏయే దేవతలు ఆవేశించి ఉన్నారో ఈ ఆరణ్యకం ఇలా నిరూపిస్తున్నది –

'వాక్కు నాది' అని అగ్ని వాక్కునావేశించాడు. 'ప్రాణం నాది' అని వాయువు ప్రాణాన్నావేశించాడు. 'అపానం నాది' అని విద్యుత్ అపానాన్నావేశించింది. 'ఉదానం నాది' అని పర్జన్యుడు ఉదానాన్నావేశించాడు. 'చక్షువు నాది' అని ఆదిత్యుడు చక్షువు నావేశించాడు. 'మనస్సు నాది' అని చంద్రుడు మనస్సునావేశించాడు. 'శ్రోత్రం మాది' అని దిక్కులు శ్రోత్రాన్నావేశించాయి 'శరీరం నాది' అని పృథివి శరీరాన్ని ఆవేశించింది. 'రేతస్సు నాది' అని రేతస్సును జల మావేశించింది. 'బలం నాది' అని ఇంద్రుడు బలాన్ని ఆవేశించాడు. 'మన్యువు నాది' అని మన్యువును ఈశానుడావేశించాడు. 'తల నాది' అని ఆకాశం తలను ఆవేశించింది. 'ఆత్మ నాది' అని బ్రహ్మ ఆత్మను ఆవేశించింది.

ఇలాంటి విశిష్టమైన భావనలను నిరూపిస్తూ కౌషీతకారణ్యకం ఆరణ్యకవాఙ్మయంలో విశిష్టమైందిగా చెప్పబడుతున్నది.

మరణ మాసన్నమైన వానికి కన్పడే అరిష్టాలను, స్వప్నాలను ఈ ఆరణ్యకం విలక్షణంగా నిరూపిస్తున్నది[4].

---

3. శా. ఆ. 11.2

4. శా. ఆ. 11.3-4

మానవ శరీరాన్ని వైరాగ్యం చేత సంస్కరించాలి. అలా సంస్కరించిన బ్రహ్మనిష్ఠుని భావాలెలా ఉంటాయో ఈ ఆరణ్యకం వివరిస్తున్నది--

అతడు ఆత్మనే అన్నిచోట్ల దర్శిస్తాడు, వింటాడు, మననం చేస్తాడు. ధ్యానం చేస్తాడు. వేదాధ్యయనం చేస్తూ బ్రహ్మచర్యంతో, తపస్సుతో, శ్రద్ధతో, నిత్యమైన యజ్ఞంతో ఆత్మను తెలిసికొనవలెనని మాండేయుడును, ఇట్లు ఆత్మను తెలిసికొని శాంతుడు, దాంతుడు, ఉపరతుడు, సహనశీలియై తనలోని పరమాత్మను దర్శించాలని మాండవ్యుడు బోధిస్తున్నారు.[5]

వేదాధ్యాయనం చేసిన వాడి గొప్పతనాన్ని అభివర్ణిస్తూ, వేదార్థం తెలియకపోతే అధ్యయనం చేసినా అతడు కేవలం భారవహుడే అవుతాడని ఈ ఆరణ్యకం నిరూపిస్తూ ఎంతో విశిష్టమైనదిగా గుర్తింపబడింది.

— వి.వి.బి.

---

5 వైరాగ్యసంస్కృతే శరీరే బ్రహ్మయజ్ఞనిష్ఠో భవేదప పునర్మృత్యుం జయతి తదుహవ ఆత్మా ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్య ఇతివేతం వేదాను వచనేన వివిదిషన్తి. బ్రహ్మచర్యేణ తపసా శ్రద్ధయా యజ్ఞే నాశకేన చేతి మాండూకేయః. తస్మాదేవం విచ్ఛాన్తో దాన్త ఉపరతస్తితిక్షుః శ్రద్ధావిత్తో భూత్వాఽఽత్మన్యేవాఽఽత్మానం పశ్యేదితి మాండవ్యః. శాం.ఆ. 13.1.

## 2.2.8 సంగ్రహ సమీక్ష

శాంఖాయనారణ్యకమే కౌషీతకారణ్యకం. కుషీతకి మహర్షి శిష్యుడు శాంఖాయనుడు. శాంఖాయనశాఖకు సంబంధించిన ఆరణ్యకానికి కుషీతకి మహర్షి మూలపురుషుడు కావడం వల్ల రెండు పేర్లతోను వ్యవహారం ఏర్పడింది. ఈ ఆంణ్యకంలో పదిహేను అధ్యాయాలున్నాయి. ప్రతి అధ్యాయంలోను కొన్ని ఖండలున్నాయి. ఇందులో పేర్కొనబడిన విషయాలను ఇక్కడ సంక్షిప్తంగా వివరిస్తాను.

1. ప్రథమాధ్యాయంలో మహావ్రతం నిరూపించబడింది. ప్రజాపతి సంవత్సరానికి ప్రతీక. మహావ్రతం ఆ ప్రజాపతికి శరీరం. ఇందులో ఉపయోగించబడే ఆజ్యశస్త్రంలో పన్నెండు అనువాకాలున్నాయి. ఒక్కొక్క అనువాకం ఒక్కొక్క మాసానికి సంకేతంగా భావింపబడుతున్నది. స్త్రీశక్తి - పురుష శక్తుల కలయిక ఈ మహావ్రతంలో పరోక్షంగా సూచింపబడింది. దీనికి ఈ ఆరణ్యకం విశ్వామిత్రోపాఖ్యానాన్ని ఉదాహరణగా ఇస్తున్నది.

విశ్వామిత్రుడు స్వర్గానికి వెడతాడు. ఇంద్రుడతని నాహ్వానించి ఏదైనా వరం కోరుకొమ్మంటాడు. నిన్ను గ్రహించ గలిగేటట్లు వరం ఇవ్వమంటాడు. చివఋకు ఇంద్రుడు - "నేనే మహత్తును, మహతిని, నేనే దేవుణ్ణి, దేవిని కూడా. స్త్రీ శక్తి పురుష శక్తి, ఈ రెండింటికీ అతీతమైన శక్తిని నేనేనని గ్రహించు" అంటాడు.

2. ద్వితీయాధ్యాయంలో హింకారమే ప్రాణమని హింకార స్వరూపం అనేక విధాల వర్ణింపబడింది. సాంకేతికంగా ఆరణ్యకం ఎన్నో విషయాలనిలా అందిస్తుంది.

మూడు శీర్షణ్యాలను ప్రశంసిస్తున్నాడు. అవి మూడు తృచలు. శీర్షంలో కపాలాలు మూడు. ఈ రెండింటిని సంధిస్తున్నాడు. ఒక్కొ

క్కటి మూడు మూడుగా అయి మొత్తం తొమ్మిది ఋక్కులైనాయి. శిరస్సులో తొమ్మిది ప్రాణాలున్నాయి. అవి అర్కసహితాలుగ ఉన్నాయి. ఇది పగటి రూపం.

ఇలా ఈ అధ్యాయంలో అనేకాంశాలు వివరింపబడినాయి.

3. తృతీయాధ్యాయంలో చిత్రుడు గాంగ్యాయని యజ్ఞం చేయాలనుకొని ఆరుణిని వరించాడు. అతడు తన కొడుకైన శ్వేతకేతువును యజ్ఞాన్ని ఆచరించి రమ్మని పంపాడు. యజ్ఞాన్ని నిర్వహించడానికి వచ్చిన శ్వేతకేతువును గాంగ్యాయని ప్రశ్నించాడు. దానికి సమాధానం తెలియదని తన గురువువద్దకు వెళ్లి తెలుసుకొని వచ్చి చెబుతానని అంటాడు శ్వేతకేతువు. గురువైన తండ్రి దగ్గఱకు వచ్చి రాజు వేసిన ప్రశ్నలను వివరిస్తాడు. తండ్రి వాటికి సమాధానాలిస్తాడు. తరువాత తండ్రికొడుకులిద్దఱు రాజు దగ్గఱకు వస్తారు. రాజు వారిద్దఱికీ, తనకు తెలిసిన తత్త్వాన్ని ఉపదేశిస్తాడు.

యజుర్వేదం పొట్ట, సామవేదం శిరస్సు, ఋగ్వేదం, శాశ్వతమైన మూర్తిగా రూపొందిన ఋషి బ్రహ్మమయుడు, గొప్పవాడని ఈ అధ్యాయంలో ప్రతిపాదించబడింది.

4. నాలుగో అధ్యాయంలో కౌషీతకి, పైంగ్య, శుష్కభృంగారులు బోధించిన విశేషాలెన్నో ఉన్నాయి. కౌషీతకి ప్రాణమే బ్రహ్మ అని, మనస్సు దూత అని చక్షుస్సు గోప్త అని, శ్రోత్రం సంశ్రావయిత అని, వాక్కు పరివేష్ట్రి అని వివరించాడు. పైంగి కూడ ప్రాణమే బ్రహ్మ అని ప్రబోధించాడు. శుష్కభృంగారుడు ఉక్థం బ్రహ్మ అని ప్రతిపాదించాడు.

పితాపుత్రులకు సంబంధించి లోకంలో సుప్రసిద్ధమైన ఒక భావన ఈ ఆరణ్యకంలో చోటు చేసుకుంది. తండ్రి కొడుకును ఇలా ఆశీర్వదిస్తున్నాడు.

"నీవు నా ప్రతి అంగం నుంచి జన్మించావు.
హృదయం నుంచి పుట్టావు. నీవుగా ఏర్పడినది నేనే.
నూరేళ్ళు జీవించు"[1]

ఇంద్రియాలన్నింటి కంటే ప్రాణమే శ్రేష్ఠమైనదనే అంశం ఇందులో వివరింపబడింది.

5. పంచమాధ్యాయంలో దివోదాసపుత్రుడైన ప్రతర్దనునికి ఇంద్రునికి జరిగిన సంవాదం ముఖ్యమైన అంశంగా వివరింపబడింది.

స్వర్గానికి చేరిన ప్రతర్దనుణ్ణి ఇంద్రుడేదైనా వరం కోరుకోమంటాడు. మనుష్యులకేది మంచిదో దానిని నీవే ఇవ్వమంటాడు ప్రతర్దనుడు. తక్కువ వాడికోసం అధికుడు వరాన్ని కోరడం సబబుకాదు. నీవే కోరుకో అంటాడు ఇంద్రుడు. వద్దంటాడు ప్రతర్దనుడు. నన్ను ప్రజ్ఞాతనైన ప్రాణాన్నిగా తెలుసుకో! అని ఇంద్రుడు ప్రతర్దనునికి చెబుతాడు.

మూగవాళ్లు, గుడ్డివాళ్లు, చెవిటివాళ్లు, మనఃస్థిమితం లేనివాళ్లు, చేతులు లేనివాళ్లు, కాళ్లులేనివాళ్లను చూశాం. కాని ప్రాణాలు లేనివాళ్లను బ్రతికి ఉండటం చూడలేదు. అందువల్ల ప్రాణం ఇంద్రియాలన్నిటికంటే ముఖ్యమైంది. దాన్ని బ్రహ్మగా ఉపాసన చేయాలని ఈ అధ్యాయం ఉపదేశిస్తున్నది.

6. ఈ అధ్యాయంలో గార్గ్యుడైన బాలాకి-అజాతశత్రువుల మధ్య జరిగిన బ్రహ్మవిషయకసంవాదం ఇలా వివరింపబడింది.

---

1. అంగాదంగాత్సంభవసి హృదయాదధిజాయసే |
అత్మా వై పుత్రనామాసి సజీవ శరదః శతమ్ ||

శాం. ఆ. 4.11

ఆదిత్యునిలోను, చంద్రునిలోను, విద్యుత్తులోను, మేఘంలోను, వాయువులోను, ఆకాశంలోను, అగ్నిలోను, నీటిలోను, అద్దంలోను, నీడలోను, ప్రతిధ్వనిలోను, శబ్దంలోను, నిద్రించే పురుషునిలోను శరీరంలోగల పురుషునిలోను కుడికన్నులోను, ఎడమకన్నులోను గల పురుషుణ్ణి నేనుపాసన చేస్తున్నానని బాలాకి చెప్పగా, అజాతశత్రువు అలా చేయరాదని చెప్పి ప్రాణోపాసన చెయ్యమని ఉపదేశిస్తాడు.

7. ఏడో అధ్యాయంలో సంహితోపనిషత్తు వివరింపబడింది. మండుకేయ, శాకల్య, వైశ్వామిత్ర, కౌంఠవ్యులు - పృథివి అగ్ని వాక్కు మొ|| వాటికి పూర్వ రూపాది అంగాలను నిరూపించారు. పరబ్రహ్మతత్త్వాన్ని వివరించారు.

8. ఎనిమిదో అధ్యాయంలో ప్రాణోపాసన గొప్పదనం, శరీర పురుష, ఛందఃపురుష, వేదపురుష, మహాపురుషులనే నాలుగు విధాల పురుషుల స్వరూపం విశదీకరించబడింది.

9. తొమ్మిదో అధ్యాయంలో గాయత్రీమహిమ, ప్రాణం యొక్క జ్యేష్ఠత్వ, శ్రేష్ఠత్వ గుణాలను ప్రతిపాదిస్తూ ప్రాణమే బ్రహ్మగా ఉపాసించాలని చెప్పబడింది.

10. పదో అధ్యాయంలో ఆధ్యాత్మికమైన ఆన్తరాగ్నిహోత్రం అభివర్ణింప బడింది. మానవుడిలో అగ్ని వాక్కులోను, వాయువు ప్రాణంలోను, ఆదిత్యుడు కంటిలోను, చంద్రుడు మనస్సులోను, దిక్కులు చెవులలోను, జలం రేతస్సులోను, ఉండి అతడు తినే ఆహారాన్ని తిని పిస్తూ నీటిని త్రాగిస్తూ ఉన్నారు. అప్పుడే అతడు తినడం, త్రాగడం, తృప్తిపడటం జరుగుతున్నదని ఇందులో చెప్పబడింది.

11. పదకొండో అధ్యాయంలో అగ్న్యాది దేవతలలో పురుష రూపోపాసన, మరణ సూచకాలైన కొన్ని అరిష్టాలు, కొన్ని దుఃస్వప్నాలు,

వాటి ఫలితాలు, వాటి పరిహారం కోసం చేయాల్సిన హోమాలు, కొన్ని ఆశీస్సులు, ప్రార్థనలు వివరింపబడ్డాయి.

12. పన్నెండో అధ్యాయంలో ఇరామణికల్పం విపులంగా వర్ణించబడింది. ఇరామణిని ధరించిన వారికి ఏయే ప్రమాదాలుండవో, ఆపదలుండవో విస్తరంగా చెప్పబడింది.

13. పదమూడో అధ్యాయంలో వైరాగ్యం చేత సుసంస్కృతమైన శరీరంతో బ్రహ్మయజ్ఞనిష్ఠతో ఉన్నవాడికి అపమృత్యుభయం లేదని చెప్పి, ఆత్మ దర్శనం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం చేస్తూ, బ్రహ్మచర్యంతో శ్రద్ధతో జీవితాన్ని యజ్ఞభావనతో గడిపితే బ్రహ్మైక్యం సిద్ధిస్తుందని ప్రతిపాదించబడింది.

14. పధ్నాలుగో అధ్యాయంలో వేదాధ్యయనం చేయని వాని జీవితం వ్యర్థమని చెప్పి, వేదాధ్యయనం చేసి అర్థం తెలుసుకోకుండా ఊరికే వల్లె వేసేవాడు భారహరుడేనని, అర్థం తెలుసుకో గలిగితే సకల సంపదలను చివఱలో స్వర్గాన్ని పొందగలడని వివరింప బడింది.

15. పదిహేనో అధ్యాయంలో ఈ శాఖకు సంబంధించిన పరంపర పేర్కొనబడింది.

స్వయంభూ బ్రహ్మతో ప్రారంభమై, ప్రజాపతి, ఇంద్రుడు, విశ్వామిత్రుడు, దేవరాతుడు, సాకమశ్వుడు, వ్యశ్వుడు, విశ్వమనసుడు, ఉద్దాలకుడు, సుమ్నయువు, బృహద్దివుడు, ప్రతివేశ్యుడు, సోమపుడు, ప్రియవ్రతుడు, ఆరుణి, కౌషీతకి, శాంఖాయనుడు. ఇలా ఋషి పరంపరగా ఈ ఆరణ్యకం అధ్యయనం చేయబడిందని చెప్పబడింది.

ఇలా కౌషీతకారణ్యకంలో గల పదిహేను అధ్యాయాలలోను వ్రత, యజ్ఞ, జ్ఞాన భాగాలకు సంబంధించిన ఎన్నో విశేషాలు చక్కగా నిరూపింప బడినాయి.

— పి.జి.ఎల్.

# ఆర్షవిజ్ఞానసర్వస్వము

## ఆరణ్యకాలు

## 2.3 తైత్తిరీయారణ్యకం

### 2.3.1 పరిచయం

కృష్ణయజుర్వేదానికి గల తైత్తిరీయ శాఖకు సంబంధించిన ఆరణ్యకం తైత్తిరీయారణ్యకం. తైత్తిరీయసంహితలో బ్రాహ్మణ భాగాలు కలిసి ఉన్నా సంహిత కంటే భిన్నంగా తైత్తిరీయబ్రాహ్మణం చెప్పబడింది. తైత్తిరీయబ్రాహ్మణ పరిశిష్ట భాగమే తైత్తిరీయారణ్యకం. తైత్తిరీయ శబ్దస్వరూపాన్ని గురించి లోగడ (ఆ.వి.స. Vol.II 204) వివరించాను.

వైశంపాయనుని శిష్యుడు పైంగి యాస్కుడు. తిత్తిరిమహర్షి అతని శిష్యుడు. ఉఖుడు తిత్తిరి శిష్యుడు. అతని శిష్యుడు ఆత్రేయుడు. తైత్తి

రీయశాఖాప్రవర్తకులలో తిత్తిరిమహర్షి ఇలా ప్రముఖ స్థానంలో ఉండటం చేత దీనికి తైత్తిరీయమనే పేరేర్పడింది.

—ఎస్.బి.ఆర్.

## 2.3.2 విభాగం

తైత్తిరీయారణ్యకంలో పది ప్రపాఠకాలున్నాయి. అందులో మొదటి రెండు ప్రపాఠకాలకు కాఠకమని పేరు. సాయణుడు పదో ప్రపాఠకం ఖిలకాండమని తన భాష్యంలో పేర్కొంటున్నాడు.[1] ఏడు, ఎనిమిది, తొమ్మిది అధ్యాయాలు తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధి పొందాయి. ఇందులోని ప్రతి ప్రపాఠకంలోను కొన్ని అనువాకాలున్నాయి. వివరాలకు చూడండి.

| ప్రపాఠకం | అనువాకాలు | ప్రపాఠకం | అనువాకాలు |
|---|---|---|---|
| 1 | 32 | 6 | 12 |
| 2 | 20 | 7 | 12 |
| 3 | 21 | 8 | 9 |
| 4 | 42 | 9 | 10 |
| 5 | 12 | 10 | 80 |
| | 127 | | 127+123=250 |

పదోప్రపాఠకంలో ద్రావిడపాఠాన్ననుసరించి 64 అనువాకాలున్నాయని, ఆంధ్రపాఠాన్ననుసరించి 80 అనువాకాలున్నాయని, కర్ణాటకలోని కొందఱి పాఠంలో 74 అనువాకాలున్నాయని, ఇంకొందఱి పాఠంలో

1. యథా బృహదారణ్యకే సప్తమాష్టమావధ్యాయౌ ఖిలకాండత్వేనాచార్యైరుదాహృతౌ, తథేయం నారాయణీయా వ్యాఖ్యా యాజ్ఞిక్యుపనిషదపి ఖిలకాండరూపాల్లక్షణోపేతత్వాత్.

తై.ఆ.సా.భా.

క్ష్రీ: తత్ర ద్రవిడానాం చతుష్షష్ట్యనువాకపాఠః. ఆంధ్రాణామశీత్యనువాకపాఠః.
సు: కర్ణాటకేషు కేషాంచిచ్చతుఃసప్తతిపాఠః. అపరేషాం నవాశీతిపాఠః. తత్ర వయం పాఠాన్తరాణి యథాసంభవం సూచయన్తో అశీతిపాఠం ప్రాధాన్యేన వ్యాఖ్యాస్యామః.

89 అనువాకాలున్నాయని, తాను ఆంధ్రపాఠాన్ని వ్యాఖ్యానిస్తున్నానని సాయణుడు తన భాష్యంలో పేర్కొంటున్నాడు.

**విషయవిభాగం:**

ఈ అరణ్యకంలోని ప్రథమ ప్రపాఠకంలో ఋతుస్వభావం, ద్యావాపృథువులు, గాయత్రీ మంత్రం, శరీర వికారాలు, వాయుస్వరూపం మొదలగు అంశాలు, ద్వితీయప్రపాఠకంలో యజ్ఞోపవీతస్వరూపం, సంధ్యోపాసనం, భూమి ప్రశంస, కూష్మాండ హోమ మంత్రాలు, బ్రహ్మయజ్ఞం, పరబ్రహ్మ స్వరూపం, బ్రహ్మోపస్థానం మొదలగు విషయాలు, తృతీయ ప్రపాఠకంలో సంభారయజుస్సులు, ప్రతిగ్రహ మంత్రాలు, మృత్యుసూక్తం, చతుర్థ ప్రపాఠకంలో మహావీర నిర్మాణాదులు, ప్రైషమంత్రాలు, అగ్నిహోత్ర హోమం మొదలగు విషయాలు, పంచమప్రపాఠకంలో ప్రవర్గ్యమంత్రాలు, షష్ఠప్రపాఠకంలో పితృమేధం నిరూపించబడింది.

**మొదలు – చివర:**

తైత్తిరీయారణ్యకం "భద్రం కర్ణేభిః" అనే మంత్రంతో ప్రారంభమై "పిబతోదకం" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

—ఎస్.బి.ఆర్.

## 2.3.3 సంకలన కాలం:

**దేశం:**

యజ్ఞయాగాల నిర్వహణ బాగా జరిగి ధర్మక్షేత్రమని ప్రసిద్ధి పొందిన కురుక్షేత్రంలో తైత్తిరీయసంహిత, తైత్తిరీయబ్రాహ్మణం ఏర్పడి ఉంటుం దని విమర్శకులు భావిస్తున్నారు. తైత్తిరీయబ్రాహ్మణ పరిశిష్టమే తైత్తిరీ యారణ్యకం కాబట్టి ఇది కూడా కురు-పాంచాల దేశాలలో రచింపబడి ఉంటుందనుకోవడానికి అవకాశం ఉంది.

**కాలం:**

బ్రాహ్మణ వాఙ్మయంలో రెండోస్థానం గాని, మూడో స్థానం గాని తైత్తిరీయబ్రాహ్మణం ఆక్రమిస్తున్నది. క్రీ.పూ. 8వ శతాబ్దం బ్రాహ్మణ రచనకు ప్రారంభకాలంగా చరిత్రకారులు భావిస్తున్నారు. దాన్నిబట్టి తైత్తిరీయబ్రాహ్మణం అదే శతాబ్దంలో ఏర్పడి ఉండి ఉండవచ్చునని వారి భావన. తైత్తిరీయారణ్యకం కూడా క్రీ.పూ. 8వ శతాబ్దం చివటిలోగాని లేక 7వ శతాబ్దం మొదట గాని రచింపబడి ఉండి ఉంటుందనుకోవడానికి ఎక్కువ అవకాశం కనపడుతున్నది. ఇంకా ఈ అంశాలమీద చాల చోట్ల పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే సంప్రదాయువాదులు ఆధునికులు చేసిన ఈ కాలనిర్ణయాన్ని అంగీకరించడంలేదు.

—ఎస్.బి.ఆర్.

# 2.3.4 వ్యాఖ్యానాలు -- ప్రచురణలు:

తైత్తిరీయారణ్యకానికి భట్టభాస్కరుడు, సాయణుడు వ్రాసిన భాష్యాలు దొరుకుతున్నాయి. దక్షిణభారతదేశంలోని కొన్ని వ్రాత ప్రతులు ఆధారంగా ఔఫ్రెెట్ తయారుచేసిన పుస్తక సూచిలో తైత్తిరీయారణ్యకానికి వరదరాజు వ్రాసిన భాష్యం ఉన్నట్లు పేర్కొనబడింది. వరదరాజు తండ్రి అనన్తనారాయణ. ఈయన సామవేదానికి సంబంధించిన కొన్ని సూత్రాలకు వ్యాఖ్యానం వ్రాసినట్లు తెలుస్తున్నది. వరదరాజు వ్రాసిన తైత్తిరీయారణ్యక భాష్యం కాలగర్భంలో కలిసిపోయింది. భవస్వామి కూడా తైత్తిరీయారణ్యకానికి భాష్యం వ్రాసినట్లు తెలుస్తున్నది. కాని అది ఎక్కడా లభించడంలేదు.

**ప్రచురణలు:**

తైత్తిరీయారణ్యకాన్ని 1872లో కలకత్తానుంచి సాయణభాష్యంతో రాజేంద్రలాల్ మిత్ర ప్రకటించాడు. ఆ తరువాత 1898లో బాబా శాస్త్రి ఫడకే ఆనందాశ్రమం, పూనానుంచి ప్రచురించాడు. భట్ట భాస్కర భాష్యంతో 1902లో తైత్తిరీయారణ్యకం ప్రచురించబడింది. తరువాత పూనా వారి సంస్కరణం ఇంకొకటి వచ్చింది. ఇంతకు మించి తైత్తిరీయారణ్యకానికి వేఱే ప్రచురణలున్నట్లు తెలియడంలేదు.

—ఎస్.బి.ఆర్.

## 2.3.5 ప్రసిద్ధి

తైత్తిరీయారణ్యకంలో కొంత కర్మకాండకు సంబంధించిన విషయం ఉన్నా, ఎన్నో తాత్త్వికాంశాలు కూడ చక్కగా చర్చించబడ్డాయి. లౌకిక జీవనం సాగిస్తున్న మానవులందఱు తెలుసుకోవాల్సిన అనేకాంశాలు కూడా ఈ అరణ్యకంలో అక్కడక్కడా దర్శనమిస్తాయి. చూడండి :

"ఈ భూమి జాయ. ఆకాశం భర్త. దంపతులిద్దఱు కలసి వెడుతున్నారు. ఈ ఇద్దఱి ఒడిలో ఉన్న కొడుకులిద్దఱు బృహస్పతి, .అగ్ని. కూతురు సరమ, అంటే వేది[1] ."

శరీరం అశాశ్వతమైంది. దీన్నే మానవుడు శాశ్వతమనుకుంటున్నాడు. ఇదే ఆత్మ అని భ్రమపడుతున్నాడు. కానీ ఈ శరీరానికి కొన్ని వికారాలున్నాయని తైత్తిరీయారణ్యకం ఇలా ప్రబోధిస్తున్నది--

"ఒకప్పుడు ముఖంలో నవ్వు కనిపిస్తుంది. ఇంకొకప్పుడు ఏడుపు, ఉత్సాహంగా ఒకప్పుడు గానం కనబడుతుంది. ఒకసారి వీణ వాయిస్తాడు. ఇంకోసారి పణవం, మృదంగం మొ|| ప్రయోగిస్తాడు. ఒకప్పుడు చనిపోతాడు. ఇంకొకప్పుడు బ్రతుకుతుంటాడు. హస్తపాదాది అంగాలెలా శరీరంలో ఉన్నాయో ఈ వికారాలన్నీ శరీరంలోనే ఉన్నాయని గుర్తించాలి [2] .

ఇలా ఎన్నో నూతనమైన తాత్త్వికాంశాలు ఈ అరణ్యకంలో నిరూపింపబడి దీనికి మంచి ప్రసిద్ధిని సంపాదిస్తున్నాయి.

—ఎస్.బి.ఆర్.

---

1. జాయా భూమిః పతిర్వ్యోమ మిథునం తా అతుర్యథుః
పుత్రో బృహస్పతీ రుద్రః సరమా ఇతి స్త్రీ పుమమ్ 1.10.2.
2. హసితం రుదితం గీతం వీణా పణవలాసితమ్,
మృతం జీవం చ యత్కించిత్ అంగాని స్నేవ విద్ధితత్. 1.11.3.

## 2.3.6 ఉపాసనలు

ప్రతివ్యక్తి తన గృహస్థాశ్రమ ధర్మాలను చక్కగా నిర్వహించి, మంచి సంతానాన్ని కని, వాళ్లు పెరిగి పెద్దవాళ్లై సమాజంలో తమ తమ విధులను సక్రమంగా నిర్వహించుకోగలిగిన వాళ్లైనప్పుడు, వాళ్ల జీవనమార్గానికి అడ్డుగా ఉండకుండా, తన భార్యతో కలసి వనప్రస్థుడు కావాలి. దీన్నే వానప్రస్థాశ్రమం అంటారు. తన జీవితంలో అంతవఱకు చేయులేని తత్త్వజిజ్ఞాసను, బ్రహ్మచర్యంతో, శ్రద్ధతో, వైరాగ్యంతో వానప్రస్థాశ్రమంలో ఉండి నిర్వహించాలి. వానప్రస్థాశ్రమ ధర్మాలను పాటిస్తూ తన సహధర్మచారిణితో ప్రశాంతమైన జీవితం గడపాలి. ఇలా వానప్రస్థులైన వారు అరణ్యాల్లో అధ్యయనం చేసే గ్రంథాలకే ఆరణ్యకాలని పేరు. ఆరణ్యకాలన్నింటిలో తైత్తిరీయారణ్యకం కొన్నివిధాల విశిష్టమైంది. ఇందులో స్వర సంప్రదాయం ఇప్పటికీ కనపడుతుంది.

ప్రథమప్రపాఠకంలో అరుణకేత్వగ్నిస్వరూపం, ఋతువుల సాంకేతిక స్వరూపం కాలవిభాగాలు వర్ణింపబడినాయి. ఈ భూలోక స్వర్గలోకాలను ఎవరు పోషిస్తున్నారని ఇందులో (1.8) ప్రశ్నించబడింది. వత్సమహర్షి చెప్పిన సమాధానంగా విష్ణువే భూలోకానికి స్వర్గలోకానికి స్థితి కారకుడని సమాధానం చెప్పబడింది. అలాగే ఈ శరీరానికి ఆత్మ సంబంధం ఎలా కలుగుతున్నది? మళ్లా ఇది ఆత్మతో ఎలా విడిపోతున్నదని చర్చించబడింది. కొన్ని యజ్ఞాలవల్ల ఫలితాలను పొందిన తరువాత మానవుడాచరించాల్సిన కొన్ని వ్రతాలు ఇందులో పేర్కొనబడ్డాయి.

ఉపాసనలన్నింటిలో ముఖ్యమైన సంధ్యోపాసన గురించి ద్వితీయ ప్రపాఠకంలో (2.1.2) వివరించబడింది. సంధ్యోపాసన త్రైవర్ణికులకు నిత్యవిధి అనే అంశాన్ని ఈ ఆరణ్యకం (2.9) పేర్కొంటున్నది[1].

ప్రతియాగారంభంలోను ఆయుష్కరమైన బ్రహ్మోపస్థానం జరుగుతుంది. ఇందులో యజమాని అన్ని లోకాల్లోను సంచరించి చివఱకు స్వర్గాన్ని చేరుకుంటాడని తెలుసుకోవాలి. యజమాని చుట్టూ కవచం మాదిరి బ్రహ్మ ఆవరిస్తాడు. సర్వసాక్షియైన ఈశ్వరుని తేజస్సును తన ఆత్మదృష్టితో యజమాని గ్రహించగలుగుతాడు. పరబ్రహ్మ ఇక్కడ ధ్యానించదగిన శిశుమారమనే జలగ్రహానికి శిరస్థానీయం. అనుష్ఠేయమైన ధర్మం మూర్ధస్థానీయం, చతుర్ముఖ బ్రహ్మ ఆ గ్రహానికి పై దవడ, యజ్ఞం క్రింది దవడ, విష్ణువు హృదయ స్థానీయుడు, సంవత్సరం యోని, అశ్వినులు మిత్రావరుణులు పాదాలు, అత్రిముని మధ్యశరీరం, శిశుమార గ్రహానికి పుచ్ఛభాగంలో ఎన్నో భేదాలు :- అగ్ని పుచ్ఛానికి ప్రథమ భాగం, ఇంద్రుడు ద్వితీయభాగం, ప్రజాపతి తృతీయ భాగం, పరబ్రహ్మ చతుర్థ భాగం. ఇటువంటి శిశుమార స్వరూపి అయిన భగవంతుని తెలిసికొని ఉపాసించి యజమాని అపమృత్యుభయం పోగొట్టుకుంటాడని తైత్తిరీయారణ్యకం పేర్కొంటున్నది.

ఈ ఆరణ్యకంలోని తృతీయప్రపాఠకంలో సృష్టికి మూలభూతుడైన నారాయణుని వైభవాన్ని ప్రతిపాదించే పురుషసూక్తం పేర్కొనబడింది. పరమపురుషుడైన నారాయణుని సమస్తప్రపంచానికి ఆశ్రయుడుగా ఎవరు

---

1. సవా ఏష దివ్యః శాక్వరః శిశుమారస్తం హ,
యు ఏవం వేదాప పునర్మృత్యుంజయతి జయతి స్వర్గలోకం
నా ధ్వని ప్రమీయతే నాగ్నౌ ప్రమీయతే, నాప్సు ప్రమీయతే
నానపత్యః ప్రమీయతే లఘ్వాన్నో భవతి.

తై.ఆ. 2.19

గుర్తిస్తారో; వాళ్లు ఈ జీవితంలోనే అమృతత్వాన్ని పొందగలరు. ఈ మర్త్యలోక బంధాలను తెంచుకొని పోవడానికి ఈ జ్ఞానంకంటే వేరే మార్గం ఇంకోటి లేదు. 'తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి' అన్న చోట్లగల 'విద్వాన్' అనే పదం ఉపాసనాపరంగా తీసుకోబడింది. కేవలం జ్ఞానం మాత్రమే కాక నారాయణుని ఉపాసన ద్వారా పొందిన వాటితో తృప్తిగా జీవించడం కూడా ముఖ్యమని ఇక్కడ తెలుసుకోవాలి (3.12.13).

నారాయణుని సూర్యాన్తర్గతునిగా కూడా ఉపాసించాలని ఈ ఆరణ్యకం చెబుతున్నది. సూర్యుడీసందర్భంలో విస్తరంగా వర్ణింపబడినాడు (3.23).

ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది ప్రపాఠకాలు తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధమైనాయి. కొందఱు పదో ప్రపాఠకాన్ని మహా నారాయణోపనిషత్తుగాను ఏడు నుంచి తొమ్మిది ప్రపాఠకాల వఱకే తైత్తిరీయోపనిషత్తుగాను భావిస్తున్నారు.

ద్వితీయ ప్రపాఠకం పూర్తిగా (1-20) ప్రతివాడు సంధ్యోపాసన ద్వారా ప్రతిరోజు తనను తాను పవిత్రీకరించుకొని ఏదైనా నూతన కార్యాన్ని చేపట్టడానికి అర్హతను సంపాదించాలని ప్రబోధిస్తున్నది.

అనేక చేష్టలుగల వివిధావయవాలతో కూడిన శరీరంగల శింశుమారంగా పరబ్రహ్మ అభివర్ణింపబడింది. ఉపాసనకు కావలసిన మార్గనిర్దేశం కూడా చేయబడింది. విష్ణువు నియంతగా అనగా అన్తర్యామిగా పరబ్రహ్మ యొక్క హృదయస్థానాన్ని ఆక్రమిస్తున్నాడు. అది సాంకేతికంగా ప్రపంచాన్ని సూచిస్తున్నది. ఈ అభిప్రాయాన్ని "అన్తః ప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా (3.11.2)" అనే ఆరణ్యక వాక్యం సమర్థిస్తున్నది. కనుక ప్రతివాడు తనలో అన్తర్యామిగా ఉన్న బ్రహ్మను తెలిసికొని ఉపాసించాలని ఇక్కడ సూచింపబడుతున్నది. దీన్ని మిగత

ఉపనిషత్తుల్లో తరువాత ఏర్పడిన వివరణలకు మూలభూతమైన భావనగా గుర్తించాలి.

అలాగే విష్ణువుగా గుర్తింపబడిన నారాయణుడు సృష్టికర్త. ఆయననే ఆదిత్యునిలో ఆరాధించాలి. సూర్యుణ్ణి ఆరాధించడమంటే ఆయనలో గల విష్ణువునారాధించడానికి వేసే ఇంకొక ముందడుగు మాత్రమే. ఈ ఆరణ్యకం నారాయణోపాసనను తప్ప ఇంకే ఇతర దేవతోపాసనను ప్రత్యేకంగా చెప్పడం లేదు. అంత మాత్రంచేత ఇతర దేవతలు ఈ ఆరణ్యకంలో ఉపేక్షింపబడ్డారని అనుకోకూడదు. మిగత దేవతలందఱు విష్ణువుకు సహాయకులుగా పేర్కొనబడినారు. 'విష్ణునా విధృతే భూమ్' (1.8.2) 'వాతాద్విష్ణోర్బల మాహుః అక్షరాద్దీప్తి రుచ్యతే' త్రిపదాద్ధారయద్దేవః యద్విష్ణోరేకముత్తమమ్ (1.8.3), అగ్నయో వాయవశ్చైవ ఏతదస్య పరాయణమ్ (1.8.4).

ఈ ఆరణ్యకంలో విష్ణువు పరమపురుషుడుగా గొప్పదేవతగా ప్రశంసింపబడినట్లు అర్థమవుతుంది. విశ్వానికి మూలభూతుడుగా విష్ణువును అర్థం చేసుకోవడం వల్లనే అమృతత్వం సిద్ధిస్తుందనే అంశాన్ని తైత్తిరీయారణ్యకం ప్రతిపాదిస్తున్నది. ఒకరకంగా ఇదే ఉపాసన.

నిజంగా ఉపాసన అని పిలువబడే ఆరాధనతత్త్వం తైత్తిరీయారణ్యకంలో ప్రసిద్ధంగా లేదనే చెప్పాలి. కాని విష్ణువును అన్తర్యామిగా శాస్తగా పేర్కొనడం ఇంకోరకమైన వ్యాఖ్యానానికి అవకాశమివ్వడం లేదు. పరబ్రహ్మ హృదయాన్తర్యామిగా ఉండడాన్నే ధృవపరుస్తున్నది. విద్వాన్ అనే పదం కూడా ఆయననే ఉపాసించాలని ఉపదేశిస్తున్నది.

ఉపాసన విస్తరంగా వర్ణింపబడే ఉపనిషత్తు లక్షణం ఈ తైత్తిరీయారణ్యకంలో ప్రారంభమైనట్లు మనం గుర్తించవచ్చు.

— వి.వి.

## 2.3.7 వైశిష్ట్యం

మంత్రరూపమైన వేదం మూలంవంటిదని, దాని వ్యాఖ్యానం వంటిది బ్రాహ్మణమనీ ఇదివఱకు సూచించడం జరిగింది. అటువంటి బ్రాహ్మణానికి చివరిభాగంగా ఏర్పడి, యజ్ఞయాగాదులకు సంబంధించిన కొన్ని విషయాలను, తత్త్వచింతనకు చెందిన మరికొన్ని విషయాలను ప్రతిపాదించే గ్రంథాన్ని "ఆరణ్యకం" అని అంటారు.

"తైత్తిరీయారణ్యకం" ఆరణ్యకాలన్నింటిలోను అతి ప్రసిద్ధమయింది. (ఇతర వేదాలకు కొన్నిటికి ఆరణ్యకాలే లేవు. కొన్నింటికి ఉన్నా నామమాత్రంగా కనిపిస్తాయి.) స్వరూపాన్ని బట్టి, విషయాన్ని బట్టి కూడా ఇది "గహనం గభీరమ్" అనిపించుకుంటుంది. ఇందులోని విభాగాలకు "ప్రపాఠకాలు" అని వ్యవహారం. పది ప్రపాఠకాలతో ఇది ప్రకాశిస్తోంది.

మొదటి ప్రపాఠకం "ఆరుణకేతుకం" లేక "అరుణం" సూర్యుని వర్ణనం, మహత్త్వం, ప్రశంస మొదలైన అంశాలతో కూడిన మంత్రాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. వీటిని పఠిస్తూ సూర్యనమస్కారాలు చేసే పద్ధతి నేటికీ భారతదేశం అంతటా అనూచానంగా, అవిచ్ఛిన్నంగా ఆచరణలో ఉంది. అరణ్యంలో చదువవలసిన భాగాలలో ఈ అరుణం ఒకటి. అందువల్లనే సూర్యనమస్కారాలను ఇళ్ళలోగాక, దేవాలయాలలో గాని, ఊరి చివరనున్న తోటలలో గాని జరిపించే ఆచారం పరంపరగా వస్తున్నది. సూర్యుడు ప్రత్యక్షదైవం. ఆరోగ్యానికి మూలకందం. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" (సూర్యుని వలన ఆరోగ్యాన్ని సంపాదించు కోవాలి) అన్న సూక్తి అందరికి సుపరిచితమే. సకల జీవులకు ప్రాణశక్తి సూర్యుడని, అతని వలన జీవజాలానికి మహోపకారం జరుగుతున్నదని నేటి విజ్ఞానం కూడా వేనోళ్ళ చాటి చెబుతోంది. అటువంటి మహిమగల సూర్యుణ్ణే వివిధ కోణాలలో పరిశీలించి -- భావించి వర్ణించి -- మురిసిపోయి, భావావేశంతో చేయెత్తి

అతనికి జోహారులర్పిస్తుంది ఈ అరుణం. ప్రాచీనార్య విజ్ఞానానికి వైదికుల దివ్యభవ్య భావనలకు కూడా ఇది నిలయం. "శ్రద్ధతో ఆచరించే వారికి సకలరోగనివారణమైన రామబాణం అరుణం" అన్న విషయం ఇప్పటికీ– ఎప్పటికీ అనుభవసిద్ధమే.

సూర్య వర్ణనమే గాక సంవత్సర వర్ణనం, ఋతువుల వర్ణనం కూడా సహజమనోహరంగా అరుణంలో ఉన్నాయి. "కాలపురుషుడే సంవత్సరం. అతడు ఋతువులను తమ తమ పనులను చేయమని ఆదేశిస్తాడు. తదనుసారం వసంతాది ఋతువులు వరుసగా పనిచేస్తాయి. వసంతం జీవవసంతం. గ్రీష్మం సంతాపదాయకం. వర్షఋతువు వర్షించి పంటలు పండిస్తుంది. ఉపకారశాలి. శరత్తు లోకాన్ని ప్రసన్నంగా ఉంచుతుంది. హేమంతలో చలి కొరికేస్తుంది. చలిదుస్తులతో ప్రజలందరు వింతవింతగా కనిపిస్తారు. శిశిరర్తువు ప్రకృతిని ఆర్పివేసి సౌందర్య హీనంగా చేస్తుంది." ఈ విధంగా కాలమానాన్ని కళ్ళముందుంచుతుంది ఈ ఘట్టం. తరువాతి సంస్కృత సాహిత్యంలో పరవళ్లు తొక్కిన ఋతువర్ణనలకు ఇదే ఆధారం అనవచ్చు.

రెండవ ప్రపాఠకానికి "స్వాధ్యాయ బ్రాహ్మణం" అని పేరు. యజ్ఞోపవీతాన్ని (జందెం) ధరించే విధానం, దాని అవసరం; దాని ఫలితం, అర్ఘ్య ప్రదానం యొక్క ఔచిత్యం, వేదాన్ని అధ్యయనం చేసే తీరు మొదలైన విషయాలు ఇందులో ఉన్నాయి. వానిలో గృహస్థులందరు ఆచరించదగిన "పంచమహాయజ్ఞాలు" చాలా ముఖ్యమైనవి. వాటి స్వరూపం సంగ్రహంగా ఇది :–

1. దేవయజ్ఞం : అభీష్టమైన దేవతలను యథాశక్తిగా పూజించడం.
2. పితృయజ్ఞం : పితృదేవతలకు నీటితో తర్పణం చేయడం. (ఆయా సమయాలలో) పితరులను ఆరాధించడం.

3. భూతయజ్ఞం : పశుపక్ష్యాదులకు ఆహారాన్ని, నీటిని అందజే యడం.

4. మనుష్యయజ్ఞం : ఇంటికి వచ్చిన అతిథులను అభ్యాగతులను అన్న పానాదులతో ఆదరించడం.

5. బ్రహ్మయజ్ఞం : వేదవేదాంగాలను పారాయణం చేయడం.

ప్రతివేదంలోను మొదటి మంత్రాన్ని అంగాలలోని మొదటి వాక్యాలను ఏర్చి కూర్చి, సారరూపంగా సంగ్రహంగా పారాయణంచేసే తీరు ఒకటి ఇక్కడ చూపబడింది. ఇంద్రియనిగ్రహం, దైవ విశ్వాసం, భూత దయ, పరోపకారం, చదువులందు శ్రద్ధ మొదలగు మంచి గుణాలు మానవులకు అలవడడానికి, మానవత్వం వికసించడానికి ఈ అయిదు యజ్ఞాలను ప్రతిదినం ఆచరించవలసిందిగా ఆర్యులు ఆదేశించారు. మానవులకు గల సహజమైన దౌర్బల్యాలను గుర్తించడంలోను, వానికి తగిన విరుగుడు మందులను కనిపెట్టి ఔన్నత్యానికి సోపానాలు నిర్మించడంలోను వారిది అందెవేసిన చెయ్యిగదా!

మూడు, నాలుగు, అయిదు -- ప్రపాఠకాలలో అగ్ని, ఇంద్రుడు, పూష మొదలైన దేవతలను స్తుతించే మంత్రాలే అధికంగా ఉన్నాయి. ఇవి పూర్తిగా యజ్ఞకర్మకు ఉపయోగించేవి.

ఆరవ ప్రపాఠకం "పితృమేధం" అనే అపరకర్మకు వినియుక్తమయింది. యజ్ఞయాగాలు చేసిన వారు చనిపోయినపుడు చేయవలసిన కర్మలను ఇది విశదం చేస్తుంది.

ఏడవ ప్రపాఠకం శిక్షావల్లి. ఎనిమిదవది ఆనందవల్లి. తొమ్మిదవది భృగువల్లి. ఈ మూడింటికి మొత్తంగా "తైత్తిరీయోపనిషత్తు" అని పేరు. కృష్ణయజుర్వేదం యొక్క చివరి భాగాలు గనుక వీనిని "వేదాంతం" అని ప్రసిద్ధంగా పిలుస్తారు. అది పూర్తిగా అన్వర్థం. వీనిలో ప్రతి వాక్యంలోను తత్త్వవిచారణే కనిపిస్తుంది. బ్రహ్మలక్షణం,

బ్రహ్మానుసంధానం, బ్రహ్మానందస్వరూపం మొదలైన అంశాలతో ఈ భాగాలు కేవలం వినేవారిని కూడా ఆనందసాగరంలో ముంచి తేలుస్తాయి. ప్రపంచప్రఖ్యాతిని ఆర్జించిన భారతీయుల తత్త్వ మీమాంసకు ఇవి మణిదర్పణాలు.

ఇక – పదవ ప్రపాఠకం. దీనికి "నారాయణోపనిషత్తు", "యాజ్ఞికృుపనిషత్తు" అనే పేర్లు వాడుకలో ఉన్నాయి. అంతమాత్రం చేత ఇది కేవలం బ్రహ్మతత్త్వాన్ని చెప్పే ఉపనిషత్తని అనుకోనక్కరలేదు. వివిధ కర్మలకు, వివిధ ధర్మాలకు సంబంధించిన మంత్రాలు కూడా ఇందులో విరివిగా ఉన్నాయి. వాటితోపాటు తత్త్వవ్యాఖ్యానం కొంగుముడి వేసుకొని నడుస్తుంది. పూజాసమయంలో "సహస్ర శీర్షం దేవమ్" ఇత్యాదిగా పఠించే అతి ప్రసిద్ధమైన మంత్రపుష్పం ఇందులోనిదే. అది పరతత్త్వానికే అమూల్యమైనగని. ఆ విధంగానే సత్యం, శమం, దమం, దానం, ధర్మం, తపస్సు, త్యాగం మొదలైన గుణరత్నాల ప్రశంస ఈ ప్రపాఠకంలో సహేతుకంగా నిబద్ధమై ఉంది. చిట్టచివరను "ఆత్మయజ్ఞం" అనే ఘట్టంతో ఇది పరిసమాప్తం అవుతుంది. "బ్రహ్మజ్ఞానియైన జీవన్ముక్తుని నిత్యజీవనం ఒక మహాయజ్ఞమే" అన్న సొగసైన ధోరణిలో, ఆలంకారికంగా ఒక చిన్న కావ్యఖండం వలె నడుస్తుంది ఈ ఘట్టం. కొంచెం తాత్పర్యం తెలుసుకొని వింటూ ఉంటే ఆనందామృతంలో మునకలు వేస్తాం.

ఈ విధంగా కర్మ బ్రహ్మలకు సేతువై, ముముక్షువులకు పరమపదసోపానమై, ఆరణ్యకాలకు అగ్రనాయకంగాను, ఉపనిషత్తులకు చూడామణిగాను ప్రకాశిస్తోంది "తైత్తిరీయారణ్యకం."

–ఏ.ఎస్.ఎస్.

# 2.3.8 సంగ్రహసమీక్ష

తైత్తిరీయారణ్యకంలో పది ప్రపాఠకాలున్నాయి. అందులో మొదటి ఆరు ప్రపాఠకాలను ఆరణ్యకంగాను, ఏడు, ఎనిమిది, తొమ్మిది ప్రపాఠకాలను తైత్తిరీయోపనిషత్తుగాను, పదో ప్రపాఠకం మహానారాయణీయోపనిషత్తుగాను వ్యవహరిస్తున్నారు.

**మొదటిప్రపాఠకం:**

మొదటిప్రపాఠకంలో ఆదిత్యమండల ప్రస్తావం ఉంది. సృష్టికి ముందు సూర్యుడు 'మరీచి' అనే రశ్మి ప్రభావంవల్ల క్షణ, ముహూర్త, పక్ష, మాసాది కాలాలను నిశ్చయిస్తాడు. చిన్న నదులు మహానదిలో కలసినట్లు దివస, పక్షాది కాలాలన్నీ సంవత్సరంలో ఐక్యమౌతున్నాయి. కాలం పరమాత్మ స్వరూపమే. ఆయన శిరఃస్థానంలో సంవత్సరం, ముఖస్థానంలో దక్షిణాయనం, ఉత్తరాయణం, వీటి అంశలుగా ఋతువులు ఉన్నాయి. దక్షిణోత్తరాయణాలకు ఏడు ఇన్ద్రియాలున్నాయి. శీర్షస్థానంలో ప్రాణి శరీరాలు పుడుతున్నాయి. కాలానికి దక్షిణపువైపు తెల్లగా పగలు, ఎడమ వైపు నల్లగా చీకటి ఉంది. ఆదిత్యునిలోంచి ఏర్పడ్డ కిరణాలు ఆరు, ఆరు ఋతువులైనాయి. అరుణకేతుకాగ్ని చయనం ఇందులో నిరూపింపబడింది.

1. అరోగుడు 2. భ్రాజుడు 3. పటరుడు 4. పతంగుడు 5. స్వర్ణరుడు 6. జ్యోతిషీమంతుడు 7. విభాసుడని ఏడుగురు సూర్యులున్నారు. వీళ్లు లోకాలను ప్రకాశింపజేస్తారు. కశ్యపుడనే ఎనిమిదో సూర్యుడు మేరుపర్వతం దగ్గరే ఉండి దాన్ని ప్రకాశింపజేస్తాడు. పంచకర్ణ, సప్తకర్ణ మహర్షులు అరోగుడు మొదలగు సూర్యులనందరినీ ప్రత్యక్షంగా చూశారు. ప్రాణిత్రాతుడనే మహర్షి కశ్యపుడనే ఎనిమిదో

సూర్యుణ్ణి చూశాడు. తూర్పు దిక్కుకు సూర్యవతి అని పేరు. ఆగ్నేయాది దిక్కుల్లో ఏడుగురు సూర్యులున్నారు. మొత్తం ఎనిమిది సూర్యమండలాలున్నట్లు ఈ ఆరణ్యకం పేర్కొంటున్నది.

మృత్యువులు నలుగురున్నారు. 1. పరమమృత్యువు ఆదిత్యుడు, 2. మధ్యమ మృత్యువు వాయువు, 3. అవమ మృత్యువు అగ్ని, 4. చతుర్థమృత్యువు చంద్రుడు. పాపం చేసిన వాళ్లు క్రిమికీటకాలై సుఖం లేకుండా మరణిస్తారు. పుణ్యం కల వాళ్లు స్వర్గ సుఖాలననుభవిస్తారు.

ఈ ప్రపాఠకంలో 1. అగ్ని 2. జాతవేదుడు 3. సహోజుడు 4. అజారాప్రభువు, 5. వైశ్వానరుడు 6. నర్యాపుడు 7. పంక్తిరథుడు, 8. విసర్పుడని ఎనిమిది మంది అగ్నిహోత్రులున్నట్లు చెప్పబడింది.

**రెండో ప్రపాఠకం:**

ఈ ప్రపాఠకానికి స్వాధ్యాయబ్రాహ్మణమని పేరు. ఇందులో ఇరవై అనువాకాలున్నాయి. ముఖ్యంగా సంధ్యోపాసన ప్రాశస్త్యం, పంచ మహాయజ్ఞాలు, బ్రహ్మోపస్థానం మొదలగు అంశాలు ఇందులో వివరింపబడినాయి.

**యజ్ఞోపవీతప్రశస్తి:**

సంధ్యోపాసనకు, వేదాధ్యయనం చేయడానికి, యజ్ఞయాగాలనాచరించడానికి యజ్ఞోపవీతం తప్పక ధరించాలి. అలా యజ్ఞోపవీతాన్ని ధరించ కుండా చేసిన కార్యాలు సత్ఫలితాలనివ్వలేదు. దీన్నిగురించి ఈ ఆరణ్యకం ఒక కథనిలా చెప్తున్నది.

ఒకప్పుడు దేవతలు, అసురులు స్వర్గాభిలాషతో యజ్ఞం చేయడానికి పూనుకున్నారు. అసురులు యజ్ఞోపవీతాన్ని ధరించకుండా, బ్రహ్మ

చర్యాన్ని పాటించకుండా మూర్ఖులై భుజబలంతో యజ్ఞం చేయడంవల్ల స్వర్గాన్ని పొందలేక పోయారు. దేవతలు బ్రహ్మచర్యంతో యజ్ఞోపవీతాన్ని ధరించి శాస్త్రానుసారం యజ్ఞంచేయడంవల్ల స్వర్గాన్ని పొందారు.

**సంధ్యోపాసన:**

సంధ్యోపాసన చేయకుండా చేసిన ఏవైదిక కర్మ కూడా సిద్ధిని కలిగించదు. సంధ్యావందనం చేసి అర్ఘ్యప్రదానం చేయడం వల్ల ఆ జలం వజ్రరూపాన్ని ధరించి ఆదిత్యునితో యుద్ధం చేయడానికి వచ్చిన మందేహాలనే రాక్షసులను అరుణద్వీపానికి తరిమివేస్తుంది. కనుక ప్రతివ్యక్తి సంధ్యావందనం అర్ఘ్యప్రదానం తప్పక చేయాలి.

ఈ ప్రపాఠకంలో కూష్మాండ హోమమంత్రాలు చెప్పబడినాయి. అన్ని కర్మలకు ముందు కూష్మాండహోమం చేస్తారు. దీనివల్ల యజమానికి అన్ని పాపాలు నశించి దేవలోకం ప్రాప్తిస్తుంది.

**పంచమహాయజ్ఞాలు:**

దేవతలనుద్దేశించి అగ్నిలో చేసే హోమం దేవయజ్ఞం. పితృదేవతల ప్రీతికోసం చేసే శ్రాద్ధకర్మ పితృయజ్ఞం. వైశ్వదేవం చేసి కాకులు మొదలగు వాటికి ఆహారమివ్వడమే భూతయజ్ఞం. బ్రాహ్మణులకు భోజనం పెట్టడం మనుష్యయజ్ఞం. స్వవేదశాఖనధ్యయనం చేయడం బ్రహ్మయజ్ఞం. పంచమహాయజ్ఞాల స్వరూపాన్ని ఈ ఆరణ్యకం వివరిస్తున్నది.

**మూడో ప్రపాఠకం:**

ఈ ప్రపాఠకంలో చెప్పబడిన దశహోతృ, చతుర్హోతృ, పంచహోతృ, షడ్ఢోతృమంత్రాలు అరణ్యంలో అధ్యయనం చేయాల్సినవి. ఇందులో నారాయణం (పురుషసూక్తం) భర్తృసూక్తం, మృత్యుసూక్తం, సూర్యోపస్థానం మొ|| విస్తరంగా చెప్పబడ్డాయి.

పురుషసూక్తంలో ఒక విరాట్స్వరూపం అభివర్ణింపబడింది. అందు లోని ప్రతిమంత్రం ఓ ఆణిముత్యం లాంటిది. చూడండి.

"విరాట్పురుషుడు దేవ -- మనుష్యాది శరీరాలను సృష్టించి, 'ఇతడు దేవుడు' 'ఇతడు మనుష్యుడు' 'ఇది పశువు' అని వ్యవహరిస్తున్నాడు. సర్వగుణసంపన్నుడైన ఆదిత్యునిలాగా ప్రకాశించు ఈ విరాట్పురుషుణ్ణి నేను ధ్యానిస్తూ అనుభవిస్తున్నాను. అతడు అజ్ఞానానికి అవతల ఉన్నాడు. గురు -- శాస్త్రోపదేశం లేకుండా అతణ్ణి తెలుసుకోవడం చాలా కష్టం[1].

**నాలుగో ప్రపాఠకం:**

ఈ ప్రపాఠకంలో ప్రవర్గ్యను గురించి చెప్పబడింది. యజ్ఞాభిమాని దేవత విష్ణువు గృహపతిగా దీక్షను పొంది సత్రయాగాన్నారంభించాడు. చీమలతో సమానమైన క్షుద్రజంతువులు యజ్ఞపురుషునిచేతిలోని ధనుస్సుకుగల అల్లెత్రాడును భక్షించాయి. పైకి ఎక్కుపెట్టబడిన ధనుస్సు యజ్ఞపురుషుని తలను ఖండించి ఆకాశంలోకి దూసుకుపోయింది. యజ్ఞపురుషుని శిరస్సు ద్యులోకం దాకా ఎగిరి మళ్లా భూమిమీద పడింది. ఆ యజ్ఞశిరస్సుకే ప్రవర్గ్యమని పేరేర్పడింది. అది భూమి పైన పడేటప్పుడు 'ఘ్రా' అనే శబ్దమేర్పడింది. అందువల్ల శిరస్సుకు 'ఘర్మ' అనే పేరు కూడా వచ్చింది. మహస్ అయిన యజ్ఞపురుషుని వీర్యం; అనగా సారభూతమైన శిరస్సుకాబట్టి దానికి 'మహావీర' మనే పేరు కూడా వచ్చింది. శిరస్సులేని యజ్ఞపురుషుని శరీరం మూడు భాగాలుగా విభజింపబడింది. వాటికే ప్రాతస్సవనం, మాధ్యన్దినసవనం, తృతీయసవనమని పేర్లు.

---

1. వేదాహ మేతం పురుషం మహాన్తం
ఆదిత్యవర్ణం తమసస్తుపారే
సర్వాణి రూపాణి విచిత్య ధీరః
నామాని కృత్వా -భివదన్యదాస్తే  తై.ఆ. 3.12

అయిదో ప్రపాఠకం:

ఈ ప్రపాఠకంలో ప్రవర్గ్య నిష్పత్తి, విష్ణువు చేసిన సత్రయాగం, సావిత్రహోమం, మహావీరనిర్మాణం, అజక్షీర ప్రశస్తి, బ్రహ్మవాదుల ప్రశ్నోత్తరికలు మొదలగు అంశాలు ప్రతిపాదింపబడ్డాయి.

భూమిదేనువు రూపాన్ని ధరించగా వాయువు వత్సరూపం దాల్చి నట్లు ధనుస్సు యజ్ఞపురుషుని శిరస్సు ఖండించగా అశ్వినీదేవతలు ఆ శిరస్సును అతికించినట్లును, అందువల్లనే ఇంద్రునితో కూడిన అశ్వినీ దేవతలకు ముందు హవిస్సు సమర్పింపబడుతున్నదని కూడా ఈ ప్రపా ఠకం తెలియజేస్తున్నది.

ప్రవర్గ్యునికి, ప్రజాపతి, సమ్రాట్, ఘర్మడు, మహావీరుడు, ఆది త్యుడు అనే పేర్లున్నట్లు ఈ ప్రపాఠకం తెలియజేస్తున్నది. ప్రవర్గ్యకు సంబంధించిన అనేక విశేషాలు ఈ ప్రపాఠకంలో విస్తరంగా వర్ణింప బడుతున్నాయి.

ఆరో ప్రపాఠకం:

ఈ ప్రపాఠకానికి పితృమేధమనే పేరుంది. ఆహితాగ్ని చనిపోయి నప్పుడు చేయాల్సిన విధులన్నీ వివరంగా ఇందులో తెలియజేయబడినాయి.

చనిపోయినవాడు లోకాంతరాలకు వెళ్లే పద్ధతి, పుణ్య పాప కర్మ లను అనుభవించే తీరు, ఆహితాగ్ని అయిన బ్రాహ్మణుడు, యుద్ధంలో మరణించిన క్షత్రియుడు పొందే లోకాలు మొ|| ఎన్నో విశేషాలు ఈ ప్రపాఠకంలో చెప్పబడ్డాయి.

— కె. హెచ్. ఎస్.

# ఆర్షవిజ్ఞానసర్వస్వము

## ఆరణ్యకాలు

# 2 విశేషవిభాగం

## 2.4 బృహదారణ్యకం

### 2.4.1 పరిచయం

శుక్లయజుర్వేదానికి సంబంధించిన శతపథ బ్రాహ్మణ పరిశిష్టమే బృహదారణ్యకం. మాధ్యన్దిన శతపథ బ్రాహ్మణంలో ఉన్న పధ్నాలుగు కాండల్లో చివరికాండమే బృహదారణ్యకం. అందులోను చివరి ఆరు అధ్యాయాలు బృహదారణ్యకోపనిషత్‌గా ప్రసిద్ధి చెందినాయి. కాణ్వశాఖకు సంబంధించిన శతపథ బ్రాహ్మణంలో చివరి ఐదు అధ్యాయాలు బృహదారణ్యకంగా గుర్తింపబడినాయి. పథశబ్దం అధ్యాయ పర్యాయమని శతపథం అంటే నూరు అధ్యాయాలు కల గ్రంథమని వెనుకటి సంపుటంలో (ఆ.వి.స. Vol. II. 249) వివరించాను. మాధ్యన్దినకాణ్వశాఖలకు సంబంధించిన బృహదారణ్యకాలు పేరుకు రెండుగా ఉన్నా

అధ్యాయాది విభాగాల్లో చిన్న చిన్న తేడాలు తప్ప విషయంలో చెప్ప దగినంత మార్పు లేదు.

— ఎస్.బి.ఆర్.

# 2.4.2 విభాగం

మాధ్యన్దిన శతపథబ్రాహ్మణంలోని బృహదారణ్యకంలో ఆరు అధ్యాయాలున్నాయి. వాటిల్లో మొత్తం 44 బ్రాహ్మణాలున్నాయి. ఈ బ్రాహ్మణాలు మళ్ళా ఖండలుగాను ఖండికలుగాను విభజింపబడ్డాయి. ఈ ఆరు అధ్యాయాలు కాక ఇంకో రెండధ్యాయాలు కూడా ఇందులో ఉండేవని చెబుతారు. వీటిలో యజ్ఞాలు పేర్కొనబడినాయి. వీటిని శంకరాచార్యులు కాని ఇతరులు కాని ప్రక్షిప్తాలనే భావంతో వ్యాఖ్యానించ లేదు. తరువాత వీటిని బృహదారణ్యక భాగంగా ఎవ్వరూ గుర్తించలేదు.

కాణ్వశాఖకు చెందిన బృహదారణ్యకంలో కూడా ఆరు అధ్యాయాలే ఉన్నాయి. మొత్తం ఆరణ్యకంలో 47 బ్రాహ్మణాలున్నాయి. అధ్యాయాది విభాగాల్లో తేడా తప్ప ఈ రెండు ఆరణ్యకాలకు విషయంలో భేదం లేదు. వివరాలకు చూడండి:

| మాధ్యన్దిన శాఖ | |
|---|---|
| అధ్యాయం | బ్రాహ్మణం |
| 1 | 6 |
| 2 | 5 |
| 3 | 9 |
| 4 | 5 |
| 5 | 15 |
| 6 | 4 |
| 6 | 44 |

| కాణ్వశాఖ | |
|---|---|
| అధ్యాయం | బ్రాహ్మణం |
| 1 | 6 |
| 2 | 6 |
| 3 | 9 |
| 4 | 6 |
| 5 | 15 |
| 6 | 5 |
| 6 | 47 |

విషయవిభాగం:

బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్య మహర్షి, విదేహరాజు జనకుడు ప్రధానమైన వ్యక్తులు. ఆధ్యాత్మిక రంగంలో సుప్రసిద్ధులైన గార్గి, మైత్రేయి ఇందులో ముఖ్యులు. ఇందులో విశ్వోత్పత్తి, జీవోత్పత్తి-మరణాలు, ఆత్మ స్వరూపం, మనస్సు, వాక్కు, ప్రాణస్వరూపం, నామ-రూప-కర్మల తత్త్వం సుషుప్తిస్వరూపం, ఋగాది విద్యలు, పృథివ్యాది మహాభూత వర్ణనం, అంతర్యామి స్వరూపం, స్వప్న స్వరూపం మొ|| అంశాలు ప్రతిపాదింపబడ్డాయి.

మొదలు - చివర:

బృహదారణ్యకం "ఉషా వా అశ్వస్య మేధ్యస్య శిరః" అనే మంత్రంతో ప్రారంభమై "సమానమా సాంజీవీ పుత్రాత్" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

– ఎస్.బి.ఆర్.

## 2.4.3 సంకలనకాలం:

**దేశం:**

శతపథ బ్రాహ్మణంలో ఒక భాగమే బృహదారణ్యకమని ఇంతకు ముందే చెప్పాను. పాంచాలదేశీయుడైన అరుణి శిష్యుడు యాజ్ఞవల్క్యుడు ఈ ఆరణ్యకాన్ని రచించాడు. యజ్ఞయాగాదులకు పుట్టినిల్లైన కురుపాంచాల దేశాల్లో ఈ ఆరణ్యకం రచింపబడినా కోసల-విదేహ దేశాల్లో ఇది ఎక్కువగా ప్రచారం పొందింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు రెండో సంపుటంలో (ఆ.వి.స. Vol. II 254) ఇవ్వబడ్డాయి.

**కాలం:**

బృహదారణ్యకం శతపథబ్రాహ్మణంలో ఒక భాగమే కాబట్టి ఆ బ్రాహ్మణ రచనా కాలమే దీని ఉత్పత్తి కాలమని వేటే చెప్పనక్కర్లేదు. బ్రాహ్మణ వాఙ్మయంలో శతపథబ్రాహ్మణం నాలుగో స్థానం ఆక్రమిస్తున్నది. ఐతరేయాది బ్రాహ్మణాల కంటే ఈ బ్రాహ్మణం నవీనమైంది. కాబట్టి ఇది క్రీ. పూ. 6 వ శతాబ్దంలో ఏర్పడి ఉంటుందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఆధునిక విమర్శకులు చేసిన ఈ కాలనిర్ణయాన్ని సంప్రదాయవాదులంగీకరించరు.

— ఎస్.బి.ఆర్.

## 2.4.4 వ్యాఖ్యానాలు -- ప్రచురణలు:

### వ్యాఖ్యానాలు:

మాధ్యన్దినశాఖకు సంబంధించిన శతపథబ్రాహ్మణానికి హరిస్వామి 'శ్రుత్యర్థ వివృతి' అనే భాష్యం వ్రాశాడు. కాని ఇది సమగ్రంగా దొరకడం లేదు. వివరాలు క్రిందటి సంపుటంలో (ఆ.వి.స. Vol. II 255) ఇచ్చాను. బృహదారణ్యకానికి సాయణభాష్యం దొరుకుతున్నది. శ్రీగణేశ్ శాస్త్రి పాఠక్ 'స్వరప్రకాశం' అనే భాష్యాన్ని వ్రాసినట్లు ప్రసిద్ధి ఉంది కాని అది ఇంతవఱకు వెలుగు చూడలేదు.

కాణ్వశాఖకు చెందిన శతపథబ్రాహ్మణానికి వ్యాఖ్యానాలు లేవనే చెప్పవచ్చు. మహాభారతవ్యాఖ్యాత నీలకంఠుడు ఈ బ్రాహ్మణానికి వ్యాఖ్యానం వ్రాసినట్లు తెలుస్తున్నది. కాని అది ఇంతవఱకు ముద్రింపబడలేదు.

బృహదారణ్యకానికి ఉపనిషత్తుగా ప్రసిద్ధి ఉండటంచేత శ్రీశంకరులు అద్వైతపరంగాను, శ్రీరంగ రామానుజులు విశిష్టాద్వైతపరంగాను, శ్రీ ఆనందతీర్థులు ద్వైతపరంగాను భాష్యాలు వ్రాశారు.

### ప్రచురణలు:

శతపథబ్రాహ్మణానికి లండన్ నుంచి సాయణభాష్యంతో 1885 లో ఎ. వేబర్ ప్రచురణ, 1902 లో అజ్మీర్ నుంచి ఇంకొక ప్రచురణ, 1905 లో కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటి ద్వారా సాయణభాష్యంతో సత్యవ్రత సామాశ్రమి ప్రచురణ, సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్ (S.B.E.) గ్రంథమాలలో 12, 26, 41, 43, 44 సంపుటాలుగా ఆంగ్లానువాదంతో ప్రా|| ఎగ్గలింగ్ ప్రచురణ, 1926 లో లాహోరు నుంచి డబ్ల్యు. కాలండ్ ప్రచురణ, 1937 లో కాశీ-ప్రచురణ, బొంబాయి నుంచి 1940 లో సాయణభాష్యంతో శ్రీధరశర్మ

ప్రచురణ ఏర్పడినాయి. వీటిలో బృహదారణ్యకం కలసి ఉంది. ఇవి కాక బృహదారణ్యకోపనిషత్తుగా మనదేశంలో దీనికి ఎన్నో ప్రచురణలు, భాషానువాదాలు వచ్చాయి.

— ఎస్.బి.ఆర్.

## 2.4.5 ప్రసిద్ధి

బృహదారణ్యకానికి ఒక ఆరణ్యకంగా కాకుండా ఉపనిషత్తుగా ఎక్కువ ప్రసిద్ధి వచ్చింది. ఇందులోని అనేకాంశాలు ఆధ్యాత్మిక భావనలను ఇదమిత్థంగా పరిష్కరించడం, భారతీయ తాత్త్వికరంగంలో మతత్రయంగా సుప్రసిద్ధమైన ద్వైతాద్వైతవిశిష్టాద్వైత సంప్రదాయాలకు సంబంధించిన ఆచార్యులు దీనికి భాష్యాలు వ్రాయడం దీనికి ముఖ్యమైన కారణం.

ఇందులోని యాజ్ఞవల్క్య-జనక సంవాదాలు, గార్గి - మైత్రేయి మొదలగు వారి భావనల్లోని అనేక తాత్త్వికాంశాలు ఈ ఆరణ్యకానికి ఎంతో ప్రసిద్ధిని చేకూర్చినాయి. గాఢనిద్రను గురించి ఈ ఆరణ్యకం ఎలా వివరిస్తున్నదో చూడండి–

### నిద్ర ఎలా వస్తుంది?

జీవుడు గాఢసుషుప్తి పొందినప్పుడు అతడికేమీ తెలియదు. 'హిత' లనే డెబ్బైరెండు వేల నాడులు మన హృదయం నుంచి పురీతత్‌లో ప్రవేశిస్తాయి. అప్పుడు పిల్లవాడుగాని, మహారాజుగాని, మహాబ్రాహ్మణుడుగాని ఆనందం కోసం శయనమందిరానికి చేరి నిద్రించినట్లు జీవుడు పురీతత్ అనే నాడిలో శయనిస్తాడు[1].

1. అథ యదా సుషుప్తో భవతి యదా న కస్యచన వేద, హితా నామ నాడ్యో ద్వాసప్తతి సహస్రాణి హృదయాత్పురీతతమభిప్రతిష్ఠన్తే. తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే, స యథా కుమారో వా మహారాజో వా మహాబ్రాహ్మణో వాతిఘ్నీ మానన్దస్య గత్వా శయీతైవ మేష ఏతచ్ఛేతే. 2.1.19.

ప్రేమ ఎలా కలుగుతుంది?

భార్యకు భర్త ప్రియుడెందు కవుతున్నాడు ?

భర్తపై ప్రేమతో కాదు. ఆత్మపైన ప్రేమతో.

భర్తకు భార్య ఎందుకు ప్రియురాలౌతున్నది ?

భార్యమీద ప్రేమతో కాదు. ఆత్మపైన ప్రేమతో.

పుత్రులపైన ప్రేమ వల్ల వాళ్ళు తల్లిదండ్రులకు

ఇష్టమైన వాళ్ళు కావడం లేదు. ఆత్మపైన గల

ప్రేమవల్ల వాళ్ళు ప్రియమైన వాళ్లవుతున్నారు[2].

— ఎస్.బి.ఆర్.

---

2. నవా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి
ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి.
నవా అరే జాయాయై కామాయ జాయా ప్రియా భవతి.
ఆత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి.
న వా అరే పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవన్తి.
ఆత్మనస్తు కామాయ పుత్రా ప్రియా భవన్తి. 2.4.5

## 2.4.6 ఉపాసన

ఉపాసన అనే పదానికి సమీపంలో ఉండటం అని అర్థం. ఉపాసన వల్ల భగవంతునికి సమీపంలో ఉండవచ్చు. ఉపాసనద్వారా మనస్సును ఒక లక్ష్యంపై కేంద్రీకరించవచ్చు. ఒకడు మంత్రాన్ని ఉపాసించాడని అంటే ఆ మంత్రంపై మనస్సును కేంద్రీకరించి, మననం చేసికొంటూ దానికి సంబంధించిన దేవతను తృప్తిపరచడం. గాయత్రిని ఉపాసిస్తే దాని ద్వారా సాత్వికమైన శక్తి కలుగుతుంది. మనస్సు స్వచ్ఛంగాను, పవిత్రంగాను అవుతుంది. చెడుతలంపులు రావు. మంచివిషయాల మీద మనస్సు ప్రసరిస్తుంది. మంచి పనులను చేసి లోకానికి మేలు చేయవచ్చు.

ఒక దేవతను ఉపాసించడం కూడ అలాంటిదే. ఆంజనేయుని ఉపాసించడం అంటే మనస్సును హనుమంతునిపై నిలిపి అతనిని హృద్గతం చేసికోవడం. దాని వలన ఆయన లాగా కార్యసాధకుడుగాను, నిర్భయుడు గాను కావచ్చు. 'శివో భూత్వా శివం యజేత్' అన్నారు. శివుని పూజించాలంటే శివునితో అభేదాన్ని పొందాలి. అట్లే ఉపాసకుడు ఆమంత్రంతో గాని, దేవతతోగాని తాదాత్మ్యాన్ని పొందుతాడు. మంత్రం, దేవతల యొక్క గుణాలనుబట్టి ఉపాసకునికి అలాంటి గుణాలు కలుగుతాయి. నరసింహుని ఉపాసించిన శంకరుని శిష్యుడు ఒక కాపాలికుని చంపి తన గురువును రక్షించిన విషయం తెలిసిందే గదా!

త్రికాలాలలోను సంధ్యను ఉపాసిస్తే ఓజస్సు పెరుగుతుంది. తామసిక గుణంగల దేవతను ఉపాసిస్తే తమోగుణం కలుగుతుంది. కొందరు క్షుద్రదేవతను ఉపాసించి స్వాధీనం చేసికొంటారు. ఇతరులకు హాని కలిగించే పనులు చేస్తారు. బాణామతి (చేతబడి) వంటి విద్యలు అలాంటివే. వాటి ప్రభావం కొద్దికాలమే ఉంటుంది. అలాగాక సాత్త్విక దేవతలను ఉపాసిస్తే పరోపకారం చేయవచ్చు. ఈ విధంగా ఉపాసనా పద్ధతులు ఇందులో వివరింప బడ్డాయి.

అశ్వరూపమైన ప్రజాపతిని, యజ్ఞఫలరూపమైన అగ్నిని ఉపాసించడమే అశ్వమేధం అనవచ్చు. తన తేజస్సుతో ప్రపంచాన్ని తపింపజేసే సూర్యుడు అశ్వమేధఫలంగా చెప్పబడ్డాడు. సూర్యునికి సంవత్సరకాలం శరీరం. యజ్ఞసాధనమైన అగ్నియే సూర్యుడు. యజ్ఞఫలం అగ్ని వల్ల సాధింపబడుతుంది. సూర్యుడు యజ్ఞరూపుడు. అశ్వమేధోపాసన అంటే సూర్యోపాసన అని అనవచ్చు. అగ్ని, ఆదిత్యుడు కలిసి మృత్యువనే దేవతగా అయ్యారు. ఈ విషయం తెలిసికొని ఉపాసన చేసే వారు మృత్యువును జయించగలుగుతారు. మోక్షపురుషార్థం కరతలామలకం అవుతుంది (1-2-7).

ప్రాణోపాసన:

ప్రజాపతి వల్ల దేవతలు, అసురులు కలిగారు. శాస్త్రజ్ఞానం, కర్మ కలవారు దేవతలు. ప్రత్యక్షజన్యజ్ఞానం, కర్మ కలవారు అసురులు. దేవతలు సాత్త్వికులు. వాళ్ళు కొద్దిమందే ఉంటారు. అసురులు కేవల భౌతికశక్తి నాశ్రయించినవాళ్ళు. వాళ్ళు అధిక సంఖ్యలో ఉంటారు. వాళ్ళు ఎప్పుడూ కలహించుకొంటూ ఉండే వారు. సాత్త్వికమైన దైవీశక్తికి, అసాత్త్వికమైన ఆసురీశక్తికి మధ్యగల పోరాటమే దేవాసుర యుద్ధంగా వర్ణింపబడింది. దేవతలు జయిస్తే ధర్మం పెరుగుతుంది. అసురులది పైచేయి అయితే అధర్మం పెరుగుతుంది. ఈ రెండు శక్తుల కలయిక వల్ల మనుష్యత్వం కలుగుతుంది (1-3).

ఒకసారి దేవతలు యజ్ఞంచేసి అసురులను జయించాలనుకొన్నారు. మాకోసం ఉద్గీథ మంత్రాన్ని గానం చేయమని వాక్కును కోరారు. ఎల్లప్పుడు ఆత్మను దీవిస్తూ, మంచిమాటలు చెపుతూ ఉండమని కోరారు. వాక్కు ఆ విధంగా గానం చేసింది. దానివల్ల కలిగిన జ్ఞానబలాన్ని దేవతలకు ఇచ్చి, కర్మఫలాన్ని వాక్కు తాను తీసికొంది. అసురులు భయపడి వాక్కును పాపవిద్ధం చేశారు. భయం, అసత్యం మొదలైన అసాత్త్విక

తత్త్వం కలిగేటట్లు వాక్కును ప్రేరేపించారు. దానివల్ల దేవతలు అసురులను జయించలేకపోయారు. తరువాత దేవతలు ఘ్రాణేంద్రియాన్ని ఈ విధంగానే కోరారు. అసురులు ఘ్రాణం చేసిన ఉద్గీథాన్ని కూడ పాపవిద్ధం చేశారు. చక్షువు, శ్రోత్రము, మనస్సు విషయంలో కూడా ఈ విధంగానే జరిగింది. చివరకు దేవతలు ప్రాణాన్ని కోరారు. ప్రాణం ఉద్గీథాన్ని గానం చేసింది. దానిని పాపవిద్ధం చేయడానికి అసురులకు సాధ్యం కాలేదు. మట్టిబెడ్డ బండరాతిని పగులగొట్టాలని వెళ్ళి తానే చితికిపోయినట్లుగా, అసురులు చెల్లాచెదరై పోయారు. దేవతలకు స్వస్థత చిక్కింది. కనుక ప్రాణోపాసన చేయాలి. దాని వల్ల మృత్యువు దూరంగా తొలగుతుంది. అమరత్వం పొందవచ్చు.

దేవతలు ఈ ప్రాణం ఎక్కడ ఉందని విచారించి, అది శరీరంలోనే ఉందని తెలుసుకొన్నారు. ఆ ప్రాణం 'ఆయాస్య' (వాగాది ఇంద్రియాలను పట్టి ఉంచేది), 'అంగిరస్సు' (అంగాలకు సారభూతంగా ఉండేది) అని పిలువబడుతోంది. దీనివల్ల మృత్యువు దూరమవుతుంది. కనుక 'దూ' అని పిలువబడుతోంది. ఇది వాక్కు మొదలైన వాటి పాపాలను పారద్రోలుతోంది. ఆ పాపాలు దుష్టులను చేరుతాయి. కనుక దుష్టసహవాసం పనికిరాదన్నారు. ప్రాణంవల్లనే వాగాదులకు దేవతాత్వం వస్తుంది. ఇది ఆవహించినపుడు వాక్కు అగ్ని దేవతగాను, ఘ్రాణం వాయుదేవతగాను, చక్షువు ఆదిత్యుడుగాను, శ్రోత్రం, దిగ్దేవతగాను, మనస్సు చంద్రుడుగాను ప్రకాశిస్తాయి. ఇది తెలిసికొని ప్రాణాన్ని ఉపాసిస్తే దేవతాత్వం వస్తుంది. ప్రాణం అన్నాన్ని కూడ ఆవహిస్తుంది. వాగాదులు ఆ అన్నంలో తమకుకూడ భాగమిమ్మని కోరాయి. అలా అయితే నాతో చేరమని ప్రాణం చెప్పింది. అవి ప్రాణాన్ని చేరాయి. కాబట్టి ప్రాణం నిలుపుకోవడం కోసం మాత్రమే అన్నం తినేవాని వాగాది ఇంద్రియాలు తృప్తిపడతాయి. బ్రతికి ఉండడానికి మాత్రమే తినడం ఉత్తముల లక్షణం. తినడం కోసం బ్రతకడం నీచుల లక్షణం.

ఉత్తమమైన పనులు చేయడం కోసం బ్రతకాలి. అలా బ్రతకడం కోసం తినాలి. అన్ని అంగాలకు సారం ప్రాణమే. అది పోతే అవయవాలు శుష్కించి పోతాయి. ప్రాణం వల్లనే వేదవిద్యను సాధించగలుగుతాడు. అన్నింటిని ఉన్నతంగా తీసికొనిపోయే వాక్కుకు ఉద్గీథమని పేరు. అది కూడ ప్రాణం వల్లనే సాధ్యమవుతుంది. ఇలాంటి ప్రాణాన్ని ఉపాసన చేస్తే సకలశుభాలు చేకూరుతాయి (1-3).

**ఆత్మోపాసన:**

ఈ జగత్తంతా మొదట ఆత్మలో లీనమై ఉంది. తరువాత ప్రజా పతి స్వయంగా ఉద్భవించాడు. అప్పుడు అతడు తనను తప్ప వేరే దేనినీ చూడలేదు. నేనే ఉన్నానని తలచాడు. జ్ఞానకర్మలద్వారా అజ్ఞాన లక్షణమైన పాపాలను దహించివేశాడు. అందువల్ల ఆత్మకు పురుషుడని పేరుగలిగింది. ప్రజాపతి మొదట తానొక్కడే ఉన్నట్లు తలచి భయ పడ్డాడు. తరువాత ఏకత్వానుభూతి (సర్వం బ్రహ్మమయం అని) పొందగా అది పోయింది. ఒక్కడుగా ఉంటే సంతోషముండదు. కనుక తన సంతోషం కోసం రెండవ వస్తువును, అనగా స్త్రీని కోరాడు. స్త్రీ పురుషరూపాలుగా చేసికొన్నాడు. ఆ మిథునం వల్ల మనుష్యులు, పశువులు, పక్షులు మొదలైన సృష్టి జరిగింది. తరువాత చంద్రుడు, అగ్ని, అన్నం మొదలైన వాటిని సృష్టించాడు.

మొదట ఈ జగత్తు నామరూప వికారాలు లేకుండా ఉంది. తరు వాత ఆ వికారాలు పొంది అనేకరకాల వస్తువులుగా ఏర్పడింది. దానిలో ఎలాంటి వికారాలు లేని ఆత్మ ప్రవేశించింది. ఒరలో కత్తిలాగా, చెట్టులో అగ్ని లాగా అది సర్వత్రా వ్యాపించింది. ఆ ఆత్మయే శ్వాసక్రియ జరి గేటప్పుడు ప్రాణమనీ, మాట్లాడేటప్పుడు వాక్కు అనీ, చూసేటప్పుడు చక్షువనీ, వినేటప్పుడు శ్రోత్రమనీ, తలచేటప్పుడు మనస్సనీ పిలువబడు తోంది. అన్ని కర్మలూ ఆత్మయందే ఉన్నాయనీ, సర్వమూ ఆత్మే అనీ

దానిని ఉపాసించాలి. తప్పిపోయిన ఆవులను వాటి అడుగుజాడలను బట్టి తెలిసికొన్నట్లుగా, మరుగైన ఆత్మను జ్ఞానం వల్ల తెలిసికోవాలి. భార్యాబిడ్డలు, ధనధాన్యాలు మనకు ప్రియమైనవి. వాటికంటే కూడ మిక్కిలి ప్రియమైనది ఆత్మ. దానిని ఉపాసిస్తే ప్రియమైన వస్తువులన్నీ నశించకుండా ఉంటాయి. ఆత్మను తెలిసికొన్నవానికి తాను కోరినవి సృష్టించుకునే శక్తి కలుగుతుంది (1-4).

**అన్నోపాసన:**

ప్రజాపతి ఏడు విధాలైన అన్నాలను సృష్టించాడు. సాధారణంగా లోకంలో అన్ని ప్రాణులు తినే అన్నం ఒక విధం. మిశ్రమంగా ఉండే ఈ అన్నాన్ని ఉపాసించిన వారి పాపాలు తొలగవు. దేవతలకు హవిస్సు, బలి అని రెండు విధాలైన అన్నాలు ఈయబడతాయి. అగ్నిలో హోమంగా అర్పింపబడేది హవిస్సు. వాటిలో నుంచి దేవతల భాగంగా వేరుచేయబడేది బలి. పశువులద్వారా లభించే పాలు నాల్గవ విధం. పుట్టిన శిశువుగాని, లేగ దూడగాని పాలు త్రాగి బ్రతుకుతాయి. తరువాతనే మనుష్యుడు అన్నమూ, పశువు గడ్డి తింటుంది. ఈ పాలతో ఒక్క రోజు హోమం చేసినా అకాలమృత్యువు తొలగిపోతుంది. పురుషుడు ఈ అన్నాన్ని తన జ్ఞానంతోను, కర్మలోను సృష్టించుకొంటాడు గనుక ఇవి క్షీణించవు. ఇలాంటి అన్నాన్ని ఉపాసిస్తే శాశ్వతుడవుతాడు (1-5-1).

మనస్సు, వాక్కు, ప్రాణం – అనే మూడు విధాలైన అన్నాలను తన కొఱకు సృష్టించాడు. అందులో మనస్సు ముఖ్యమైంది. మనస్సు తొలగి ఉంటే దగ్గర ఉన్న దానిని కూడ చూడలేం, వినలేం. అది ఉంటేనే చూడగలం, వినగలం. మనస్సు చేతనే కామం, ధైర్యం, శ్రద్ధ మొదలైన వాటిని తెలిసికోగలం. ఆరవది వాక్కు. ఇది వాచకమైన వస్తువును అనుసరించి ఉండి, దానిని ప్రకాశింపచేస్తోంది. ఏడవవిధ

మైన అన్నం ప్రాణం. అది ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం – అని అయిదు విధాలు. ఆత్మ మనోమయం, వాఙ్మయం, ప్రాణమయం. ఇవి అనంతాలు. ఇది తెలిసికొని ఆత్మను ఉపాసిస్తే అనంతాలైన లోకాలు సిద్ధిస్తాయి (1-5).

వాగ్బ్రహ్మోపాసన:

జిత్వాశైలిని జనకమహారాజుకు వాక్కే బ్రహ్మమని బోధించాడు. యాజ్ఞవల్క్యుడు ఆయతన ప్రతిష్ఠలలో దానిని వివరించాడు. వాక్కునే బ్రహ్మకు శరీరం (ఆయతనం) వాక్కే. అన్ని కాలాలలోను దానికి ఆశ్రయం (ప్రతిష్ఠ) ఆకాశం. దానిని ప్రజ్ఞారూపంలో ఉపాసించాలి. ఆయతన ప్రతిష్ఠలు వాక్కుకంటే వేరైనవి. కాని ప్రజ్ఞకు వాక్కుకు భేదం లేదు. వేదాది సకలవిషయాలు వాక్కువల్ల తెలుస్తున్నాయి. బ్రహ్మవిద్య వాక్కును విడిచి ఉండదు. కనుక వాక్కే బ్రహ్మం. దీనిని తెలిసికొని ఉపాసిస్తే సకలభూతాలు రక్షిస్తాయి. చివరకు దేవతాత్వం పొందుతాడు (4-1-3).

వాయుబ్రహ్మోపాసన:

ఉదంకుడు బోధించిన వాయుబ్రహ్మకు శరీరం వాయువే. ఆశ్రయం ఆకాశం. దానిని ప్రియవస్తువుగా ఉపాసించాలి. ప్రాణం కోసమే పతితుని చేత యాగం చేయించడం, పుచ్చుకోరాని దానిని దానంగా పుచ్చుకోవడం చేస్తూ ఉంటాడు. ప్రాణం మీది ప్రీతితోనే దొంగలుండే దిక్కుకు చంపుతారనే భయంతో పోడు. కనుక ప్రాణరూప వాయువును ప్రియవస్తువుగా ఉపాసించాలి (4-1-4).

చక్షుర్బ్రహ్మోపాసన:

బర్కు అనే ఆయన బోధించిన చక్షూరూప బ్రహ్మకు శరీరం నేత్రం. ఆశ్రయం ఆకాశం. దీనిని సత్యవస్తువుగా ఉపాసించాలి. నీవు

దానిని చూశావా అని అడిగితే నేను కంటితో చూశానంటాడు. అది సత్యమే. కనుక చక్షువనే బ్రహ్మను ఉపాసన చేసినవాడు సత్యస్వరూపుడవుతాడు (4-1-5).

శ్రోత్రబ్రహ్మోపాసన:

భారద్వాజుడు శ్రోత్రం బ్రహ్మ అన్నాడు. దానికి శరీరం చెవి. ఆశ్రయం ఆకాశమే. దానిని అనంతం అనే రూపంలో ఉపాసించాలి. దిక్కులు అనంతాలు. ఏదిక్కుకు పోయినా దానికి అంతం చూడలేం. ఇలాంటి శ్రోత్రరూపమైన బ్రహ్మను ఉపాసిస్తే దేవతాత్వాన్ని పొందవచ్చు (4-1-6).

మనోబ్రహ్మోపాసన:

సత్యకాముడు మనస్సు బ్రహ్మమన్నాడు. దానికి శరీరం మనస్సు. ఆశ్రయం ఆకాశమే. దానిని ఆనందరూపంలో ఉపాసించాలి. మనస్సుతో అనురూపవతియైన స్త్రీని కోరుతాడు. ఆమెయందు అనురూపమైన పుత్రుడు కలుగుతాడు. అదే ఆనందం. కనుక మనోరూపమైన బ్రహ్మను ఉపాసిస్తే సకలదేవతలు రక్షించి ఉపకారం చేస్తారు (4-1-7).

హృదయబ్రహ్మోపాసన:

శాకల్యుడు హృదయమే బ్రహ్మ అన్నాడు. దానికి శరీరం హృదయమే. ఆశ్రయం ఆకాశమే. దానిని స్థితిరూపంలో ఉపాసించాలి. సకల భూతాలకు హృదయమే ఆయతనం ప్రతిష్ఠ కూడ. దానిలోనే అన్ని భూతాలు నిలిచి ఉంటాయి. దానిని ఉపాసిస్తే దేవతాత్వం కలుగుతుంది (4-1-8). ఇది యాజ్ఞవల్క్యుడు జనకునికి బోధించినది. హృదయమే బ్రహ్మం. హృద్గతబుద్ధితత్త్వమే బ్రహ్మస్వరూపం. దీనిలో మూడు అక్షరాలున్నాయి. 'హృ' అనే అక్షరం హృదయాత్మకు ఇంద్రియాలు, విషయాలు, వాటి బలాలను ఇస్తుంది. 'ద' అనే అక్షరం

ఇంద్రియాల చేతను, వాటి విషయాల చేతను వీర్యాన్ని ఇస్తోంది. 'యమ్' అనే అక్షరం స్వర్గానికి పోయేటట్లు చేస్తోంది. దీనిని తెలిసికొని ఉపాసిస్తే బలవీర్యాలు కలిగి స్వర్గాన్ని పొందగలరు (5-3-1).

ప్రణవాకాశోపాసన:

'ఓం ఖం' రూపమైన ఆకాశం బ్రహ్మస్వరూపం. ఇది అశాశ్వతమైన భూతాకాశం కాదు. శాశ్వతమైన చిదాకాశం. ఇది వాయుసంబంధమైన ఆకాశం. 'ఓం' వేదస్వరూపం. అలాంటి వేదం చేత తెలియజెప్పబడుతోంది గనుక దీనికీ పేరు వచ్చింది. బ్రహ్మోపాసనకు ఓంకారం సాధనం. ఇది బ్రహ్మకు రూపం, నామం కూడ. బ్రహ్మజ్ఞానానికి ఇది పట్టుకొమ్మ. ఇది జీవాత్మపరమాత్మలకు నామరూపాత్మకంగా ఉంది. దీనిని ఉపాసిస్తే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది (5-1-1).

సత్యబ్రహ్మోపాసన:

ఇది సత్య స్వరూపం. సత్ అంటే పృథివి, జలం, అగ్ని. త్య అంటే వాయువు, ఆకాశం. మహత్తుగల ఈ బ్రహ్మను సత్యస్వరూపంగా ఉపాసించాలి. అతడు సర్వలోకాలను జయించగలడు. మొదట జలం ఉంది. అది సత్యాన్ని సృష్టించింది. ఆ సత్యం బ్రహ్మస్వరూపం. అది ప్రజాపతిని సృష్టించింది. అతడు దేవతలను సృష్టించాడు. వారు సత్యాన్ని బ్రహ్మగా ఉపాసించారు. ఇందులో స-త-యం-- అనే మూడక్షరాలున్నాయి. మధ్య 'త' కారం అసత్యాక్షరం. ఇది రెండు సత్యాక్షరాల మధ్యనున్నందువల్ల సత్యం యొక్క బలం పెరుగుతుంది. అక్షరజ్ఞానం కలిగి ఉపాసిస్తే అసత్యంవల్ల బాధ కలుగదు (5-4; 5-5).

విద్యుద్బ్రహ్మోపాసన:

విద్యుత్తు బ్రహ్మం. ఇది మేఘంలోని చీకటిని చీల్చి ప్రకాశిస్తోంది. దీన్ని ఉపాసిస్తే ఆత్మకు ప్రతికూలంగా ఉండే పాపాలను పోగొడుతుంది (5-7-1).

ధేనురూప వాక్ బ్రహ్మోపాసన:

వాక్కు బ్రహ్మ స్వరూపం. వేదాలే ఆ వాక్కు. ఇలాంటి వాక్కు అనే ధేనువును బ్రహ్మస్వరూపంగా ఉపాసించాలి. ఆవు తన పొదుగులోని పాలతో దూడను, దేవతలు మొదలైనవారిని పోషిస్తుంది. అలాగే వాక్కు పాలవంటి అన్నాన్ని దేవతలకు ఇస్తుంది. దేవతలకు 'స్వాహా', 'వషట్' కారాలతోను, మనుష్యులకు 'హన్త' కారంతోను, పితృదేవతలకు 'స్వధా' కారంతోను అన్నం ఇవ్వబడుతుంది. ఆవులాగా ఉన్న వాక్కు దేవాదులకు అన్నం ఇస్తుంది కనుక దీనికీపేరు. వేదాధ్యయనం చేసి వేదోక్తకర్మలద్వారా దేవతలకు, పితృదేవతలకు, మనుష్యులకు తృప్తి కలిగించాలి. ప్రాణంవల్ల వాక్కు పుడుతుంది. ఈ ధేనురూప వాక్కుకు వృషభం ప్రాణం, దూడ మనస్సు. మనస్సుతో ఆలోచించిన విషయంలో వాక్కు ప్రసరిస్తుంది. దీన్ని ఉపాసిస్తే బ్రహ్మత్వాన్ని పొందవచ్చు.

పురుషునిలో ఉన్న వైశ్వానరాగ్ని తిన్నదానిని పచనం చేస్తుంది. చెవులు మూసికొన్నపుడు వినపడేది ఆ అగ్ని యొక్క ధ్వనియే. ప్రజాపతి రూపమైన దీనిని ఉపాసిస్తే తద్రూపాన్ని పొందవచ్చు. దీనిని ఉపాసించిన పురుషుడు చనిపోయిన తరువాత ముందు వాయులోకాన్ని చేరతాడు. తరువాత పైనున్న సూర్యలోకాన్ని, తరువాత చంద్రలోకాన్ని చేరతాడు. చివరికి శాశ్వతమైన అనంతలోకాలలో నివాసముంటాడు. అక్కడ శారీరకంగాగాని, మానసికంగాగాని ఎలాంటి దుఃఖాలూ ఉండవు (5-8).

**అన్న ప్రాణరూప బ్రహ్మోపాసన:**

ప్రాణం లేకుంటే అన్నం దుర్గంధంతో కూడి ఉంటుంది. అన్నం లేకుంటే ప్రాణం రసవిహీనంగా ఉంటుంది. అన్నం వల్ల ప్రాణం నిలుస్తోంది. కనుక అన్నమూ, ప్రాణమూ రెండు బ్రహ్మస్వరూపాలే. కనుక ఆరెంటిని కలిపి ఉపాసించాలి. 'వి' అన్నానికి సంకేతం. 'రం' ప్రాణానికి సంకేతం. 'ఉక్థము' ఆయుధాలలో ప్రధానం. ప్రాణం ఇంద్రియాలలో ప్రధానం. కనుక ప్రాణాన్ని ఉక్థరూపంలో ఉపాసించాలి. ప్రాణం అందరినీ పైకి లేపినట్లు ఉన్నతంగా ఉంచగలదు. శస్త్రం చేత గాయం ఏర్పడ్డప్పుడు ప్రాణం దానిని రక్తమాంసాదులతో నింపి రక్షిస్తుంది. అందుకే 'క్షత్ర' రూపంలోనూ ప్రాణాన్ని ఉపాసించాలి.

**గాయత్ర్యుపాసన:**

గాయత్రి అన్నిఛందస్సులలోను శ్రేష్ఠమైంది. దానిని మననం చేసిన వానిని, ప్రయోగించే వానిని కాపాడుతుంది. కనుక దానికాపేరు వచ్చింది. ఇతర ఛందస్సులకు ఈ శక్తి లేదు. ప్రాణమే గాయత్రి. గాయత్రి బ్రాహ్మణత్వాన్ని కలిగించేది కూడ. దీనిని ఉపాసించిన వాడు ద్విజుడు అవుతాడు. వీనికే మోక్ష పురుషార్థాన్ని పొందే అర్హత ఉంటుంది. దీన్ని ఉపాసిస్తే బ్రహ్మతేజం వస్తుంది.

భూమి, అంతరిక్షం, దివం-- ఇది గాయత్రి మొదటి పాదం. ఎనిమిది అక్షరాలు కలది. ఇది ముల్లోకాలకు ఆత్మ. దీనిని తెలిసికొంటే ముల్లోకాలను జయించగలడు.

ఋక్, యజుస్సు, సామ– ఇది గాయత్రి రెండవ పాదం. ఎనిమిది అక్షరాలు కలది. ఇది వేదత్రయాత్మకం. దీనిని తెలిసికొంటే వేదత్రయాన్ని స్వాధీనం చేసికోవచ్చు.

ప్రాణ, అపాన, వ్యాన– ఇది గాయత్రి మూడవ పాదం. ఎనిమిది అక్షరాలున్నాయి. దీనిని ఉపాసిస్తే సకల జీవరాసులను జయించగలడు.

వెలుగుతూ ఉండే పరోరజస్సు గాయత్రికి నాల్గవ పాదం. ఆదిత్య మండలంలో ఉండే పరమపురుషుడు అతడు. రజోగుణంతో పుట్టిన సర్వలోకాలను తపింపచేస్తాడు. ఇది తెలిసికొంటే సర్వసంపదలు, కీర్తి కలుగుతాయి.

మొదటి మూడు పాదాల గాయత్రి పరోరజస్సులో ప్రతిష్ఠింపబడింది. ఇది అంతా సత్యంలో ప్రతిష్ఠింపబడింది. నేత్రమే సత్యం. ఒకచోట తగాదా పడుతుంటే, దానిని ఒకడు కళ్ళారా చూస్తాడు. మరొకడు వింటాడు. అందులో చూసినవాడు చెప్పిందే సత్యంగా నమ్ముతాం. ఆ సత్యం ప్రాణంలో ప్రతిష్ఠితమైంది. సత్యం కంటే ప్రాణం శ్రేష్ఠం. ఆ ప్రాణం ఆత్మలో ప్రతిష్ఠితమైంది. వాగాది ఇంద్రియాలను రక్షిస్తోంది గనుక గాయత్రి అనే పేరు వచ్చింది. గాయత్రిని ఉపదేశం పొంది ఉపాసించిన వానిని పరమాత్మ రక్షిస్తాడు (5-14).

## వివిధదృష్టులతో ప్రాణోపాసన:

1. ప్రాణం జ్యేష్ఠం, శ్రేష్ఠం కూడ. వయస్సు పెద్ద అయితే జ్యేష్ఠుడంటాం. గుణాలలో పెద్దఅయితే శ్రేష్ఠుడంటాం. ఒకడు వయసులో పెద్దవాడైనా గుణాలు లేకుంటే వానిని జ్యేష్ఠుడనవచ్చు గాని శ్రేష్ఠుడనలేం. అట్లే వయస్సులో పిన్న అయినా గుణాలుంటే వానిని జ్యేష్ఠుడని అనలేం కాని శ్రేష్ఠుడనవచ్చు. ప్రాణం జ్యేష్ఠమూ, శ్రేష్ఠమూ కూడా అవుతుంది. శుక్రశోణితాల వల్ల పిండం ఏర్పడుతుంది. దానికి ప్రాణం ఉండాలి. చక్షురాది ఇంద్రియాలన్నింటిలో ప్రాణం జ్యేష్ఠం. ప్రాణం లేకపోతే ఇంద్రియాలు పనిచేయలేవు. కనుక అది శ్రేష్ఠం కూడా అవుతుంది.

ఒకసారి వాగాది ఇంద్రియాలు ప్రాణంతో పాటు ప్రజాపతి దగ్గరకు వెళ్ళి మాలో శ్రేష్ఠుడెవరని అడిగాయి. ఎవరు ఈ శరీరాన్ని విడిచిపెడితే శరీరం చెడిపోతుందో వాడే శ్రేష్ఠుడని ప్రజాపతి చెప్పాడు. ముందు వాక్కు శరీరాన్ని విడిచి వెళ్ళి ఒక సంవత్సరకాలం తరువాత వచ్చి చూసి ఆశ్చర్యపోయింది. వాక్కు లేక మూగ అయినా శరీరం పనిచేస్తూనే ఉన్నది. ఓడిపోయినట్లు ఒప్పుకొని వాక్కు శరీరంలో ప్రవేశించింది. చక్షువు లేక గ్రుడ్డి అయినా, శ్రోత్రం లేక చెవిటి అయినా, మనస్సు లేక మూఢుడయినా శరీరం పనిచేస్తూనే ఉన్నది. ప్రజాసృష్టి కారణమైన రేతస్సు లేక నపుంసకుడైనా శరీరం పనిచేస్తోంది. చివరకు ప్రాణం శరీరాన్ని విడిచివెళ్లబోయింది. పెద్ద గుర్రంకాళ్ళకు కట్టిన త్రాళ్ళు మేకులతో సహా పెకలించి పరుగెత్తినట్లుగా ప్రాణంతోపాటు ఇంద్రియాలన్నీ కదిలాయి. ఇంద్రియాలన్నీ ప్రాణం యొక్క శ్రేష్ఠత్వాన్ని అంగీకరించాయి. జ్యేష్ఠం, శ్రేష్ఠం అయిన ప్రాణాన్ని ఉపాసించాలి.

2. వసిష్ఠ రూపంలో ప్రాణాన్ని ఉపాసించాలి. వసిష్ఠ అంటే వాక్కు. తనతో చేరిన వారిని వసించేటట్లు చేసేది. మాటలలో నేర్పరి ఇతరులను ఓడించి తన శ్రేష్ఠత్వాన్ని నిరూపించుకొంటాడు.

3. ప్రతిష్ఠారూపంలో ప్రాణాన్ని ఉపాసించాలి. ప్రతిష్ఠ అంటే కన్ను. ఇది మంచి దారి, ఇది మిట్ట పల్లాలు గలది అని కంటితోనే తెలిసికొంటాడు. దీనిని ఉపాసిస్తే ప్రతిష్ఠ కలుగుతుంది.

4. సంపత్ అంటే శ్రోత్రం. విని, వేదాధ్యయనం చేస్తే సంపదలు కలుగుతాయి. వేదవిహితకర్మలకు అధీనంగా భోగాలుంటాయి. వాటి వలన కోరినదంతా పొందవచ్చును.

5. ఆయతనం అంటే మనస్సు. అన్నిటికి ఆశ్రయం మనస్సే. మనస్సుకధీనమై ఇంద్రియాలు విషయాలలో ప్రవర్తిస్తాయి. అలాంటి ఆయతన దృష్టితో ప్రాణాన్ని ఉపాసించాలి.

6. ప్రజాపతి అంటే రేతస్సు. ప్రజలు, పశువుల సృష్టికి ఇది మూలం. ప్రజాపతి దృష్టితో ప్రాణాన్ని ఉపాసిస్తే సకల సమృద్ధులు కలుగుతాయి.

ఈ విధంగా ఉపాసనల వల్ల బ్రహ్మజ్ఞానం పొంది మోక్షాన్ని పొంద వచ్చు.

-- యు.వి.ఆర్.

## 2.4.7 వైశిష్ట్యం:

బృహదారణ్యకం ఉపనిషత్తుగా సుప్రసిద్ధమైంది. ఇందులో చాలా ఆఖ్యాయికలద్వారా నిగూఢమైన వేదాంతతత్త్వం ప్రబోధింపబడింది. తత్త్వానికి సంబంధించిన జిజ్ఞాస ఆనాడు ఎంతగా ఉండేదో ఇందులోని మహర్షులకు రాజులకు మధ్యనడచిన సంభాషణల ద్వారా మనం తెలుసుకోవచ్చు. రాజర్షి అయిన జనకమహారాజు ఆస్థానం, ఆనాడొక తత్త్వవేదికగా రూపొందింది. సభాపతి యాజ్ఞవల్క్యుడు నిరూపించిన వేదాన్త సిద్ధాన్తాలు ఈ ఆరణ్యకానికి ఎంతో విశిష్టతను కలిగిస్తున్నాయి.

యాజ్ఞవల్క్యుడు మహర్షి వరేణ్యుడేకాక బ్రహ్మతత్త్వాన్ని చక్కగా అవగాహన చేసుకున్న మహనీయుడు కూడ. అతనికి మైత్రేయి, కాత్యాయని అని ఇద్దఱు భార్యలు. మహర్షి వనప్రస్థుడు కావాలనుకొని భార్యలనిద్దఱిని పిలిచి -- "నేను అరణ్యాల్లో నివసించడానికి వెడుతున్నాను. సమానంగా ఆస్తిని మీరిద్దఱు పంచుకొని సుఖంగా ఉండండి" అన్నాడు. అందుకు పెద్ద భార్య మైత్రేయి ఇలా అన్నది -- "స్వామీ! మీరెందుకరణ్యానికి వెడుతున్నారు?" ఆమాటలకు మహర్షి – "మానవుడై పుట్టినందుకు ఆత్మదర్శనం చేయాలి. అదే మానవజన్మకు ముఖ్యమైన ప్రయోజనం. అది చాలా కష్టమైనపని. గృహస్థుడుగా సమాజంలో ఉండి ఆత్మదర్శనం చేయాలంటే అవరోధాలెన్నో ఉంటాయి. కనుక అరణ్యాల్లో ఉండి పెద్దలవల్ల ఆత్మతత్త్వాన్ని గురించి విని, బాగా మననం చేసి, నిశ్చయాత్మక బుద్ధిని కలిగించుకొని ధ్యానం చేయాలి.[1] అప్పుడు కాని ఆత్మదర్శనం కాదు. ఆత్మదర్శనం చేస్తేనే జన్మరాహిత్యం కలిగి మోక్షం సిద్ధిస్తుంది. అలా కాకపోతే పుడుతూ చస్తూ ఈ సంసార కూపంలోనే సంచరిస్తూ ఉండాల్సి ఉంటుంది. మోక్షప్రాప్తికి ఆత్మ

---

1. ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః, తమేవ విదిత్వా అతి మృత్యుమేతి. నాన్యః పంథాః విద్యతేఽయనాయ బృ.ఆ.

దర్శనం కంటే ఇంకోమార్గం లేదు. మరణరహితమైన అమృతత్వాన్నే మోక్షమంటారు" అని వివరించాడు.

అందుకు మైత్రేయి "స్వామీ! మీరిచ్చే ఆస్తిమాత్రం కాదు. పృథివీ సామ్రాజ్యం మొత్తం లభించినా అమృతత్వం సిద్ధిస్తుందా?" అన్నది. "ఎన్నటికీ సిద్ధించదు" అన్నాడు యాజ్ఞవల్క్యుడు. "అమృతత్వం కలిగించని ఈ ఆస్తి వల్ల నాకేం ప్రయోజనం? జన్మ రాహిత్యం కలిగే మార్గాన్నుపదేశించండి" అని ప్రాధేయపడింది మైత్రేయి. అందుకు సంతోషించిన యాజ్ఞవల్క్యుడు ఇలా ఉపదేశించాడు –

"భార్యకు భర్త ఇష్టుడెందుకవుతున్నాడు? అతడిపై ప్రేమ వల్లకాదు. ఆత్మ పైన తనకు గల ప్రేమ వల్ల. భార్యపై ప్రేమ వల్ల కాదు భర్తకు ఆమెపై ఇష్టం కలుగుతున్నది. ఆత్మపైన గల ప్రేమ వల్ల. ఆత్మపైన ప్రేమవల్ల పుత్రులపైన ఇష్టం కలుగుతుంది. వాళ్లపైన ప్రేమ వల్లకాదు. తనపైగల ప్రేమవల్లనే ప్రతివాడికి డబ్బు మీద ఇష్టం ఏర్పడుతుంది. అంతేకాని అది కేవలం డబ్బు మీద ప్రేమ వల్ల కాదు".[2]

ఇది ఎంతో మౌలికమైన తత్వాన్ని స్పృశిస్తున్నది. లోకవ్యవహారమంతా ఈ మాటల్లోనే ఇమిడి ఉంది. ఇలాంటి ప్రబోధం ఉండటం వల్లనే బృహదారణ్యకం ఆరణ్యకవాఙ్మయంలోనే ఎంతో విశిష్టమైందిగా గుర్తింపు పొందింది. ఆత్మానందం కోసమే మానవుడు ప్రతిపనీ చేస్తున్నాడు కాని ఇతరుల కోసం కానే కాదనే వాస్తవం ఇక్కడ బయట పడుతున్నది.

ఏ తాత్కాలికమైన ఆనందంకోసం మానవుడు జీవితమంతాశ్రమ పడుతున్నాడో అది శాశ్వతమైంది కాదు. ఆత్మ దర్శనం చేస్తే

---

2. నవా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి, ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి. బృ. ఆ. 2.4.5

నేగాని శాశ్వతానందం లభించదు. బ్రహ్మీభావస్థితిని పొందినప్పుడే అతడికి అది లభిస్తుంది. మానవుడు దానికోసం ప్రయత్నించాలి. ప్రపంచమంతా బ్రహ్మయొక్క విలాసమే. సమస్త ప్రాణికోటిలోను పరమే శ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు. ప్రతిజీవి తనలో అంతర్యామిగా ఉన్న ఆ పరబ్రహ్మకు అంశభూతుణ్ణని గుర్తించి బాహ్యానందాలకోసం తాప త్రయపడకుండా మోక్షసిద్ధి కోసం ప్రయత్నించాలనే బృహదారణ్యకం ఉపదేశిస్తున్నది.

ఒకప్పుడు జనకుడొక యజ్ఞాన్ని చేస్తూ బ్రహ్మనిష్ఠులైన బ్రాహ్మ ణుల నందఱిని ఆహ్వానించి -- "మీలో ఎవరు బ్రహ్మిష్ఠులో వారికి వెయ్యి గోవులనిస్తా" నన్నాడు. ఎవ్వరూ పలకలేదు. అంతలో యాజ్ఞవల్క్యుడు లేచి తన శిష్యుడితో ఆవెయ్యి గోవులను ఇంటికి తోలుకెళ్లమని చెప్పాడు. మిగతా వాళ్లందఱు అసూయతో, స్పర్థతో యాజ్ఞవల్క్యుని ప్రశ్నించడం మొదలుపెట్టారు. అశ్వలుడు, ఆర్త భాగుడు, భుజ్యుడు, ఉషస్తి, కహోలుడు, గార్గి, ఉద్దాలకుడు, శాకల్యుడు వరుసగా మహర్షితో వాదించారు. అందఱికి తృప్తికరమైన సమా ధానాలు చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. చివఱ శాకల్యుడు అతిప్రసంగం చేస్తే యాజ్ఞవల్క్యుడు అతణ్ణిలా శపించాడు -- "నీవు అతిప్రసంగం చేస్తున్నావు. కాబట్టి నీతల పడిపోతుంది." మహర్షి శాపంతో శాక ల్యుడి తల పడిపోయి అతడు మరణిస్తాడు.

జీవుడు ఆత్మదర్శనం చేయడాన్ని గురించి ఈ ఆరణ్యకం ఒక చక్కని ఆఖ్యాయికనిలా చెబుతున్నది --

ఒకరాజపుత్రుడు చిన్నతనంలోనే తల్లిదండ్రులకు దూరంగా వన ప్రదేశంలో కిరాతుల దగ్గఱకు చేరి అక్కడే పెరిగాడు. తనొక కిరాత బాలకుణ్ణనే భావిస్తున్నాడు. ఒకరోజు ఒక మహర్షి అతణ్ణి చూసి అతడికి రాజయోగమున్నట్లు గుర్తించి -- "నీవు కిరాతపుత్రుడివి కావు.

రాజపుత్రుడవేన"ని బోధించాడు. అప్పుడు "తను కిరాతపుత్రుణ్ణి కానని, రాజపుత్రుణ్ణే"నని ఆ పిల్లవాడు తన నిజస్వరూపాన్ని గుర్తిస్తాడు. అలాగే "నేను జరామరణాలకు బానిసను. ఈ దేహంతోనే నేను నశిస్తాను" అని దుఃఖపడే జీవునికి -- "నీవీ శరీరంకాదు. శరీరం నశించినా నీవు నశించవు. నీ ఆత్మ శాశ్వతమైంది. పరమాత్మలో అది అంశభూతమైంది" అని ఉపదేశిస్తే అతనికి స్వస్వరూపజ్ఞానం కలుగుతుంది.

ఆత్మ ద్రష్ట, ప్రపంచమంతా దృశ్యం అనే భావం ఈ ఆరణ్యకంలో ఇలా ఉపదేశింపబడింది --

ఒకరోజు జనకుని దగ్గఱికి యాజ్ఞవల్క్యుడు వస్తాడు. జనకుడు మహర్షిని పూజించి ఇలా ప్రశ్నించాడు --

"మహర్షీ! మానవుడికి దర్శనహేతువైన జ్యోతి ఏది?" "సూర్యుడని" యాజ్ఞవల్క్యుడు సమాధానం చెప్పాడు. "సూర్యుడస్తమిస్తేనో" అన్నాడు జనకుడు. "చంద్రుడు" అన్నాడు ఋషి. "చంద్రుడుకూడా అస్తమిస్తే" అన్నాడు రాజు. "అగ్ని" అని సమాధానం. "సూర్యుడు, చంద్రుడు, అగ్ని -- ఈ ముగ్గురు లేని సమయంలోనో" అన్నాడు జనకుడు. "వాగ్జ్యోతి" అన్నాడు మహర్షి. "వాక్కు గూడా లేనప్పుడో" అన్నాడు మహారాజు. "ఆత్మజ్యోతి" అని సమాధానం చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. ఆత్మవల్లనే ప్రపంచమంతా గోచరిస్తున్నది. ఆత్మ ద్రష్ట ప్రపంచమంతా దృశ్యంమాత్రమేనని దీనివల్ల గ్రహింపబడుతుంది.

**ఈషణలకు దూరం కావాలి:**

దారేషణ, ధనేషణ, పుత్రేషణ, లోకేషణ మానవుడికి బంధహేతువులు. ఎవరు ఈషణలను వదలి, కోరికలను తగ్గించుకొని ప్రపంచాన్ని బ్రహ్మస్వరూపంగా భావించి, తనను ఆ పరబ్రహ్మకు అంశగా గుర్తించి జీవనాన్ని సాగిస్తాడో వాడే జీవన్ముక్తుడవుతాడు. అలా కాకుండా

ఈషణలలో బద్ధుడై కోరికలతో జీవితాన్ని, దుఃఖమయంగా గడిపేవాడు జరామరణాలతో యుద్ధం చేస్తూ 'పునరపి జననం' అన్నట్లు పుడుతూ చస్తూ ఉంటాడు.

**అంతట పరిపూర్ణత:**

బృహదారణ్యకం పరబ్రహ్మ పూర్ణస్వభావం కలది అని ఇలా నిరూపిస్తున్నది --

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే |
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ||

కారణరూపమైన బ్రహ్మపదార్థం పూర్ణమైంది. దాని నుంచి ఉద్భవించిన కార్యరూపమైన ఈ జగత్తు కూడా పూర్ణమైందే. మళ్లా ఈ జగత్తు కారణరూపమైన బ్రహ్మలో లయం పొందినా అది పూర్ణంగానే మిగులుతుంది.

దీనికి చక్కని గణిత శాస్త్రీయమైన ఉపపత్తి చెప్పవచ్చు. పూర్ణానికి గణితంలో "0" అనేది సంజ్ఞ. ఇది శూన్యం కాదు. దీనిలోనే సంఖ్యలన్నీ నిండి ఉన్నాయి. 15=5x3 అన్నప్పుడు 15లో 5, 3 ఇమిడి ఉన్నాయి. అలాగే 100x0=0 అన్నప్పుడు, 100, పూర్ణమైన '0' లోనే ఇమిడి ఉంది. 0X1000=0 కనుక '0' లో 1000 ఇమిడి ఉంది.

ఈ పద్ధతిలో '0' లో సంఖ్యలన్నీ ఇమిడి ఉన్నాయని తెలుసుకోవాలి. ఈ '0' అవ్యాకృత బ్రహ్మస్వరూపం. అందుకే ఉపనిషత్తు 'అసద్వా ఇదమగ్ర ఆసీత్' అని అంటోంది. సృష్టికి పూర్వం ఏమున్నదని ప్రశ్నిస్తే అసత్ వంటి సత్ ఉన్నదని సమాధానం. అసత్పదార్థం నుంచి సత్పదార్థం పుట్టదు. సత్పదార్థం నుంచే సత్పదార్థం పుడుతుంది. కనుక సృష్టికి ముందున్న బ్రహ్మ సద్రూపమే. శూన్యం కాదు.

అలాంటి బ్రహ్మను పూర్ణమని '0' చేత ప్రతిపాదించవచ్చు. ఈ పూర్ణంలో సంఖ్యలన్నీ అధ్యస్తమై ఉన్నాయి. ఎలాగంటే --

1=1+0 కాబట్టి 1, పూర్ణమైన '0' మీద అధ్యస్తమై 1 గా పరిణమించింది. ఇలాగే X=0+X అనడంలో సర్వసంఖ్యాస్వ రూపమైన x '0' లో అధ్యస్తమై x గా పరిణమించింది. 0xX=0 అనడంచేత x '0' లో నిబిడీకృతమైంది. ఇంకా 0/x=0, అనడంచేత '0' పూర్ణాన్ని ఏ సంఖ్యచేత హరించినా '0' మిగులుతుంది.

ఈ క్రింది విధంగా కూడా పై మంత్రాన్ని వ్యాఖ్యానించుకోవచ్చు.

1. 1+2+3+. . . . . . . . . . . . . . . . . . =00 (అనంతం)

2. 1+3+5+7+. . . . . . . . . . . . . . . . .=00 (అనంతం)

పై అనంత సంఖ్యలో క్రింది అనంతసంఖ్యను తీసివేసి,

3. 2+4+6+. . . . . . . . . . . . . =00 (ఇది కూడా అనంతమే)

రెండవ అనంతానికి మూడవ అనంతాన్ని కలిపితే 1 వ అనంతం వచ్చింది. కనుక అనంతానికి అనంతం కలిపినా పైవిధంగా తీసే సినా అనంతమే వస్తుంది. ఈ అనంతానికి సంజ్ఞ ∞. '0' పూర్ణం అవ్యాకృత బ్రహ్మస్వరూపం. పై అనంతం వ్యాకృత బ్రహ్మస్వరూపంగా భావించవచ్చు.

ఇలా ఈ ఆరణ్యకం విజ్ఞానశాస్త్రాలకు అందని ఎన్నో విశేషాలను ప్రతిపాదిస్తూ ఎంతో విశిష్టమైందిగా ప్రసిద్ధిని సంపాదిస్తున్నది.

— డి.ఎ.ఎస్.

# 2.4.8 సంగ్రహసమీక్ష

బృహదారణ్యకం శతపథబ్రాహ్మణానికి చివరిభాగంగా ఉంది. ఆరణ్యక గ్రంథాలన్నింటిలో పరిమాణంలోను పదార్థనిరూపణంలోను పెద్దది కావడం వల్ల దీనికీ పేరేర్పడింది. ఇది కేవలం జ్ఞానకాండకు సంబంధించిన అనేక విశేషాలను నిరూపిస్తున్నది. ఆత్మస్వరూపం, బ్రహ్మస్వరూపం, పునర్జన్మ, ప్రాణస్వరూపం, సన్న్యాసాశ్రమం, యజ్ఞస్వరూపం, మోక్షం, మోక్షోపాయాలు మొదలగు విషయాలెన్నో ఇందులో చక్కగా నిరూపించబడ్డాయి. ఈ ఆరణ్యకంలో గల ఆరు అధ్యాయాలలో చర్చించబడిన విశేషాలను సంగ్రహంగా ఇక్కడ పరిశీలిద్దాం.

యాగాశ్వావయవాలకు విరాట్పురుషుని అవయవాలకు సామ్యం చెప్పబడింది. వాగుత్పత్తి, ఋగాది వేదావిర్భావం, ధర్మస్వరూపం, దేవదానవవైరం పేర్కొనబడినాయి. దేవతలు సంఖ్యలో తక్కువ. రాక్షసులు సంఖ్యలో ఎక్కువ అని ఈ ఆరణ్యకం చెబుతున్నది.[1] రాక్షసులు స్వార్థచింతనాపరులు, పాపాచారపరాయణులు, తామసులు, అన్య సంతోషాపహారులు, డాంబికులు, దేవతలు సాత్త్వికులు సర్వహితైషులు, పుణ్యస్వరూపులు, త్యాగధనులు, జగత్కల్యాణకారకులని ఇందులో వర్ణింపబడింది.

ప్రాణస్వరూపాన్ని గురించి ఈ ఆరణ్యకం ఎన్నో విశేషాలను తెలియజేస్తున్నది. ఇంద్రియాలు నిద్రావస్థలోగాని జాగ్రదవస్థలో గాని ఉన్నప్పుడు కూడా ప్రాణం మేలుకొనే ఉంటుంది. ప్రాణం సర్వాంగాలకు సారభూతమైంది. ప్రాణమే ఆత్మకు ప్రతిరూపం. ప్రపంచమంతా

1. తతః కానీయసా దేవాః జ్యాయసా అసురాః బృ. అ. 1.1

బ్రహ్మస్వరూపి అయిన ప్రాణం నుంచే ఏర్పడింది. వాక్కులోనే ప్రాణం ఉంది.

**రెండో అధ్యాయం:**

రెండో అధ్యాయంలో యాజ్ఞవల్క్యుడు, గార్గికి బ్రహ్మవిద్యోపదేశం చేయడం, గార్గి — అజాతశత్రువుల సంవాదం, స్వప్నవృత్తి స్వరూపం, సుషుప్తి స్వరూపం, మూర్తామూర్త భేదంతో బ్రహ్మద్వైవిధ్యం, యాజ్ఞవల్క్య-మైత్రేయీ సంవాదం, అమృతత్వాన్ని గురించి, మోక్షాన్ని గురించి యాజ్ఞవల్క్యుడు వివరించడం, మధువిద్య, ప్రాణవర్ణనం మొదలగు అంశాలు నిరూపింపబడినాయి.

ఈ ఆరణ్యకంలో ప్రముఖుడైన వ్యక్తి యాజ్ఞవల్క్య మహర్షి. ఆయనకు మైత్రేయి, కాత్యాయని అని ఇద్దరు భార్యలు. మైత్రేయి వైరాగ్యవతి, శ్రేయఃకామిని. బ్రహ్మవిద్య అంటే ఆమెకెంతో ఇష్టం. ఇక రెండో భార్య కాత్యాయని సామాన్యురాలు. ప్రేయః కామిని. ప్రేయస్సంటే సంసారంలో అనుభవించే భౌతిక సుఖ సంతోషాలు. యాజ్ఞవల్క్యుడు మైత్రేయి మనస్తత్వం తెలిసినవాడు గనుక ఆమె కోరిక ప్రకారం బ్రహ్మవిద్యనుపదేశించాడు.

సమస్త జగత్తుకు బ్రహ్మ మూలకారణమని, ప్రళయకాలంలో జగత్తు బ్రహ్మలోనే చేరిపోతుందని, నిత్యము, సత్యమైన దాని స్వరూపం గ్రహించడం సులభంకాదని, నిరంతర సాధనవల్ల ఆత్మదర్శనం వల్ల అది సాధ్యమౌతుందని ఈ ఆరణ్యకం ప్రబోధిస్తుంది.

**మూడో అధ్యాయం:**

బృహదారణ్యకంలో మూడో అధ్యాయం చాలా ముఖ్యమైంది. ఇందులో విదేహమహారాజు జనకుడు ఒకనాడు సభలో బ్రహ్మిష్ఠుడైన

బ్రాహ్మణునికి వెయ్యిగోవులనిస్తానని ప్రకటిస్తాడు. సభలో ఎవ్వరూ ముందుకు రారు. యాజ్ఞవల్క్యుడప్పుడు తన శిష్యునితో ఆ గోవులను ఇంటికి తోలుకెళ్లమని చెబుతాడు. యాజ్ఞవల్క్యుడలా చెప్పడాన్ని ఆర్తభాగాది మహర్షులు సహించక ఆయనతో వాదానికి దిగుతారు. వరుసగా యాజ్ఞవల్క్యుడు అందఱు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి మెప్పిస్తాడు. అలా సభాపతి అయిన యాజ్ఞవల్క్యుడు బ్రహ్మిష్ఠుడని అందఱు అంగీకరిస్తారు. ఈ వృత్తాంతం ఇందులో ఎంతో వివరంగా నిరూపించబడింది.

## గ్రహాలు : అతిగ్రహాలు

జరత్కారుని పుత్రుడైన ఆర్తభాగుడు యాజ్ఞవల్క్యుణ్ణి ఇలా ప్రశ్నిస్తాడు –

"మహర్షీ! ఎన్ని గ్రహాలు, ఎన్ని అతిగ్రహాలున్నాయి?" అందుకు యాజ్ఞవల్క్యుడు – ఎనిమిది గ్రహాలు, ఎనిమిది అతిగ్రహాలు ఉన్నాయి. ప్రాణం గ్రహం. అది అపానమనే అతిగ్రహం చేత గ్రహింపబడి గంధాన్ని ఆఘ్రాణిస్తున్నది. వాక్కు గ్రహం. అది పేరు అనే అతిగ్రహంచేత గ్రహింపబడి పేర్లను చెబుతున్నది. జిహ్వ గ్రహం. అది రసమనే అతిగ్రహంచేత రసాలను తెలుసుకుంటున్నది. చక్షువు గ్రహం. అది రూపమనే అతిగ్రహంచేత గ్రహింపబడి, రూపాలను చూస్తున్నది. శ్రోతం గ్రహం, అది శబ్దమనే అతిగ్రహం చేత గ్రహింపబడి, శబ్దాలను వింటున్నది. మనస్సు గ్రహం. అది కామమనే అతిగ్రహంచేత గ్రహింపబడి కోరికలను కోరుతున్నది. హస్తాలు గ్రహం. అవి కర్మ అనే అతిగ్రహంచేత గ్రహింపబడి కర్మలు చేస్తున్నాయి. త్వక్ గ్రహం. అది స్పర్శ అనే అతిగ్రహంచేత గ్రహింపబడి స్పర్శను తెలుసుకుంటున్నది. ఇలా ఎనిమిది గ్రహాలు, ఎనిమిది అతిగ్రహాలున్నాయని ఈ ఆరణ్యకం ద్వారా తెలుస్తున్నది.

ఇంకా ఈ అధ్యాయంలో అశ్వలుడు, భుజ్యుడు, ఉషస్తి, కహోలుడు, గార్గి, ఉద్దాలకుడు, శాకల్యుడనే మహర్షుల ప్రశ్నలు యాజ్ఞవల్క్యుని సమాధానాలు ఎంతో చక్కగా వర్ణింపబడినాయి.

వీరి సంవాదాల్లో మృత్యువు, కాలం, ఆత్మస్వరూపం, అంతర్యామి, అక్షరస్వరూపం, దేవతలు, ప్రాణం, దిక్కులు, హృదయ శరీరాలు మొదలగు విషయాలు విస్తరంగా వివరింపబడ్డాయి.

ఆత్మ అన్నింటికి మూలమని, దాన్ని తెలుసుకుంటే అన్నింటిని తెలుసుకున్నట్లేనని, ఆత్మ సంకల్పమాత్రం చేతనే సమస్తాన్ని సృష్టిస్తుందని ఈ అధ్యాయం తెలియజేస్తున్నది.

**నాలుగో అధ్యాయం:**

ఈ అధ్యాయంలో జననమరణాలు, స్వప్నావస్థ, మోక్షస్వరూపం, జ్ఞానం, ప్రాణం ఇంకో దేహంలో ప్రవేశించడం. మోక్ష విషయంలో భిన్నాభిప్రాయాలు, విద్య-అవిద్యల స్వరూపం, ఆత్మజ్ఞాని నిశ్చలత్వం, నిర్భయత్వం, అమృతత్వం, బ్రహ్మస్వరూపం, ప్రాణ శబ్దార్థం, మరణ సమయంలో ఇంద్రియాలు సూక్ష్మశరీరాన్ని చేరడం, జ్ఞానం వల్ల పాపం దహించుకు పోవడం, సృష్టికి ముందు గల బ్రహ్మస్వరూపం మొదలగు అంశాలు విచారింపబడినాయి.

యాజ్ఞవల్క్యుడు జనకునితో ఆత్మజ్ఞానోపదేశార్హతను గుర్తించి బ్రహ్మవిద్యనిలా ఉపదేశిస్తాడు --

ఆత్మ స్వయంజ్యోతి స్వరూపం, స్వయంప్రకాశం. అది శరీరం ద్వారా అనేక విషయాలననుభవిస్తున్నప్పటికి తామరాకుపై నీటి బొట్టులాగా అంటీ అంటకుండానే ఉంటుంది. సుషుప్తిదశలో కూడా ఆత్మ సమస్త ప్రపంచాన్ని అనుభవిస్తూ ఆనందస్వరూపంగానే ఉంటుంది.

శ్రవణ-మనన-నిదిధ్యాసనాల ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందవచ్చు. ఆత్మ నిత్యమైనది. ఆదిమధ్యాంతరహితమైనది. శరీరంకంటే భిన్న మైంది. ఆత్మ పరబ్రహ్మస్వరూపం.

ఇలా యాజ్ఞవల్క్యుని ఉపదేశాన్ని పొందిన జనకుడు ధన్యుడై తన సర్వస్వాన్ని గురువుకు సమర్పించి విరక్తితో కర్తవ్యాన్ని ఆచరిస్తూ ఉంటాడు.

**అయిదో అధ్యాయం:**

**'ద'కారోపదేశం:**

ప్రజాపతి తన సంతానమైన దేవతలకు, మనుష్యులకు, రాక్షసులకు 'ద' అనే అక్షరాన్ని ఉపదేశించాడు. భోగపురుషులైన దేవతలు దకారానికి "దామ్యత" "దమంతో అనగా సంయమనంతో ఉండండి" అని తమకుపదేశించినట్లు భావించారు. ధనకామంగల మనుష్యులు "దత్త" "దానం చేయండి" అని తమకుపదేశించినట్లు భావించారు. క్రూరస్వభావంగల రాక్షసులు "దయధ్వం" అనగా "దయతో ఉండండి" అని బోధించినట్లు తలచారు.[2] అంటే వారి వారి స్వభావాలకు తగినట్లు ప్రజాపతి వారికుపదేశించాడని, వారు దాంతో అలాగే నడచుకొన్నారని తెలుస్తున్నది.

**హృదయమంటే ఏమిటి?**

ఈ అధ్యాయంలో హృదయబ్రహ్మోపాసన విశిష్టంగా నిరూపించబడింది. హృదయ శబ్దార్థం ఎంతో చక్కగా చెప్పబడింది --

2. బృ.ఆ. 5.1-3.

'హృదయ' శబ్దంలో మూడక్షరాలున్నాయి. అందులో 'హృ' అనే అక్షరం, తనవాళ్లు, ఇతరులు దీనికోసం సమస్తం అభిహరిస్తున్నారని, 'ద' అనే అక్షరం, అందఱు దీనికోసం సమస్తాన్ని ఇస్తున్నారని, 'యం' అనే అక్షరం ఇది స్వర్గలోకానికి వెడుతుందనే అర్థాలను తెలియజేస్తు న్నాయి.[3] అంటే దేనికోసం తనవాళ్లుగాని, ఇతరులు సమస్తాన్ని సంపాదిస్తున్నారో దేనికోసం సమస్తాన్ని సమ ర్పిస్తున్నారో, దేనితో మానవుడు స్వర్గలోకం చేరగలడో అదే హృదయమని అర్థమవుతున్నది.

ఇలాగే మనోమయ పురుషోపాసన, విద్యుద్బ్రహ్మోపాసన, వాక్కును ధేనువుగా ఉపాసించడం, వైశ్వానరాగ్ని స్వరూపం, ప్రాణో పాసన, గాయత్ర్యుపాసన, గాయత్రీశబ్ద నిర్వచనం, గాయత్రి మహాత్వం మొదలగు విషయాలు ఇందులో ఉపదేశించబడినాయి.

**ఆరో అధ్యాయం:**

ఈ అధ్యాయంలో ప్రాణోపాసన, వాగుపాసన, చక్షురుపాసన, శ్రోత్రోపాసన మొదలగు అంశాలు విశేషంగా వివరింపబడ్డాయి.

ప్రవాహణ-శ్వేతకేతు సంవాదం. శ్వేతకేతువు తండ్రి అయిన ఆరుణి దగ్గఱ రాజు అడిగిన ప్రశ్నలను చెప్పగా, తనకు తెలిసినంత వఱకు చెబుతాడు. తరువాత ఇద్దఱు రాజు దగ్గఱకు వస్తారు. తరు వాత ప్రవాహణుడు వారికి పంచాగ్ని విద్యలనుపదేశిస్తాడు. పంచాగ్నులు

---

3. తదేతత్త్ర్యక్షరం హృదయమితి. హృశ్చేత్యేకమక్షరం అభిహరన్త్యస్మై స్వాశ్చాన్యే చ య ఏవం వేద. ద ఇత్యేకమక్షరం దదత్యస్మై స్వాశ్చాన్యే చ య ఏవం వేద. యమిత్యేకమక్షరం మేతి స్వర్గలోకం యఏవం వేద. బృ.ఉ. 5.3

1. ద్యులోకాగ్ని, 2. పర్జన్యాగ్ని, 3. ఇహలోకాగ్ని, 4. పురుషాగ్ని, 5 యోషాగ్ని.

ఈ అధ్యాయంలో చివఱ నామకర్మ, సంతానోత్పత్తి విజ్ఞానం మొదలగు అంశాలు నిరూపించబడ్డాయి.

ఇలా బృహదారణ్యకంలో ఆరు అధ్యాయాలలో అనేక తాత్త్విక విశేషాలు అనేకాఖ్యాయికల ద్వారా ప్రతిపాదింపబడినాయి.

— ఎస్.పి.వి.

# 2. విశేషవిభాగం:

## 2.5 మైత్రాయణీయారణ్యకం

### 2.5.1 పరిచయం:

కృష్ణయజుర్వేదానికి గల నాలుగు శాఖలలో మైత్రాయణీయశాఖ ఒకటి. ఇది చరక శాఖల్లో చేరుతున్నది. దీన్ని కాలాపశాఖ అని కూడా అంటారు. ఈ శాఖకు సంబంధించిన సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకం, ఉపనిషత్తు మైత్రాయణీయ శబ్దంతోనే వ్యవహరింపబడుతు న్నాయి. మైత్రాయణి మహర్షి ఈ శాఖను 1. మానవ 2. వారాహ 3. దుందుభ 4. ఛాగలేయ 5. హారిద్రవీయ 6. శ్యామాయనీయు లనే ఆరుగురు శిష్యులద్వారా ప్రవర్తింపజేయుడంవల్ల దీనికీ పేరేర్పడింది. మైత్రాయణీయారణ్యకాన్ని బృహదారణ్యకమని కూడా కొందఱు పిలు స్తున్నారు.

మైత్రాయణీయసంహితలోని నాలుగో కాండ మైత్రాయణీయ బ్రాహ్మణమని దాని పరిశిష్టమే మైత్రాయణీయారణ్యకమని చారిత్రి

కుల భావన. దీన్నే మైత్రాయణీయోపనిషత్తని కూడా అంటారు. వైదికవాఙ్మయాన్ని సముద్ధరించిన సాత్వడేకర్ దీన్ని ఆరణ్యకమని వ్యవహరించడం గుర్తించదగిన విషయం.

— ఎస్.బి.ఆర్.

## 2.5.2 విభాగం

మైత్రాయణీయారణ్యకంలో ఏడు ప్రపాఠకాలున్నాయి. మొత్తం ఈ ఏడు ప్రపాఠకాల్లోను 73 ఖండలున్నాయి. ఈ ఆరణ్యకం మైత్రేయీ ఉపనిషత్తుగా సుప్రసిద్ధమైంది. ఒక్కొక్క సంస్కరణంలో ఒకరకమైన ప్రపాఠకాది విభాగం కనబడుతున్నది. ఆనందాశ్రమం సంస్కరణంలో ఏడు ప్రపాఠకాలు, నిర్ణయసాగర్ ప్రచురణలో అయిదు ప్రపాఠకాలు, శ్రేడర్ ప్రచురణలో మూడు ప్రపాఠకాలు, అడయార్‌నుంచి సామాన్య వేదాన్తోపనిషత్ అని వెలువడ్డ ప్రచురణలో నాలుగు ప్రపాఠకాలు ఉన్నాయి. ఆనందాశ్రమసంస్కరణలోని మొదటి ప్రపాఠకంలో రెండో ఖండ నుంచి మిగత ప్రచురణలు ప్రారంభమౌతున్నాయి.

| ప్రపాఠకం | ఖండలు | ప్రపాఠకం | ఖండలు |
|---|---|---|---|
| 1 | 4 | 4 | 6 |
| 2 | 7 | 5 | 2 |
| 3 | 5 | 6 | 38 |
| | | 7 | 11 |
| | 16 | | 16 + 57 = 73 |

శ్రీపాద దామోదర సాత్వడేకర్ ప్రచురణ ఆధారంగా ఈ విభాగం చేయబడింది.

**విషయవిభాగం:**

ఈ ఆరణ్యకంలో ప్రథమ ప్రపాఠకంలో బృహద్రథుడనే రాజు వానప్రస్థుడై తపస్సు చేసి పూజ్యుడైన శాకాయన్యుణ్ణి - 'హేయమైన, అశాశ్వతమైన ఈ శరీరంలో క్షణికమైన భోగాలననుభవించడం వివేకం కాదు. నన్ను ఉద్ధరించి తరణోపాయాన్నుపదేశించ' మని ప్రార్థి

స్తాడు. ద్వితీయ ప్రపాఠకంలో శాకాయన్యుడు ప్రాణస్వరూపాన్ని సృష్టి స్వరూపాన్ని అతనికి ఉపదేశిస్తాడు. తృతీయ ప్రపాఠకంలో భూతాత్మ స్వరూపం, శరీర స్వభావం పేర్కొనబడింది. చతుర్థ ప్రపాఠకంలో శబ్ద స్పర్శాదులకు లొంగిపోయిన వాడు పరమపదాన్ని స్మరించడని తపస్సు ద్వారా మనోనిగ్రహాన్ని సంపాదించాలని చెప్పబడింది. పంచమ ప్రపాఠ కంలో కౌత్సాయని స్తుతి, ఆత్మస్వరూపం పేర్కొనబడింది. ఆరో ప్రపాఠకంలో ప్రాణస్వరూపం, సూర్యస్వరూపం, సూర్యమహిమ, కాల స్వభావం, శబ్దబ్రహ్మస్వరూపం, చిత్తస్వరూపం నిరూపించబడినాయి. ఏడో ప్రపాఠకంలో ఆత్మస్వరూపం, అవిద్యాస్వరూపం మొ|| అంశాలు ప్రతిపాదించబడినాయి.

మొత్తం మీద ఈ ఆరణ్యకం ఆత్మస్వరూపాన్ని, ఆదిత్యస్వరూపాన్ని, భౌతికప్రపంచం యొక్క అశాశ్వతత్వాన్ని, మనస్స్వరూపాన్ని ప్రధానంగా నిరూపిస్తున్నది.

**మొదలు - చివఱ:**

ఈ ఆరణ్యకం "బ్రహ్మ యజ్ఞో వా ఏష" అనే మంత్రంతో ప్రారంభమై "త్రిష్వేకపాచ్చరేద్ బ్రహ్మ" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

— ఎస్.బి.ఆర్.

## 2.5.3 సంకలనకాలం

**దేశం:**

మైత్రాయణీయారణ్యకం భారతదేశంలో ఏప్రాంతంలో రచింపబడి ఉంటుందనే విషయంలో తగినసాక్ష్యాధారాలేవీ కనబడటం లేదు. కాని మహార్ణవం ఇలా చెబుతున్నది –

మయూరాద్రినుంచి ఘూర్జర దేశం వఱకు భారతదేశంలోని వాయవ్యభాగంలో మైత్రాయణీశాఖ వ్యాపించి ఉన్నది.[1] నాసిక్ క్షేత్రానికి ఉత్తరపుదిక్కున ముల్హేర్ క్షేత్రం ప్రక్కనే మయూరాద్రి ఉన్నట్లు తెలుస్తున్నది. అక్కడినుండి గుర్జర దేశం వఱకు మైత్రాయణీయ శాఖీయులు నివసిస్తున్నారు. గుర్జర సౌరాష్ట్ర దేశీయులైన మైత్రాయణీయులు మోఢజ్ఞాతీయులని వ్యవహింప బడుతున్నారు. మహారాష్ట్రలో కూడా నాగపూర్, నన్దురబార్, భడగాం, నాసిక్ మొదలైన చోట్ల ఈ శాఖనధ్యయనం చేసినవారు ఇప్పటికీ నివసిస్తున్నారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో వివిధ వైదిక శాఖల నధ్యయనం చేసిన ఆహితాగ్నులున్నారు. గోదావరీనదికి దక్షిణతీరంలో కూడా మైత్రాయణీయ శాఖనధ్యయనం చేసిన వాళ్లొకప్పుడుండేవాళ్లు. కానీ ఇప్పుడు గోదావరికి దక్షిణాన ఆ శాఖ కనపడటంలేదు. కనుక నాసిక్ క్షేత్రానికి ఉత్తరానగల గుర్జర దేశమే (గుజరాత్) ఈ ఆరణ్యకం పుట్టిన చోటనుకోవడంలో తప్పు లేదు.

---

1. మయూరాద్రిం సమారభ్య యావద్గుర్జరదేశతః |
వ్యాప్య వాయవ్యదేశం వై శాఖా మైత్రాయణీ స్థితా ||
మహార్ణవం, ప్రస్తావః 21, మై. సం.

**కాలం:**

ఒక గ్రంథంలో పేర్కొనబడ్డ విషయాలను బట్టి, భాషను బట్టి ఆధునిక విమర్శకులు అది ఏకాలానికి సంబంధించినదో నిర్ణయిస్తుంటారు. మైత్రాయణీయారణ్యకం ఏకాలంలో రచింపబడిందని ఇదమిత్థంగా చెప్పడానికి ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉంది. సామాన్యంగా బ్రాహ్మణకాలం క్రీ.పూ 8వ శతాబ్దం నుంచి అని, కృష్ణ యజుర్వేదానికి సంబంధించిన తైత్తిరీయారణ్యకం 8వ శతాబ్దం చివర గాని లేక 7వ శతాబ్దం మొదట గాని రచింపబడి ఉండి ఉండవచ్చు నని భావింప బడుతుండటం చేత, అదే వేదానికి సంబంధించిన ఈ ఆరణ్యకం కూడా 7వ శతాబ్దంలోనే రచింప బడి ఉండాలి. దీనికి ఉపనిషత్తుగా కూడా ప్రసిద్ధి ఉండటం, ఇందులోని భాషలో కొంత అర్వాచీనత కనబడుతుండటాన్ని బట్టి ఇది ఉపనిషత్తుల కాలంలో రచింపబడి ఉంటుందనుకోవడానికి కూడా అవకాశం ఉంది.

— ఎస్.బి.ఆర్.

## 2.5.4 వ్యాఖ్యానాలు -- ప్రచురణలు

**వ్యాఖ్యానాలు:**

మైత్రాయణీయారణ్యకానికి రామతీర్థుడు వ్రాసిన దీపిక అనే వ్యాఖ్యానం లభిస్తున్నది. దీనికి సాయణాచార్యుడు భాష్యం వ్రాయ లేదు. కాని ఔఫ్రిత్ (Aufrecht) ఈ ఆరణ్యకానికి శంకరాచార్యుని భాష్యం, నారాయణుని 'దీపిక,' ప్రకాశాత్ముని 'దీపిక' విజ్ఞాన భిక్షువు రచించిన 'ఆలోక' వ్యాఖ్యానం ఉన్నట్లు చెబుతున్నాడు.

**ప్రచురణలు:**

మైత్రాయణీయారణ్యకానికి రామతీర్థుని దీపికావ్యాఖ్యానంతో పూనాలోని ఆనందాశ్రమం తరపున వినాయక గణేశ ఆప్టే 1925 లో మొదటి ప్రచురణ చేశాడు. తరువాత మైత్రాయణ్యుపనిషత్ లేక మైత్రేయోపనిషత్, మైత్ర్యుపనిషత్ అనే పేరుతో పద్దెనిమిది ప్రము ఖోపనిషత్తుల (Eighteen Principal Upanishads) సంకలనంలో భాగంగా లిమాయే, వాడేకర్లు పూనాలోని వైదికసంశోధమండలం ద్వారా ప్రచురించారు. మైత్రాయణీయారణ్యకం రామతీర్థుడు వ్రాసిన దీపికతో మళ్లా ప్రచురించబడింది. బొంబాయిలోని నిర్ణయసాగర ముద్రా ణాలయం ద్వారా మైత్రాయణీ ఉపనిషత్ ప్రచురింపబడింది. మైత్రేయీ ఉపనిషత్ అని ఎఫ్.ఒ.ష్రేడర్ (F.O. Schroeder) లఘూపనిషత్తుల (Minor Upanishads) సంకలనంలో ప్రచురించాడు. సామాన్య వేదా న్తోపనిషత్ అని మద్రాసునుండి అడ్యార్ సంస్థ తరపున వచ్చిన సంకల నంలో కూడా మైత్రాయణీయోపనిషత్ ప్రచురింపబడింది. సాత్వడేకర్ పారడీ లోని స్వాధ్యాయమండల్ ద్వారా మైత్రాయణీయ సంహితలో పరిశిష్టంగా మైత్రాయణీయారణ్యకాన్ని కూడా ప్రచురించాడు.

—ఎస్.బి.ఆర్.

## 2.5.5 ప్రసిద్ధి

ఆరణ్యకాలు కొన్ని యజ్ఞ సంబంధమైన అంశాలను ప్రస్తావిస్తూ ఆధ్యాత్మిక విశేషాలను ప్రతిపాదిస్తుంటాయి. కొన్ని పూర్తిగా పార లౌకికమైన విషయాలను చర్చిస్తూ ఈ లోకంలో మానవుని జీవ నానికుపయోగపడే మార్గదర్శక సూత్రాలను గూడా నిర్దేశిస్తుంటాయి. మైత్రాయణీయారణ్యకం ఎన్నో అమూల్యమైన విషయాలనందిస్తూ మంచి ప్రసిద్ధిని సంపాదించింది.

**కాలమే అన్నింటికీ కారణం:**

> "ఈ భూమిమీద జీవులన్నీ కాల ప్రభావం వల్లనే పుడుతున్నాయి. కాలం వల్లనే వృద్ధి పొందుతున్నాయి. కాలంలోనే లయమౌతు న్నాయి. రూపంలేని కాలమే ఈ నాటకాన్ని నడిపిస్తున్నది."
>
> జీవులన్నింటిని కాలం పరమాత్మలో పండిస్తున్నది. ఆ కాలమే పరమాత్మ చేతిలో పక్వమౌతున్నది. ఈ రహస్యం తెలుసుకున్న వాడే వేదజ్ఞుడు.[1]

**మనస్సే మనసాధనం:**

"మనస్సే సంసారం. దాన్ని గట్టి ప్రయత్నంతో నిరోధించాలి. మనస్సును బట్టే మనిషి రూపొందుతున్నాడు. ఈ రహస్యం అందరికీ అర్థం కాదు. మనస్సు అదుపులో ఉంటే పుణ్య పాపాలను నశింప

---

1. కాలా త్సరివన్తి భూతాని కాలా ద్వృద్ధిం ప్రయాన్తి చ |
కాలే చాస్తం నియచ్ఛన్తి కాలో మూర్తిరమూర్తిమాన్ ||
కాలః పచతి భూతాని సర్వాణ్యేవ మహాత్మని |
యస్మింస్తు పచ్యతే కాలో యస్తం వేద స వేదవిత్ ||

6.14-15.

జేసుకోవచ్చు. ప్రసన్నమైన మనస్సుతో ప్రతివాడు సుఖపడతాడు. మనస్సే ప్రతివాడికి బంధానికైనా మోక్షానికైనా కారణమౌతున్నది. అది లౌకిక విషయాలలో తగుల్కొంటే బంధాన్ని, విషయాలనుంచి వేరైపోతే మోక్షాన్ని మనకు కలిగిస్తున్నది.[2]

ఇలా లోకంలో ప్రసిద్ధమైన అనేక తాత్త్వికాంశాలను ఈ ఆరణ్యకం నిరూపిస్తూ ప్రముఖస్థానాన్ని సంపాదిస్తున్నది.

—ఎస్.బి.ఆర్.

2. చిత్తమేవ హి సంసారం తత్ప్రయత్నేన శోధయేత్ ।
యచ్చిత్తస్తన్మయో భవతి గుహ్యమేతత్సనాతనమ్ ॥
చిత్తస్య హి ప్రసాదేన హన్తి కర్మ శుభాశుభమ్ ।
ప్రసన్నాత్మాత్మని స్థిత్వా సుఖమవ్యయమశ్నుతే ॥
మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసంగి మోక్షే నిర్విషయం స్మృతమ్ ॥
6.33. 3-4; 11.

## 2.5.6 ఉపాసనలు

మైత్రాయణీయారణ్యకంలో ప్రధానంగా ఆత్మతత్త్వం బ్రహ్మజ్ఞాన స్వరూపం, అనేకోపాసనలు ఉపదేశించబడ్డాయి. మైత్రాయణీయ సంహితలో అగ్నిహోత్రాది యాగాలు చెప్పబడినాయి. ఆ కర్మల ఫలాలు శాశ్వతం కాదని, వాటికంటే శాశ్వత సుఖాన్నందించే ఆత్మ యజ్ఞం అనగా బ్రహ్మజ్ఞానం ఈ అరణ్యకంలో ఉపదేశింపబడుతోంది. ముఖ్యమైన అగ్నిష్టోమం బ్రహ్మయజ్ఞమేనని ఆ యాగం చేసిన తరువాత ఆత్మ విచారం చేయాలని, ఆత్మను ఉపాసించాలంటే ఆత్మజ్ఞానం కావాలని, అందుకే ఇక్కడ ఆత్మస్వరూపనిరూపణం చేయబడుతున్నదని ఒక ఉపాఖ్యానాన్ని చెబుతున్నదీ అరణ్యకం.

బృహద్రథమహారాజు విరక్తుడై రాజ్యాన్ని పరిత్యజించి వనప్రస్థుడై తపస్సు చేసుకుంటున్నాడు. ఒకరోజు శాక్యాయనుడనే బ్రహ్మజ్ఞుడు అతని దగ్గఱ కెళ్ళి ఒక వరాన్ని కోరుకోమన్నాడు. సంసారం, కామోపభోగాలు నిస్సారాలని, కూపస్థమండూకంలాగా మోహజాలంలో చిక్కుకున్న తన నుద్ధరించడానికి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించమని కోరాడు ఆ మహారాజు. శాక్యాయనుడు రాజు కోరికను మన్నించి అలాగేనని అంగీకరించాడు. బృహద్రథునికిలా బోధించడం ప్రారంభించాడు --

ఉచ్ఛ్వాసంతో పైకి లేచి తమస్సును పోగొడుతున్న తత్త్వమే ఆత్మ. సుషుప్తికాలంలో ఏది శరీరాన్ని వదిలిపెట్టి పరంజ్యోతి స్వరూపాన్ని పొంది తిరిగి వస్తున్నదో అదే ఆత్మ. ఈ రహస్యమైన బ్రహ్మవిద్యను నేను మైత్రిమహర్షి దగ్గఱ పొందాను.

తేజఃస్వరూపులైన వాలఖిల్యమహర్షులు ఊర్ధ్వరేతస్కులు. వారొక్కపుడు క్రతుప్రజాపతి నిలా ప్రశ్నించారు --

శరీరం ఒక వాహనంలాగా నిశ్చేతనం కదా! ఏ అతీంద్రియశక్తి దీన్ని సచేతనం చేస్తున్నది? దీనికి చోదకుడెవరు? దానికి ప్రజాపతి ఇలా సమాధానం చెప్పాడు --

గుణాతీతుడు, అజుడు. అనంతుడు, మహిమాన్వితుడైన చేతనవత్పురుషుని చేత ఈ శరీరం ప్రచోదింపబడుతోంది.

"అటువంటి సూక్ష్మతత్త్వం ఎలా ఈ శరీరాన్ని ప్రేరేపిస్తున్నద"ని వాలఖిల్యులు ప్రజాపతిని మళ్లా ప్రశ్నించారు. దానికాయన ఇలా బదులిచ్చాడు --

ఆ పురుషుడు అతి సూక్ష్మరూపుడు, అగ్రాహ్యుడు, అదృశ్యుడు, ఈ శరీరమతనికి క్షేత్రం. ఆయనే క్షేత్రజ్ఞుడు. అతనిని 'విశ్వప్రజాపతి' అంటారు. ఆయనే ప్రజలను సృష్టించి వారిలో ప్రవేశించి పంచప్రాణాల రూపంలో ఉన్నాడు. అతడే ప్రాణుల్లోని వైశ్వానరాగ్ని. అతని అంశమొక్కటి ఈ శరీరాన్ని సచేతనంగా చేస్తున్నది. దానివల్లనే జ్ఞానేంద్రియాలు పనిచేస్తున్నాయి. జ్ఞానేంద్రియాలితని చేతిలో పగ్గాలు. కర్మేంద్రియాలు అశ్వాలు. శరీరమే రథం. మనస్సు సారథి. మన ప్రకృతి ప్రతోదం. ఇలా శరీరరథచక్రం నడుస్తున్నది.[1]

ఈ ఆత్మనే బుద్ధిమంతులు తెలుసుకోవాలనుకుంటున్నారు. ఇది కర్మఫలసంబంధం లేనిది. సూక్ష్మం, అవ్యక్తమై ప్రతి శరీరం లోను సంచరిస్తున్నది. సాక్షిభూతంగా ఉంది. గుణమయమై భోక్తృరూపాన్ని ధరిస్తున్నది.

---

1. బుద్ధీన్ద్రియాణి యానీమాన్యేతాన్యస్య రశ్మయః, కర్మేంద్రియాణ్యస్య హయాః రథః శరీరం, మనోనియన్తా, ప్రకృతిమయోఽస్య ప్రతోదోఽనేన ఖల్వీరితం పరిభ్రమతీదం శరీరం చక్రమివ. మై. ఆ. 2.6.

వాలఖిల్యులు మళ్లా ప్రజాపతి నిలా ప్రశ్నించారు -- "ఆత్మకు ఇంతటి మహిమ ఉన్నట్లైతే, పుణ్యాపాప ఫలాలననుభవిస్తూ ఉచ్చనీచ జన్మల నెత్తుతున్నదెవరు"?

దానికి ప్రజాపతి ఇలా సమాధానం చెప్పాడు --

ఫలభోక్త, శరీరధారియైన భూతాత్మ అయి అతడే అనేక జన్మ లెత్తుతున్నాడు. పాంచభౌతికశరీరాన్ని ధరించి ఆ ఆత్మయే ప్రాకృతగుణాల ప్రభావం వల్ల సమ్మోహుడై, సృష్టికర్త అయిన భగవంతుని నిజస్వరూపాన్ని చూడలేకపోతున్నాడు. దేహాభిమానంతో "నేను, నాది" అనే భావాల వల్ల బద్ధుడౌతున్నాడు. పక్షివలలో చిక్కుకున్నట్లు కర్మజాలంలో తగుల్కొని ఎన్నో జన్మల నెత్తుతూ పరిభ్రమిస్తున్నాడు.

ఈ భూతాత్మయే కర్త. ఇంద్రియాలను ప్రేరేపించేది అంతరాత్మ. కాలిన ఇనుము సుత్తితో కొట్టబడి అనేక రూపాలను ధరించినట్లు త్రిగుణాల చేత కొట్టబడి, అన్తఃపురుషుడు నానాత్వాన్ని పొందుతున్నాడు. ఎనభై నాలుగు లక్షల జీవరాసులలో ఎక్కడో పుడుతున్నాడు. అయఃపిండాన్ని కొడితే అగ్నికి తగలనట్లే కర్మఫలాలు ఈ అంతరాత్మకు చెందవు.

ఈ శరీరం స్త్రీపుంసయోగం వల్ల ఏర్పడుతున్నది. ఇది విణ్మూత్ర పురీషమయం. నిద్ర, ఆకలిదప్పులు, సమ్మోహం, మొ॥ తామస గుణాలకు రాగద్వేషాది రాజసగుణాలకు ఆలవాలమై ఈ జీవుడు వివిధరూపాలను ధరిస్తున్నాడు.

వాలఖిల్యులు జీవుని ఈ విషమస్థితికి ఆశ్చర్యపడి ఇతడెలా విముక్తిని పొందుతాడని ప్రజాపతిని ప్రశ్నించారు. అప్పుడాయన పరబ్రహ్మోపాసన నిలా ఉపదేశించాడు --

పరబ్రహ్మోపాసన:

పురాకృతకర్మలు అనుల్లంఘనీయాలు. కర్మఫలాలు మహానదిలోని తరంగాల్లాగా అనివార్యాలు. మృత్యువు సముద్రపు చెలియలి గట్టు లాగా దాటలేనిది. జీవుడు కట్టిపడేసిన కుంటివాడిలాగా అస్వతంత్రుడు. శబ్దస్పర్శాది విషయ వాసనాసక్తుడై భూతాత్మ పరమపదాన్నే మర్చిపోతాడు.[2] దీన్నుంచి బయటపడటానికొకే మార్గముంది. వేదాభ్యాసం చేసి, స్వధర్మాన్నాచరిస్తూ చిత్తశుద్ధిని కలిగించుకొని, తపస్సుచేత ఆత్మ తత్త్వాన్ని తెలుసుకోవాలి. తపస్సుచేత, ధ్యానం చేత పరమాత్మను పొందాలి. అలా పరబ్రహ్మోపాసన చేసినవాడు ఈ బంధాలనుంచి విముక్తుడై శాశ్వత సుఖాన్ని పొందగలుగుతాడు.

"కొందఱు అగ్నిని, ఇంకొందఱు వాయువును, మఱి కొందఱు ఆదిత్యుని, కొందఱు విష్ణువును ధ్యానిస్తున్నారు కదా! మఱి ఎవరిని ధ్యానించడం శ్రేష్ఠమ"ని వాలఖిల్యులడిగిన ప్రశ్నకు క్రతువిలా సమాధానం చెప్పాడు –

సర్వం బ్రహ్మమయం. ఈ దేవతలంతా పరబ్రహ్మ శరీరాలే. వాళ్ల రూపాలను ధ్యానించినా ఉన్నత గతుల్ని, ఉన్నతలోకాలను పొందవచ్చు. కౌత్సాయనుడు పరబ్రహ్మనిలా స్తుతించాడు --

బ్రహ్మ అనాదినిధనం. అచింత్యం. అప్రమేయం. సృష్టికి ముందు అది తమోమయంగా ఉంది. సృష్టి తరువాత రజస్సు, సత్త్వం అనే గుణాలేర్పడ్డాయి. రుద్రుడు తమోరూపుడు, విష్ణువు సత్త్వ సంపన్నుడు. ఏకరూపుడైన ఆ పరమపురుషుడే అనేక రూపాల్ని ధరించాడు.

---

2. శబ్ద స్పర్శాదయో హ్యర్థా మర్త్యేఽనర్థా ఇవ స్థితాః |
యేషాం సక్తస్తు భూతాత్మా న స్మరేత పరం పదమ్ ||
మై. ఆ. 4.2.

భూతాధిపతి అయినాడు. ఆ పరమాత్మయే లోపల బయట ప్రకాశి స్తున్నాడు. బయట ఆదిత్యునిలో గల హిరణ్మయ పురుషుడే హృత్పుం డరీకంలో ఉన్నాడు. విద్వాంసుడైనవాడు చిత్తశుద్ధితో అంతర్ముఖుడై, అంతరాత్మను దర్శించి బహిరాత్మను కూడా తెలుసుకోగలుగుతున్నాడు.

**ఆదిత్యోపాసన:**

అంతరాదిత్య పురుషుడు జగత్సాక్షి. హృదయ పుండరీకంలో ఉన్న జీవాత్మ ఇంద్రియగోచరాలైన పదార్థాల ననుభవిస్తున్నాడు. అతడు సమష్టి సృష్టికధిష్ఠాత. ఇతడు వ్యష్టిసృష్టికి నియంత. ఆ పురుషుణ్ణే గాయత్రీ మంత్రంతోను వ్యాహృతిసహితమైన ఓంకారంతోను ఉపాసిస్తున్నారు.

ఆదిత్యుడే సవితృదేవత. ఆయననుపాసించాలని బ్రహ్మవాదులు చెబుతున్నారు. మన బుద్ధుల్ని ప్రేరేపించే సవితృదేవతయొక్క భర్గాన్ని అంటే కంట్లో పాపలాగా ఉన్న సారభూతమైన తేజస్సునుపాసించాలి. అతణ్ణే సూర్యుడు మొ|| యథార్థనామాలతో పిలుస్తున్నారు.

ఇలా అంతరాదిత్యపురుషుడే దేహాన్ని ధరించి, ఇంద్రియాల ద్వారా ద్వైతభావం ఉండేదాకా కర్తగాను, భోక్తగాను ప్రవర్తిస్తున్నాడు. ఇతడే విధాత. హిరణ్యగర్భ బ్రహ్మ. ఇతణ్ణే అన్వేషించాలి. అరణ్యాల కెళ్లి, తపస్సుచేసి ఇతణ్ణే తెలుసుకోవాలి. ఆ పరమాత్మ వైశ్వానరాగ్ని రూపాన్ని ధరించి మన శరీరంలో ఉన్నాడని భావన చేస్తూ సమం త్రకంగా అన్నం తినాలి. అన్నమే బీజరూపాన్ని పొంది జీవోత్పత్తికి కారణమౌతున్నది. భోక్త అయిన పురుషుడు త్రిగుణాతీతుడు. భోజ్యమైన ప్రకృతి త్రిగుణాత్మకం. ఈ రహస్యం తెలిసినవాడే నిజమైన యోగి. ఆత్మయజ్ఞం చేసిన ఆత్మయాజి.

**అన్నోపాసన:**

ప్రాణాలు అన్నమయాలు. అన్నం తిననివాడి ఇంద్రియాలు పనిచేయవు. ప్రాణాలు నిష్క్రమిస్తాయి. అందువల్ల అన్నం నుంచే జీవులు జన్మిస్తున్నారు. అన్నంవల్లే జీవిస్తున్నారు. అన్నంలోనే లయమవుతున్నారు. అందువల్ల అన్నమే ఆత్మ అని ఉపాసించాలి[3] అన్నరసం ప్రాణాలుగాను, ప్రాణరసమే మనస్సుగాను, మనోరసమే విజ్ఞానంగాను, విజ్ఞానరసమే ఆనందంగాను పరిణమిస్తున్నది. అందువల్ల పంచవిధ కోశాలకు అన్నమే మూలం. అన్నానికి మూలం కాలం. కాలానికి మూలం సూర్యుడు. కాలం నిమేషాది విభాగంతో సర్వప్రమాణంగా విరాజిల్లుతున్నది. అందువల్ల కాలాన్ని బ్రహ్మగా ఉపాసించాలి. ఈ కాలం మూర్తం అమూర్తం కూడా అవుతున్నది. బ్రహ్మకాలం అకాలం కూడా అవుతున్నది. కాలనియామకుడు సూర్యుడు. అందువల్ల సూర్యుడే బ్రహ్మ అని ఉపాసించాలి.

**షడంగయోగం:**

బ్రహ్మజ్ఞానం పొందటానికి షడంగయోగాన్ని ఈ ఆరణ్యకం ఉపదేశిస్తున్నది. ప్రాణాయామం, ప్రత్యాహారం, ధ్యానం, ధారణ, తర్కం, సమాధి అనేవి ఆరు అంగాలు. వీటిద్వారా పుణ్యపాప విముక్తుడై జీవుడు బ్రహ్మసాక్షాత్కారం పొందగలడు. ప్రాణాలను నియమించి తురీయంలో నిలపాలి. చిత్తాన్ని నాలుగు వైపులకూ పోనీయకుండా తురీయాయత్తం చేయాలి. తరువాత ధారణ, తర్కాల సహాయంతో మనస్సును జయించి ఆత్మదర్శనాన్ని పొందాలి. ఇదే మోక్షం. అవ్యయమైన సుఖప్రాప్తి హేతువు.

---

3. అన్నాద్భూతాని జాయన్తే జాతాన్యన్నేన వర్ధన్తే |
అద్యతేఽత్తి చ భూతాని తస్మాదన్నం తదుచ్యతే || మై. ఉ. 6.12.

సుషుమ్నానాడి ఊర్ధ్వభాగానికి పయనిస్తుంది. ఇదే ప్రాణసంచార మార్గం. ఇది తాలువులో రెండుగా భిన్నమై ఉంది. ఇది ప్రాణ-ఓంకార-మనోయుక్తమైన మార్గం ద్వారా ఊర్ధ్వముఖంగా పయనించాలి. జిహ్వాగ్రాన్ని తాలుమూలానికి త్రిప్పి ఇంద్రియశక్తుల్ని విషయాలనుంచి మరల్చి ఆత్మతో జోడించి పరమాత్మదర్శనం చేయాలి.

**శబ్దోపాసన:**

ధ్యానయోగ్యమైన బ్రహ్మ శబ్దాశబ్దరూపం. శబ్దోపాసనద్వారా అశబ్ద తత్త్వాన్ని సాక్షాత్కరించుకోవాలి. ఓంకారం ద్వారా ఊర్ధ్వభాగానికి పయనించి అశబ్దతత్త్వంలో ఐక్యం కావాలి. ఇదే సాయుజ్యం.

సాలీడు స్వయంగా సృష్టించుకున్న దారంపైన పైపైకి పాకి పోతున్నట్లు లోపల మోగే శబ్దం ద్వారా పైకి వెళ్లి స్వాతంత్ర్యం పొందాలి. శబ్దబ్రహ్మవాదులు అంగుష్ఠాలతో చెవులు మూసుకొని ఏడు విధాలైన శబ్దాలను విని, అశబ్దం, అవ్యక్తమైన బ్రహ్మతత్త్వాన్ని పొందుతున్నారు.[4]

**ప్రణవోపాసన:**

ఓంకారాన్ని మూర్ధస్థానంలో ధ్యానించాలి. ఈ శరీరం ధనుస్సు. ఓంకారం బాణం. బాణం అంచు మనస్సు. అది తమస్సును భేదించి అలాతచక్రంలాగా ప్రకాశించే సూర్యుని సందర్శిస్తుంది. అమృతత్త్వాన్ని పొందుతుంది. ఇలా ప్రాణం, మనస్సు, ఇంద్రియాలు ఏకత్వాన్ని పొంది ప్రణవంతో సంయోగాన్ని పొందటాన్నే యోగమంటారు.

---

4. ద్వే బ్రహ్మణీ వేదితవ్యే శబ్దబ్రహ్మ పరం చ యత్ |
శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి || మై.ఉ. 6.22.

అగ్ని నుంచి రవ్వల్లాగా, సూర్యునినుంచి కిరణాల్లాగా, ప్రాణాదులు బ్రహ్మనుంచి నిర్గమిస్తున్నాయి. అటువంటి బ్రహ్మను ధ్యానిస్తే చిత్తం అందులో విలీనమౌతుంది. ఈ విధంగా ప్రణవోపాసన చేసేవారు సంసారసాగరాన్ని తరించి శాశ్వతంగా ముక్తులౌతారు. దారాపుత్రాదులపైన ఆసక్తి కలవాడికీ స్థితి ఎన్నటికీ కలగదు.

ఇలా ఈ ఆరణ్యకం కొన్ని ఉపాసనలను ఉపదేశిస్తూ ఆరణ్యక గ్రంథాలలో చాలా విశిష్టమైందిగా గుర్తింపు పొందింది.

– పి.ఎస్.

# 2.5.7 వైశిష్ట్యం

మైత్రాయణీయారణ్యకానికి ఉపనిషత్తుగా కూడా ప్రసిద్ధి ఉంది. బృహద్రథుడనే రాజు శాకాయన్యుడనే మహర్షిని బ్రహ్మజ్ఞానాన్నుపదేశించమని ప్రార్థిస్తాడు. మహర్షి ప్రసన్నుడై ఆ రాజుకు ఆత్మతత్త్వాన్ని ఉపదేశించి, బ్రహ్మజ్ఞానాన్ని, ఎన్నో ఉపాసనలను అతనికి ప్రబోధిస్తాడు. అందులో బ్రహ్మోపాసన, అన్నోపాసన, ప్రణవోపాసన, కాలోపాసన, శబ్దోపాసన మొ|| ఎంతో విశిష్టంగా నిరూపించబడినాయి.

**ఇదంతా నశించిపోయేదే!**

మనకంటికి కనపడే ఈ భౌతిక ప్రపంచమంతా నశించిపోయేదే. ఎందరు మహాధనుర్ధరులు, చక్రవర్తులు, సుద్యుమ్న-భూరిద్యుమ్నాదులు, బంధువులందరు చూస్తుండగానే సకల సంపదల్ని, అధికారాన్ని భూమి మీదే వదిలేసి వెళ్లలేదు? ఈ సంసారం చాలా విచిత్రమైంది. ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ఏరోజు ఏది ఏమౌతుందో ఎవ్వరికీ తెలియదు. సముద్రాలు ఎండిపోవడం, పర్వతాలు పడిపోవడం, ధ్రువం కదలిపోవడం, మహావాయువు చీలిపోవడం, పృథివి మునిగిపోవడం, దేవతలు పదభ్రష్టులు కావడం, ఇవన్నీ ఈ సంసారంలో సహజాలు. అలాంటి ఈ లోకంలో భౌతిక సుఖాలను అనుభవించాలనుకోవడం ఎంత వెఱ్ఱితనం? కనుక నాకు ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించమంటాడు మహర్షి శాకాయన్యునితో బృహద్రథుడు.[1] సత్యాన్ని ఈ ఆరణ్యకం ఎంత విశిష్టంగా నిరూపిస్తున్నదో చూడండి.

---

1. శోషణం మహార్ణవానాం, శిఖరిణాం ప్రపతనం, ధ్రువస్య ప్రచలనం, వ్రశ్చనం వాతరజ్జూనాం, నిమజ్జనం పృథివ్యాః, స్థానాదపసరణం సురాణామిత్యేతద్విధేఽస్మిన్ సంసారే కిం కామోపభోగైః?

మై. ఆ. 1.4.

## మనస్సే అన్నింటికీ మూలం

మానవుడు అజ్ఞానంతో పుడతాడు. అజ్ఞానంతోనే పెద్దవాడవుతాడు. జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి మొదట అతని బుద్ధి అంత అను కూలంగా ఉండదు. అంతా అశాశ్వతమని తెలుసుకొన్న తరువాత బ్రహ్మజ్ఞానేచ్ఛ కలుగుతుంది. దానికి మనోనైర్మల్యం కావాలి.

సాధారణంగా మనస్సు రెండు విధాలు. నిర్మలమైన భావాలతో నిండినది మొదటిది. కలుషితమైన భావాలతో నిండినది రెండోది. నిర్మలమైన మనస్సుకు కామాదులు, వాటికి సంబంధించిన సంకల్పాలు ఎన్నటికీ కలగవు. కలుషితమైన మనస్సు కామాదులకు సంబంధించిన అనేక సంకల్ప వికల్పాలతో నైర్మల్యాన్ని పోగొట్టుకుంటుంది. చంచ లమైపోతుంది. మనస్సు నిశ్చలత్వాన్ని పోగొట్టుకొన్నప్పుడు అనేక సంకల్పాలు వెంటాడుతూ ఉంటాయి. వీటినే వృత్తులంటారు. కట్టెలు, బొగ్గులు లేనప్పుడెలా అగ్ని ప్రజ్వరిల్లదో అలాగే సంకల్పాలు లేనప్పుడు మనస్సు చాంచల్యాన్ని పొందదు. సంకల్పాలే సంసారం. సంకల్పరహితులైన వారికి సంసారమే లేదు.

చిత్తం ప్రసన్నంగా ఉంటే పుణ్యపాపరూపమైన కర్మలను మాన వుడు వదిలించుకోవచ్చు. ఏకాగ్రత వల్ల సమాధివల్ల చిత్తాన్ని ప్రసన్నంగా చేసుకోవచ్చు. పంచభూతాల విషయంలో మనస్సును లయింపజేయాలి. బంధానికైనా మోక్షానికైనా మనస్సే కారణం. శబ్దాది విషయాసక్తమైన మనస్సు బంధింపబడుతుంది. విషయాసక్తి లేక నిర్విషయమైన మనస్సు మోక్షాన్ని కలిగిస్తుందని ఈ ఆరణ్యకం ఎంతో విశిష్టమైన నిరూపణ చేస్తున్నది.[2]

---

2. చిత్తస్య హి ప్రసాదేన హన్తి కర్మ శుభాశుభమ్ |
ప్రసన్నాత్మా-త్మని స్థిత్వా సుఖమవ్యయమశ్నుతే || మై. ఆ. 6.20

ఐహికబంధాలనుంచి విముక్తిని, మనశ్శాంతిని కోరేవారు భగవదుపాసన చేయాలి. ఈ సంసారం సాక్షాత్ బ్రహ్మస్వరూపం కనుక బ్రహ్మోపాసన ద్వారా ఆ జగద్రూపుని స్తుతించడం ద్వారా భవబంధాలను పోగొట్టుకోవాలి.

కౌత్సాయనుడీ ఆరణ్యకంలో భగవంతుణ్ణి స్తుతిస్తాడు-జగన్నియామకుడైన ఆ పరమాత్మయే బ్రహ్మ, విష్ణువు, శివుడు. అతడే ప్రజాపతి. అగ్ని, వరుణుడు, వాయువు, ఇంద్రుడు, మనువు, యముడు, భూమి, అచ్యుతుడు, చంద్రుడు అన్నీ ఆ భగవానుడే. ఈ ప్రపంచమంతా ఆయనే నిండి ఉన్నాడు. ఆయనే విశ్వేశ్వరుడు, విశ్వాత్మ, విశ్వభోక్త, శాంతాత్ముడు, కంటికి కనబడకుండా రహస్యంగా ఉండేవాడు. మన ఆలోచనలకందనివాడు. అన్ని వస్తువులలో ఉండికూడా పైకి కనపడనివాడు.[3]

త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మ రజోగుణంతోను, రుద్రుడు తమోగుణంతోను, విష్ణువు సత్త్వగుణంతోను ఈ విశ్వంలో తమతమ అంశంతో గోచరిస్తారు. విష్ణువు మొదట ఒకడుగ, ముగ్గురుగా ఎనిమిది విధాలుగా, పన్నెండు విధాలుగా, అపరిమిత రూపాలతో అవతరించి, చరాచర ప్రపంచమంతా నిండి ఉన్నాడు. కనుక అతడే ఆత్మ.

---

3. త్వం బ్రహ్మ త్వం చ వై విష్ణుః త్వం రుద్రస్త్వం ప్రజాపతిః |
త్వమగ్నిర్వరుణో వాయుస్త్వమిన్ద్రిస్త్వం నిశాకరః ||
త్వం మనస్త్వం యమస్త్వం పృథివీ త్వం విశ్వం శమథాచ్యుతః |
స్వార్థే స్వాభావికేఽర్థే చ బహుధా సంస్థితిస్త్వయి ||
విశ్వేశ్వర నమస్తుభ్యం విశ్వాత్మా విశ్వకర్మకృత్ |
విశ్వభుగ్విశ్వమాయుస్త్వం విశ్వక్రీడారతిః ప్రభుః || మై.ఆ. 5.1.

బయట, లోపల అంతట అతడే నిండి ఉన్నాడు. అతడే అందరికీ ఉపాసింపదగినవాడని ఈ ఆరణ్యకం చక్కగా నిరూపిస్తున్నది.

— కె.బి.ఆర్

## 2.5.8 సంగ్రహసమీక్ష

మైత్రాయారణ్యకంలోని ముఖ్యభాగం బృహద్రథుడనే రాజుకు, శాకాయన్యుడనే ఋషికి జరిగిన సంభాషణ. ఈ ఋషి తన గురువైన మైత్రేయుని నుండి నేర్చుకొన్న బ్రహ్మవిద్యను బృహద్రథునకు యథాతథంగా బోధించినాడు. ఈ విధంగా బ్రహ్మవిద్యను బోధిస్తూ మధ్య మధ్య పూర్వం వాలఖిల్యులకు, ప్రజాపతి క్రతువులకు జరిగిన సంభాషణలను బోధించాడు. దీనిలోని ఉపదేశ భాగాలు మొదట నాలుగో ప్రపాఠకంతో ముగిసి ఉంటాయి. కాని ఇప్పుడు లభించే కొన్ని పరిష్కరణలలో ఆరవ ప్రపాఠకంలోని ఇరవై తొమ్మిదవ ఖండం వరకు ఈ ఉపదేశం పొడిగించబడింది. మైత్రి ఉపదేశం 30 వ ఖండంతో ముగుస్తుంది. మైత్రాయణ్యుపనిషత్తు అదే విషయాన్ని 7వ ప్రపాఠకం చివరి వఱకు పెంచింది. 17వ శతాబ్దికి చెందిన రామతీర్థుడు దీనికి వ్రాసిన వ్యాఖ్యానంలో 6,7 ప్రపాఠకాలు ఖిలాలని, విషయ, సంగతి సారూప్యాలు ఈ ప్రపాఠకాలలో ఉండకపోవచ్చునని అంటాడు.

ఇతర ఉపనిషత్తులలోని, గ్రంథాలలోని విషయాలను "అన్యత్రాప్యుక్తం" అని చెప్పడం, వాటినుండి కొన్ని శ్లోకాలను, వాక్యాలను యథాతథంగా ఉదహరించడం ఈ ఆరణ్యకంలోని విశేషాలు. బృహదారణ్యకం నుండి 5వ ప్రపాఠకంలోని 9వ ఖండంలోను, ఛాందోగ్యోపనిషత్తునుండి 6వ ప్రపాఠకంలోని 4వ ఖండంలోను, కఠోపనిషత్తునుండి 6వ ప్రపాఠకంలోని 30వ ఖండంలోను, 7వ ప్రపాఠకంలోని 9వ ఖండంలోను, ప్రశ్నోపనిషత్తు నుండి 6వ ప్రపాఠకంలోని 5వ ఖండంలోను, తైత్తిరీయోపనిషత్తు నుండి 6వ ప్రపాఠకంలోను, ఈశోపనిషత్తు నుండి 7వ ప్రపాఠకంలోను, అమృతబిందూపనిషత్తు నుండి 6వ ప్రపాఠకంలోను, మనుస్మృతి నుండి కొన్ని వాక్యాలు, శ్లోకాలు యథాతథంగా అనువదింపబడ్డాయి. ఇవికాక ఆకరాలు లభించనివెన్నో ఉన్నాయి.

ఇక ఈ ఆరణ్యకంలోని విషయాన్ని సంగ్రహంగా పరిశీలిస్తాం.

ప్రథమ ప్రపాఠకం:

బృహద్రథుడనే ఇక్ష్వాకువంశపురాజుకు రాజ్యాన్ని పాలిస్తుండగా ప్రపంచం మీద, రాజ్యం మీద వైరాగ్యం కలిగింది. ఆయన రాజ్యాన్ని తన పెద్దకొడుకుకు అప్పగించి అడవికి వెళ్లి వెయ్యి సంవత్సరాలు కఠినమైన తపస్సు చేశాడు. అప్పుడు ఆయన దగ్గరికి శాకాయన్యుడనే ఋషి వచ్చి"నాయనా! లే! నీకేం వరం కావాలో కోరుకో" అన్నాడు. అందుకా రాజు తనకు ఆత్మతత్త్వాన్ని ఉపదేశించమని కోరగా ఋషి "ఈ వరాన్నివ్వడం చాలా కష్టం. దీనిని తప్ప ఇంకేదైనా కోరుకో" అన్నాడు. అప్పుడు బృహద్రథుడు ఋషీశ్వరుని పాదాలను తాకి "అస్థి చర్మ స్నాయుమజ్జామాంస శుక్రశోణిత శ్లేష్మాదులవల్ల పుట్టిన ఈ దేహం చాలా హేయమైంది. ఇటువంటి దేహంతో సుఖమెలా కలుగుతుంది? ఈ దేహం కామ - క్రోధ - లోభ - భయ - మోహ - రోగ - క్షుత్ - పిపాసా - దుఃఖాలకు గురి అవుతుంది. ఈ దేహం క్రిమికీటకాదులలాగా అశాశ్వతమైంది. సుద్యుమ్న, భూరిద్యుమ్న - ఇంద్రద్యుమ్న - కువలయాశ్వ - యౌవనాశ్వ- వధ్ర్యశ్వ - అశ్వపతి - శశిబిందు - హరిశ్చంద్ర - అంబరీష - ననక్తుసర్యాతి - యయాతి - అనరణ్య - ఉక్షసేనాది మహా ధనుర్ధరులు, మరుత్త - భరతాది మహా రాజులు తమ ఐహిక సంపదలనన్నింటిని విడిచి పరలోకానికి వెళ్లారు కదా! వీరేల? వీరి కన్న ఉన్నతులైన గంధర్వులు - అసురులు - రాక్షసులు - భూతాలు, గణాలు - పిశాచాలు - సర్ప గ్రహాదులు కూడ నామరూపాదులు లేకుండా పోయినవి కదా! ఇంతేల? సముద్రాలు ఇంకిపోవడం, పర్వతాలు రాలిపోవడం, ధృవనక్షత్రం చలించడం, వాతరజ్జువులు తెగిపోవడం, భూమి వరదలపాలు కావడం, దేవతలు స్థాన భ్రంశం పొందడం మొదలైన అసాధారణ విషయాలు ఎన్నో విన్నాం, చూస్తున్నాం. ఇటువంటి నిస్సారమైన ప్రపంచంలో సుఖాలను కోరడం,

అనుభవించడం వ్యర్థం కదా! కనుక మూయబడిన బావిలో చిక్కు కున్న కప్పలాగా ఈ ప్రపంచంలో పుట్టి విలవిలలాడుతూ ఉండే నన్ను ఉద్ధరించండి. మీరే నాకు రక్షకులు" అన్నాడు.

## ద్వితీయ ప్రపాఠకం

ఈ మాటలు విని శాకాయన్య ఋషి సంతోషంతో ఈ విధంగా అన్నాడు. "ఇక్ష్వాకుకులతిలక, బృహద్రథ! నీకోరిక నెఱవేరింది. నీవు ఆత్మజ్ఞుడవైనావు. మరుత్ అనే పేరుతో నీవు ప్రసిద్ధిని పొందావు. నీవు ఏ ఆత్మను గురించి తెలుసుకొనదలచావో ఆ ఆత్మ నీవే". అప్పుడు బృహద్రథుడు "ఆ ఆత్మ ఏమి? అది ఎటువంటిది? దానిని వర్ణించండి" అని ప్రార్థించాడు. ఋషి ఈ విధంగా బదులు చెప్పాడు - "జీవుని ఉచ్ఛ్వాసాన్ని నిలిపివేయక నిద్రావస్థలో సూక్ష్మ శరీరాన్ని ఆశ్రయించి అన్ని దిక్కులా సంచరిస్తూ ఉండి కూడా సంచ రింపని దానిలాగా ఉండి అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలేదే ఆత్మ. గాఢనిద్రాస్థితిలో మిక్కిలి నిశ్చలంగా ఉండే సూక్ష్మ స్థూల శరీరాల నధిగమించి పరంజ్యోతిని చేరుకొని తన స్వాభావిక స్థితిలో గోచరించే దానికి ఆత్మ అని పేరు. ఇది మరణం లేనిది. భయరహితమైంది. దీనికే బ్రహ్మ అని పేరు. బృహద్రథా! ఉపనిషత్తులలో చెప్పబడి బ్రహ్మ విద్య అనే పేరుతో ప్రసిద్ధమై పూజ్యులైన మా గురువు మైత్రినుండి ఉపదేశం పొందిన ఈ ఆత్మతత్త్వాన్ని నీకు బోధిస్తాను, విను –

శృతిప్రసిద్ధమైన వాలఖిల్యులనే పవిత్ర పురుషులుండేవారు. వారు బ్రహ్మచర్యంలో ఉండి పాపాలను క్షాలనం చేసికొని కామక్రోధలోభా దులను జయించారు. వీరు ప్రజాపతి క్రతువుతో ఇలా అన్నారు. "స్వామీ! చైతన్యం లేని బండివంటిది శరీరం. కాని ఈ దేహం లోని కరచరణాద్యవయవాలు పనిచేస్తున్నాయి. ఇది ఆశ్చర్యంగా ఉంది. కంటికి కూడా కన్పించకుండా దేహాన్ని నడిపిస్తూ చైతన్యం కలదాని

లాగా చేసే ఆ అతీంద్రియశక్తి ఏది? దానిని మాకు బోధించండి" అని ప్రార్థించారు. అప్పుడు ప్రజాపతి క్రతువు ఈ విధంగా బోధించాడు. "ఆత్మ అనేది ఒకటే. అది అన్నింటికన్నా పరమోన్నతమైంది, శుద్ధమైంది, పరిశుద్ధిని చేసేది. అది శూన్యం, శాన్తస్వభావం కలది, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు లేనిది. అంతం లేనిది. స్వతంత్రం. స్థిరమై పుట్టుక, మార్పు నాశం లేనిది. అటువంటి ఆత్మ ఈ దేహంలో నివసిస్తూ ఉండడం వల్ల దేహం చైతన్యం వుండేదిగా కన్పిస్తూ దేహాన్ని కదలిస్తుంది. ఇది సూక్ష్మంగా ఉండి సులభంగా గ్రహింప వీలులేకుండా కంటికి కన్పించకుండా దేహంలో ఉంటుంది."

ఈ అంశకే పురుషుడు అని పేరు. చైతన్యం కలవాడు. సూక్ష్మ రూపంలో ప్రతిదేహంలోను ప్రవేశిస్తాడు. ప్రతి జీవునికి సంకల్ప, అధ్యవసాయ అభిమానాలు కలుగుతాయి. ఈ క్షేత్రజ్ఞుడనే పురుషునికే ప్రజాపతి అని పేరు. ఇతడు అన్నీ చూడగలుగుతాడు. ఇతడు దేహానికి ఆశ్రయం. అందుకే దేహం చైతన్యమయుంగా కన్పిస్తూ కదలిక మొదలైన వాటిని కలిగి ఉంటుంది. ప్రజాపతి ఏవిధంగా ప్రతి దేహంలోను ప్రవేశిస్తాడో వివరిస్తాను. ప్రజాపతి మొదట్లో ఒకడే ఉండేవాడు. ఒంటరిగా ఉండడం వల్ల ఆయనకు సంతోషం లేకపోయింది. ఆయన తనను తాను ధ్యానించుకొని చాలా జీవరాసులను సృష్టించాడు. కాని అవి రాళ్ళవలె అచేతనంగాను, చెట్లబోదెలవలె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లేకుండాను ఉన్నాయి. వాటిని చూసి ఆయనకు దుఃఖం కలిగి వాటిని ప్రబోధింపచేయడానికి తాను ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమానాలనే ఐదు వాయువులుగా మారి వాటిలో ప్రవేశించాడు. పైకి వెళ్లే వాయువు ప్రాణం, అడుగున వెళ్ళేది అపానం, ప్రాణ అపానాలను సేవించేది వ్యానం. ఘనపదార్థాలను క్రింది ప్రేగులలోకి, ద్రవపదార్థాలను దేహంలోని భాగాలన్నిటికి తీసుకొని పోయే వాయువుకు సమానం అని పేరు. త్రాగబడిన ద్రవపదార్థాలను, తినబడిన ఘనపదార్థాలను క్రిందికి, పైకి

తో సేది ఉదానం. ఉపాంశుగ్రహం అంతర్యామిగ్రహం పైన, అంతర్యామి ఉపాంశువు పైన ఆధారపడి ఉంది. ఈ రెండింటి మధ్య పుట్టే ఉష్ణమే పురుషుడు. ఇతడే వైశ్వానరాగ్ని. దేహంలో ఉండే వైశ్వానరాగ్ని వలన కడుపులోని ఆహారం జీర్ణమవుతుంది. మనం రెండు చెవులు మూసుకొని వింటే వైశ్వానరాగ్ని చేసే శబ్దం వినబడుతుంది. ఇది దేహం నుంచి వెళ్లిపోయేటప్పుడు దీని శబ్దం వినిపించదు.

తనను పంచ ప్రాణాలుగా విభజించుకొన్న పురుషుడు జీవుని హృదయాంతరాళంలో ప్రవేశించి పంచేంద్రియాలద్వారా ఇంద్రియార్థాలను అనుభవింపదలచాడు. ఈ విధంగా పురుషుని చేత ప్రేరేపింపబడిన దేహం కుమ్మరిచక్రం లాగా కదలుతుంది. దేహానికి పురుషుడు ఆధారమవటం వల్ల దేహం చైతన్యమయమవుతుంది. అందుకే ఋషులు ఈ పురుషుణ్ణే "ఆత్మ" అని అంటారు. దేహి యొక్క సుకృత, దుష్కృత కర్మల ఫలితం చేత ఆక్రమింపబడిన పురుషుడు కర్మఫలాన్ని అనుసరించి వివిధ దేహాలను ధరిస్తాడు. సూక్ష్మంగా, అదృశ్యంగా అతీంద్రియంగా ఉంటూ పురుషుడు (ఆత్మ) దేహంలో అన్ని కర్మలను చేసే కర్తలాగా ఉంటాడు.

## తృతీయ ప్రపాఠకం

'భూతాత్మ' అనేది ఇంకొకటి ఉంది. ఇది శుభాశుభ కర్మల ఫలితాలననుభవిస్తూ, ద్వంద్వాలననుభవిస్తూ నీచ, ఉచ్చ యోనులలో పుడుతుంది. ప్రకృతి గుణాలు దీనికి అంటుతాయి. కనుకనే దీన్ని అజ్ఞానం ఆవహిస్తుంది. అందుకే తనలోని పరమాత్మను చూడలేకపోతూ 'ఇది నేను, ఇది నాది' అనే భ్రాంతిని పొంది మమకారాన్ని పెంచుకొంటుంది. ఈ విధంగా శుభాశుభ కర్మల ఫలితంగా భూతాత్మ సంసారంలో చిక్కుకొంటుంది. మోహ, భయ, విషాద, నిద్రా, ప్రమాద, జరా, శోక, క్షుత్, పిపాసా, క్రోధ, నాస్తిక్య, అజ్ఞానాలు తామసగుణాలనుంచి

పుట్టాయి. స్నేహ, రాగ, లోభ, హింసా, రతి, ఈర్ష్య, అకరుణ, అస్థిరత్వ, చలత్వాదులు రజోగుణం నుంచి పుట్టాయి. ఇవన్నీ భూతాత్మకు అంటుతాయి.

**చతుర్థ ప్రపాఠకం**

మహానదిలోని అలలను అడ్డగించడం ఏవిధంగా కష్టమో ప్రారబ్ధ కర్మలను అడ్డగించడం కూడ అంతే కష్టం. మృత్యువును అడ్డగించడం సముద్రంలోని తరంగాలను అడ్డగించడం వంటిది. భూతాత్మ యజ్ఞ పశువులాగా శుభాశుభ కర్మల ఫలితంచేత బంధింపబడుతుంది. బందీలాగా నిశ్శక్తిగా ఉంటుంది. ఇంద్రియ సుఖాలకు బానిస అవుతుంది. రాగద్వేషాదులకు నిలయమవుతుంది. కాని దీనికి తగిన ప్రతిక్రియ చేయడానికి వేదాధ్యయనం చేయడం, స్వధర్మాచరణం, ఆశ్రమధర్మాలనాచరించడం మొదలైనవి ఉపకరిస్తాయి. తపస్సువల్ల సత్త్వగుణం, సత్త్వగుణం వల్ల మనస్సు, మనస్సువల్ల ఆత్మానుభవం కలుగుతాయి. ఆత్మానుభవం పొందిన వానికి పునర్జన్మలేదు.

అగ్ని, వాయు, సూర్య, బ్రహ్మ, రుద్ర, విష్ణ్వాదులు ఈ పరబ్రహ్మ యొక్క శరీరాలు. ఈ పరబ్రహ్మమే ప్రపంచం.

**పంచమ ప్రపాఠకం**

మొదట్లో అంతా చీకటిగా ఉండేది. ఈ చీకటి పరమాత్మలో అంతర్గతంగా ఉండేది. కాని ఆయన సంకల్పం వల్ల చీకటి బయటికి వచ్చి విషమస్థితిని పొందింది. దీనికే 'రజోగుణం' అని పేరు. దీనికి విషమస్థితి కలిగి సత్త్వగుణంగా మారింది. సత్త్వగుణంనుండి ప్రతి జీవిలో ఉండే క్షేత్రజ్ఞుని అంశం ఏర్పడింది. విష్ణు-బ్రహ్మ-రుద్రులు సత్త్వ రజస్తమోగుణ పూరితుడైన పురుషుని శరీరాలు. సత్త్వశరీరానికి విష్ణువని, రజశ్శరీరానికి బ్రహ్మ అని, తమశ్శరీరానికి రుద్రుడని పేరు.

షష్ఠ ప్రపాఠకం

ఈ బ్రహ్మయొక్క ఆత్మ 'ప్రాణం' అని, 'ఆదిత్యుడు' అని రెండు విధాలుగా ఉంటుంది. ఇది బ్రహ్మ యొక్క అంతర్బహిర్మార్గాలు. ఇవి అహోరాత్రాలు ప్రవర్తిస్తాయి. ఆదిత్యుడు బ్రహ్మయొక్క బహిరాత్మ. ప్రాణం అంతరాత్మ.

పరబ్రహ్మకు 'మూర్తం' 'అమూర్తం' అని రెండు రూపాలున్నాయి. మూర్తరూపం అసత్యం, అమూర్త రూపం సత్యమైంది. అమూర్త రూపమే సత్యం, జ్యోతి. జ్యోతియే ఆదిత్యుడు. ఆదిత్యుడే ఓంకారం. అదియే ఆత్మ. ఓంకారంలో మూడు మాత్రలున్నాయి. వీటివల్లనే సమస్తం బ్రహ్మలో వ్యాపించి ఉన్నాయి. ఆదిత్యునికే 'ఉద్గీథ' మని పేరు. ఈ ఉద్గీథమే ప్రణవం (ఓంకారం) కాబట్టి ప్రతి ఒకరు ఓంకారోపాసన చేయాలి. పరబ్రహ్మమైన ప్రణవాన్ని తెలిసికొన్నవారు సమస్త కామ్యార్థాలను పొందగలరు.

నాదాత్మకమైన ప్రజాపతి యొక్క దేహమే ఓంకారం. ఈ దేహం స్త్రీ-పుం-నపుంసకలింగాత్మకమైనది. అగ్ని, వాయువు, ఆదిత్యుడు, కలసి తేజోరూప శరీరమవుతుంది. బ్రహ్మ, రుద్ర, విష్ణువులనే దేవతలకు దేహమవుతోంది. గార్హపత్య, దక్షిణ, ఆహవనీయాలనే త్రేతాగ్నులే దీనిముఖం. ఋక్, యజుస్, సామ వేదాలు దీని విజ్ఞానరూపం. "భూర్భువః స్వః" అనేవి లోకరూపం. భూతభవిష్యద్వర్తమానాలు కాలరూపం. ప్రాణ-అపాన-వ్యానాలు ప్రాణరూపాలు. ఈ ఓంకారమే పర, అపర బ్రహ్మలవుతోంది.

ఇక గాయత్రీ మంత్రార్థాన్ని బ్రహ్మవాదులు ఈ విధంగా వివరిస్తారు. తత్సవితుర్వరేణ్యం ఇక్కడ 'సవితా' అంటే ఆదిత్యుడు. పరమాత్మను పొందగోరినవాడు ఈ ఆదిత్యుని సేవించాలి. భర్గో

దేవస్య ధీమహి - ఇక్కడ 'దేవత' అంటే సవితా (ఆదిత్యుడు) అని అర్థం. ఇతడే భర్గుడు, పరమాత్ముడు. ఆయనను ధ్యానించాలి. ధియో యో నః ప్రచోదయాత్ - 'ధియః' అంటే బుద్ధులు. అతడు మన బుద్ధులను ప్రేరేపించేవాడు అని అర్థం. భర్గుడంటే ఆదిత్యుని (సూర్యుని)లో ఉండేవాడు. కంటిలోని వెలుగు ఉండే స్థానంలో నుండే వాడు. కిరణ రూపంలో ప్రసరించడం వల్ల లేక భయపెట్టడం వల్ల భర్గుడనిపించుకొన్నాడు. 'భ' అంటే ప్రపంచానికి వెలుగు నిచ్చేవాడు. 'ర' అంటే జీవరాసులను సంతోషింపజేసేవాడు. 'గ' అంటే ఈ జీవ రాసులన్నీ ఇతని నుండి పుట్టి ఇతనిలోనికి వెళ్లుతాయి అని అర్థం. భ, ర, గ లు కలసి భర్గః అయ్యాయి. ఇది ఆదిత్యునికి పేరు.

ఈ పరమాత్ముడే అన్నం. అన్నాన్ని భుజించేవాడు కూడ. ప్రాణా లన్నీ అన్నంలోనే ఉన్నాయి. ఇతడే సర్వభూతాత్మ. జీవరాసులన్నీ అన్నం నుండి పుట్టి దానితో బ్రతికి చివఱకు అన్నమయమయిన ఈ పరమాత్మునిలోనే లీనమవుతున్నాయి.

ఈ అన్నమే విశ్వభృత్ అయిన విష్ణువు యొక్క దేహం. ప్రాణం అన్నం యొక్క సారం. మనస్సు ప్రాణం యొక్క సారం. మనస్సు యొక్క సారం జ్ఞానం. జ్ఞానం యొక్క సారం ఆనందం. దీనిని తెలిసి కొన్నవాడు అన్నం-ప్రాణం-మనస్సు-జ్ఞానం-ఆనందాలను పొందుతాడు. అన్నం సర్వప్రపంచానికి మూలాధారం.

మూర్తిమంతమైన కాలం సకల జీవరాసుల పుట్టుకకు నిలయం. దీనిలోనే 'సవిత' ఉన్నాడు. ఈయన నుండి చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, సంవత్సరాలు మొదలైనవి పుట్టాయి. వీటి నుండి ఈ ప్రపంచమంతా ఉద్భవించింది. ప్రపంచంలోని మంచిచెడ్డలంతా వీటినుండి ఏర్పడినవే. అందుకే బ్రహ్మ ఆదిత్యుని అంతరాత్మగా ఉంటాడు. బ్రహ్మను కాలమనే సూర్యునిగా గుర్తించి ఉపాసించాలి.

ఆదిలో బ్రహ్మ మాత్రం ఒకడే ఉండేవాడు. ఆయన తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కులనతిక్రమించి అంతటా ఉండేవాడు. ఈయన ఆకాశాత్మ. సర్వం నాశనమైనప్పటికి ఈయన ఉంటాడు. సాధకుడైన వాడు షడంగ యోగాభ్యాసంతో అంతరంగిక మలినాలను పోగొట్టుకొని బ్రహ్మన్ని పొందగలుగుతాడు. మనస్సును నిగ్రహించి, బ్రహ్మ మీద మనస్సును కేంద్రీకరించి యోగసమాధిని పొందాలి.

దేహం ధనుస్సు, ప్రణవం బాణం, మనస్సు దాని అగ్రం. ప్రణవమనే బాణం తపస్సు అనే లక్ష్యాన్ని ఛేదించి జ్యోతిస్స్వరూపుడైన పరబ్రహ్మను చూపిస్తుంది. ఈ బ్రహ్మ సాక్షాత్కారం వల్ల అమృతత్వం కలుగుతుంది. యోగాభ్యాసం దీనికి ఎంతో ఉపకరిస్తుంది. ప్రాణం, మనస్సు, ఇంద్రియాలు, ఇంద్రియార్థాలనన్నింటిని ఒకటిగా లీనం చేయడాన్నే యోగమంటారు.

శాకాయనుడు బ్రహ్మవిద్యను ఈ విధంగా రాజుకు బోధించి ఇలా అన్నాడు – 'ఓ రాజా! ఈ బ్రహ్మవిద్యవల్ల ప్రజాపతిపుత్రులు బ్రహ్మ మార్గాన్ని పొందారు. సంతోషం, తృప్తి, ద్వంద్వాలను సహించడం, ప్రశాంతచిత్తత – ఇవి యోగం వల్ల లభిస్తాయి. దీనిని పుత్రులు లేని వారికి, శిష్యులు లేనివారికి, అపవిత్రునికి ఉపదేశింపకూడదు. భక్తిశ్రద్ధలు సుగుణాలు కలిగిన శ్రద్ధాళువుకే ఉపదేశించాలి.

### సప్తమ ప్రపాఠకం

అగ్ని, గాయత్రీఛందస్సు, త్రివృత్ స్తోమం, రథంతరసామం, వసంతం, ప్రాణం, నక్షత్రాలు, వసువులు – ఇవి అన్నీ తూర్పున ఉదయిస్తాయి. వేడిని కలుగజేస్తాయి. వర్షాన్నిస్తాయి. సూర్యుని స్తుతిస్తాయి. సూర్యునితో తిరిగి కలసిపోతాయి. సూర్యుడు అచింత్యుడు, రూపరహితుడు, గభీరుడు, గుప్తుడు, దోషరహితుడు, నిర్గుణుడు, శుద్ధుడు,

ప్రకాశించువాడు, యోగీశ్వరుడు, సర్వజ్ఞుడు, అప్రమేయుడు, సర్వాంతర్యామి.

ఇంద్రుడు, త్రిష్టుప్ ఛందస్సు, పంచదశస్తోమాత్మకుడు, బృహత్సాముడు, గ్రీష్మఋతువు, వ్యానమనే ప్రాణం, సోముడు, రుద్రుడు -- ఇవి అన్నీ దక్షిణదిక్కుగా ఉదయిస్తాయి. ఇవి వేడినిచ్చి వర్షాన్ని కలుగజేసి స్తుతించి, సూర్యునితో తిరిగి చేరిపోతాయి. ఇతడు అపరిమితుడు, అపరిచ్ఛిన్నుడు, స్వతంత్రుడు, అంగరహితుడు, మూర్తిరహితుడు, అనంతశక్తిమంతుడు, సృష్టికర్త కూడ.

మరుత్తులు జగతీఛందస్సు, సప్తదశస్తోమం, వైరూపసామం, వర్షఋతువు, అపానవాయువు, శుక్ర ఆదిత్యులు -- ఇవి పశ్చిమాన ఉదయిస్తాయి. ఇవి వేడినిచ్చి వర్షాన్ని కలుగజేసి, స్తుతించి సూర్యునితో తిరిగి చేరుతాయి. ఇదియే శాంతం, అశబ్దం, అభయం, అశోకం, ఆనందం, తృప్తం, స్థిరం, అచలం, అమృతం, అచ్యుతం, ధ్రువం అవుతూ విష్ణువనే పేరుగల పరంధామం అనిపించుకొంటోంది.

విశ్వేదేవతలు, అనుష్టుప్ ఛందస్సు, ఏకవింశస్తోమం, వైరాగ్యసామం, శరత్కాలం, వరుణుడు, సాధ్యులు ఇవి ఉత్తరదిక్కుగా ఉదయిస్తాయి. ఇవి వేడినిచ్చి వర్షాన్ని కలుగజేసి, తిరిగి సూర్యునిలో చేరిపోతాయి.

మిత్రావరుణులు, పంక్తిఛందస్సు, త్రిణవత్రయస్త్రింశస్తోమలు, శక్వర, దైవతసామలు, హేమంత శిశిర ఋతువులు, ఆంగిరస, చంద్రుడు -- ఇవి అన్నీ సూర్యునికి ఊర్ధ్వంగా ఉదయిస్తాయి. శని, రాహువు, కేతువు, సర్పాలు, రాక్షసులు, యక్షులు, నరులు, విహగాలు, శరభాలు, గజాలు మొదలైనవి సూర్యుని క్రింది భాగం నుండి ఉదయిస్తాయి.

ఈ విధంగా సర్వవ్యాపి, సర్వాంతర్యామి అయి ఆత్మ అనంతమైనది. అన్నిరూపాలను ధరిస్తుంది. చరాచర ప్రపంచమంతా ఆత్మయొక్క విలాసమే. ఇదియే మృత్యురహితమై, అజరామరమై, శాశ్వతానంద దాయకమైంది. ఈ పరమాత్మకే శంభువు, భవుడు, రుద్రుడు, ప్రజాపతి, హిరణ్యగర్భుడు, సత్యం, ప్రాణం, హంస, ప్రభువు, శాశ్వతం, విష్ణువు, నారాయణుడు అనిపేర్లు. ఇదియే సమస్త ప్రాణులలోను, సర్వ హృదయాంతరాళాలలోను నివసిస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకొనడమే నిజమైన జ్ఞానం.

—కె.ఎస్.ఆర్.డి.

# ఆర్షవిజ్ఞానసర్వస్వము

## ఆరణ్యకాలు

# 2 విశేషవిభాగం

## 2.6 తలవకారారణ్యకం

### 2.6.1 పరిచయం

కృష్ణద్వైపాయనుడు వేదవిభాగం చేసి వేదవ్యాసుడైనాడు. వేదవ్యాసుని శిష్యుడు జైమిని. జైమిని శిష్యుడు తలవకారుడు. జైమిని ప్రణీతమైన జైమినీయబ్రాహ్మణమే అతని శిష్యుడైన తలవకారుని ద్వారా ప్రచారంలోకి వచ్చి తలవకారబ్రాహ్మణమనే ప్రసిద్ధిని పొందింది. తలవకారబ్రాహ్మణంలో అయిదుకాండలున్నాయి. అందులో మొదటి మూడు కాండలు బ్రాహ్మణానికి సంబంధించినవి. నాల్గో భాగం ఆరణ్యకానికి సంబంధించింది. దీన్ని జైమినీయోపనిషద్బ్రాహ్మణమని, ఉపనిషద్బ్రాహ్మణమని, తలవకారారణ్యకమని వ్యవహరిస్తున్నారు. సామవేదానికి సంబంధించి మనకు దొరకుతున్న ఒకే ఒక ఆరణ్యకం తలవకారారణ్యకం కావడం విశేషం.

— ఎస్.టి.ఆర్.

## 2.6.2 విభాగం

తలవకారారణ్యకంలో నాలుగధ్యాయాలున్నాయి. అందులో ప్రథమాధ్యాయంలో పద్దెనిమిది అనువాకాలు, అరవై ఖండలుగా విభజింపబడి ఉన్నాయి. ద్వితీయాధ్యాయంలో అయిదు అనువాకాలు, పదిహేను

| అనువాకం | అధ్యాయం I ఖండలు | అధ్యాయం II ఖండలు | అధ్యాయం III ఖండలు | అధ్యాయం IV ఖండలు |
|---|---|---|---|---|
| 1 | 7 | 2 | 5 | 1 |
| 2 | 3 | 4 | 5 | 1 |
| 3 | 4 | 3 | 4 | 1 |
| 4 | 4 | 3 | 5 | 1 |
| 5 | 1 | 3 | 9 | 1 |
| 6 | 3 | | 9 | 3 |
| 7 | 2 | | 5 | 2 |
| 8 | 3 | | | 5 |
| 9 | 3 | | | 2 |
| 10 | 2 | | | 4 |
| 11 | 2 | | | 5 |
| 12 | 5 | | | 2 |
| 13 | 2 | | | |
| 14 | 4 | | | |
| 15 | 4 | | | |
| 16 | 3 | | | |
| 17 | 3 | | | |
| 18 | 5 | | | |
| | 60 | 15 | 42 | 28=145 |

ఖండలుగాను, తృతీయాధ్యాయంలో ఏడు అనువాకాలు, నలభై రెండు ఖండలుగాను, చతుర్థాధ్యాయంలో పదమూడు అనువాకాలు, ఇరవై ఎనిమిది ఖండలుగాను విభజింపబడి ఉన్నాయి. మొత్తం ఇందులో 145 ఖండలున్నట్లు తెలుస్తోంది. చూడండి:

చతుర్థాధ్యాయంలో దశమానువాకంలో గల నాలుగుఖండలే కేనోపనిషత్తుగా ప్రసిద్ధిని పొందాయి.

**విషయవిభాగం:**

తలవకారారణ్యకంలో ఓంకారస్వరూపం, గాయత్రీప్రభావం, శర్యాత వృత్తాంతం, సుదక్షిణక్షైమి ప్రాచీనశాలి వృత్తాంతం, ఉచ్చైశ్శ్రవ కాపేయ వృత్తాంతం, భగీరథవృత్తాంతం మొదలగు అంశాలున్నాయి. స్థూలంగా మిగతా భాగాలన్నీ అనేక వైదికకర్మలను బోధిస్తున్నా నాల్గో అధ్యాయంలో పదో అనువాకంలోని నాలుగుఖండలు కేనోపనిషత్తుగా సుప్రసిద్ధమైనాయి.

**మొదలు - చివర:**

తలవకారారణ్యకం "ప్రజాపతిర్వా ఇదం త్రయేణ వేదేనాజాయత్" అనే మంత్రంతో ప్రారంభమై; "సైషా శాట్యాయనీ గాయత్రస్యోపనిషద్ ఏవముపాసితవ్యా" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

**— ఎస్.బి.ఆర్.**

## 2.6.3 సంకలనకాలం

**దేశం:**

తలవకారారణ్యకం తలవకారబ్రాహ్మణంలోని నాల్గో కాండే కాబట్టి, ఈ బ్రాహ్మణప్రణేత జైమినిమహర్షి ద్వైతవనంలో పుట్టడంచేత, సింధు నదీతీరంలోనే ఈ అరణ్యకం ఏర్పడిందనుకోవడంలో అనౌచిత్యం లేదు. దీనికి సంబంధించిన ఇతర వివరాలు బ్రాహ్మణాన్ని గురించి చర్చించిన పుడు (ఆ.వి.స. Vol. II. 291) పేర్కొన్నాను.

**కాలం:**

సామవేదబ్రాహ్మణాలను యజ్ఞయాగాల నిర్వహణలో ఎక్కువగా ఉపయోగించడం కనబడుతుంది. కనుక యజ్ఞయాగాల ప్రాచుర్యం ఉన్న రోజుల్లోనే ఈ బ్రాహ్మణాలు ఏర్పడి ఉంటాయని ఆధునికుల అంచనా. తాండ్య తైత్తిరీయ బ్రాహ్మణాల తర్వాత తృతీయ స్థానంలో ఉన్న తలవకార బ్రాహ్మణం క్రీ. పూ. 8 వ శతాబ్దంలో రచింపబడి ఉండవచ్చునని రెండోసంపుటంలో (ఆ.వి.స. Vol. II 291) పేర్కొనడంవల్ల ఆబ్రాహ్మణంలో చివరి భాగమైన తలవకారారణ్యకం కూడా ఆ శతాబ్దంలోనే నిర్మించబడి ఉంటుందని విశ్వసింపబడుతోంది. ఈ కాలనిర్ణయం సంప్రదాయవాదుల కభిమతం కాదు.

— ఎస్.బి.ఆర్.

## 2.6.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

**వ్యాఖ్యానాలు:**

తలవకారబ్రాహ్మణానికి కాని, తలవకారారణ్యకానికి గాని సాయణుడు భాష్యం వ్రాసినట్లు తెలియడం లేదు. ఇంకే సుప్రసిద్ధమైన భాష్యం కూడా దీనికి లేదు. భవత్రాతుడు ఈ బ్రాహ్మణానికి భాష్యం వ్రాసినట్లు చెబుతారు కాని అదీ దొరకడం లేదు.

**ప్రచురణలు:**

జైమినీయోపనిషద్బ్రాహ్మణమనే ప్రసిద్ధి గల తలవకారారణ్యకానికి ఇప్పటికి మూడు ప్రచురణలు వచ్చాయి. అందులో మొదటిది రోమన్ లిపిలో ఆంగ్లానువాదంతో అమెరికన్ ఓరియంటల్ సొసైటి 16వ సంపుటంగా హెచ్. ఓర్టెల్, న్యూహెవెన్‌లో 1874 లో చేసిన ప్రచురణ. ఇందులో మూలానికి సంబంధించిన అనేక సమస్యలను గురించిన చర్చ, పదానుక్రమణులు మొదలగునవి ఉన్నాయి. దీనికే దేవనాగరిలిపిలో పునర్ముద్రణ 1921 లో రామదేవ అనే విమర్శకుడు లాహోర్‌లో డి.ఎ.వి. కళాశాల పుస్తకమాలలో ప్రచురించాడు. ఇందులో హిందీ ఉపోద్ఘాతం కూడా ఉంది. ఇది రెండవ ప్రచురణ. డా.బి.ఆర్. శర్మ తిరుపతి, కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం ద్వారా 1967 లో జైమినీయోపనిషద్బ్రాహ్మణమనే పేరుతో చేసిన ప్రచురణ మూడోది. ఇందులో అనేక వివరణలతో ఆయన వ్రాసిన ఆంగ్లోపోద్ఘాతం చాలా విలువైనది. ఈ సంస్కరణలో నాలుగో అధ్యాయంలో తొమ్మిదో అనువాకం వఱకే ఉంది. కేనోపనిషద్భాగం చేర్చలేదు.

— ఎస్.బి.ఆర్.

## 2.6.5 ప్రసిద్ధి

జైమినీయోపనిషద్బ్రాహ్మణమనే పేరుకల తలవకారారణ్యకంలో ఆధ్యాత్మికభావనలతో బాటు లౌకికాంశాలు కూడా ఎన్నో ఉన్నాయి. లోకవ్యవహారానికి ముఖ్యమైంది వాక్కు. ఈ ఆరణ్యకం వాక్స్వరూపాన్ని వివరించిన తీరు ఎంతో ప్రశంసనీయమైంది. ఋగ్వేద ప్రథమమండలం లోని మంత్రాన్ని[1] రెండు చోట్ల (1.1.7; 1.13.1) పేర్కొంటూ ఈ ఆరణ్యకం వాక్స్వరూపాన్ని క్రింది విధంగా నిరూపిస్తున్నది:

> వాక్కులు నాలుగు రకాలు. పర, పశ్యన్తీ, మధ్యమ, వైఖరి అని వాటి పేర్లు.[2] మూలాధారచక్రంలో 'పర' అనే వాక్కు పుడుతున్నది. నాభిలో పశ్యన్తి ఏర్పడుతున్నది. మధ్యమ హృదయంలో ఉదయిస్తున్నది. విద్వాంసులు ఈ మూడింటిని తెలుసుకోగలుగుతున్నారు. 'వైఖరి' అనే వాక్కును మాత్రమే సామాన్యంగా మానవులందరూ ఉచ్చరిస్తున్నారు. పర, పశ్యన్తి, మధ్యమలను గురించి అందరికీ తెలియదు.[3]

నామలని, ఆఖ్యాతలని, ఉపసర్గలని, నిపాతలని పదాలు నాలుగు రకాలు. వీటి సంపూర్ణ స్వరూపం అందరికీ తెలియదు. చిత్తశుద్ధితో

---

1. చత్వారి వాక్ పరిమితా పదాని తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః |
గుహా త్రీణి నిహితా నేంగయన్తి తురీయం వాచో మనుష్యా వదన్తి ||
ఋ.సం.1.164.45

2. వైఖరీ శబ్దనిష్పత్తిః మధ్యమా శ్రుతిగోచరా |
ఆన్తరార్థా చ పశ్యన్తీ సూక్ష్మా వాగనపాయినీ ||
మ.భా. వన్పశా. ఛాయా. 44.

3. తత్ర శ్రోత్రవిషయా వైఖరీ. మధ్యమా హృదయదేశస్థా పదాది ప్రత్యక్షానుపపత్త్యా వ్యవహారకారణమ్. పశ్యన్తీ తు లోకవ్యవహారాతీతా. యోగినాం తు తత్రాపి ప్రకృతి ప్రత్యయ విభాగావగతిరస్తి. పరాయాం తు నైవ.
అందులోనే ఉ. 44.

విషయాన్తరాల నుంచి మనస్సును మరల్చగలిగిన మనీషులకే వీటి తత్త్వం అర్థమవుతుంది. వీటిల్లో నాలుగోవంతు మాత్రమే మిగతవాళ్లకు అర్థమవుతుంది. [4]

వాక్కులో ఒక వంతు మనస్సు, ఇంకొక వంతు కన్ను, ఇంకొక వంతు చెవి, నాలుగో వంతు మనం ఉచ్చరించే వాక్కు. ఏది మనస్సులో ధ్యానిస్తున్నాడో దాన్నే మాటతో చెబుతున్నాడు. ఏది కంటితో చూస్తున్నాడో దాన్నే మాటతో చెబుతున్నాడు. ఏది చెవితో వింటున్నాడో దాన్నే మాటతో చెబుతున్నాడు. అందువల్ల ఈ జ్ఞానమంతా వాఙ్మయంగానే కనబడుతున్నదని కూడా ఈ అరణ్యకం వివరిస్తూ ప్రసిద్ధిని పొందుతున్నది. [5]

4. మ. భా. వన్పశా. ఛాయా 44
5. జై. ఉ. బ్రా. 1. 13. 1

## 2.6.6 ఉపాసనలు

ఉపాసన మోక్షసాధనం. ఆరణ్యకాల్లో, ఉపనిషత్తుల్లోను, మోక్ష సాధనాలైన ఎన్నో ఉపాసనలు ఉపదేశింపబడ్డాయి. అవిచ్ఛిన్నంగా తదేకచింతనతో ఏ ఉపాసన చేసినా బంధవిముక్తి కలుగుతుందని సంప్రదాయవాదులు చెబుతున్నారు.

కొన్ని సందర్భాల్లో ఉపక్రమంలో 'ఉపాసీత' అనే క్రియాపదాన్ని ఉపసంహారంలో 'వేద' అనే క్రియను ఉపయోగిస్తూ ఆరణ్యకాలు ఉపాసనను తెలియజేస్తున్నాయి. కొన్నిచోట్ల 'వేద' అనే క్రియను ఉపక్రమంలోను 'ఉపాసీత' అనే క్రియను ఉపసంహారంలోను ప్రయోగిస్తూ ఉపాసనలు తెలియజేయబడినాయి. దీనివల్ల మోక్షసాధనమైన జ్ఞానం ఉపాసనారూపమని తెలుస్తున్నది.

పరమాత్మస్వరూపాన్ని తెలిసినవాడిని 'సన్' (ఉన్నవాడు) అని తెలియనివాడిని 'అసన్' (లేనివాడు) అని అంటున్నారు. అంటే పరమాత్మస్వరూపాన్ని గుర్తించిన జీవికే ఉనికి ఉన్నట్లు, అలా గుర్తించని జీవికి ఉనికే లేనట్లు తెలుస్తోంది. అందుకే జ్ఞానులు సర్వభూతాలలోను పరమాత్మ స్వరూపాన్ని భావించి, పైలోకాలకు వెళ్లి అమృతత్వాన్ని పొందుతున్నారు.

ఉపాసన అంటే అనుష్ఠానం, ఏకాగ్రచిత్తవృత్తి, తనలో ఉన్న స్మృతి సంతతి, జ్ఞానవిశేషం, భక్తి, సేవ, దర్శనసమాకారమనే అర్థాలున్నాయి. పరమాత్మ స్వరూపాన్ని గుణగణాలను ఎప్పుడూ స్మరించడం ఉపాసన. ఉపాసనాత్మకజ్ఞానం చేత ఉపాధి నశించగా ఉపహితాంశమైన జీవుడు, అనుపహితాంశమైన దేవుణ్ణే పొందడమే మోక్షం. దానికి చిత్తైకాగ్రత ఎంతైనా అవసరము. "హే భగవన్! నీవే నేను, నేనే నీవు" అనే

భావంతో ఉపాసన చేయాలి. ఆచార్యోపదేశం చేత సంస్కరింపబడిన మనస్సుతో పరమాత్మోపాసన చేయాలి.

బ్రహ్మవిద్యలకన్నింటికి బ్రహ్మప్రాప్తి రూపమైన మోక్షమే ఫలం. ఆరణ్యకాల్లోను, ఉపనిషత్తుల్లోను ఉపాసనల కోసం ఎన్నో బ్రహ్మవిద్యలు పేర్కొనబడ్డాయి. అందులో సద్విద్య, భూమ విద్య, ఉపకోసలవిద్య, శాండిల్యవిద్య, వైశ్వానరవిద్య, అక్షరవిద్య, ఆనందమయవిద్య, ప్రాణ విద్య, త్రయీవిద్య మొదలగునవి ముఖ్యమైనవి. వీటిలో శబ్ద, అభ్యాస, సంఖ్య, గుణ, ప్రక్రియ, నామధేయాలలో భేదం కనబడుతుంది.

తలవకారారణ్యకంలో ఉపాసనలకు సాధనాలుగా గాయత్రీ, ప్రణవ, త్రయీ, ప్రాణ, ఉద్గీథ, అక్షర, మధు, భూమవిద్యలు ప్రతిపాదింపబడ్డాయి. ఇక్కడ కొన్నింటిని సంగ్రహంగా తెలుసుకుందాం.

**గాయత్ర్యోపాసన:**

"గయాం స్త్రతే ఇతి గాయత్రీ" ప్రాణాలను రక్షించేది కాబట్టి దీనికి గాయత్రీ అని పేరు. త్రైజ్=పాలనే అనే ధాతువుకు లిట్ రూపం 'తత్రే' అని అవుతుంది. గాయత్రిద్వారానే ప్రజాపతి, దేవతలు, ఋషులు అమృతత్వాన్ని పొందారు.

గాయత్రం ప్రాతస్సవనం. అంటే ప్రాతఃకాలంలో ఆచరించే యజ్ఞం. గాయత్రం వసువుల ప్రాణం. ప్రాణాలే వసువులు. గాయత్రి 24 అక్షరాలతో కూడి ఉన్నది. గాయత్రి సర్వపాపాల నుంచి విముక్తిని కలిగించి కాపాడుతున్నది. బ్రహ్మమే గాయత్రం. గాయత్ర్యోపాసన చేసినవాడికి బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. ఇలా ఈ ఆరణ్యకం గాయత్ర్యోపాసనను వివరిస్తున్నది.

**ఉద్గీథోపాసన:**

ప్రతి సామకు ప్రస్తావం, ఉద్గీథం, ప్రతీహారం, ఉపద్రవం, నిధనమని అయిదు విభాగాలున్నాయి. వీటికి భక్తులని కూడా పేరు. ఈ అయిదు భక్తుల్లో ప్రస్తావమనేది హింకారపురస్సరంగా గానం చేయబడుతుంది. ఉద్గీథమనేది ప్రణవపురస్సరంగా గానం చేయబడుతుంది. ఉద్గీథాద్యుపాసనలు కర్మలకు అతిశయాన్ని కలగజేసేవైనా అవి బ్రహ్మదృష్టిరూపాలు. వాటిని ఫలాపేక్ష లేకుండా అనుష్ఠిస్తే బ్రహ్మజ్ఞానాన్ని కలుగజేస్తాయి.

ఉద్గీథోపాసనతో చేసిన కర్మలన్నీ ఎంతో సమర్థంగా ఫలాలనిస్తున్నాయి. ఉద్గీథాదుల్ని ఆదిత్యాదులుగా భావించి ఉపాసన చేయాలి. ఎందుకంటే ఉద్గీథాదుల కంటే ఆదిత్యాదులు ఉత్కృష్టమైనవారు. ఆదిత్యాదిదేవతలను సంతోషపరచడంవల్ల కర్మలు ఫలసాధనాలవుతున్నాయి. కనుక ఉద్గీథాదులను ఆదిత్యాదులుగా భావించాలి.

ఏ పురుషుడు ఈ నేత్రమధ్యంలో కన్పడుతున్నాడో అతడే ఋగ్యజుస్సామ శరీరుడైన పరమాత్మ. అతడు అధిదైవతోపాసనలో ఆదిత్యమండల మధ్యగతుడుగా చెప్పబడుతున్నాడు. అతని హిరణ్మయస్వరూపాన్ని ఋక్సామలు 'ఉత్' అని ఉద్గీథమని చెబుతున్నాయి. ఇలా అధ్యాత్మోపాసన కూడా చేస్తున్నారు.

**ప్రణవోపాసన:**

'ఓం' అనే అక్షరాన్ని ఉద్గీథంగా ఉపాసించాలి. సామావయవమైన భక్తినే ఉద్గీథమంటున్నారు. ఓంకారమే ఉద్గీథం. దీన్ని సామగా, బ్రహ్మగా, అమృతంగా భావించాలి. ఉద్గీథం దేవతలకు అమృతం. ఆదిత్యుని కిరణాలే ఈ ఉద్గీథానికి పుత్రులు. కనుక ఉద్గీథాన్ని బహూపుత్రవతిగా ఉపాసించాలి. ఉద్గీథమైన 'ఓం' కారాన్ని ఉపాసించాలని దానికి ఇలా వివరణనిస్తున్నది ఈ ఆరణ్యకం –

అగ్ని, వాయువు, ఆదిత్యుడు తపస్సు చేయగా, అగ్ని నుండి ఋగ్వేదం, వాయువునుండి యజుర్వేదం, ఆదిత్యునినుండి సామవేదం ఆవిర్భవించినాయి. మళ్లా ఈ వేదత్రయాన్ని మథించగా ఋగ్వేదం నుంచి 'భూః' అని యజుర్వేదంనుంచి 'భువః' అని సామవేదంనుంచి 'సువః' అని వ్యాహృతులుద్భవించాయి. వాటిని మళ్లా మథించగా అ+ఉ+మ్ అనే అక్షరాలుద్భవించి 'ఓం' కారమేర్పడింది. ఈ ఓంకారాన్ని తెలుసుకోవడానికే త్రయీవిద్య అని పేరు. అక్షరోపాసనమే త్రయీవిద్య.

ఆదిత్యునిలో ఉండే ఆ పురుషునకు 'భూః, భువః, సువః' అని మూడు వ్యాహృతులే అవయవాలు. అతడు సత్యస్వరూపుడు. కనుక అతనిని 'భూర్భువస్సువః' అని ఉపాసించాలి. ఇలా ఆ అక్షర పరబ్రహ్మను తెలుసుకోవడానికే అక్షరవిద్య అని పేరు. ఈ విద్యను తెలుసుకున్నవారు సర్వపాపవిముక్తులౌతారు.

### ప్రాణోపాసన:

సామనుపాసించాలి. వాయువే సామ. ప్రాణమే సామ. ప్రాణం పరబ్రహ్మస్వరూపం. ప్రాణరూపపరబ్రహ్మకు ప్రాణమే శరీరం. కనుక ప్రాణాన్ని పరబ్రహ్మగా ఉపాసించాలి. లోకంలో ప్రతివాడికి అన్నింటి కన్నా ప్రియమైంది ప్రాణమే. ప్రాణాన్ని పరబ్రహ్మగా ఉపాసించేవాడికి ప్రాణభయం లేదు. సర్వభూతాలకు ప్రాణమే ఆధారం కాబట్టి పరమాత్మయే అన్నిటికి ఆధారమని తెలుస్తున్నది. ఆ పరమాత్మను ప్రాణంగా ఉపాసించాలి. సర్వేంద్రియాలకు ప్రాణమే ఆధారమని తెలుసుకొని ప్రాణాన్ని ఉపాసిస్తున్నారు. ప్రాణం జ్యేష్ఠత్వ శ్రేష్ఠత్వాలను తెలిసికొని ప్రాణోపాసన చేసేవారు, జ్యేష్ఠులు, శ్రేష్ఠులు అవుతున్నారు. ప్రాణానికి ఉదకమే వస్త్రం కావడం వల్ల లోకంలో పండితులు భోజనానికి ముందు వెనుక ఆచమనం చేస్తున్నారు. అంటే ప్రాణోపాసన చేస్తు

న్నారన్నమాట. ప్రాణంలో ఉన్న విజ్ఞానమయస్వరూపుడు పరమాత్మ అని తెలుసుకొని, ఇంద్రాదులతని స్వాధీనంలో ఉన్నారని, అతడు సర్వనియామకుడని పాపాలంటనివాడని భావించి ఉపాసిస్తున్నారు.

పరమాత్మనెలా తెలుసుకొని ఉపాసించాలి? అనే ప్రశ్నకు సమాధానంగా ఆయనను తెలుసుకొనే విధానం ఈ ఆరణ్యకంలో వివరింపబడింది.

ప్రాణానికి తపస్సు అంతరాత్మ. తపస్సుకు అగ్ని విద్యుత్తు అంతరాత్మలు. మనస్సే నేత్రం. వాయువే ప్రాణం. అగ్నియే వాక్. చంద్రుడే మనస్సు. ఆదిత్యుడే స్వరం. కనుక ఈ దేవతలందరినీ ఉపాసించాలి.

అగ్నికి, ఆదిత్యునికి ప్రకాశకమై మరణరహితమైన ఆ తేజస్సును ఆయుస్సుగా దేవతలుపాసిస్తున్నారు. కాబట్టి దేవతలు అధికాయుస్సు తోనున్నారు. కనుక ఆయుష్యాన్ని కోరేవారు బ్రహ్మను ఆయుష్యంగా ఉపాసించాలి.

**విద్యుదుపాసన:**

విద్యుద్రూప పరబ్రహ్మ పాపాలనే చీకటిని పోగొడుతుంది. కనుక పరమాత్మను విద్యుత్తుగా ఉపాసించాలి.

విద్యుత్తులో నున్న పురుషుడే ప్రాణం. సామ, బ్రహ్మ, అమృతం. నేత్రంలో ఉన్నవాడే పురుషుడు. ఆదిత్యునిలో ఉన్నవాడు అతిపురుషుడు. విద్యుత్తులో ఉన్నవాడు పరమపురుషుడు. వీరు ముగ్గురు పురుషులు. వీరిలో ఉన్నవాడే పరమాత్మ కనుక పరమాత్మను తెలుసుకొని ఉపాసించాలి. నేత్రంలో ఉన్న పురుషుణ్ణి అనురూపునిగాను, ఆదిత్యునిలో ఉన్న పురుషుణ్ణి ప్రతిరూపునిగాను, విద్యుత్తులోనున్న పురుషుణ్ణి సర్వరూపునిగాను ఉపాసించాలి. మనోమయుడైన పరమాత్మ సమస్తాన్ని నియమిస్తున్నాడని ఉపాసన చేస్తే పరమాత్మకు సన్నిహితుడౌతాడు.

వేదత్రయోపాసన:

భూః, భువః, సువః అనే మూడు వ్యాహృతి మంత్రాలు. ఇవే వాక్కు, మనస్సు, ప్రాణం. ఈ మూడు మూడు వేదాలు. వాక్కు ఋగ్వేదం. మనస్సే యజుర్వేదం. ప్రాణమే సామవేదం. కనుక 'భూర్భువస్సువః' అని వేదత్రయాన్ని ఉపాసించాలి. ఈ మంత్రసారమే ఓంకారం కాబట్టి, దాన్ని ముందు ఉచ్చరించాలి కనుక 'ఓం భూర్భువస్సువః' అని ఉపాసించాలి.

"నీవు ఎవరినుపాసిస్తున్నావు? అనే ప్రశ్నకు సామను భగవంతునిగా ఉపాసిస్తున్నాను; అని సమాధానం.

అగ్నిలో ఏమున్నదో దాన్ని తెలుసుకో! పృథివిలో ఏముందో దాన్ని తెలుసుకో! నీటిలో ఏముందో దాన్ని తెలుసుకో! అంతరిక్షంలో ఏముందో దాన్ని తెలుసుకో! వాయువులో ఏముందో దాన్ని తెలుసుకో! దిక్కులలో ఏముందో దాన్ని తెలుసుకో! దివిలో ఏముందో దాన్ని తెలుసుకో! ఆజ్యోతిని, ప్రతిష్ఠను, శాంతిని, ఆత్మను, శ్రీని, వ్యాప్తిని, విభూతిని సామగా భావించి ఉపాసించాలి.

ఆదిత్యునిలోను, చంద్రునిలోను, నక్షత్రాలలోను, అన్నంలోను, పశువులలోను, ఋక్కులోను, యజుస్సులోను, సామలోను ఏది ఉన్నదో దాన్ని ఉపాసించు! సమస్తంలో పరమాత్మ ఉన్నాడని భావించి ఆయన్నే ఉపాసించమని ఈ ఆరణ్యకం ఉపాసనాతత్త్వాన్ని చక్కగా వివరిస్తున్నది.

— టి.వి.ఆర్.

# 2.6.7 వైశిష్ట్యం:

సామవేదానికి సంబంధించిన శాఖలలో జైమినీయశాఖ ప్రధాన మైంది. ఆ శాఖకు సంబంధించిన ఆరణ్యకం తలవకారారణ్యకం. దీన్ని జైమినీయోపనిషద్బ్రాహ్మణం అని కూడా అంటారు.

ఈ ఆరణ్యకం చాలా ప్రాచీనమైంది. ఇందులోని భాష అతి ప్రాచీన వైదికభాషకు దగ్గఱగా కనబడుతోంది. ఇందులో పేర్కొనబడిన కొన్ని ఉపాఖ్యానాలు ఇతర గ్రంథాల్లో ఎక్కడా దొరకడం లేదు. దీనిలో చర్చించబడిన అంశాలు అసాధారణమైనవిగా కనబడుతున్నాయి. ఇందులో మృతులైనవారు పితృదేవతలుగా వచ్చి జ్ఞానోపార్జన చేసేవారికి మార్గదర్శనం చేయడం, ఇంద్రజాలికశక్తుల్ని సంపాదించడానికి, కార్య సిద్ధిని పొందడానికి కొన్ని ప్రక్రియలు పేర్కొనబడ్డాయి.

ఈ ఆరణ్యకం ఉపాఖ్యానాలను కొన్నింటిని ఎంతో విశిష్టంగా ప్రతిపాదించింది. శర్యాతోపాఖ్యానం, సుదక్షిణక్షైమి ఉపాఖ్యానం, ఉచ్చైశ్రవకౌపయేయ-భగీరథ వృత్తాంతాలు ఇందులో విశిష్టంగా నిరూ పింపబడినాయి.

ఇందులోని ఉపాసనలు ఎంతో విలక్షణమైనవిగా కనబడుతున్నాయి. ప్రణవోపాసన, గాయత్రోపాసన ఎంతో విస్తరంగా వర్ణింపబడ్డాయి. ప్రపంచసృష్టికి ముందే వేదత్రయమున్నట్లు, ఓంకారం వేదత్రయంలో కలసి ఉన్నట్లు, జ్ఞానసారాంశమే "ఓం" కారమైనట్లు ఈ ఆరణ్యకం తెలియజేస్తున్నది.

సృష్టికి ప్రారంభంలో ప్రజాపతి వేదత్రయం నుంచి భూః, భువః, సువః అనే వ్యాహృతిమంత్రాలను గ్రహించి, భూమిగాను, వాతావరణం గాను, ఆకాశంగాను సృష్టించాడు. ఇవి అగ్ని, వాయువు, సూర్యుల నుండి ఏర్పడ్డాయని ఇందులో పేర్కొనబడింది.

ప్రణవస్వరూపి అయిన పరబ్రహ్మనుపాసించినవాడు అన్ని పాపాల నుంచి విముక్తుడౌతాడని, అమృతత్వాన్ని పొందుతాడని, మోక్షాన్ని అధిగమిస్తాడని ఈ ఆరణ్యకం పేర్కొంటున్నది [1].

సామకు సంబంధించిన ఏడు భక్తులు ప్రస్తావం మొదలు ఇందులో ఎంతో విశిష్టంగా పేర్కొనబడినాయి.

గాయత్రోపాసన గొప్పదనాన్ని ఈ ఆరణ్యకం ఎంతో విశిష్టంగా పేర్కొంటున్నది. గాయత్రోపాసనవల్ల ప్రజాపతి, దేవతలు, మహర్షులు స్వర్గాన్ని పొందారు.[2] రాక్షసుల్ని ఓడించి, దేవతలు పోగొట్టుకున్న స్వర్గ సామ్రాజ్యాన్ని తిరిగి పొందగలిగారు.

కురు-పాంచాల దేశాల ప్రశస్తి ఈ అరణ్యకం ద్వారా వ్యక్తమవుతున్నది. ఈ దేశాలలో ఎందరో సామవేద విద్వాంసులుండేవారని, ఎన్నో యజ్ఞయాగాలకు ఈ ప్రదేశాలు నిలయాలుగా ఉండేవని, అందరు వేదాధ్యయనం చేసేవారని, జైమినీయోపనిషద్బ్రాహ్మణం వివరిస్తున్న తీరు ఎంతో ప్రశంసనీయంగా ఉంది.

**అశరీరసామ:**

కౌపయేయుడైన ఉచ్చైఃశ్రవుడు కేశిదాల్భ్యుడు మంచి స్నేహితులు. ఉచ్చైఃశ్రవుని చెల్లెలు కొడుకు కేశిదాల్భ్యుడు. ఇతడు పాంచాల దేశాధిపతి. కురుదేశాధిపతి మేనమామ అయిన ఉచ్చైఃశ్రవుని మరణంతో ఇతడు మనోవ్యధ చెందుతాడు. అరణ్యంలో ఇతడు వేటాడుతున్న సమయంలో ఉచ్చైశ్రవుడితనికి కన్పడి "అశరీరసామ"ను గానం చేస్తే నీవు కూడా దేవతలలాగా మోక్షాన్ని పొందగలవని, ఈ ప్రపంచంలో లభించే

---

1. ఏవం విద్వాన్ ఓమిత్యేతదేవాక్షరం సమారుహ్య యదదోఽమృతం
తవతి తత్ప్రపద్య తతో మృత్యునా పాప్మనా వ్యావర్తతే.
జై.ఉ.బ్రా. 1.4.11.

2. తదేతదమృతం గాయత్రమ్. ఏతేన వై ప్రజాపతి
రమృతత్వమగచ్ఛత్. ఏతేన దేవాః ఏతేనర్షయః. అందులోనే 3.7.1.

కీర్తి శాశ్వతం కాదని ఉపదేశిస్తాడు.[3] సామగానంచేతనే ప్రజాపతి కుమారుడైన పతంగుడు మొదలగు దేవతలు అశాశ్వతమైన ఈ ప్రపంచాన్ని వదలి శాశ్వతమైన స్వర్గాన్ని పొందారని చెబుతాడు. తరువాత "కేశిదాల్భ్యుడు" "ద్వాదశాహా'న్ని ఆచరించి 'అశరీరసామ"ను గానం చేయించి మోక్షం పొందుతాడు. ఇదే సామ 'అన్నృచసామ'గా కూడా ప్రసిద్ధి పొందింది.

భగీరథవృత్తాంతం ఇందులో ప్రతిపాదించబడింది. ఇక్ష్వాకువంశానికి సంబంధించిన మహారాజు భగీరథుడు. తన మనోరథాలు సిద్ధించడానికి అతడొక యజ్ఞాన్ని తలపెట్టి కురుపాంచాల దేశాలలో గల పండితుల్ని అందఱిని ఆహ్వానించాడు. వారందఱితో వేదాంతవిషయాలను చర్చిస్తూ తనకున్న అయిదు సంశయాలను అతడు నివృత్తి చేసుకున్నట్లు ఈ బ్రాహ్మణం వివరిస్తున్నది.

జైమినీయోపనిషద్బ్రాహ్మణంలో కురు-పాంచాల దేశాలకు సంబంధించిన ఎన్నో అంశాలు స్పష్టంగా అభివర్ణించబడినాయి. దీని అధ్యయనం ద్వారా మరుగున పడిపోయిన సాంస్కృతిక-తాత్త్విక-ఐతిహాసిక విశేషాలు చాలా బయటపడటానికి అవకాశం కనబడుతుంది. ఆ రోజుల్లో భారతదేశంలో ఈ ప్రదేశంలోనే వైదికధర్మానికి, తత్త్వశాస్త్రానికి, రాజనీతికి సంబంధించిన ప్రచారం ఎక్కువగా ఉండేదని ఈ బ్రాహ్మణం తెలియజేస్తున్నది.

సామవేదగానానికి ముఖ్యమైన ఏడు స్వరాలు, స్తోభమంత్రాల ప్రాముఖ్యాన్ని ఈ ఆరణ్యకం వివరిస్తున్నది. 'అశరీరసామోపదేశం'

---

3. బ్రాహ్మణో వై మే సామ విద్వాన్ సామ్నోదగాయత్.
ఏమేఽశరీరేణ సామ్నా శరీరాణ్యధునోత్.
తద్యస్య వై కిం సామ విద్వాన్ సామ్నోద్గాయతి
దేవతానామేవ సలోకతాం గమయతి. జై.ఉ.బ్రా. 3.6.2.

చేస్తున్న ఈ జైమినీయోపనిషద్బ్రాహ్మణం ఆరణ్యకాలలో చాలా విశిష్టమైందని భావించవచ్చు.

— డి.ఎస్.ఆర్.

## 2.6.8 సంగ్రహసమీక్ష

జైమినీయోపనిషద్బ్రాహ్మణమని, ఉపనిషద్బ్రాహ్మణమని సుప్రసిద్ధమైన ఈ తలవకారారణ్యకం తలవకారబ్రాహ్మణంలోని నాలుగవ కాండగా గుర్తింపబడింది. సామవేదంలోని జైమినీయశాఖకు సంబంధించిన బ్రాహ్మణాల్లో తలవకారబ్రాహ్మణం చాలా ప్రాచీనమైందని చారిత్రకుల భావన.

ఈ ఆరణ్యకంలో నాలుగు అధ్యాయాలు, ముప్పైతొమ్మిది అనువాకాలు ఉన్నాయి. ఇందులో అనేక రహస్యార్థాలు బోధింపబడ్డాయి. ఇక్కడ సంగ్రహంగా ప్రతి అధ్యాయంలో ప్రతిపాదించబడిన కొన్ని విశేషాలను తెలుసుకుందాం.

ప్రథమాధ్యాయం:

ఈ అధ్యాయంలో పద్దెనిమిది అనువాకాలు, అరవై ఖండలు ఉన్నాయి. ఇతర బ్రాహ్మణాల కంటే భిన్నంగా సృష్టిస్వరూపాన్ని నిరూపిస్తూ తలవకారారణ్యకం ప్రారంభమైంది. 'భూః' అనే వ్యాహృతి మంత్రాన్నుచ్చరిస్తూ ఋగ్వేదసారరూపంగా భూమిని దానికి సారంగా అగ్నిని 'భువః' అనే వ్యాహృతినుచ్చరిస్తూ యజుర్వేదసారభూతమైన అన్తరిక్షాన్ని, దానికి సారంగా వాయువును, 'స్వర్' అనే వ్యాహృతితో సామవేదసారమైన ఆకాశాన్ని, దానికి సారమైన ఆదిత్యుణ్ణి, ప్రజాపతి సంకల్పమాత్రం చేత సృష్టించాడని తలవకారారణ్యకం విచిత్రమైన ఈ సృష్టిరహస్యాన్ని గురించి తెలియజేస్తున్నది.

'ఓం' అనే ప్రణవసారాన్ని ప్రజాపతి సరిగా గ్రహించలేక పోయాడు. అదే వాక్కుగా పరిణమించింది. దానికి సారం ప్రాణమేనని ఈ ఆరణ్యకం ప్రతిపాదిస్తున్నది.

రహస్యార్థాన్ని ప్రతిపాదించే ఓంకారంలో ఎనిమిది భాగాలున్నాయి. అదే గాయత్రిగా గుర్తింపబడింది. గాయత్రి ఎవరో కాదు సాక్షాత్ బ్రహ్మ స్వరూపమేనంటుంది ఈ ఆరణ్యకం.[1]

దేవతలు వేదత్రయిలో గూఢంగా నిహితమై ఉన్న ఓంకారాన్ని కనుక్కున్నారు. వాళ్లు తపస్సు చేశారు. అందువల్ల వాళ్లకు చురుకైన, విశాలమైన జ్ఞానం ఏర్పడింది. పేలాలలో తేనెను కలిపినట్లు జ్ఞానంతో తపస్సును మేళవించి దేవతలు విశ్వాన్ని జయించారు.[2]

ఎవరైనా సరే తమ జ్ఞానాన్ని తపస్సుతో శక్తిసంపన్నంగా చేసుకోగలిగితే వాళ్లకు ప్రతిష్ఠ పెరుగుతుంది. తేజస్సు ఇనుమడిస్తుంది. వాళ్లు అంతఃప్రపంచాన్ని, బాహ్యప్రపంచాన్ని కూడా తేలికగా జయించగలుగుతారనే సత్యాన్ని మనం దీనిద్వారా తెలుసుకోవచ్చు. విద్యను సంపాదించడంతో సరిపోదు. దాని ప్రభావం మనలో పెరగాలంటే మనలో తపస్సు కూడా ఎంతో అవసరమని ఈ వృత్తాంతం ద్వారా తెలుసుకోవాలి.

తలవకారారణ్యకంలో ముఖ్యంగా ఓంకారప్రభావం విస్తరంగా చెప్పబడింది. ఓంకారమే నిత్యమైన సత్యం. దాని మీదనే ఈ విశ్వమంతా ఆధారపడి ఉంది. విశ్వమంతటా ఓంకారం వ్యాపించి ఉంది.

ఓంకారంలోనే జలం ఉంది. జలంలో పృథివి. పృథివిలో ఈ లోకాలన్నీ ఉన్నాయి. సూదితో పలాశపత్రాలెలా గుచ్చబడ్డాయో అలాగే ఓంకారంతో ఈ లోకాలన్నీ సంగ్రథనం చేయబడినాయని ఈ ఆరణ్యకం

1. తాన్యేతాన్యష్టౌ. అష్టాక్షరా గాయత్రీ. గాయత్రం సామ. బ్రహ్మ ఉ గాయత్రీ తద్ ఉ బ్రహ్మాభిసంపద్యతే. అష్టశఫాః పశవః తేన ఉపశవ్యమ్. జై.ఉ.బ్రా. 1.1.1.6.
2. అందులోనే 1.2.1.

ఎంతో చక్కగా వివరిస్తున్నది.[3] 'సామ' అనే శబ్దానికి వ్యుత్పత్తి ఈ ఆరణ్యకంలో ఇలా కనబడుతున్నది --

ప్రజాపతి తనను పదహారు విధాలుగా విభజించుకొని వాటన్నింటితో కూడి ఉండటమే సామలోని సామత్వం.[4]

**ద్వితీయాధ్యాయం:**

ఈ అధ్యాయంలో అయిదు అనువాకాలు, పదిహేను ఖండలు ఉన్నాయి. ఒకప్పుడు దేవతలకు రాక్షసులకు యుద్ధమేర్పడింది. రాక్షసులను అధిగమించడానికి దేవతలు సామగానం చేశారు. దేవతలు మంచి మనసుతో గానం చేయగా అసురులు దాన్ని దుష్టసంకల్పంతో కలుషితం చేశారు. తరువాత దేవతలు వరుసగా వాక్కుతోను, దృష్టి తోను, వినికిడితోను, అపానంతోను గానం చేశారు. కానీ అసురులు ఈ గానాలన్నింటినీ తమ దుశ్చేష్టలతో పాడు చేశారు. చివరకు దేవతలు ప్రాణంతో సామగానం చేశారు. దాన్ని కూడా పాడుచేయు డానికి అసురులు హడావిడి పడ్డారు. కానీ ఆ ప్రయత్నంతో వాళ్లు ముక్కలు ముక్కలై నాశనమై పోయారు.[5] దేవతలు గానం చేసిన వాక్కు, మనస్సు, దృష్టి, వినికిడి, అపానం, ప్రాణం అనే ఆరుగురు ఉద్గాతలు అగ్ని, చంద్రుడు, సూర్యుడు, దిక్కులు, విశ్వేదేవులు, బృహ

3. తదేతత్ సత్యమక్షరం యదోమ్ ఇతి. తస్మిన్నాపః ప్రతిష్ఠితాః అప్సు పృథివీ. పృథివ్యామిమే లోకాః. యథా సూచ్యా పలాశాని సంతృణ్ణాని స్యుః ఏవమేవ తేనాక్షరేణేమే లోకాః సంతృణ్ణాః
జై.ఉ.బ్రా. 1.2.3 2-3.

4. సహైవం షోడశధాత్మానం వికృత్య సార్ధం సమైతే తద్యత్సార్ధం సమైతే తత్సామ్నః సామత్వమ్. అందులోనే 1.15.3.7.

5. దేవానాం వై షడ్ ఉద్గాతార ఆసన్. వాక్ చ మనశ్చ చక్షుశ్చ శ్రోత్రం చ అపానంశ్చ ప్రాణశ్చ. అందులోనే 2.1.1.1.

స్పతి, ప్రజాపతి అని గుర్తించబడ్డారు.[6] ఈ అధ్యాయంలో "గొప్ప దైన వాక్కుకు అధిపతి" కాబట్టి "బృహస్పతి" అని బృహస్పతి శబ్దార్థం నిరూపించబడింది.[7]

**శర్యాతోపాఖ్యానం:**

ప్రాచీస్థలిలో శర్యాతుడనే మానవుడొక యజ్ఞం చేశాడు. అందులో బృహస్పతి, బంబ, ఆజద్విష, ఉశనసుడు, అయాస్యుడైన ఆంగీరసుడు పాల్గొనడానికి ఉద్గీథగానం చేయడానికి అవకాశం ఇవ్వమని దేవతలు, పితృదేవులు, అసురులు, మానవులు శర్యాతుణ్ణి అడిగారు. అందుకతడు వాళ్లనందరినీ, విడివిడిగా తన యజ్ఞంలో ఉద్గీథగానం చెయ్యనిస్తే ఏమౌ తుందని అడిగాడు. అందుకు బృహస్పతి, బంబ, ఆజద్విష, ఉశనసులు అలా జరిగితే అతడు స్వర్గాన్ని పొందుతాడని, తమలో ప్రతివ్యక్తి గొప్ప శక్తినీ, అదృష్టాన్ని పొందగలడని సమాధానం చెప్పారు.

చివరిలో మానవులకు గురువైన అయాస్యుడైన ఆంగీరసుడు "దేవతలను, మానవులను, పితరులను వాళ్ల వాళ్ల లోకాలలో అట్టిపెట్టి అసురులను ఈ లోకం నుంచి గెంటివేసి శర్యాత మానవుణ్ణి స్వర్గ లోకానికి పంపిస్తా" నని చెప్పాడు. శర్యాతుడు అయాస్యుణ్ణే ఉద్గీథ గానం చేయమని అతడు చెప్పినట్లే యజ్ఞాన్ని ఆచరించాడు. ఈ సందర్భంలోనే ఇందులో అయాస్య ఆంగిరస శబ్ద వ్యుత్పత్తులిలా ఇవ్వబడినాయి--

1. ఆసేధతి తస్మాదాయాస్యః
   యద్వేవాస్యే రమతే తస్మాదు ఏవాయాస్యః 2.4.2.8.

---

6. సా యా సా వాగాసీత్ సోఽగ్నిరభవత్. అథ యత్తన్మన ఆసీత్ స చంద్రమా అభవత్. అథ యత్తచ్చక్షురాసీత్ స ఆదిత్యోఽభవత్. అథ యత్తచ్ఛ్రోత్రమాసీత్ తా ఇమా దిశో ఽభవన్. తా ఉ ఏవ విశ్వేదేవాః. జై.ఉ.బ్రా. 2.1.2. 1-4.

7. యదస్యై వాచో బృహత్యై పతి స్తస్మాద్బృహస్పతిః.అందులోనే 2.1.2.5.

2. స ఏష ఏవాంగిరసః అతోహ్యమాన్యంగాని రసం లభన్తే.
తస్మాదాంగిరసః ఉద్వేషామంగానాం రసః తస్మాదేవాంగిరసః. 2.4.2.9.

తృతీయాధ్యాయం:

ఈ అధ్యాయంలో ఏడు అనువాకాలు, నలభై రెండు ఖండలు ఉన్నాయి. ఇందులో గాయత్రీసామను గానం చేసిన ఋషిపరంపర సప్తమానువాకంలోని మూడు, నాలుగు, అయిదు ఖండల్లో పేర్కొనబడింది. గాయత్రీ ప్రభావాన్ని ఈ అధ్యాయం చక్కగా వర్ణిస్తున్నది.

సుదక్షిణక్షైమి – ప్రాచీనశాలి:

సుదక్షిణక్షైమి, ప్రాచీనశాలి, ఇద్దఱు జాబాలురు ఒకే గురుకులంలో సహాధ్యాయులుగా ఉండేవాళ్లు. ఇందులో ప్రాచీనశాలి, జాబాలులిద్దరు ఎప్పుడూ ఎక్కువగా చదివేవాళ్లు కాని వాళ్లకు అర్థజ్ఞానం తగినంత ఉండేది కాదు. సుదక్షిణక్షైమి వాళ్లను యజ్ఞాలకు సంబంధించిన అనేక ప్రశ్నలతో ముప్పతిప్పలు పెట్టేవాడు. అతడి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఈ ముగ్గురు సుదక్షిణక్షైమిని సరిగ్గా వేదం చదవని వాడనే అర్థం వచ్చే "శూద్రదురనూచాన" అని నిందించేవాళ్లు.[8] దానికి ఆగ్రహించిన సుదక్షిణుడు కురుపాంచాల పండితులు చేరిన సభలో వారిని సంవాదానికి పిలిచాడు. జాబాలు లిద్దఱు ప్రాచీనశాలిని ఒక యజ్ఞంలో ఉద్గాతగా నిర్ణయించారు. ఆ విషయం తెలిసిన సుదక్షిణుడు రథం పైన అక్కడికి వెళ్లి, కురు పాంచాల పండితులు గల ఆ సభలో మానవుని జీవితంలోని మూడు జన్మల్ని, మరణాన్ని గురించి మూడు కష్టమైన ప్రశ్నల్ని అడుగుతాడు. సామరహస్యాల్ని తెలిసి ఈ ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పగల ఉద్గాత మాత్రమే యజమానిని స్వర్గానికి

8. త ఉ హ వా అపోదితా. వ్యాక్రోశమానశ్చేరుః శూద్రో దురనూచాన ఇతి. జై.ఉ.బ్రా. 3.2.5.

పంపగలడని అతడు ప్రకటిస్తాడు. ఉద్గాత ప్రాచీనశాలి సమాధానం చెప్ప లేక వెళ్లిపోతాడు. తరువాత కాండ్వియుడు ఉద్గాతగా వచ్చి వాటికి సమాధానం చెపుతాడు.[9]

ఈ వృత్తాంతం ద్వారా ఆనాడు సమాజంలో అందఱు వేదాధ్య యనం చేసేవారనే సత్యం బహిర్గతమౌతున్నది.

**మూడుసార్లు పుట్టి మూడు సార్లు చస్తున్నాడు:**

తలవకారారణ్యకం ప్రతివాడు మూడు సార్లు పుట్టి మూడుసార్లు చస్తున్నాడని ఇలా నిరూపిస్తున్నది –

తండ్రిలో రేతస్సు రూపంలో మొదటి జన్మ. తల్లిగర్భంలోకి చేరిన రేతస్సు ప్రాణం పోసుకున్నప్పుడు రెండోజన్మ. పెరిగి పెద్దవాడై యజ్ఞంలో ఆహుతిని అగ్నిహోత్రానికి అర్పించినప్పుడు మూడో జన్మ![10]

రేతస్సురూపంలో తల్లి గర్భంలో పడిపోయినప్పుడు మొదటి మరణం. జుట్టు, గోళ్లు తీసివేసి శరీరం మర్దించి హోమంగాని, యజ్ఞం గాని, స్త్రీ సంబంధంగాని లేకుండా మృతుడిలాగా ఉండే దీక్షనివ్వడం రెండో మరణం. ఈ లోకం నుంచి పోయిన ఇతడిని చితిపైన పెట్టి నప్పుడు మూడో మరణం. ఇలా మొత్తం మూడు జన్మలు, మూడు మరణాలు మానవుడికి సంభవిస్తున్నాయి.

**చతుర్థాధ్యాయం:**

నాలుగో అధ్యాయంలో తొమ్మిది అనువాకాలు, ఇరవై ఎనిమిది ఖండలు ఉన్నాయి. ఇందులో తొమ్మిదో అనువాకం పూర్తిగా గాయ త్రోద్గీథాన్ని గానం చేసిన ఋషిపరంపరను అభివర్ణిస్తున్నది.

---

9. త్రిర్వై గృహపతే పురుషో జాయతే. పితురేవాగ్రేఽధిజాయతే. అథ మాతుః. అథ యజ్ఞాత్. జై.ఉ.బ్రా. 3.4. 1-7.

10. అందులోనే 3.5.4.7.

**నేనంటే నేను:**

ఒకప్పుడు అగ్ని, వాయు, ఆదిత్య, ప్రాణ, అన్న, వాక్కులకు పోటీ ఏర్పడింది. "నేనే గొప్పవాణ్ణి. నన్నే ఆరాధించండి" అని ఎవ రికి వారు చెప్పుకున్నారు. తమలో గల గొప్పతనానికి కారణాలేమిటో కూడా వాళ్లు వివరించారు. తరువాత కొంతకాలానికి తమలో ప్రతి వాళ్లు ఇతరుల మీద ఆధారపడ్డవాళ్లేనని గుర్తించగలిగారు. తమలో ఏ ఒక్కరు లేకపోయినా అంతా నాశనమైపోతుందని గ్రహించారు. ఇలా అనుకున్నారు -- "అందరూ కలసి రండి, మనమందరూం కలసి బలమైన శక్తిగా రూపొంది అందరికీ ఆరాధ్యులమౌదాం!" తరువాత వాళ్లు గాయత్రసామను గానం చేస్తూ వినాశాన్ని తప్పించుకొని, పాపం పోగొట్టుకొని స్వర్గం పొందారు.[11]

ఈ వృత్తాంతం సమాజంలో ఎవరు తమంతట తాము గొప్ప వాళ్లు కాదని, ఇతరులను తక్కువగా చూడకూడదని, అందరూ కలసి మెలసి ఉండి గౌరవింపబడాలనే సత్యాన్ని చెప్పకనే చెబుతున్నది.

**భగేరథవృత్తాంతం:**

ఇక్ష్వాకు వంశస్థుడైన భగేరథమహారాజు ఒక కామ్యేష్టిని ప్రారంభిం చాడు. కురు పాంచాల దేశాలలోని బ్రాహ్మణులు ఆయనతో మాట్లా డటానికి వెళ్లారు. రాజు వారికి స్వాగతం పలికి, గౌరవించి వారిని తత్త్వశాస్త్రంలో అయిదు ప్రశ్నలనడిగాడు. దాల్భ్యుడైన బకుడనే పండి తుడు వాటికి సమాధానాలను చక్కగా చెప్పి ఆయన సందేహాలను పోగొట్టాడు.[12]

---

11. షడ్ వై దేవతాః స్వయంభువః అగ్నిర్వాయురసావాదిత్యః ప్రాణోఽన్నం వాక్. తాః శ్రేష్ఠ్యే వ్యవదన్త. అహం శ్రేష్ఠాస్మి. అహం శ్రేష్ఠాస్మి. మాం శ్రియముపాధ్వమితి. జై.ఉ.బ్రా. 4.8.1.3

12. అందులోనే 4.6.1-3

ఈ ఆరణ్యకంలో మధ్య మధ్య సందర్భాల ననుసరించి ఎన్నో ఉపాఖ్యానాలు, వృత్తాంతాలు వచ్చినా ప్రధానంగా ఓంకార స్వరూపం, గాయత్రసామ స్వరూపం, ప్రభావం, వైశిష్ట్యం, దానిని గానం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలు నిరూపించబడినట్లు చెప్పవచ్చు.

ఓంకారాన్ని గురించి, గాయత్రిని గురించి సమగ్రంగా తెలుసుకోదల్చిన వాళ్లకు ఈ ఆరణ్యకం ఎంతో ఉపయోగపడుతుంది.

— సి.ఎల్.ఆర్.

# అధ్యయగ్రంథసూచి

---


ఋగ్వేదసంహితా (ఋ. సం)
ఎన్.ఎస్. సొంతక్కె
వైదిక సంశోధ మండలం, పూనా, 1972.

ఐతరేయ ఆరణ్యకమ్ (ఐ. ఆ)
(సాయణభాష్యసహితమ్)
హరినారాయణ ఆప్టే
ఆనందాశ్రమప్రెస్, పూనా, 1820.

ఐతరేయబ్రాహ్మణమ్ (ఐ. బ్రా)
ఐ. ఎస్. కాశీనాథశాస్త్రి
ఆనందాశ్రమ సాంస్క్రిట్ గ్రంథావళి, పూనా, 1977.

జైమినీయ ఉపనిషద్ బ్రాహ్మణమ్ (జై. ఉ. బ్రా.)
ప్రొ. రఘువీర, లోకేశచంద్ర
నాగపూర్, 1954.

తైత్తిరీయ ఆరణ్యకమ్ (తై. ఆ)
(సాయణభాష్యసహితమ్)
బాబాశాస్త్రిఫడకే
ఆనందాశ్రమ సాంస్క్రిట్ గ్రంథావళి, పూనా, 1927.

బృహదారణ్యకమ్ (బృ. ఆ.)
వాసుదేవ బ్రహ్మభాగవత్
గంగావిష్ణుశ్రీకృష్ణదాస్, కల్యాణ్, బాంబే, 1940.

మహాభారతమ్ (మ. భా)
వి. ఎస్. సుక్తంకర్
భాండార్కర్ ఓరియంటల్ రిసెర్చి ఇన్స్టిట్యూట్, పూనా, 1988.

మహాభాష్యమ్ (మహా.)
జయకృష్ణదాస్ హరిదాస్ గుప్త
చౌఖంభా సంస్కృత సీరీస్ ఆఫీస్, బెనారస్, 1854.

మైత్రాయణీయసంహితా (మై. సం.)
డా|| లియోపోల్డ్ వాన్ ష్రోడర్
ఆట్టో హర్రాసోవిట్జ్
లిప్జిగ్, 1923.

మోక్షప్రదా (మో. ప్ర.)
హరినారాయణఆప్టే
ఆనందాశ్రమముద్రెస్, పూనా, 1820.

వైదిక సాహిత్య చరిత్రమ్ (వై. సా. చ)
పి. పి. ఎస్. శాస్త్రి; కె. ఎల్. వి. శాస్త్రి
శ్రీ గీర్వాణి వాణీ పుస్తకశాల, పాల్ఘాట్, 1927.

శతపథబ్రాహ్మణమ్ (శ. బ్రా.)
గంగావిష్ణుశ్రీకృష్ణదాస్
కల్యాణ్, బొంబాయి, 1946.

శాంఖాయన ఆరణ్యకమ్ (శాం. ఆ)
శ్రీధరశాస్త్రి
ఆనందాశ్రమ సాంస్క్రిట్ గ్రంథావళి, పూనా, 1922.

* * *

# BIBLIOGRAPHY

---

DAS GUPTA, S.
**A History of Indian Philosophy**
Motilal Banarsi Dass, DELHI, 1975.

MAXMULLER, F
**The Vedas**
Indological Book House, DELHI, 1969.

RENOU, L.
**Vedic India**
Indological Book House, DELHI, 1971.

SATYASRAVA.
**A Comprehensive History of Vedic Literature**
(Brahmana and Aranyaka works)
Pranava Prakashan, NEW DELHI, 1977.

WINTERNITZ, M.
**A History of Indian Literature**
Munshiram Manoharlal, NEW DELHI, 1977.

* * *

# విశిష్టపదసూచి


అజాతశత్రువు 28, 29, 30, 36, 37, 116, 123, 127, 138, 139, 188

అనన్తనారాయణ 147

అరం 37

అరణమానులు 43

అరణులు 43

ఆత్మానందుడు 14

ఆనందతీర్థులు 164

ఆర్యావర్తం 22, 25

ఇ. బి. కోవెల్ 120

ఉక్థం 101, 105, 106, 108, 110, 130, 134, 177

ఉదయుడు 120

ఋషి 22, 24

ఎగ్గ్లింగ్ 164

ఎ. బి. కీత్ 95, 120

ఎ. వేబర్ 164

ఓర్టెల్ 230

ఔఫ్రెత్ 146, 200

కాలండ్ 14, 164

కాశికావృత్తి 16

కురుక్షేత్రం 23, 45, 118, 127, 146, 163, 240, 241, 247, 249

కె. రాఘవన్‌పిళ్లై 95

కోసల 23, 163

గణేశశాస్త్రిపాఠక్ 164

దుర్గాచార్యుడు 15

నారాయణ 200

నీలకంఠుడు 164

పతంజలి 14, 15, 24

పాంచాలదేశం 23, 45, 118, 127, 146, 163, 240, 241, 247, 249

ప్రకాశాత్మ 200

ప్రవర్గ్య 43, 58, 59, 145, 157, 160, 161

పంచయజ్ఞాలు 26, 27, 154, 155, 156, 159.

ఫ్రెడ్‌లండర్ 120

బాబాశాస్త్రి ఫడకే 95, 147

బి. ఆర్. శర్మ 230

బిల్వమణి 55, 56

బృహద్దేవత 16

బ్రహ్మావర్తం 23

భట్టగోవిందస్వామి 43

భట్ట భాస్కరుడు 147

భవత్రాతుడు 230

భవస్వామి 146

మత్స్యదేశం 23, 45, 118
మనుస్మృతి 4, 24, 43, 52
మహాభారతం 4, 105
మహాభాష్యం 14, 24
మహావ్రతం 3, 4, 32, 33, 43, 53, 54, 55, 61, 92, 106, 108, 112, 116, 117, 123, 124, 131, 136
మహావీరం 58, 145, 160, 161
మేక్డోనల్ 94
మంగళదేవశాస్త్రి 95
యాస్కుడు 15, 118, 142
రఘునందనుడు 13
రాజేంద్రలాల్ మిత్ర 95, 147
రామతీర్థుడు 200, 215
రామదేవ 230
రామానుజులు 164
లిమాయే 200
వరదరాజు 147
వాడేకర్ 200
వాసిష్ఠధర్మసూత్రం 4, 14
విజ్ఞానభిక్షువు 200
విద్యారణ్యస్వామి 52, 61
విదేహ 23, 45, 118, 163
వినాయకగణేశ ఆప్టే 200
విశ్వరూపాచార్యులు 14, 15
శబరస్వామి 13
శ్రీధరశర్మపాఠక్ 118, 120, 164
శ్రీపాద దామోదర సాత్వదేకర్ 195, 196, 200.
శూరసేనదేశం 23
శంకరాచార్యులు 13, 32, 108, 115, 161, 164, 200.
షడ్గురుశిష్యుడు 90, 95
శ్రేడర్ 196, 200
సత్యవ్రతసామాశ్రమి 164
స్కందస్వామి 16
సాయణాచార్యులు 3, 4 15, 16, 17, 20, 90, 92, 95, 108, 120, 121, 144, 145, 147, 200, 230.
సురేశ్వరాచార్యులు 4, 52
సూర్యకాన్త 14
హరిస్వామి 164

* * *

T.T.D. Religious Publications Series No. 413
Arsha Vijnana Sarvasvam Vol.—III Aranyakas

**PRICE Rs.25/-**

మహోన్నతమైన మానవజాతి ప్రాచీన విజ్ఞానశిఖరాలను అందుకోవాలనే అభిలాష ఉంటే; భవ్యమైన భారతీయ సంస్కృతీ సౌరభాలను ఆఘ్రాణించే ఆకాంక్ష ఉంటే; సభ్యతా-సంస్కారాల మధ్యలో పెరిగిన సమసమాజభావనను సాక్షాత్కరించుకోవాలనే సంకల్పం ఉంటే; ఈ విశ్వంలోని మానవులంతా ఒకే కుటుంబమనే విశాలదృక్పథం ఏర్పడాలంటే; భావితరాలవారు అంటే మన మనుమలు,ముని మనుమలు శాంతితో, సౌహార్దంతో, కలసిమెలసి కళకళలాడుతూ జీవించాలనే కల్యాణకామన ఉంటే; ఆర్షసంస్కృతిని అవహేళన చేయకండి! ఆర్షవిజ్ఞానాన్ని కాపాడండి! 'ఆ మాకెందుకు?' అనకుండా మీ ముందుకు వచ్చిన

## ఆర్షవిజ్ఞాన సర్వస్వాన్ని అవలోకించండి!

ఆర్షవిజ్ఞానమంటే, అదేదో మనకు సంబంధించనిది కాదు; తరతరాలుగా మన తాతముత్తాలనుంచి మనకు సంక్రమించిన సమిష్టిసంపద. మహర్షులంటే ఎవరో కారు; మానవ జాతికి మహనీయ భావనలతో రూపురేఖలు దిద్దిన జాతి నిర్మాతలు. ఆ సంపదను వ్యర్థంచేసుకోవడం అవివేకం కాదా? ఆ మహాత్ములు మాకేంకారనుకోవడం తెలివితక్కువ కాదా? అందులో ఏంలేదనుకుందామంటే; ప్రపంచంలోని మేధావులందరు ప్రశంసించారే! చూడండి; ఒక దివ్యసుందర శిల్పాన్ని ఒక్కక్షణంలో ముక్కలుచేసేయెుచ్చు; కాని దాని నిర్మాణానికి ఎంత శ్రమపడాలి? ఎంతకాలం పడుతుంది? ఎంత సామగ్రి కావాలి? అహంకారం; ఆగ్రహం; అజ్ఞానం; ఆవేశం; -వీటితో పొందలేని అనర్థం ఏముంది?

**--ఆగండి! ఒక్కక్షణం ఆలోచించండి!**

Published by Dr. I.V. Subba Rao, I.A.S., Executive Officer
T.T.Devasthanams, Tirupati and printed at T.T.D. Press, Tirupati.